


'స్వచ్ఛమైన రక్షిత జలాలను
అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి
గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


పేజీలు: 16+6 వెల: ₹ 5.50

దేశమంతా 'సీసీసీ'

ఇది మోదీ గ్యారంటీ ● మేం ఉండగా ఎలాంటి పర్సనల్ లా అమలు కానివ్వం

గుణ: మతపరమైన పర్సనల్ లా తిరిగి తేవడమే కాంగ్రెస్ వాగ్దానమైతే, దేశమంతటా ఉమ్మడి పౌర స్మృతి(సీసీసీ) అమలు చేయడమే ప్రధాని మోదీ వాగ్దానమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా పోటీ చేస్తున్న మధ్యప్రదేశ్‌లోని గుణ పార్లమెంట్ నియోజకవర్గంలో శుక్రవారం అమిత్‌షా ఎన్నికల ప్రచారంలో పాల్గొని ప్రసంగించారు. ''కాంగ్రెస్ మేనిఫెస్టోను క్షుణ్ణంగా పరిశీలిస్తే ముస్లిం పర్సనల్ లా మళ్లీ ప్రవేశపెట్టబోతున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. అంటే ట్రిపుల్ తలాఖ్‌ను మళ్లీ తెస్తారన్నమాట. దేశం షరియా(ఇస్లామిక్ చట్టం)పై నడుస్తుందా? కాంగ్రెస్ అభిప్రాయం ప్రకారం దేశ వనరులపై తొలి హక్కులు ముస్లింలకే దక్కుతాయి. బీజేపీ మాత్రం పేదలు, దళితులు, ఇతర వెనకబడిన వర్గాలు, దళితులకే తొలి హక్కులు చెందాలని కోరుకుంటుంది'' అని అమిత్ షా పేర్కొన్నారు. బీజేపీ ఉన్నంతవరకు ఎలాంటి పర్సనల్ లా దేశంలో అమలు కానివ్వబోమన్నారు. దేశంలో ఉమ్మడి పౌరస్మృతి, రాజ్యాంగం ద్వారానే పాలన సాగుతుందని చెప్పారు. 'ఇప్పటికే ఉత్తరాఖండ్‌లో సీసీసీ అమలు

కేంద్ర హోంమంత్రి అమిత్ షా



చేశాం. దేశమంతా సీసీసీ అమలే మోదీ గ్యారంటీ. ఒక్క దెబ్బతో ఆర్టికల్ 370 రద్దుచేశాం. కశ్మీర్‌లో రక్తం వరదలై పారుతుందని రాహుల్ బాబా భయపెట్టారు. ఇది మోదీ సర్కార్. రక్తం సంగతి దేవుడెరుగు. ఒక్క రాళ్లు రువ్వే ఘటన కూడా ఐదేళ్లలో కనిపించకుండా చేశాం'' అని షా వ్యాఖ్యానించారు. దేశంలో ఉగ్రవాదం, నక్సలిజాన్ని మోదీ సర్కార్ అణచివేసిందన్నారు. రిజర్వేషన్లపై మండల్ కమిషన్ సిఫారసులను నాటి కాంగ్రెస్ సర్కార్ తొక్కిపెట్టిందని, రామమందిర నిర్మాణానికి 70 ఏళ్ల అవరోధాలు సృష్టించిందని విమర్శించారు. ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆహ్వానం అందినా, సమయం కుదిరినా సోనియా, రాహుల్ ఉద్దేశపూర్వకంగా రాలేదని ఆరోపించారు.

ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తాం

ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని అమిత్ షా ప్రకటించారు. ఆ స్థానంలో ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గాలకు రిజర్వేషన్లు తెస్తామని పేర్కొన్నారు. గురువారం తెలంగాణలోని సిద్దిపేటలో నిర్వహించిన 'బీజేపీ విశాల జన సభ'లో అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మజ్లిస్‌కు భయపడే రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ తెలంగాణ విమోచన దినోత్సవానికి దూరంగా ఉన్నాయని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహిస్తామని చెప్పారు.

యనమల కృష్ణుడు టీడీపీకి గుడ్‌బై


- పార్టీ సభ్యత్వానికి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పదవికి రాజీనామా
- అదే దారిలో పలువురు టీడీపీ ముఖ్య నేతలు
- త్వరలో వైఎస్సార్‌సీపీలో చేరతామని ప్రకటన



10లో

కూటమి చార్జిషీట్ అబద్ధాల పుట్ట

- టీడీపీదే అసలైన రక్తచరిత్ర.. ఇది జగమెరిగిన సత్యం
- టీడీపీ చేసిన మారణకాండను దళితులెవ్వరూ మరచిపోలేదు
- సబ్‌ప్లాన్ నిధులు పక్కకు వెళ్లే అవకాశం లేదు
- వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి రావెల కిషోర్ బాబు



3లో



ఈ ఫొటోలోని మహిళ పేరు పుత్తూరు పుష్పలత. పక్కన ఆమె కుమారులు జ్ఞానేంద్ర, లిఖిత్. భర్త విశ్వనాథరెడ్డి డ్రైవర్. చిత్తూరులో ఉంటారు. ఈ కుటుంబంపై విధి చిన్నచూపు చూసింది. నాలుగేళ్ల వయస్సులో పెద్ద కుమారుడు జ్ఞానేంద్ర కంటిచూపును కోల్పోయాడు. కుడి కన్ను కొంత పనిచేస్తుండగా, ఎడమ కన్ను పూర్తిగా పనిచేయట్లేదు. ఇక 2020లో రెండో కుమారుడు లిఖిత్‌కు రెండు కిడ్నీలు ఫెయిలయ్యాయి. వారిద్దరూ ఇలా అనారోగ్య సమస్యల బారినపడటంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. రెండో కుమారుడికి సీఎం జగన్ ప్రభుత్వం అండగా నిలిచింది. ఇప్పటివరకూ హీమోడయాలసిస్ (20 సిట్టింగ్‌లు) ప్రభుత్వమే చేయించి, మందులను ఉచితంగా అందిస్తోంది. నెలనెలా రూ.5 వేల పెన్షన్ కూడా ఇస్తోంది. ఈ నేపథ్యంలో.. చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం తలపులపల్లి వద్ద 'మేమంతా సిద్ధం' బస్సుయాత్రలో సీఎం జగన్‌ను పుష్పలత కలిసి పిల్లల పరిస్థితిని వివరించింది. ఎంత ఖర్చయినా ఇద్దరికీ మెరుగైన వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. సీఎం ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ హరికృష్ణ వివరాలు తీసుకున్నారు. ఆ వెంటనే పుష్పలతకు ఫోన్.. పెద్దబాబును కడపలోని ఎల్‌వి ప్రసాద్ కంటి ఆస్పత్రికి తీసుకెళ్లమని చెప్పారు. దీంతో ఈనెల 17న ఆస్పత్రికి తీసుకెళ్లగా చూపొస్తుందని వైద్యులు భరోసా ఇచ్చారు. వెంటనే హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స అందిస్తున్నారు. జ్ఞానేంద్ర కుడి కంటికి ఆపరేషన్ కూడా చేస్తున్నారు. దీంతో.. 'కిడ్నీ సమస్యతో బాధపడుతున్న నా బిడ్డకు పూర్తి ఉచితంగా చికిత్స అందించిన సీఎం జగన్ ఇప్పుడు నా పెద్ద కొడుక్కీ ఎంత ఖర్చయినా చికిత్స చేయిద్దాం అని హామీ ఇచ్చారు. ఆయన మా కుటుంబానికి ఆపద్బాంధవుడు'.. అని పుష్పలత భావోద్వేగానికి గురైంది.

అభాగ్యులకు ఆపన్నహస్తం

అరుదైన వ్యాధిగ్రస్తులకు సీఎం జగన్ భరోసా

పుష్పలత తరహాలోనే వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులు, వారి కుటుంబ సభ్యులు 'మేమంతా సిద్ధం' బస్సుయాత్రలో సీఎం వైఎస్ జగన్‌ను కలిసి తమ గోడును చెప్పుకున్నారు. వీరి కష్టాలను విని సీఎం చలించిపోయారు. మానవతా దృక్పథంతో స్పందించి, అభాగ్యులకు ఆపన్నహస్తాన్ని అందించారు. చికిత్సకు కావల్సిన ఏర్పాట్లు చేయించారు. అవసరమైన ఆర్థికసాయం అందించారు. 22 రోజుల పాటు 23 జిల్లాల మీదుగా సాగిన యాత్రలో 350 మందికి పైగా వివిధ రకాల వ్యాధిగ్రస్తులు ముఖ్యమంత్రిని కలిశారు. బ్లడ్ క్యాన్సర్, మెదడు, గుండె, కాలేయంకు సంబంధించిన, ఇతర అరుదైన వ్యాధుల బాధితులు తమను ఆదుకోవాలంటూ సీఎంను కోరారు. తనను కలసిన ప్రతిఒక్కరి వివరాలు తీసుకుని వారికి వైద్యపరంగా అవసరమైన చేయూతనిచ్చేలా ఆయన ఆదేశాలు జారీచేశారు.

సాక్షి, అమరావతి

- 'మేమంతా సిద్ధం' బస్సుయాత్రలో ముఖ్యమంత్రిని కలిసిన 350కి పైగా బాధితులు
- వారి కష్టాలను విని చలించిపోయిన సీఎం..
- మానవతా దృక్పథంతో భరోసా కల్పించిన జననేత
- బాధితులకు వైద్యంతోపాటు ఆర్థికంగానూ చేయూత
- ఆరోగ్యశ్రీ బలోపేతం.. ఐదేళ్లలో రూ.14వేల కోట్లకు పైగా ఖర్చు

తొలినుంచి ప్రజారోగ్యానికి పెద్దపీట..

2019లో సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన నాటి నుంచి ప్రజారోగ్యం పట్ల వైఎస్ జగన్ ప్రత్యేక దృష్టిసారించారు. ఈ క్రమంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీని బలోపేతం చేసి పేద, మధ్యతరగతి బాధితులకు అండగా నిలిచారు. ఏకంగా 3,257 ప్రొసీజర్లను పథకంలోకి చేర్చి ఐదేళ్లలో రూ.14 వేల కోట్లకు పైగా వైద్యసేవల కోసం ఖర్చుచేశారు. అదే విధంగా ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని పలు అరుదైనా జబ్బుల బారినపడిన వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా వైద్యానికి చేయూతనిచ్చారు. జిల్లాల పర్యటనకు వెళ్లిన సమయంలో తనను కలిసిన బాధితులకు వైద్యంతో పాటు, ఆర్థికంగా కూడా సాయం చేశారు. కొన్ని సందర్భాల్లో ఖర్చుతో సంబంధం లేకుండా పలు ఘటనల్లో రూ.కోట్లు వెచ్చించి బాధితులకు చికిత్సలు అందించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా నక్కా రామేశ్వరానికి చెందిన రాంబాబు, నాగలక్ష్మి దంపతుల కుమార్తె జన్యుపరమైన వ్యాధితో బాధపడుతుండగా ఆ చిన్నారి వైద్యానికి ఏకంగా రూ.కోటి ఖర్చుచేశారు.

మా పాలిట దైవం ఆయన..

నాకు ఇద్దరు ఆడపిల్లలు, ఒక బాబు. బాబుకు నాలుగేళ్లు. మూడు నెలల క్రితం జ్వరంగా ఉందని ఆస్పత్రికి తీసుకెళ్తే వైద్య పరీక్షలు చేసి బ్లడ్ క్యాన్సర్ అని నిర్ధారించారు. ఆటో నడిపితే కానీ పూట గడవని పరిస్థితి నాది. ఆదుకోవాలని సీఎం జగన్‌ను బస్సుయాత్రలో కలిశాను. మా కష్టం విని ఆయన చలించిపోయారు. బాబుకు ఎంత ఖర్చయినాసరే చికిత్స అందిస్తామని హామీ ఇచ్చారు. మాకు ఆయన దైవంతో సమానం. పైగా.. ఈ ప్రభుత్వంలో ఎక్కడా లంచం ఇవ్వకుండా ఏ ఆఫీసు చుట్టూ తిరక్కుండానే అమ్మఒడి, వాహనమిత్ర, మా అమ్మకు వైఎస్సార్ చేయూత వచ్చాయి.

– ఎం. ఉమామహేశ్, ఆటో డ్రైవర్, విజయనగరం

ఆదుకుంటామన్నారు

మా పాపకు పుట్టుకతో వినికిడి లోపం ఉంది. 2015లో ఆరోగ్యశ్రీ కింద కాంక్లియర్ ఇంప్లాంటేషన్ చేయించడానికి ప్రయత్నించాం. అప్పట్లో రెండు చెవులకు ఇంప్లాంటేషన్ ఉండేది కాదు. దీంతో ఒక చెవికి చేయించాం. ఇప్పుడా మిషన్ పనిచేయట్లేదు. కొత్త మిషన్‌కు రూ.6.5 లక్షలు ఖర్చవుతుందన్నారు. నా భర్త కూలిపనికి వెళ్తేగానీ ఇల్లు గడవని పరిస్థితి మాది. అలాంటిది అంత డబ్బు ఖర్చుపెట్టి మిషన్ కొనే స్థోమత మాకులేదు. సామర్లకోటలో బస్సుయాత్ర జరుగుతుండగా సీఎంను కలిశాం. ఆయన ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

– కోలాబత్తుల సంధ్యారాణి, గోనాడ, కాకినాడ జిల్లా

కొండంత అండగా నిలిచారు

నేను ప్రైవేట్ స్కూల్ టీచర్ని. 2019లో మా అమ్మాయికి బ్లడ్ క్యాన్సర్ వచ్చింది. రూ.లక్షల్లో వైద్యం చేయించే స్థోమతలేని పరిస్థితుల్లో సీఎం జగన్ అండగా నిలిచారు. సీఎంఆర్ఎఫ్ కింద సాయంచేశారు. ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేశారు. పాప కోలుకుంది. ఇప్పుడు పాపకు రక్తంలో హిమోగ్లోబిన్, ప్లేట్‌లెట్స్ బాగా తగ్గిపోయాయి. దీంతో వెంటనే బయాప్సీ చేసి బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలని, రూ.25లక్షలు అవుతుందని చెప్పారు. నంబూరు వద్ద సీఎం జగన్‌ను బస్సుయాత్రలో కలిసి మా సమస్యను వివరించాం. వెంటనే ఆయన స్పందించి పాపకు ఎంత ఖర్చయినా ఉచితంగా వైద్యం అందించాలని ఆదేశించారు. ప్రస్తుతం కీమోథెరపీ నడుస్తోంది. దేవుడిలా సీఎం జగన్ మమ్మల్ని ఆదుకున్నారు. ఆయన రుణం ఏమిచ్చినా తీర్చుకోలేం.

– కంతేటి మోహన్‌రావు, పెదకాకాని, గుంటూరు జిల్లా

జిల్లా యంత్రాంగం సమక్షంలో కార్మికులతో చర్చలు జరపండి


గంగవరం పోర్టు యాజమాన్యానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: సమ్మె చేస్తున్న కార్మికులతో చర్చలు జరిపి వివాద పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గంగవరం పోర్టు యాజమాన్యాన్ని హైకోర్టు ఆదేశించింది. జిల్లా రెవెన్యూ, పోలీసు యంత్రాంగం సమక్షంలో చర్చలు జరపాలని స్పష్టం చేసింది. సమ్మె పరిష్కారానికి తీసుకున్న చర్యలను వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని పోర్టు యాజమాన్యాన్ని ఆదేశించింది. స్థానిక పరిస్థితులు, సమ్మె పరిష్కారానికి ఇప్పటి వరకు ఏం చేశారు? ఎంత మందిపై కేసులు నమోదు చేశారు? తదితర వివరాలతో అఫిడవిట్ వేయాలని పోలీస్ కమిషనర్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 30కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. గంగవరం పోర్టులో కార్మికుల సమ్మె వల్ల విశాఖ స్టీల్ ప్లాంట్‌కు బొగ్గు సరఫరాలో అంతరాయం ఏర్పడిందని, దీని వల్ల ప్లాంట్ మూతపడే పరిస్థితి ఉందని, బొగ్గు సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలంటూ స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకట దుర్గా ప్రసాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి శుక్రవారం మరోసారి విచారణ జరిపారు. స్టీల్ ప్లాంట్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ గంగవరం పోర్టులో బొగ్గు అన్‌లోడ్ చేయని నౌకను విశాఖకు తరలించామని, అక్కడి నుంచి బొగ్గును ప్లాంట్‌కు తరలిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరాం వాదనలు వినిపిస్తూ , కార్మికులు సమ్మె విరమించేందుకు పోర్టు యాజమాన్యం మరింత చొరవ చూపాల్సింది ఉందన్నారు. వారు ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు సరిపోవన్నారు. నిర్వాసిత కార్మికులు ఆత్మహత్య చేసుకుంటామని బెదిరిస్తున్నారని తెలిపారు. కార్మికులు, పోర్టు యాజమాన్యం మధ్య వివాదం శాంతిభద్రతల సమస్యగా మారే ప్రమాదం ఉందన్నారు. పోలీసులు జోక్యం చేసుకుంటే పరిస్థితి మరింత జటిలం అవుతుందన్నారు. వివాద పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఏమి చేయాలో అదంతా చేస్తోందని చెప్పారు. కార్మికుల వాదన కూడా వింటే బాగుంటుందని, అందువల్ల వారిని ఈ వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చాలన్నారు. కోర్టు జోక్యం లేకుండానే సమస్య పరిష్కారానికి పోర్టు యాజమాన్యమే చర్యలు తీసుకుంటే మంచిదని చెప్పారు. పోర్టు తరఫు సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్ వాదనలు వినిపిస్తూ కార్మికులు గతంలో లేవనెత్తిన డిమాండ్లను పరిష్కరించామని, ఇప్పుడు మళ్లీ కొత్త డిమాండ్లతో సమ్మెకు దిగారని తెలిపారు. కార్మికులతో చర్చలకు యాజమాన్యం సిద్ధంగా ఉందన్నారు.

మా సేవలు కొనసాగాలంటే మళ్లీ జగన్ గెలవాలి

- చంద్రబాబు అధికారంలోకి వస్తే మళ్లీ వచ్చేది జన్మభూమి కమిటీలే
- వలంటీర్ల గురించి నీచంగా మాట్లాడిన బాబు, పవన్ క్షమాపణ చెప్పాలి
- గ్రామ, వార్డు వలంటీర్ల అసోసియేషన్ రాష్ట్ర కమిటీ డిమాండ్

సాక్షి, అమరావతి: మళ్లీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయితేనే వలంటీర్ల సేవలు కొనసాగుతాయని గ్రామ, వార్డు వలంటీర్ల అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఒకవేళ చంద్రబాబు అధికారంలోకి వస్తే గతంలో ప్రజలను హింసించిన జన్మభూమి కమిటీలనే మళ్లీ తెస్తారని ఆందోళన వ్యక్తం చేసింది. గత ఐదేళ్లగా ప్రజలకు వారి ఇంటి వద్దనే సేవలందించిన వలంటీర్లలో ఏ ఒక్కరినీ కొనసాగించరని పేర్కొంది. ఎన్నికల సమయంలో వలంటీర్లను మభ్యపెట్టేందుకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తింది. ఇన్నాళ్లూ వలంటీర్ల గురించి నీచంగా మాట్లాడినందుకు, మానసికంగా వేధించినందుకు వారిద్దరూ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు గ్రామ, వార్డు వలంటీర్ల అసోసియేషన్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు పేటా నాగమల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మద్దలి కాళిదాసు, ఉపాధ్యక్షుడు ఉదయ్ కుమార్, సంయుక్త కార్యదర్శి సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల సంఘం నిర్ణయం వల్ల ప్రజలకు తాము ఎలాంటి సేవ చేయలేకపోతున్నామన్నారు. తాము వలంటీర్లుగా ఉండి కూడా అవ్వాతాతలు పింఛన్ కోసం కష్టపడుతుంటే చూడలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ జగన్ మళ్లీ సీఎం అయితేనే తాము వలంటీర్లుగా సేవ చేయడం వీలవుతుందన్నారు.


'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+6 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 35

శనివారం 27-4-2024



ఫైనల్లో సురేఖ-అభిషేక్ జోడీ


ప్రపంచకప్ స్టేజ్-1 ఆర్చరీ టోర్నీలో భారత క్రీడాకారుల జోరు - 13లో



భారత్ వృద్ధి 6.6 శాతం

2024-25లో నమోదు చేస్తుందని డెలాయిట్ ఇండియా అంచనా - 13లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఈవీఎంల ట్యాంపరింగ్ అసాధ్యం

ఈవీఎంల ట్యాంపరింగ్ అసాధ్యమని.. వంద శాతం వీవీప్యాట్ స్లిప్‌ల లెక్కింపు కుదరదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

వివరాలు 6లో ▸



ప్రతిపక్షాలకు గట్టి చెంపదెబ్బ

ఈవీఎంలు, వీవీ ప్యాట్ స్లిప్పుల విషయంలో సుప్రీంకోర్టు తీర్పు ప్రతిపక్షాలకు గట్టి చెంపదెబ్బ అని ప్రధాని మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸



వేదికపై కన్నీళ్లు పెడతాడేమో

కపట నాటకాలతో ప్రచార వేదికను కన్నీటితో తడిపేస్తాడేమో అంటూ ప్రధాని మోదీని కాంగ్రెస్ నేత రాహుల్ విమర్శించారు.

వివరాలు 6లో ▸



రెండో దశలో 63.5% పోలింగ్

రెండో దశలో భాగంగా 13 రాష్ట్రాల్లోని 88 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 63.5 శాతం పోలింగ్ నమోదైందని ఈసీ ప్రకటించింది.

వివరాలు 6లో ▸

భాషాభివృద్ధిలో యువత పాత్ర కీలకం



- ప్రపంచ భాషలకు మాతృమూర్తి సంస్కృతం
- దేశ సంస్కృతి, సంప్రదాయాలకు ఇదే నిలువెత్తు నిదర్శనం.. విద్యార్థులు దేశ సేవకు అంకితం కావాలి
- ఎన్ఎస్‌యూ స్నాతకోత్సవంలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్

5లో

బాబు సేవ కోసమే రాజకీయాల్లోకి పవన్



- చంద్రబాబును సీఎం చేయాలనే లక్ష్యంతో పవన్ పనిచేస్తున్నారు
- బాబు కిర్లంపూడిని పాకిస్తాన్ చేశాడు.. జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే పేదల కడుపు నింపుతున్నాయి
- మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ

11లో

ఇలాగైతే కష్టం.. గ్యారంటీగా గెలవం..

హామీలతో ముంచేద్దాం

అడ్డగోలు ప్రామిస్‌లతో మేనిఫెస్టోను రెడీ చేస్తున్న చంద్రబాబు

ప్రధాని మోదీ సమక్షంలో విడుదల చేసేలా పన్నాగం.. 'నో' అంటే ఆయన ఫొటోతో..

సిద్ధం సభలు, బస్సు యాత్ర సక్సెస్‌తో కూటమి వెన్నులో వణుకు

- సీఎం జగన్ బస్సు యాత్ర రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేసిందంటున్న విశ్లేషకులు.. మళ్లీ "ఫ్యాన్" ప్రభంజనమేనని 20కిపైగా జాతీయ మీడియా, పొలిటికల్ కన్సల్టెన్సీల సర్వేల్లో వెల్లడి
- 2014 ఎన్నికల్లోనూ కూటమిగా ఏర్పడి నోటికొచ్చిన హామీలిచ్చిన బాబు
- రుణమాఫీ అంటూ రైతులకు, మహిళలకు టీడీపీ వెన్నుపోటు
- జనం నిలదీస్తారనే భయంతో వెబ్‌సైట్ నుంచి మేనిఫెస్టో మాయం
- కాంగ్రెస్ హామీలకే సూపర్ సిక్స్ ముసుగేసి మినీ మేనిఫెస్టో ప్రకటన.. ఆ హామీలు కర్ణాటక, తెలంగాణలో నీరుగారిపోయిన వైనం.. బాబు మోసాలతో హామీలను పట్టించుకోని ప్రజలు
- జనసేన, బీజేపీతో జట్టు కట్టినా జనస్పందన లేక చంద్రబాబు ఆందోళన
- సీఎం జగన్‌ను తూలనాడే క్రమంలో పవన్‌పై నోరుజారడమే బాబు ఫ్రస్టేషన్‌కు నిదర్శనం
- తన దగ్గర పనిచేసే బడుగుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తూ భువనేశ్వరి బూతు పురాణం

10లో





నేడు వైఎస్సార్‌సీపీ

మేనిఫెస్టో

విడుదల చేయనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

3లో



ఐదేళ్ల ప్రయాణం

అద్భుతం

- అర్హులందరికీ సీఎం జగన్ పథకాలతో లబ్ధి చేకూర్చారు
- గతంలో ఇద్దరు కలిస్తే సమస్యలు, కష్టాలపై ఏకరువు
- ఇప్పుడు ప్రభుత్వ సాయంపై మాట్లాడుతున్నారు
- ఉత్తరాంధ్ర మనోగతం ఇదీ

10లో



పోటీ పరీక్ష ఏదైనా ఫలితాలలో అగ్రగామి
TIRUMALA
A/C Hostel
Day Scholar
E. M. SCHOOL
Jr. COLLEGE
IIT & MEDICAL ACADEMY
రాజమహేంద్రవరం
కాతేరు, రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా.
Cell : 79970 71672, 83090 76048
విశాఖపట్నం
డే & రెసిడెన్షియల్ క్యాంపస్ : రాజుల తాళ్ళవలస,
Cell : 63020 55540, 84639 33335
డే స్కాలర్ స్కూల్ క్యాంపస్ : లాసన్స్‌బే కాలనీ,
Cell : 849999 5177, 849999 6177
డే స్కాలర్ కాలేజ్ క్యాంపస్ : ఆసిల్‌మెట్ట
Cell : 849999 3177, 849999 3577
భీమవరం
ప్రకృతి ఆశ్రమం, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా.
Cell : 99123 01409, 91826 23317
JEE Main - 2024 ఫలితాలలో
వివిధ కేటగిరిలలో మా విద్యార్థులు సాధించిన అత్యద్భుత ఆలిండియా ర్యాంకులు
34th RANK U SUDHIR
37th RANK M G VENKATA MAHESH
57th RANK S DATTA VIGHNESH
57th RANK K J VENKATA SAI
90th RANK R PAVITRA
110 RANK J VENKATA SAI TEJA
118 RANK M CHARAN SREE TEJA
123 RANK G VAMSI KRISHNA
141 RANK P DINESH
145 RANK M VINESH KUMAR
149 RANK M R S V S SRI MANIKANTA
154 RANK P RAHUL
155 RANK K U KARTHIKEYA
168 RANK G N V DURGA SAI
ఈ అత్యద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులకు, కృషిచేసిన అధ్యాపకులకు, అధ్యాపకేతర సిబ్బందికి సహకరించిన తల్లిదండ్రులకు మరియు మా శ్రేయోభిలాషులకు
హృదయపూర్వక శుభాకాంక్షలు
210 RANK N VENKATA HARDHIK
217 RANK B LAKSHMAN RAO
221 RANK D S CHARAN REDDY
223 RANK B HEMANTH
224 RANK D PRAVEEN KUMAR
225 RANK G D L N E C PRAKASH
238 RANK B NAVADEEPPAVAN
253 RANK N Y KUMAR REDDY
255 RANK P S SAI AMRUTH
261 RANK CH DHANUNJAYA
265 RANK T ADITYA
277 RANK G SATYANARAYANA
279 RANK P SHANMUK SAINADH
288 RANK B S K CHAITANYA
291 RANK S JOHN VESLI
304 RANK K PRAVEEN SIDDARTH
375 RANK K G GANAPATHI NAIK
378 RANK E S D SAATHWIK
379 RANK K S T ANUROOP
383 RANK P S L N SWAMY
417 RANK B HEMA SWARUP
433 RANK K L S SRAVANYA
434 RANK K NIRMAL
447 RANK B H N VARDHAN
448 RANK K S RAMA KRISHNA
460 RANK D SAI SATYA
464 RANK M A SAI NAIDU
505 RANK S S D SRINIVAS
536 RANK V SRIRAM
542 RANK B CHARAN
553 RANK K V S NEELACHALAM
580 RANK D KRISHNA TEJA
582 RANK K J N SANTHOSH BABU
589 RANK M V RITHVIK REDDY
603 RANK A ASEERVADAM
611 RANK A SASI VARDHAN
624 RANK K S PRANAV
637 RANK N JATIN
642 RANK K L V DURGACHANDAN
643 RANK K P S MANIKANTA
648 RANK B SAI NAREN
695 RANK G SIVA VARMA
699 RANK M HIMA HARIKA
700 RANK P S R S N VINAY
717 RANK CH RISHITHA
723 RANK CH S MANAS VARMA
735 RANK V L ANJANA
744 RANK V R CHARAN VARMA
751 RANK B DINESH
782 RANK N G SRI SARAN
817 RANK T SASANK
822 RANK U R SAMUEL PAUL
843 RANK M SAI SOUMYA
848 RANK M M N MANIKANTA
851 RANK B S N V RAMANA
853 RANK T U SAI DEEPAK
859 RANK B VIGNESH KUMAR
870 RANK T GANESH
884 RANK V RAJESH GUPTHA
920 RANK R S BHARDWAJ
921 RANK T H S S NISHANTH
938 RANK P AMAR ADITYA
956 RANK K H GANESH
956 RANK S S D B GANGADHAR
961 RANK P V D VARAPRASAD
964 RANK G PRIYANKARI
976 RANK T S S M SWAMY
2024 - JEE Adv. కు QUALIFY అయినవారు
1938
2024లో ప్రతిష్ఠాత్మక IIT/NIT/IIIT లలో సాధించగల అడ్మిషన్లు
900+
వివిధ కేటగిరిలలో మా విద్యార్థులు సాధించిన ఆలిండియా ర్యాంకుల విశ్లేషణ
BELOW 2000 RANKS 169
BELOW 5000 RANKS 342
BELOW 10000 RANKS 566
BELOW 15000 RANKS 730
BELOW 20000 RANKS 900
2024 - 25 విద్యాసంవత్సరం నుండి మేము ప్రారంభించు నూతన డే స్కాలర్ క్యాంపస్‌లు
తణుకు మరియు పాయకరావుపేట
2023 లో ప్రతిష్ఠాత్మకమైన IIT/ NIT/ IIIT/ BITS లలో మా విద్యార్థులు సాధించిన సీట్లు
646
IIT 244
NIT 311
IIIT 73
BITS 18
6,7,8,9,10 వ తరగతుల లోనికి రాబోవు విద్యార్థులకు మరియు వారి తల్లిదండ్రులకు
IIT & Medical Foundation పై
అవగాహన సదస్సు
for Registration
28.04.2024
ఆదివారం ఉ.9 గం॥లకు
రాజమహేంద్రవరం, కాతేరులోని మా ప్రాంగణంలో
ONLINE REGISTRATION IS A MUST
Website : www.tirumalaedu.com
7997071672, 7702449686
8106555886, 8309076048
2023లో మా విద్యార్థులు సాధించిన MBBS సీట్లు
233
AIIMS 14 SEATS

నేడు వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టో శనివారం విడుదల కానుంది. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోను ప్రకటిస్తారు. విశ్వసనీయ సమాచారం మేరకు... ప్రస్తుతం రాష్ట్రంలో లక్షల కుటుంబాల స్థితిగతులను మార్చేసిన పథకాలన్నిటినీ తదుపరి టర్మ్‌లోనూ కొనసాగించాలని పార్టీ సూత్రప్రాయంగా నిర్ణయించిందని, ఈ మేరకు మేనిఫెస్టోలో ప్రకటన చేసే అవకాశం ఉందని తెలియవచ్చింది. ప్రస్తుతం పిల్లలను స్కూళ్లకు పంపించడానికి ఏ తల్లిదండ్రులూ భయపడకుండా, ప్రయివేటు స్కూళ్లకు పంపినా కూడా వారి ఫీజులకు ఇబ్బంది కాకుండా ప్రభుత్వం అమ్మ ఒడిని అందిస్తోంది. దీంతో పిల్లలను స్కూళ్లలో చేర్చి చదివించే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇది అక్షరాస్యత రేటుతో పాటు విద్యావంతుల సంఖ్యనూ గణనీయంగా పెంచనుంది. అలాగే నాణ్యమైన విద్యను అందించడానికి స్కూళ్లను సకల సౌకర్యాలతో తీర్చి దిద్దటంతో పాటు వారికి స్కూళ్లు తెరిచే నాటికే యూనిఫాం, బూట్లతో పాటు పుస్తకాలన్నిటినీ కలిపి విద్యా కానుకగా అందిస్తున్నారు. ఇక 8వ తరగతి పిల్లలకు ఉచితంగా ట్యాబ్‌లిస్తూ... డిజిటల్ విద్యను ప్రోత్సహిస్తున్నారు. ఈ పథకాలన్నీ కొనసాగవచ్చని సమాచారం. నడివయసు మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా వడ్డీ లేని రుణాలను అందిస్తూ 'చేయూత' ఇస్తున్నారు. ఇక రైతాంగానికి ఏటా రెండు సార్లు రైతు భరోసాను అందిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. ఈ పథకాలతో పాటు మిగతా పథకాలనూ కొనసాగించే అవకాశం కనిపిస్తోంది. నిజానికి రాష్ట్రంలో ప్రస్తుతం పథకాలన్నీ శాచ్యురేషన్ పద్ధతిలో... అంటే అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందేలా అమలు చేస్తున్నారు. ఆర్థికంగా, సామాజికంగా బలహీనంగా ఉన్న వర్గాలను ఒక స్థాయికి తెచ్చి, మిగిలిన వారితో వీళ్లు కూడా పోటీ పడేలా చేయాలన్నదే ఈ పథకాల అసలు ఉద్దేశం. అయితే ఉద్దేశించిన ఫలితాలు రావాలన్నా, ఇలా బలహీనంగా ఉన్న వర్గాలు ఆశించిన స్థాయికి చేరాలన్నా ఈ పథకాలను మరికొన్నాళ్లు కొనసాగించాల్సిన అవసరం ఉందని పార్టీ భావించిందని, ఈ నేపథ్యంలోనే ఆయా అంశాలన్నిటినీ పొందుపరిచి మేనిఫెస్టోను ప్రకటిస్తారని భావిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ అభిమానిపై టీడీపీ నాయకుడి దాడి



రేగిడి: విజయనగరం జిల్లా రేగిడి మండలం పారంపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ అభిమాని సత్తిబాబుపై టీడీపీ నాయకుడు శుక్రవారం దాడికి పాల్పడ్డాడు. గ్రామంలోని ఏర్పాటు చేసిన పెళ్లి భోజనానికి వెళ్లి వస్తుండగా ఈ ఘటన జరిగింది. రెండు రోజుల క్రితం రాజాం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ నామినేషన్‌కు సత్తిబాబు వెళ్లడం, అక్కడి నామినేషన్ వివరాలు గ్రామంలో గొప్పగా చెప్పడాన్ని అదే గ్రామానికి చెందిన టీడీపీ నేత బెజ్జిపురపు గణేష్ జీర్ణించుకోలేకపోయాడు. పెళ్లి వద్ద సత్తిబాబుతో వాగ్వాదానికి దిగాడు. ఓ కర్ర తీసుకుని సత్తిబాబు తలపై బలంగా మోదాడు. కుటుంబీకులు ఆస్పత్రికి తరలించారుప. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెలాఖరు దాకా భగభగలే

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో వడగాడ్పులు తగ్గకపోగా మరింత తీవ్రతరమవుతున్నాయి. సగానికి పైగా జిల్లాల్లో వడగాడ్పులు ప్రభావాన్ని చూపుతున్నాయి. పలుచోట్ల 42–44 డిగ్రీలు, కొన్నిచోట్ల 45 డిగ్రీలకు పైగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నిప్పులు చెరిగే ఎండలతో జనం ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే దాదాపు నాలుగు వారాల నుంచి ఉష్ణతాపం తీవ్ర ప్రతాపం చూపుతోంది. ఈ పరిస్థితి నెలాఖరు వరకు కొనసాగనుంది. శుక్రవారం 41 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 116 మండలాల్లో వడగాడ్పులు వీచాయి. శనివారం అవి మరింత ఉధృతమై 64 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 183 మండలాల్లో వడగాడ్పులు వీయనున్నాయి. కాగా.. శుక్రవారం అత్యధికంగా నంద్యాల జిల్లా చాగలమర్రిలో 45.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఖాజీపేట (వైఎస్సార్)లో 45.3, మాచర్ల (పల్నాడు)లో 45.2, కర్నూలు రూరల్‌లో 44.9, తాడిపత్రి (అనంతపురం)లో 44.6, మార్కాపురం (ప్రకాశం)లో, కొత్తవలస (విజయనగరం)లో 44.2, డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వడగాడ్పుల తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) సూచించింది.



రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, పట్టణాల్లో శుక్రవారం నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు (డిగ్రీ సెల్సియస్‌లలో)

నగరం/పట్టణం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	44.8	28.6
కర్నూలు	44.0	28.0
కడప	43.2	27.0
విజయవాడ	42.0	28.0
మార్కాపురం	42.0	28.0
రాజమహేంద్రవరం	42.5	26.0
ఏలూరు	42.0	25.0
తిరుపతి	42.0	23.0
విజయవాడ	41.0	28.0
గుంటూరు	41.0	28.0
విజయనగరం	40.0	34.0
నెల్లూరు	39.5	27.5
విశాఖపట్నం	37.6	28.0

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



వైఎస్సార్‌సీపీలో చేరిన ఓగిరాల టీడీపీ నాయకులతో వల్లభనేని వంశీమోహన్



విజయవాడలో దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలు



పల్నాడు జిల్లా ఒప్పిచర్లకు చెందిన పలువురిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పీఆర్కే



కృష్ణా జిల్లా నాగాయలంకలో టీడీపీ-జనసేన నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న సింహాద్రి రమేష్ బాబు

నాగాయలంక/వినుకొండ(నూజెండ్ల)/కారెంపూడి/రేపల్లె రూరల్/పట్నం బజారు/గంపలగూడెం/పటమట(విజయవాడ తూర్పు)/హనుమాన్ జంక్షన్ రూరల్: కృష్ణా జిల్లాలోని నాలి, ఎదురుమొండి దీవులు, గణపేశ్వరం, బర్రంకుల, సంగమేశ్వరం, కమ్మనమోలు, సొర్లగొంది, నాగాయలంక, చోడవరం గ్రామాల నుంచి టీడీపీ, జనసేనకు చెందిన 50 కుటుంబాలు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో అవనిగడ్డ అసెంబ్లీ అభ్యర్థి సింహాద్రి రమేష్ బాబు సమక్షంలో చేరాయి. పల్నాడు జిల్లా వినుకొండలో నూర్‌బాషా సంఘానికి చెందిన 20 కుటుంబాలు, కుమ్మరిపాలెం నుంచి 5 కుటుంబాలు, నూజెండ్ల మండలం గాంధీనగర్‌కి చెందిన 10 కుటుంబాలు టీడీపీని వీడి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. కారెంపూడి మండలంలోని ఒప్పిచర్లకి చెందిన 36 వడ్డెర కుటుంబాలు టీడీపీని వీడి ఎమ్మెల్యే పిన్నెల్లి సమక్షంలో పార్టీలో చేరాయి. గుంటూరు జిల్లా రేపల్లె 23వ వార్డుకు చెందిన టీడీపీ, జనసేన నేతలు రాజ్యసభ సభ్యుడు మోపిదేవి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. గుంటూరు శ్యామలానగర్‌లోని టీడీపీ, జనసేనల నుంచి 500 కుటుంబాలు, 34వ డివిజన్ ఫాతిమాపురానికి చెందిన 100 మంది టీడీపీ కార్యకర్తలు, 18 డివిజన్‌లో 150 మంది జనసేన కార్యకర్తలు, వెంకటేశ్వర కాలనీకి చెందిన వంద మంది, 44వ డివిజన్‌లో 50 మంది మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎన్టీఆర్ జిల్లా చింతలనర్వకి చెందిన 50 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీ తిరువూరు అభ్యర్థి ఎస్.స్వామిదాసు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. విజయవాడ 16వ డివిజన్‌కు చెందిన 100 మంది జనసేన కార్యకర్తలు విజయవాడ తూర్పు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాశ్ సమక్షంలో పార్టీలో చేరారు. కృష్ణా జిల్లా ఓగిరాల ఎంపీటీసీ సభ్యుడు తోకల సుబ్బారావు, పలువురు టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ సమక్షంలో పార్టీలో చేరారు.

యువత కోసం 'టర్నింగ్ 18'

- 18 ఏళ్ల యువత ఓటు హక్కు వినియోగించుకునేలా ఈసీ ప్రచారం

సాక్షి, అమరావతి: ఎన్నికల ప్రక్రియపై యువ ఓటర్లలో చైతన్యం కలిగించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు చేపట్టింది. యువ ఓటర్లను ముఖ్యంగా 18 ఏళ్ల నుంచి 19 ఏళ్లలోపు వారు ఓటు హక్కు వినియోగించుకునేలా 'టర్నింగ్ 18' పేరుతో ప్రచార కార్యక్రమం నిర్వహిస్తోంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ఎక్స్, యూట్యూబ్, పబ్లిక్ యాప్, వాట్సాప్ చానల్ ద్వారా 'టర్నింగ్ 18', 'యూ ఆర్ ది వన్' వంటి ప్రచారాలను నిర్వహిస్తోంది. గత ఎన్నికలలో పట్టణ, యువ ఓటర్లు ఉదాసీనతగా వ్యవహరించారని.. అలాంటి వారిని చైతన్యవంతుల్ని చేయడమే తమ లక్ష్యమని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. ఇందుకోసం వివిధ ఆకర్షణీయ థీమ్‌లతో ప్రచారం చేస్తోంది. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో దేశవ్యాప్తంగా మొత్తం 1.5 కోట్ల మంది 18 నుంచి 19 ఏళ్ల ఓటర్లు నమోదవ్వగా.. ఇప్పుడు 1.84 కోట్ల మంది ఓటర్లుగా నమోదయ్యారని ఎన్నికల సంఘం పేర్కొంది. ఇక ఏపీలో 2024 ఎన్నికల కోసం తొలిసారి ఓటరుగా నమోదు చేసుకున్న 18 నుంచి 19 ఏళ్లలోపు వారు 9.01 లక్షల మంది ఉన్నారు. వీరంతా ఓటు హక్కు వినియోగించుకునేలా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టింది.

డాబా కొట్లు సెంటర్‌లోనే సీఎం జగన్‌పై దాడికి యత్నం!

జనసమూహాన్ని చూసి వెనక్కి తగ్గిన నిందితుడు సతీష్

పోలీసుల విచారణలో తాజాగా వెలుగులోకి



సాక్షి ప్రతినిధి, విజయవాడ: 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా ఈ నెల 13వ తేదీన విజయవాడలో పర్యటించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై టీడీపీ నాయకులు ముందస్తు కుట్ర పూరితంగానే హత్యాయత్నం చేసినట్లు తాజాగా వెల్లడైంది. పోలీస్ కస్టడీలో ఉన్న ఏ 1 నిందితుడు వేముల సతీష్‌కుమార్ ఇదే విషయాన్ని ధ్రువీకరించినట్లు సమాచారం. న్యాయమూర్తి ఆదేశాలతో రెండు రోజులుగా సతీష్ కుమార్‌ను న్యాయవాది సమక్షంలో పోలీసులు విచారిస్తున్నారు. దాడి ఘటనకు సంబంధించి పలు కీలక అంశాలను నిందితుడి నుంచి రాబట్టినట్లు తెలుస్తోంది.

స్నేహితుడు వారించడంతో...

దాడి జరిగిన 13వ తేదీ సాయంత్రం విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోకి సీఎం జగన్ బస్సు యాత్ర ప్రవేశించింది. చుట్టుగుంట, గవర్నమెంట్ ప్రెస్, అజిత్‌సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ మీదుగా డాబాకొట్లు సెంటర్‌కు బస్సు యాత్ర చేరుకుంది. కాగా డాబాకొట్లు సెంటర్‌లోనే సీఎం జగన్‌పై దాడి చేసేందుకు నిందితుడు సతీష్ ప్రయత్నించినట్లు తెలిసింది. అయితే అక్కడ జన సమూహం ఎక్కువగా ఉండటంతో స్నేహితుడి సూచన మేరకు అక్కడ దాడి యత్నాన్ని సతీష్ విరమించుకున్నట్లు సమాచారం. అనంతరం బస్సు యాత్ర అక్కడి నుంచి వివేకానంద స్కూల్ వద్దకు చేరుకున్న సమయంలో సతీష్ తన వ్యూహాన్ని అమలు చేయడం తెలిసిందే. టీడీపీ నాయకుల ప్రోద్బలంతోనే నిందితుడు సతీష్ హత్యాయత్నం చేసినట్లు స్పష్టమవుతోంది. ఈ ఘటన వెనుక పాత్రధారులు, సూత్రధారుల వివరాలు విచారణలో వెలుగులోకి రానున్నాయి.

ఎన్నికల్లో శాంతిభద్రతలకు 'సమర్థ్'

- అన్ని జిల్లాల ఎస్పీలు, సీపీలు, సెక్టార్ అధికారులు ఈ యాప్ వినియోగించాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశం
- 'సమర్థ్' ద్వారా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు సులభం
- పోలీస్ బలగాలనూ ట్రాక్ చేయొచ్చు.. తద్వారా వేగంగా అక్కడికి సిబ్బందిని పంపించే అవకాశం
- ఈ యాప్‌ను అభివృద్ధి చేసి ప్రయోగాత్మకంగా వినియోగిస్తున్న బాపట్ల ఎస్పీకి ప్రశంసలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మే 13న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎటువంటి శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టేందుకు 'సమర్థ్'(సెక్యూరిటీ అరేంజ్‌మెంట్ మ్యాపింగ్ అనాలసిస్ రెస్పాన్స్ ట్రాకింగ్ హబ్) అనే మొబైల్ యాప్ ఉపయోగపడుతుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా చెప్పారు. ఈ యాప్‌ను అన్ని జిల్లాల ఎస్పీలు, సీపీలు, సెక్టార్ అధికారులు వినియోగించాలని ఆయన శుక్రవారం ఆదేశించారు. ఎన్నికల వేళ పోలీసులు వీలైనంత వేగంగా స్పందించేందుకు ఈ యాప్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. సమస్యాత్మక, సాధారణ పోలింగ్ కేంద్రాల లొకేషన్లను సులభంగా గుర్తించవచ్చని.. తద్వారా బలగాలను తక్షణమే అక్కడికి పంపించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కంట్రోల్ రూమ్ నుంచే పోలీస్ బలగాల లొకేషన్‌ను గూగుల్ మ్యాప్ ద్వారా ట్రాక్ చేయవచ్చని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇలాంటి స్మార్ట్ అండ్ క్విక్ పోలీసింగ్ యాప్‌ను అభివృద్ధి చేసి ప్రయోగాత్మకంగా బాపట్ల జిల్లాలో వినియోగిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్‌ను ఆయన అభినందించారు. అంతకుముందు బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సచివాలయంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాను కలిసి 'సమర్థ్' యాప్ గురించి వివరించారు. తమ జిల్లా ఐటీ కోర్ విభాగం రూపొందించిన ఈ యాప్‌ను ప్రయోగాత్మకంగా ఈ నెల 22 నుంచి తమ జిల్లాలో వినియోగిస్తూ మంచి ఫలితాలను సాధిస్తున్నట్లు తెలిపారు. ఈ యాప్ ద్వారా పోలీస్ అధికారులు నేరుగా ఫోన్ చేయవచ్చని, ఒక్క నోటిఫికేషన్ ద్వారా జిల్లాలో ఉన్న 2,000 మంది పోలీసులకు ఒకేసారి ఆదేశాలు జారీ చేయవచ్చని చెప్పారు. మొబైల్‌కు ఇంటర్నెట్ సిగ్నల్ లేకపోయినా నోటిఫికేషన్ ద్వారా వారికి సమాచారం చేరుతుందన్నారు. ఎన్నికలకు సంబంధించి వచ్చే పిటిషన్లను సంబంధిత పోలీస్ అధికారులకు యాప్ ద్వారా పంపించి.. ఎప్పటికప్పుడు వాటిని పర్యవేక్షించవచ్చని తెలిపారు. మొత్తం జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలు, మొబైల్ నంబర్లు ఈ యాప్‌లో పొందుపరిచినట్లు చెప్పారు. తద్వారా పోలీస్ అధికారులు, సిబ్బందికి సంబంధించిన రియల్ టైమ్ లొకేషన్‌ను తెలుసుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో అదనపు సీఈవోలు పి.కోటేశ్వరరావు, ఎమ్.ఎన్.హరేంధిర ప్రసాద్, బాపట్ల జిల్లా ఐటీ కోర్ ఎస్సై నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల వద్ద మహిళలకు సదుపాయాలు కల్పించాలి

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ముఖేష్ కుమార్ మీనాను కోరిన మహిళా కమిషన్



చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న గజ్జల వెంకటలక్ష్మి

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో మహిళలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ముఖేష్‌కుమార్ మీనాను ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి కోరారు. వైఎస్సార్ కడప జిల్లాలో పోలింగ్ బూత్‌లలో మహిళలకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించేందుకు అనుమతివ్వాలని చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌ను శుక్రవారం కలిసి వినతి పత్రం ఇచ్చారు. అనంతరం వెంకటలక్ష్మి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద మహిళలకు వేరుగా క్యూ లైన్‌లు, చిన్న పిల్లలతో వచ్చే బాలింతలకు ఫీడింగ్ రూమ్ ఏర్పాటు చేయాలని, గర్భిణులకు అత్యవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని కోరినట్టు తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద షెల్టర్, తాగు నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని కోరామన్నారు. మహిళలకు విధిగా మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని కోరినట్టు తెలిపారు.

కూటమి చార్జిషీట్ అబద్ధాల పుట్ట

వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి రావెల

సాక్షి, అమరావతి: టీడీపీ, బీజేపీ, జనసేనలు సీఎం జగన్ పాలనపై విడుదల చేసిన చార్జిషీట్ ఓ అబద్ధాల పుట్ట అని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి రావెల కిషోర్ బాబు దుయ్యబట్టారు. ఆయన శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. సీఎం జగన్ ఈ ఎన్నికల్లో మరోసారి ఘన విజయం సాధించబోతున్నారనే వాస్తవాన్ని జీర్ణించుకోలేక ప్రజల్లో అయోమయం సృష్టించేందుకు విపక్ష నేతలు ప్రయత్నిస్తున్నారన్నారు. అసత్య ఆరోపణల్లో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని అన్నారు. టీడీపీ నేతలదే అసలైన రక్తచరిత్ర అని చెప్పారు. కారంచేడు, నీరుకొండలో టీడీపీ చేసిన మారణకాండను, విజయవాడలో వంగవీటి రంగా హత్యను ప్రజలు మరిచిపోలేరని అన్నారు. సబ్‌ప్లాన్ నిధుల కోసం ఏపీ చట్టం చేసినందున, ఆ నిధులు పక్క దారి పట్టే అవకాశమే లేదని స్పష్టం చేశారు. చంద్రబాబు దళితుల కోసం ఒక్క రూపాయి ఖర్చు చేయరని, అందుకు ఆయన మనసొప్పదని చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు సబ్ ప్లాన్ నిధుల విషయంలో విభేదించినందుకు మంత్రి పదవి నుంచి తీసేశారని తెలిపారు. దళితులపట్ల చంద్రబాబుకు ఉన్న వ్యతిరేకతకు ఇదే నిదర్శనమన్నారు. సీఎం వైఎస్ జగన్ దళిత వాది అని చెప్పారు. అంబేడ్కర్ ఆశయాలు అమలయ్యేలా సీఎం జగన్ పాలన సాగిందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, అగ్రవర్ణాలలోని పేదలందరూ అభివృద్ధి పథంలో పయనిస్తున్నారని తెలిపారు. మేనిఫెస్టోను బైబిల్, ఖురాన్, భగవద్గీతగా భావించి అన్ని హామీలు అమలు చేశారని, మేనిఫెస్టోలో చెప్పని అంశాలు కూడా చాలా అమలు చేశారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా ప్రజలకు రూ.5 లక్షల కోట్లు వెచ్చిస్తే, అందులో రూ.2 లక్షల కోట్లకు పైగా దళితులకే ఇచ్చారని వివరించారు. ఇంగ్లిష్ మీడియం వల్ల దళితుల పిల్లలు చదువులో ముందుకు పోతున్నారని, ఇది సీఎం జగన్ దూరదృష్టికి నిదర్శనమని తెలిపారు. ధనికులు, సొంత సామాజిక వర్గం వారి కోసమే చంద్రబాబు పనిచేశారన్నారు. చంద్రబాబు ప్రభుత్వం విదేశీ విద్య పేరుతో కుంభకోణానికి పాల్పడితే.. నేడు సీఎం జగన్ విదేశీ విద్య కోసం ఒక్కో విద్యార్థికి రూ.1.25 కోట్లు ఇస్తున్నారన్నారని, అది కూడా ప్రపంచంలో టాప్ 200 యూనివర్సిటీలలో చదువుకునే అవకాశం కల్పిస్తున్నారని తెలిపారు. సీఎం జగన్‌ని చంపి సమాధి చేయండంటూ బాబు ప్రజలను రెచ్చగొట్టడం, రెడ్ బుక్ అంటూ లోకేశ్ అధికారులను బెదిరించడం వారి అరాచకానికి నిదర్శనమని అన్నారు.

పచ్చమీడియాకి బుద్ధి చెప్తారు

సీఎం వైఎస్ జగన్ గురించి అవాస్తవాలు ప్రచారం చేసే పచ్చ పార్టీలు, ఎల్లో మీడియాకు ప్రజలే బుద్ధి చెప్తారని వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు ఎ. నారాయణ మూర్తి చెప్పారు. బీసీలంటే బ్యాక్ వర్డ్ క్లాస్ కాదు బ్యాక్ బోన్ క్లాస్ అని నినాదం ఇచ్చి, ఆ వర్గాలను అభివృద్ధి పథంలో నడిపిస్తూ, వారిలో ఆత్మగౌరవం నింపింది సీఎం వైఎస్ జగనే అని తెలిపారు. 40 ఏళ్లుగా బీసీలను చంద్రబాబు కేవలం ఓటు బ్యాంకుగానే చూశారని ధ్వజమెత్తారు.

ఎక్కడివీ 'గంటా'భరణాలు!

- మాజీ మంత్రి గంటా అఫిడవిట్‌లో ఆశ్చర్యకర విషయాలు
- ఐదేళ్లల్లో ఏకంగా కిలోన్నరకు పైగా బంగారం
- గత అఫిడవిట్‌లో సతీమణి పేరుపై కేవలం 600 గ్రాముల బంగారం
- ఈ సారి ఏకంగా 2,258 గ్రాముల బంగారం ఉన్నట్టు అఫిడవిట్
- మరో రూ.1.25 కోట్ల విలువైన ఆభరణాలు ఉన్నట్లు వెల్లడి
- ఐటీ రిటర్న్స్ మూడుసార్లే దాఖలు.. అదీ తక్కువ మొత్తానికే!
- ఒక్కోసారి ఒక్కో పాన్ నంబరు చూపిన వైనం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: మాజీ మంత్రి, టీడీపీ భీమిలి అసెంబ్లీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అఫిడవిట్‌లో ఆశ్చర్యకర విషయాలు బయటపడుతున్నాయి. ఇప్పటికే గత ఎన్నికల అఫిడవిట్‌లో, ఈ ఎన్నికల అఫిడవిట్‌లో భార్య పేరిట రెండు పాన్ నంబర్లను చూపిన విషయం బయటపడగా.. గత ఐదేళ్లలో ఆయన సతీమణి పేరిట భారీ మొత్తంలో బంగారం కొన్నట్లు కూడా వెల్లడైంది. 2019 అఫిడవిట్‌లో సతీమణి పేరిట కేవలం 600 గ్రాముల బంగారం ఉందని పేర్కొన్న గంటా.. ఇప్పుడు ఏకంగా 2,258 గ్రాముల బంగారం ఉన్నట్టు తెలిపారు. అంటే గడిచిన ఐదేళ్లలో కిలోన్నరకు పైగా (1,658 గ్రాములు) బంగారాన్ని ఆయన సతీమణి కొన్నట్లు తాజా అఫిడవిట్ వెల్లడిస్తోంది. ఇందుకోసం దాదాపు రూ.కోటిన్నర మేర వెచ్చించాల్సి ఉంటుంది. అంతేకాకుండా బంగారంతో పాటు మరో రూ. 1.28 కోట్ల విలువ చేసే ఆభరణాలు ఉన్నట్టు కూడా గంటా తాజా అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అయితే, ఇవి వజ్రాభరణాలా, బంగారమా అనేది స్పష్టంగా చెప్పలేదు. కేవలం ఆభరణాలు అని పేర్కొన్న నేపథ్యంలో ఇవన్నీ వజ్రాల నగలై ఉండవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మొత్తం మీద గత ఐదేళ్లలో గంటా సతీమణి పేరుమీద రూ. 3 కోట్ల విలువ చేసే ఆభరణాలు పోగుబడడం గమనార్హం. ఆయన సతీమణి పేరుతో ఈ ఐదేళ్లలో మూడుసార్లే ఐటీ రిటర్న్స్ సమర్పించారు. అదీ రూ. 4 లక్షలు మొదలుకొని గరిష్టంగా రూ. 16 లక్షల వరకే ఐటీ రిటర్న్స్ సమర్పించడం గమనార్హం.

పాన్ నంబర్లతో మస్కా..!

ఎవరి పేరు మీదనైనా ఒక్క పాన్ నంబరే ఉంటుంది. రెండు, అంతకు మించి పాన్ నంబర్లు ఉంటే ఐటీ చట్టం ప్రకారం నేరం. ప్రధానంగా ఆర్థిక నేరాలకు పాల్పడే వారే ఈ విధంగా రెండు పాన్ నంబర్లు కలిగి ఉండే అవకాశం ఉందని ఐటీ శాఖ అధికారులు చెబుతున్నారు. గంటా శ్రీనివాసరావు 2019 అఫిడవిట్‌లో ఆయన సతీమణి పాన్ నంబరు ఏబీపీపీజీ2215ఏగా పేర్కొన్నారు. ఈ సారి (2024) అఫిడవిట్‌లో ఆమె పాన్ నంబర్‌ను ఏబీపీపీజీ2216ఏగా పేర్కొన్నారు. దీనిపై ఇప్పటికే దుమారం రేగుతోంది. ఇప్పుడు బంగారం లెక్కల్లోనూ తేడా కొడుతుండటం చర్చకు దారి తీస్తోంది. గడిచిన ఐదేళ్లలో సతీమణి ఆదాయం కేవలం రూ. 25 లక్షలుగా చూపిన గంటా.. బంగారం, ఆభరణాలు రూ.3 కోట్ల విలువైనవి ఉన్నట్లు చూపారు. ఈ నేపథ్యంలో గంటా అఫిడవిట్‌పై ఐటీ శాఖ దృష్టి సారిస్తే అసలు బండారం బయట పడుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కాంట్రాక్టు ఉద్యోగుల పదవీ కాలం పొడిగింపు

- వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకు..
- ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర స్థాయిలో వివిధ శాఖల్లోనూ, జిల్లా స్థాయిలోని వివిధ కార్యాలయాల్లోనూ పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల పదవీ కాలం ఏడాది పాటు పొడిగిస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది మార్చి నెలాఖరుతో ఈ కాంట్రాక్టు ఉద్యోగుల పదవీ కాలం ముగిసింది. అయితే వివిధ శాఖలతో పాటు జిల్లా స్థాయి కార్యాలయాల కోరిక మేరకు కాంట్రాక్టు ఉద్యోగుల పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకు పొడిగిస్తూ ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి (హెచ్ఆర్) చిరంజీవి చౌదరి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

గురివిందలా గోయల్ తీరు

- 2014–19 మధ్య రైల్వేమంత్రిగా ఉంటూ ఎందుకు రైల్వేజోన్ ఇవ్వలేదు?
- జోన్‌కు అప్పుడెందుకు భూమి కేటాయించలేదు?
- నాడు డబుల్ ఇంజన్ సర్కారే కదా ఉంది.. ఒక ఇంజిన్ రిపేర్ అయ్యిందా?
- బీజేపీ హయాంలో ఎలక్టోరల్ బాండ్స్‌లో భారీ అవినీతి
- మాపై ఆధారపడే పార్టీ కేంద్రంలో రావాలని కోరుకుంటున్నాం : మంత్రి బొత్స

విశాఖ సిటీ : '2014లోనే విశాఖ రైల్వేజోన్ కోసం నిర్ణయం జరిగింది. 2014–2019 మధ్య కూటమి ప్రభుత్వమే ఉంది. సీఎంగా చంద్రబాబు అప్పుడెందుకు రైల్వేజోన్‌కు స్థలాన్ని కేటాయించలేదు? కేంద్ర రైల్వేమంత్రిగా ఉన్న పీయూష్ గోయల్ జోన్ ఎందుకు ఏర్పాటుచేయలేదు? అప్పుడు డబుల్ ఇంజిన్ సర్కారే కదా ఉంది.. ఒక ఇంజిన్ రిపేర్ అయ్యిందా? 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ముడసర్లోవలో 52 ఎకరాలు సేకరించి జోన్ కోసం రైల్వే శాఖకు అందించాం. ఇది వాస్తవం కాదా?



అయినా.. రైల్వేజోన్‌కు రాష్ట్ర ప్రభుత్వం స్థలాన్ని కేటాయించలేదని పీయుష్ గోయల్ చెప్పడం గురువింద గింజ సామెతలా ఉంది'.. అని మంత్రి బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. ఇక్కడ శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ రైల్వేజోన్‌కు ప్రభుత్వం భూమి కేటాయించకపోవడంవల్లే జోన్ ఏర్పాటు ఆలస్యమైందని కేంద్రమంత్రి చేసిన వ్యాఖ్యలను బొత్స ఖండించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చంద్రబాబుకు చెప్పి భూమి ఇప్పిస్తాననడంపై మంత్రి సెటైర్లు విసిరారు. రాష్ట్ర ప్రభుత్వం మాఫియాలా వ్యవహరిస్తోందన్న ఆరోపణలను తిప్పికొట్టారు. బొత్స ఇంకా ఏమన్నారంటే..

నాడు కూటమి ప్రభుత్వంలో దద్దమ్మలు..

విశాఖ రైల్వేజోన్ ఏర్పాటు నిర్ణయం 2014లోనే జరిగింది. అందుకు సంబంధించి ఒప్పందాలు కూడా చేసుకున్నారు. 2019 వరకు చంద్రబాబే సీఎంగా ఉన్నారు. చేతకాని దద్దమ్మలు కూటమిలో ఉండి.. ఇప్పుడు మాపై నిందలు వేస్తే ఎలా? 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక డి-పట్టాలు, ఆక్రమిత స్థలాలను సేకరించాం. రైల్వే, జీవీఎంసీ అధికారులు సంయుక్తంగా తనిఖీచేసి 52 ఎకరాల భూమిని రైల్వేశాఖకు అప్పజెప్పాం. కానీ, రైల్వేజోన్ ఎందుకు ఏర్పాటుచేయలేదు. అప్పట్లో ప్రత్యేక హోదాను పక్కనపెట్టి ప్యాకేజీలు పంచుకున్నారు. ఇక స్వాతంత్ర్యం తరువాత దేశంలో ఎప్పుడూ జరగనంత అవినీతి ఎలక్టోరల్ బాండ్స్ ద్వారా జరగడంపై ముందు సమాధానం చెప్పండి. రూ.వేల కోట్ల దేశ సంపదను మళ్లించి.. ఇప్పుడు పెద్ద కబుర్లు దేనికి? ఇక ఉపాధ్యాయుల బదిలీల్లో అక్రమాలు జరిగాయంటూ పచ్చ పత్రికలు తెగ రాస్తున్నాయి. అధ్యాపకులు, ఉపాధ్యాయ సంఘాలను ఎవరినైనా అడగండి.. నన్ను వేలెత్తి చూపుతారేమో? నాన్‌సెన్స్ ప్రచారం చేయొద్దు. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు కృషిచేస్తున్నారు. ఎన్ని ఆరోపణలు చేసినా ఉపాధ్యాయులకు వాస్తవాలు తెలుసు.

కేంద్రంలో మాపై ఆధారపడే ప్రభుత్వం రావాలి

కేంద్రంలో మాపై ఆధారపడే ప్రభుత్వం రావాలి. అప్పుడే రాష్ట్ర ప్రయోజనాలు, హక్కులు సాధించుకునే అవకాశం ఉంటుంది. అలాగే, కేంద్రం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు తొలగించే ఆలోచన చేస్తే మట్టి కొట్టుకుపోతారు.

ఓ ప్రాణమా! వాక్కులో, కళ్లలో, చెవుల్లో, సమస్త ఇంద్రియాల్లో, మనస్సు మొదలైన అంతఃకరణాల్లో నీ రూపమేదైతే వ్యాపించివుందో దాన్ని మాకందరికీ కల్యాణమయంగానే ఉండనీ; అంతేగానీ మాపై కోపించి బయటకు వెళ్లిపోకు.

– ప్రశ్నోపనిషత్తు (హిందూ ధర్మం)

సాక్షి

శనివారం, 27 ఏప్రిల్ 2024

ఈవీఎం వివాదం చల్లారేనా!

సార్వత్రిక ఎన్నికల రెండో దశ కూడా పూర్తికావస్తుండగా శుక్రవారం సర్వోన్నత న్యాయస్థానం ఈవీఎంల వినియోగంపై వచ్చిన వ్యాజ్యాలను తోసిపుచ్చింది. విపక్షాలను విమర్శించటానికీ, ఆరోపణలు సంధించటానికీ వచ్చే ఏ అవకాశాన్నీ వదులుకోని ప్రధాని నరేంద్ర మోదీ... ఇంకా అయిదు దశల పోలింగ్ జరగాల్సిన తరుణంలో మౌనంగా ఎందుకుంటారు? అందుకే కాంగ్రెస్ నాయకత్వంలోని విపక్షాలకు ఈ తీర్పు చెంపపెట్టన్నారు. ఈవీఎంలపై సందేహాలు రేకెత్తించిన పాపానికి క్షమాపణలు చెప్పాలని కూడా మోదీ డిమాండ్ చేశారు. దేన్నయినా సందేహించటం దానికదే పాపం కాదు. పాపమే అనుకుంటే బీజేపీ, కాంగ్రెస్ సహా దాదాపు అందరికందరూ ఆ పాపం చేసినవారే. ఒకటి రెండు పార్టీలు మినహాయిస్తే పరాజితుల ప్రథమ కోపం ఎప్పుడూ ఈవీఎంలపైనే. వరసగా 2004, 2009 ఎన్నికల్లో ఓటమి ఎదురైనప్పుడు బీజేపీ ఈవీఎంలనే తప్పుబట్టింది. 2012 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినప్పుడు కాంగ్రెస్ కూడా ఆ పనే చేసింది. హ్యాకర్ల ద్వారా ఈవీఎంల సోర్స్ కోడ్ మార్చి అకాలీదళ్ తమ విజయాన్ని దొంగిలించిందని ఆరోపించింది. ఇక యూటర్న్‌ల సిద్ధహస్తుడైన తెలుగుదేశం అధినేత చంద్రబాబుకైతే ఇలాంటి ఆరోపణలు మంచినీళ్లప్రాయం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినప్పుడు ఈవీఎంలపైనే ఆయన ఆగ్రహం. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గినప్పుడు మాత్రం చప్పుడు చేయలేదు. మళ్లీ 2019 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలొచ్చాక ఈవీఎంలపై వీరంగం వేశారు. మధ్యలో ఈవీఎంలు దొంగిలించిన నేరారోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తితో మీడియా సమావేశం ఏర్పాటు చేయించి వాటిని తారుమారు చేయొచ్చని చూపించే ప్రయత్నం చేసింది కూడా చంద్రబాబే. మళ్లీ ఎన్డీఏ పంచన చేరినందువల్ల ఈవీఎంల వివాదంపై ఇప్పుడాయన కిక్కురుమనటం లేదు.

ఇతరుల మాటెలావున్నా ప్రస్తుతం ఈవీఎంల వినియోగాన్ని సవాలు చేసిన సంస్థల్లో విశ్వసనీయతగల అసోసియేషన్ ఫర్ డెమాక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) సంస్థ కూడా వుంది. కనుక ఈవీఎంలను సందేహించటం స్వప్రయోజనాల కోసమేనని భావించలేం. అదో పెద్ద నేరంగా పరిగణించలేం. అలాగని పేపర్ బ్యాలెట్ విధానం సవ్యంగా సాగిందా? పోలింగ్ బూత్‌లు చేజిక్కించుకుని, బ్యాలెట్ పేపర్లు గుంజుకుని తమ గుర్తుపై ముద్రలు వేసుకుని పెత్తందారులు చెలరేగిపోలేదా? రిగ్గింగ్ ఆరోపణలు వచ్చినప్పుడల్లా ఎన్నిసార్లు రీపోలింగ్ జరపక తప్పలేదు! ఈవీఎంల వల్ల ఈ జాడ్యం ఎంతో కొంత కట్టడి అయింది. నిమిషానికి కేవలం అయిదు ఓట్లు మాత్రమే వాటిల్లో నమోదయ్యే అవకాశం వుండటం వల్ల పోలింగ్ కేంద్రాలు ఆక్రమించిన దుండగులకు గతంలోని వెసులుబాటు పోయింది. వెనువెంటనే బలగాలు ఆ పోలింగ్ కేంద్రాన్ని చేరుకుని పరిస్థితిని చక్కదిద్దే అవకాశం వుండటం వల్ల వారి ఆటలు సాగటం లేదు. 1982లో తొలిసారి ఈవీఎంలతో కేరళలో ఒక ఉప ఎన్నిక నిర్వహించారు. అయితే తగిన చట్టం లేకుండా ఈవీఎంల వినియోగం చెల్లదంటూ సుప్రీంకోర్టు ఆ ఎన్నికను రద్దు చేసింది. 1998లో ఢిల్లీ, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో కేవలం కొన్ని నియోజకవర్గాల్లో 45 ఈవీఎంలను ప్రయోగాత్మకంగా వినియోగించారు. ఈవీఎంలపై తరచు ఫిర్యాదులు వస్తున్నందువల్ల వాటికి ప్రింటర్లను అనుసంధానించాలని 2013లో సుప్రీంకోర్టు ఆదేశించింది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో పరిమితంగా దాన్ని అమలు చేసినా... ఆ తర్వాత కాలంలో వీవీ ప్యాట్‌ల పూర్తిస్థాయి వినియోగం మొదలైంది. ఓటరు తనకు నచ్చిన గుర్తుకు ఓటేసిన వెంటనే ప్రింటర్‌పై ఆ పార్టీ పేరు, గుర్తు ఏడు సెకన్లపాటు కనబడే ఏర్పాటుచేశారు. ఆ వెంటనే ఒక స్లిప్‌పై అది ప్రింటయి దానికి అనుసంధానించిన బాక్స్‌లో పడుతుంది. పోలింగ్ సమయంలోనైనా, కౌంటింగ్ సమయంలోనైనా ఈవీఎంలను దేనితోనూ అనుసంధానించటం సాధ్యంకాదని... రిమోట్ కంట్రోల్, బ్లూటూత్, వైఫైలతో నియంత్రించటం కూడా అసాధ్యమని ఎన్నికల సంఘం పదే పదే చెబుతోంది. ప్రభుత్వ రంగ సంస్థలైన బెంగళూరు బెల్, హైదరాబాద్ ఈసీఐఎల్ వీటిని ఉత్పత్తి చేస్తున్నాయి. పోలింగ్‌కు ముందు ఈవీఎంల తనిఖీకి అభ్యర్థులకు అవకాశం ఇస్తున్నారు. చిత్రమేమంటే ఈ ప్రక్రియపై ఓటర్లనుంచి ఎప్పుడూ ఫిర్యాదులు లేవు.

ఇప్పుడు మళ్లీ బ్యాలెట్ పేపర్‌కు మళ్లాలన్న వినతిని తోసిపుచ్చటంతోపాటు వీవీ ప్యాట్ స్లిప్‌లను ఓటర్లే తీసుకునేలా, పరిశీలించుకున్నాక వారే బ్యాలెట్ బాక్స్‌లో వేసేలా చూడాలన్న కోరికను సుప్రీంకోర్టు ధర్మాసనం అంగీకరించలేదు. ఈవీఎంల ద్వారా వెల్లడయ్యే ఓట్ల సంఖ్యనూ, వీవీప్యాట్ స్లిప్‌లనూ లెక్కించి రెండూ సరిపోలినప్పుడే ఫలితం ప్రకటించాలన్న పిటిషనర్ల వినతిని కూడా తిరస్కరించింది. అయితే పార్టీల గుర్తులను కంప్యూటర్ ద్వారా ఈవీఎంలలో లోడ్ చేయటానికి ఉపయోగించే సింబల్ లోడింగ్ యూనిట్ (ఎస్ఎల్‌యూ)లను ఎన్నికల పిటిషన్లు పడిన సందర్భాల్లో పరిశీలించేందుకు అనువుగా 45 రోజులు భద్రపరచాలని ఆదేశించింది. అంటే ఇకపై ఈవీఎంలతోపాటు ఎస్ఎల్‌యూలు కూడా సీల్ చేసివుంచటం తప్పనిసరి. అలాగే రెండు, మూడు స్థానాల్లో నిలిచిన అభ్యర్థులు ఫిర్యాదుచేస్తే ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలోనూ 5 శాతం ఈవీఎంలనూ, ఎస్ఎల్‌యూలనూ ఇంజనీర్ల, ఉత్పత్తిదారుల సమక్షంలో తనిఖీకి అనుమతించవచ్చు. అయితే ఫలితాలొచ్చిన ఏడు రోజుల్లో ఫిర్యాదులు చేయాలి. అలాగే వీవీ ప్యాట్ స్లిప్‌లు లెక్కించే యంత్రాలు సమకూర్చుకునే ఆలోచన చేయాలని ఈసీని కోరింది. ఏదేమైనా బాహాటంగా బయట పడిన సందర్భాలుంటే తప్ప ఈవీఎంలపై అనవసర రాద్ధాంతానికి ముగింపు పలకటం అవసరం. ఇందుకు బదులు ప్రజల్లో విశ్వసనీయత పెంచుకోవటం ఎలా అన్న అంశంపై పార్టీలు దృష్టి సారించాలి.

పద్మవ్యూహంలో వీర అర్జునుడు

అభిప్రాయం



డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్నది మరో మహాభారతం. వీరత్వంతో యుద్ధం చేస్తున్న బాలుడు అభిమన్యుడి మీద నాలుగు మూలల నుండి అస్త్ర పరంపరలు సంధించారు ఆనాడు. పేద ప్రజల సంక్షేమమే ఆశయంగా దుష్ట గ్రహాల్ని ఎదిరిస్తూ పాలన చేస్తున్న పిన్న వయస్కుడైన జగన్ మీద అన్ని వైపుల నుండి దాడి చేస్తున్నారు ఈనాడు. వీరి ప్రయత్నమంతా జగన్‌ను యుద్ధభూమి నుండి తప్పించాలని! అయితే జగన్ అభిమన్యుడు కాదు, అర్జునుడు. కనుకనే 'ఏనుంగు మీది కెగయు సింహ కిశోరంబు రీతి'గా దుష్టుల పన్నాగాలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ పద్మవ్యూహాన్ని ఛేదించుకుంటూ ముందుకు సాగుతున్నారు. దుర్యోధన సైన్యంలా వారంతా రోజురోజుకు పెరిగిపోతుంటే ఇవతల జగన్ ప్రజాదరణ అంతకంతకు పెరిగిపోతూనే వుంది.

మహాభారత రాజకీయం అన్ని కాలాలకు వర్తిస్తుందనటానికి ప్రస్తుతం ఆంధ్రరాష్ట్రంలో జరుగుతున్న రాజకీయాలే నిదర్శనం. ధర్మరాజును ప్రాణాలతో బంధించటానికి ఆనాడు ద్రోణుడు పద్మవ్యూహం పన్నాడు. అది చాలా ప్రమాదకరమైనది. శత్రువు లోపల ప్రవేశించడమంటే అతని మరణాన్ని కొనితెచ్చుకోవటమే. దానినే చక్రవ్యూహం అని కూడా అంటారు. ఇక్కడ ఆంధ్రాలో కూడా జగన్‌మోహన్‌రెడ్డి గారి చుట్టూ పద్మవ్యూహం అల్లబడింది. అతిరథ మహారథులందరూ ఒక్కడిని జయించడానికి లేదా మట్టుపెట్టడానికి అంచెలంచెలుగా వ్యూహాత్మకంగా కుట్రలు సాగిస్తున్నారు. అక్కడ తలపండిన ద్రోణుడు ఆ వ్యూహానికి కర్త అయితే, ఇక్కడ 87 ఏళ్ళ వృద్ధ రామోజీ ఇదంతా నడిపిస్తున్నాడు.

వీళ్ళ ఎత్తుగడలో భాగం మీడియా ద్వారా జగన్‌నూ, ఆయన పాలనను రోజూ దుమ్మెత్తిపోయడం. సోషల్ మీడియా ద్వారా వ్యక్తిత్వ హననానికి పాల్పడటం. దానికి వైకాపా సోషల్ మీడియా ఎదురు దాడికి దిగటంతో ఆ ఆటలు సాగలేదు.

ఇక ఎన్డీయేతో రామోజీతో పాటు వెంకయ్య కూడా కష్టపడి పొత్తును కుదిర్చారు. దానితో ఈ మూడో అంచె వ్యూహాన్ని జగన్ అస్సలు దాటలేడని వాళ్ళు భ్రమపడ్డారు. కానీ ఈ అవకాశ పొత్తులు ప్రజలకే నచ్చక ఛీ కొట్టడంతో అదికూడా ఫెయిలయ్యింది. దాంతో 'చతుర్విధోపాయసాధ్యేతు రిపౌసాంత్వమప క్రియాన్'... అనగా సామ భేద దాన దండోపాయాల్లో, బలమైన శత్రువును ఎదుర్కోవాలంటే నాలుగవది అయిన దండోపాయమే సరయినదని ఈ కూటమి భావించి ఏకంగా ప్రాణాలు తియ్యటానికి తెగించింది. అందుకే విజయవాడలో సూటిగా బాణం వేయగలిగిన సైంధవుడి లాంటి సతీష్‌ను బోండా ఉమ డైరక్షన్లో ప్రవేశపెట్టారు. జగన్‌మోహన్‌రెడ్డి అన్నట్టు, ఆ దైవమే ఆ సమయంలో కూడా ఆయనను కాపాడింది. ఏ కొంచెం స్థానం మారినా, పెను విషాదం చోటు చేసుకునేది.

వీరత్వంతో నిజాయితీగా యుద్ధం చేస్తున్న ఒక్క బాలుడి (అభిమన్యుడు) మీద నాలుగు మూలల నుండి అస్త్ర పరంపరలు సంధించారు ఆనాడు. పేద ప్రజల సంక్షేమమే ఆశయంగా పెట్టుకుని దుష్ట గ్రహాల్ని ఎదిరిస్తూ నిర్భయంగా పాలన చేస్తున్న ఈ పిన్న వయస్కుడైన ముఖ్యమంత్రి మీద అన్ని వైపుల నుండి దాడి చేస్తున్నారు ఈనాడు. ఆయన చేస్తున్న సంక్షేమాన్ని ఆపుచేయటానికి మేధావుల ముసుగులో ఒక ఫోరమ్ బయటకు వచ్చింది. ఇప్పటి వరకు వృద్ధులకు, అంగ వికలురకు నిరంతరం సేవలందిస్తున్న వలంటీరు వ్యవస్థను ఈ కుహనా మేధావులు ఆపించి ఏదో గొప్ప కార్యం సాధించినట్లు భుజాలెగరేస్తున్నారు.



ఈసారి ఈ దుష్టకూటమి ఎన్నారై వింగ్‌ను చివరి చక్రంలోకి ప్రవేశపెట్టింది. దానికి ప్రధాన నాయకుడు కోమటి జయరాం. 2020లో వైకాపా నుండి 23 మంది ఎమ్మెల్యేలను కొనటం దగ్గర నుండి మొన్న ఎమ్మెల్యే శ్రీదేవికి డబ్బు ఇచ్చి ఎమ్మెల్సీ ఓటు కొనుక్కనే వరకు కథంతా నడిపించింది ఈ ఎన్నారై మేధావే.

కోట్లాది రూపాయలతో ఓటరు 'వెధవలను' (వాళ్ళ భాషలో) కొనటానికి మరో అస్త్రం సిద్ధం చేశారు. అదృష్టవశాత్తూ అది కూడా బయటపడిపోయింది. కాలం సమీపించినపుడు పాపాత్ములు ఏ పని చేసినా అది వాళ్ళకు ఎదురీతగానే మారుతుందన్న సామెత నిజమైంది. భారతం కూడా అదే చెబుతుంది. 'పిరికితనము, నేరప్రవృత్తి, పదవి, ధనాశ లాంటి ప్రవృత్తి గలవానికి సిరి తనంతట తానే తొలగిపోతుంది' అనే మాట చంద్రబాబు పట్ల ఋజువు కాబోతున్నది.

ఇక జగన్ మీద తండ్రీకొడుకుల వాగ్బాణాలయితే చెప్పే పని లేదు. ఒక్కడిని చుట్టు ముట్టి బహిరంగ దూషణలతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. వీరి ప్రయత్నమంతా జగన్‌ను యుద్ధభూమి నుండి తప్పించాలని! ఆయన చేసిన పాపం ఏమిటి? ఆనాడు భారత యుద్ధంలో కూడా కపటోపాయంతో తండ్రిని దూరంగా పంపి అభిమన్యుడిని బలి చేశారు. ఈరోజు కూడా ఈ ఎన్నికల సమరంలో తండ్రి లేని జగన్‌ను ఇంతమందీ కలసి ముట్టడిస్తున్నారు. అయితే ఆయన అర్జునుడు కనుక 'ఏనుంగు మీది కెగయు సింహ కిశోరంబు రీతి'గా ఈ దుష్టుల పన్నాగాలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ పద్మవ్యూహాన్ని ఛేదించుకుంటూ ముందుకు సాగిపోతున్నారు. జగన్ అంటే ధైర్యం, జగన్ అంటే ధర్మం, జగన్ అంటే విశ్వసనీయత. అందుకే వీరి బరితెగింపు నీచరాజకీయాలను తన పదునయిన అస్త్రాలతో ఛిన్నాభిన్నం చేసుకుంటూ అశేష ప్రజల ఆశీస్సులందుకుంటూ ముందుకు దూసుకుపోతున్నారు.

ఇక కూటమి దురవస్థ కూడా కౌరవుల మధ్య పొసగని అభిప్రాయాల్లాగానే ఉంది. ఒకరిపై ఒకరికి నమ్మకం లేదు. ఎవరు ఎవరిని వెన్నుపోటు పొడుస్తారో అని అస్తమానం అదే భయంతో బతుకుతున్నారు. ఎందుకంటే ఈ మూడు పార్టీలకు సిద్ధాంత బలం లేదు. ఇక్కడ కాంగ్రెస్, బీజేపీ పరోక్షంగా కలుస్తాయి. కమ్యూనిస్టులు బీజేపీ కూటమికి మద్దతిస్తారు. ఒక విచిత్రమైన రాజకీయ విన్యాసం ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే జరుగుతున్నది. కుల నాయకుడి కోసం ఐఏఎస్ పట్టాలను దాచిపెట్టి కుల రౌడీల్లా వీధుల్లోకొస్తారు కుహనా మేధావులు. తండ్రికి మరో వెన్నుపోటుదారు పురందేశ్వరి. వైయస్సార్ ఆశయాలకు తూట్లు పొడుస్తూ తిరుగుతున్న షర్మిల లాంటి వాళ్ళు కూడా ఈ విష కూటమితో కలిసి జగన్‌ను తిట్టి పోస్తారు. దుర్యోధన సైన్యంలా వీరంతా రోజురోజుకు పెరిగి పోతుంటే ఇవతల జగన్ ప్రజా దరణ అంతకంతకు పెరిగిపోతూనే వుంది. ఇంకా జగన్‌ను చంపడానికి ప్రయత్నించిన, హర్షవర్ధన చౌదరి, బోండా ఉమా లాంటి రౌడీలు కూడా ఈ వర్గంలో తక్కువేమీ కాదు. రాష్ట్రంలో ఈ అల్లరి మూకలు వైకాపా కార్యకర్తల మీద సాగిస్తున్న అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. నిన్న గాక మొన్న మంగళగిరిలో రాష్ట్రంలో రౌడీయిజాన్ని ప్రోత్సహిస్తూ హింసావాదాన్ని రెచ్చగొడుతున్న లోకేష్ గూండాలు ఎదురుగా వెళ్ళి పార్టీ ప్రచారంలో ఉన్న వెంకటరెడ్డిని బైకులతో గుద్ది చంపేశారు. దానిని కూడా సమర్థించుకుంటూ వీరి ప్రచారం సాగిపోతూనే వుంది.

ఈ ఆంధ్రా కురుక్షేత్రంలో మే 13న జరిగే ఎన్నికలు అన్నింటికీ సమాధానం చెబుతాయి. ప్రళయం వస్తే మొత్తం ఊడ్చేసినట్లు రేపు ఈ ఓటరు సునామీ ఈ కౌరవ సైన్యాన్నంతా ఓడించి దూరంగా విసిరేస్తుందనే మాట ఖాయం. దేశమంతా మెచ్చుకుంటున్న జగన్ పాలన మళ్ళీ రావటం ఖాయం. కొద్దిరోజులు ఓపిక పడదాం. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలంటే ప్రతి ఓటు జగన్‌కు వేసి వీళ్ళ పద్మవ్యూహాన్ని ధ్వంసం చెయ్యాలి. వీర అర్జునుడికి విజయం అందించాలి.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ తెలుగు–సంస్కృత అకాడమీ ఛైర్‌పర్సన్

సోషల్ మీడియా

సంక్షిప్త వాస్తవం



అమెరికా విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థులకు నా విన్నపం: మీకు మధ్యప్రాచ్యం అనేది అర్థం కాలేదు. అమెరికాతో యూకే, ఐర్లాండ్, జపాన్ లాంటి దేశాలు సాధించిన శాంతి, సాధారణ పరిస్థితులు మా ప్రాధమ్యాలు. దీనికిగానూ ఇజ్రాయిల్ అతివాదులతో సహా హమాస్, ముస్లిం బ్రదర్‌హుడ్‌ను వ్యతిరేకిస్తూ, పాలస్తీనియన్లకు, ఇజ్రాయిల్ ప్రజలకు మద్దతునిద్దాం. ఇజ్రాయెలీ బందీలు, గాజా ప్రజల స్వేచ్ఛ కోసం ప్రయత్నిద్దాం.

– అమ్జద్ తాహా, మధ్యప్రాచ్య విశ్లేషకుడు

నిరాకరించలేని సత్యం



ప్రపంచ వేదిక మీద 'క్రిక్' (సి.ఆర్.ఐ.కె.– చైనా, రష్యా, ఇరాన్, ఉత్తర కొరియా) కూటమి ఒక బలీయమైన శక్తిగా రూపొందిందన్న సత్యాన్ని మనం ఇక ఎంతోకాలం నిరాకరించలేము. (అమెరికా విదేశాంగ మాజీ మంత్రి) కిసింజర్ భయపడినట్టుగానే, పాశ్చాత్య దేశాలు రష్యాను చైనా వైపు నెట్టాయి. ప్రాణాంతకమైన భౌగోళిక–రాజకీయ తప్పు?

– రాజ్ శుక్లా, ఆర్మీ మాజీ కమాండర్

ఎన్నికల అంశమే!



జనాన్ని అనారోగ్యానికి గురిచేసేంత దారుణంగా ముంబయి గాలి నాణ్యత ఉంది. కొందరికి కాలుష్యం మీద అవగాహన ఉంది, కొందరు అమానవీయ లోకల్ రైళ్లలో ప్రయాణాలకు అలవాటుపడ్డట్టుగా దాన్ని భరిస్తున్నారు. తెలివైన రాజకీయ నాయకుడు దీన్ని ఒక ఎన్నికల అంశంగా మార్చితే, భారీ మెజారిటీతో గెలుస్తాడని నా నమ్మకం.

– వివేక్ రంజన్ అగ్నిహోత్రి, దర్శకుడు

ఓటే లైసెన్స్



ఎన్నికల్లో నా ఓటుహక్కును వినియోగించుకున్నాను. ఫిర్యాదు చేయడానికి నా లైసెన్సు'ను మరో ఐదేళ్లపాటు రెన్యువల్ చేయించుకున్నాను.

– రమేశ్ శ్రీవత్స్, వ్యంగ్య వ్యాఖ్యాత

చెప్పడం సులువు



అమెరికా విశ్వవిద్యాలయాల వ్యాప్తంగా సరికొత్త అమెరికన్ ప్రజాస్వామ్యం ప్రదర్శితమవుతోంది. నిరసనలను సహించడం, భావస్వేచ్ఛను అనుమతించడం మీద ఇప్పటికీ గ్లోబల్ సౌత్‌కు అమెరికా ఉపన్యాసాలిస్తుందా?

– ఆదిత్య రాజ్ కౌల్, జర్నలిస్ట్

మోసపోవద్దు!



ఒకప్పుడు ఒక గాడిద తనను అడవికి రాజుగా ఎన్నుకుంటే ఉన్ని శాలువాలను ఉచితంగా పంచుతానని ప్రకటించింది. గొర్రెలు తప్ప ఏవీ దానికి ఓటు వేయలేదు. వివేకంతో ఓటు వేయండి.

– ఆరిఫ్ ఆజకియా, పాకిస్తాన్‌లో పుట్టిన ఇండియన్

వైజ్ఞానిక వేగుచుక్కలు

తొలి మహిళల ఆసుపత్రి

భారతదేశంలో బ్రిటిష్ ప్రభువులు తమ క్రైస్తవ మతాన్ని వ్యాప్తి చేయడంలో ఒక సాధనంగా వైద్య రంగాన్ని ఎంచుకున్నారని చెప్తారు. దీన్నే 'క్లినికల్ క్రిస్టియానిటీ' అని కూడా అంటారు. ఇప్పటి ఉత్తరప్రదేశ్ లోని పశ్చిమ ప్రాంతంలో చారిత్రకంగా రోహిల్‌ఖండ్‌గా పిలవబడే చోట ఉన్న బెరెల్లీలో మెథడిస్ట్ మిషన్ బాలికల అనాథ శరణాలయం బాధ్యులు మిస్సెస్ థామస్ అమెరికాలో ఉన్న తన మిత్రురాలూ, ఇదివరకటి సహచరీ అయిన జేటీ గ్రేసీకి 'ఎవరైనా ఒక మహిళ వచ్చి వైద్యపరంగా తమ ప్రాంతానికి సేవ చేస్తే బాగుంటుంద'ని ఉత్తరం రాసింది. ఈ ఉత్తరం కారణంగా క్లారా స్వైన్‌ను భారతదేశం వెళ్ళమని కోరారు. అలా 1870 జనవరి 20వ తేదీన క్లారా ఎ. స్వైన్ ఇండియా (బరేలీ) వచ్చారు. 1869లో పెన్సిల్వేనియా లోని ఉమెన్స్ మెడికల్ కళాశాలలో వైద్యశాస్త్రం పట్టా పొందారు క్లారా.



క్లారా ఎ. స్వైన్

బరేలీలో మిస్సెస్ థామస్ విద్యార్థినులైన 14 మందికి 1870 మార్చి ఒకటో తేదీ నుంచి వైద్యపరమైన శిక్షణను ఇవ్వడం ప్రారంభించింది క్లారా. ఈ విద్యార్థినులు అక్కడికి దగ్గర్లోనే అనారోగ్యానికి గురైన క్రిస్టియన్ విలేజ్‌లో ప్రయోగాత్మకమైన శిక్షణను కూడా పొందడం మొదలైంది. క్లారా రోజుకు రెండు మూడు గంటల పాటు ఈ విద్యార్థినులకు శరీర నిర్మాణ శాస్త్రం, మానవ శరీరం, మెటీరియా మెడికా వంటి అంశాలు బోధించడం ప్రారంభించి పరీక్షలకు సిద్ధం చేసింది. ఈ మొత్తం ప్రక్రియ ఇద్దరు సివిల్ సర్జన్స్, ఒక అమెరికన్ ఫిజీషియన్ పర్యవేక్షణలో జరిగింది. 1873 ఏప్రిల్ 10న పదముగ్గురు పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. వీరిలో ముగ్గురిని 'బైబిల్ ఉమన్'గా క్లారా స్వైన్ స్వీకరించి ఆస్పత్రికి అనుబంధంగా ఉన్న క్రైస్తవ మతపరమైన కార్యక్రమాలకు వినియోగించారు.

తొలుత పాశ్చాత్య వైద్యానికి క్రైస్తవ మతానికి స్థానికంగా వ్యతిరేకత ఎదురైనా ఆరోగ్యానికి ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా రాంపూర్ నవాబ్ ఒక భవనాన్ని వైద్య సదుపాయాలు విస్తరింప చేయడానికి కానుకగా ఇచ్చారు. 1872 జనవరి ఒకటో తేదీన క్లారా స్వైన్ రాంపూర్ నవాబ్ ఇచ్చిన ప్రాంగణానికి తరలి వెళ్లారు. మరుసటి సంవత్సరం మే మాసంలో వైద్యం చేయడానికి ప్రత్యేక భవనం మొదలై 1874 జనవరి ఒకటో తేదీ నాటికి బయట నుంచి వచ్చి ఆరోగ్యపరమైన సేవలు, వైద్యం పొంది వెనక్కి వెళ్లిపోయే వెసులుబాటు కూడా మొదలైంది. అలా భారతదేశంలో తొలి మహిళల ఆసుపత్రి ప్రారంభమైంది. పొరుగు ప్రాంతాల వారే కాకుండా బర్మా నుంచి కూడా వచ్చి వైద్యం పొంది వెళ్లేవారు. చివరికి క్లారా స్వైన్ 1910 డిసెంబర్ 25న న్యూయార్క్‌లో కనుమూశారు.

– డా।। నాగసూరి వేణుగోపాల్ । ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి

అట్టడుగు జనం అభివృద్ధి చెందేలా...

అభిప్రాయం



శ్యాంమోహన్

ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలే కాదు, అభివృద్ధి పనులూ ఫలాలను ఇవ్వడం ప్రారంభించాయి. ఫలితంగా అట్టడుగు జనం జీవన ప్రమాణాలు పెరుగుతూ పోతున్నాయి. అభివృద్ధికి నిజమైన నిర్వచనం ఇదే కదా! పారిశ్రామిక పార్కులు, పోర్టుల నిర్మాణం – అభివృద్ధి, విమానాశ్రయాల ఏర్పాటు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనతో ఏపీలో ఉద్యోగ కల్పన వేగం పుంజుకొంది. ముఖ్యంగా గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాల్లో అధిక భాగం దక్కడం ఈ అభివృద్ధి నమూనా ప్రత్యేకతగా చెప్పుకోవాలి.

ఏపీ ప్రభుత్వం నెలకొల్పిన పారిశ్రామిక పార్కుల ప్రాంతాల్లో ఒకప్పుడు బతుకు తెరువు కోసం పట్నాలకు వలస పోయే పరిస్థితి ఉండేది. మిగిలిన వారు పెత్తందారుల చుట్టూ పని కోసం తిరిగే వారు. ప్రస్తుతం ఆ యా ప్రాంతాల్లో పరిశ్రమలు రావడంతో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. తిరుపతి జిల్లాలోని 'శ్రీసిటీ పారిశ్రామిక పార్క్' సమీపంలోని మల్లావారి పాలెం గ్రామస్థుడు సన్యాసయ్య చెప్పినట్లు 'బడుగు జీవుల పొలాలకు మంచి ధరలు వచ్చాయి. ఇంటికో ఉద్యోగం వచ్చింది. ఇప్పుడు ఎవరి ముందు తలవంచక ఆత్మ విశ్వాసంతో' బతుకుతున్నారు.

''టెన్త్ మాత్రమే చదివిన నాకు ఎక్కడా పని దొరక లేదు. సెల్‌ఫోన్‌తో కాలక్షేపం చేస్తూ... కాలం వృధా చేస్తున్న సమయంలో, సెల్‌ఫోన్లు తయారీ కంపెనీలో పని దొరికింది. ఇంటి నుండి కంపెనీకి వెళ్లి రావడానికి బస్‌సౌకర్యం, క్యాంటీన్, 24 గంటల హెల్త్ సెంటర్ ఉంది'– తిరుపతికి చెందిన మరో యువతి మనోగతం ఇది. వీరంతా ఆంధ్రప్రదేశ్ మారుమూల గ్రామాలకు చెందిన పేద మహిళలు.

ఇక్కడ ఉద్యోగాలు చేసే వారిలో 90 శాతం మహిళలే. టెన్త్ నుండి ఇంజనీరింగ్ వరకు చదివిన వారే. ఈ అవకాశం తైవాన్ బహుళజాతి సెల్‌ఫోన్ తయారీ సంస్థ 'ఫాక్స్‌కాన్' ద్వారా మహిళలకు దొరికింది. తిరుపతి జిల్లా శ్రీసిటీలో ఈ కంపెనీ 30 ఎకరాల్లో ఏర్పాటయింది.

ఆంధ్రప్రదేశ్ – తమిళనాడు సరిహద్దుల్లో, నెల్లూరు జిల్లా తడ, తిరుపతి జిల్లా సత్యవేడు మధ్య ఏర్పాటయ్యింది శ్రీసిటీ పారిశ్రామిక పార్క్. 2006లో ఇక్కడ భూసేకరణ సమయంలో అనేక ఆందోళనలు జరిగాయి. అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి రైతులతో స్వయంగా సమావేశమై అప్పటి మార్కెట్ ధర కంటే దాదాపు మూడు రెట్లు ఎక్కువ ఇచ్చి 14 గ్రామాల్లో భూములు



తీసుకున్నారు. ఇది 2008లో ప్రారంభమై 7,500 ఎకరాల్లో విస్తరించి ఉంది. జాతీయ రహదారి, రైల్వే, విమానాశ్రయం, ఓడరేవు అన్నీ దగ్గరగా ఉండడం ఈ పారిశ్రామిక పార్కుకి బాగా కలిసొచ్చింది. ఇందులో ఇప్పటి వరకు 220 కంపెనీలు ఏర్పాటై 62 వేల మందికి ఉపాధి కలిగింది. వారిలో సగం మంది మహిళలే.

గత 55 నెలల్లో, రాష్ట్రంలో 311కి పైగా ప్రధాన పరిశ్రమలు స్థాపించారు. 1.3 లక్షల ఉద్యోగావకాశాలు ఉన్నాయి. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్)లో రూ. 13.11 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించి 386 అవగాహనా ఒప్పందాలు జరిగాయి. దీనివల్ల మరో 6 లక్షల ఉద్యోగాలు వస్తాయని ఏపీ ఇన్ఫర్మేషన్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ శాఖ లెక్కలు చెబుతున్నాయి.

సీ పోర్టుల ప్రాధాన్యతను గుర్తించిన ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న ఆరు పోర్టులకు తోడు కొత్తగా నాలుగు పోర్టుల నిర్మాణం చేపట్టి వాటిని అభివృద్ధి చేస్తోంది. దాదాపు రూ. 16,000 కోట్లతో రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట, కాకినాడ గేట్‌వే పోర్టులను నిర్మిస్తున్నారు. కొత్త పోర్టుల వల్ల 110 మిలియన్ టన్నుల కార్గో హ్యాండ్లింగ్ సామర్థ్యం పెరుగుతుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఓడరేవుల ద్వారా 75 వేల మందికి ఉపాధి లభిస్తుంది. ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలు మత్స్యకారుల జీవనోపాధిని పెంచుతాయి. 3,793 కోట్ల వ్యయంతో పది ఫిషింగ్ హార్బర్‌లు, ఆరు ఫిష్‌ల్యాండింగ్ సెంటర్‌లను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మిస్తున్నారు. ప్రతి 50 కిలోమీటర్ల తీరప్రాంతానికి ఓడరేవు లేదా ఫిషింగ్‌హార్బర్ ఉంటుంది.

భోగాపురంలో కొత్త అంతర్జాతీయ విమానాశ్రయం రూ. 4,592 కోట్ల ప్రాజెక్ట్. దీనివల్ల 10,000 మందికి ప్రత్యక్షంగా, 80,000 మందికి పరోక్షంగా ఉద్యోగావకాశాలు కలుగబోతున్నాయి. గన్నవరం, కాకినాడ, విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతి, కడప, కర్నూలు విమానాశ్రయాల విస్తరణ, అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రామ్‌కో సిమెంట్, సెంచరీ ప్యానెల్స్, ఏటీసీ టైర్స్, ఆదిత్య బిర్లా గార్మెంట్స్, డిక్సన్ టెక్నాలజీస్, గ్రీన్‌లామ్ సౌత్, లారస్ ల్యాబ్స్, ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్ వంటి భారీ, మెగా పరిశ్రమల నుండి భారీ పెట్టుబడులు రాబోతున్నాయి.

దేశంలోనే అత్యధిక జీఎస్‌డీపీ వృద్ధి రేటు ఉన్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (ఈడీబీ) ఇండెక్స్‌లో వరుసగా మూడేళ్లగా భారత్‌లో నంబర్‌వన్‌గా నిలవడం ఈ సందర్భంగా గమనార్హం.

వ్యాసకర్త కార్టూనిస్ట్, జర్నలిస్ట్
మొబైల్: 94405 95858

దితి – అదితి

సృష్టి ఆరంభమైన తొలి రోజులలో, జగత్తులో ఉన్న అపారమైన వనరులను వినియోగంలోకి తెచ్చేందుకు సరిపడేటంత జనాభా ఉండేది కాదు. అందుకే బ్రహ్మ తన మానస పుత్రులుగా ప్రజాపతులనూ, మనువులనూ, మహర్షులనూ సృష్టించి, వాళ్ళకు భార్యలను కూడా సృష్టించి ఇచ్చాడని పురాణాలు చెప్తాయి. వివిధ జాతుల ప్రాణులకు పెద్ద సంఖ్యలో జన్మనిచ్చి, వాటి పరంపరల ద్వారా ఈ సృష్టి చక్రాన్ని విస్తరింపజేస్తూ వెళ్ళడం ప్రజాపతుల కర్తవ్యం. 'ప్రజ' అంటే సంతతి అని ఒక అర్థం.

మరీచి మహర్షికి కళ అనే భార్య ద్వారా కలిగిన కశ్యప ప్రజాపతి జగత్తులో ఎన్నో జాతులకు మూలపురుషుడు. దక్ష ప్రజాపతికి కలిగిన అరవై ముగ్గురు కూతుళ్ళలో పదముగ్గురిని కశ్యపుడు పెళ్ళాడాడు. వాళ్ళలో అదితి, దితి, కద్రువ, వినతా వంటి వాళ్ళు ఉన్నారు. సృష్టిలో తొట్టతొలి తరాలకు చెందిన కశ్యప మహర్షికి కూడా ఆయన భార్య దితితో భావజాల వైరుధ్యాలూ, అభిప్రాయ భేదాలూ తప్పలేదు. 'దితి' అనే మాటకు అర్థమే 'ఖండించేది' అని. భర్త మాటలను మంకుతనంతో ఖండిస్తూ ఉండేది. కనుక ఆమెకు ఆ పేరు వచ్చిందని పౌరాణిక ప్రతీతి. ఆమె సోదరీ, సవితీ అదితి ధర్మార్థ కామ సాధనలలో భర్తకు అనుకూలంగా, సహధర్మచారిణిగా ఉండేది కనుక 'అ–దితీ'.



జ్యోతిర్మయం

అదితి సంతతి ఆదిత్యులు. అంటే దేవతలు. సద్గుణవంతులు. ప్రధానంగా సత్వ గుణ సంపన్నులు. సూర్యుడూ, ఇంద్రుడూ ఇత్యాదులు. దితి సంతతి దైత్యులు. అంటే రాక్షసులు. వీళ్ళూ ఘనులే. కానీ వీరిది ప్రధానంగా తమోగుణం. మొండితనం, మూర్ఖత్వం, హింసాప్రవృత్తీ ఎక్కువ. హిరణ్యాక్షుడూ, హిరణ్యకశిపుడూ దితి పుత్రులు. సవతికి చక్కని సంతానం కలగటం చూసి, ఈసు చెంది, తనకూ అలాంటి సంతానం త్వరగా కలగాలన్న ఆరాటంతో, సత్సంతాన ప్రాప్తికి అనుకూల సమయం కాదని భర్త ఎంత వారించినా వినకుండా మంకుపట్టు పట్టడం వల్ల దితికి తమోగుణాధిక్యం గల సంతానం కలిగింది. తరువాత ఆమె తన తొందరపాటుకు పశ్చాత్తాప పడటం వల్ల, ప్రహ్లాదుడి లాంటి పరమ భాగవతుడు ఆమెకు మనుమడుగా పుట్టాడు.

దంపతులలో సయోధ్య కొరవడితే దాని ప్రభావం సంతానం మీద కూడా పడుతుందని దితి వృత్తాంతం ద్వారా భాగవత పురాణం సూచిస్తుంది.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** బ.తదియ ఉ.6.38 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** జ్యేష్ఠ రా.2.54 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** ఉ.8.09 నుండి 9.45 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.38 నుండి 7.16 వరకు, **అమృతఘడియలు:** సా.5.46 నుండి 7.24 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.41, **సూర్యాస్తమయం:** 6.13.

క్లుప్తంగా...

తెలంగాణ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ శ్రీనివాసరావు, జస్టిస్ రాజేశ్వర్‌రావు

- సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులకు కేంద్రం ఆమోదం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టులోని అదనపు న్యాయమూర్తులు జస్టిస్ జగ్గన్నగారి శ్రీనివాస్‌రావు, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావును శాశ్వత న్యాయమూర్తులుగా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇద్దరు న్యాయమూర్తులను శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలని ఫిబ్రవరి 13న హైకోర్టు కొలీజియం నిర్ణయించింది. ముఖ్యమంత్రి, గవర్నర్లు దీనికి సమ్మతి తెలియజేశారు. అనంతరం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయిలతో కూడిన కొలీజియం సమావేశమై శాశ్వత న్యాయమూర్తులుగా నియామకానికి జస్టిస్ శ్రీనివాసరావు, జస్టిస్ రాజేశ్వర్‌రావుకు తగిన అర్హతలు ఉన్నాయని నిర్ణయించింది. వారిద్దరినీ శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలని ఈ నెల 16న కేంద్రానికి సిఫార్సు చేసింది. ఈ సిఫార్సులను ఆమోదించిన కేంద్రం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

సిజేరియన్‌లు అధికంగా చేస్తే కఠిన చర్యలు

- ఆస్పత్రులకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ హెచ్చరిక


సాక్షి, అమరావతి: ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్ ప్రసవాలపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని, సిజేరియన్‌లు అధికంగా చేస్తోన్న ఆస్పత్రులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోలను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఏప్రిల్, మేల్లో ఎండల తీవ్రత కారణంగా అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నందున ప్రైవేట్ ఆస్పత్రులపై దృష్టి సారించాలని డీఎంహెచ్‌వోలను ఆదేశించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ప్రధాన కార్యాలయం నుంచి శుక్రవారం అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫైర్ ఎన్‌వోసీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అన్ని ఆస్పత్రుల్లో మాక్ డ్రిల్ నిర్వహించాలని, డెంగీ, మలేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

రుయాలో చిన్నారులకు అరుదైన శస్త్ర చికిత్స




తిరుపతి తుడా: తిరుపతిలోని పేదల ఆస్పత్రి రుయాలో ఇద్దరు చిన్నారులకు వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించారు. రాజస్థాన్‌కు చెందిన కెల్మా (4), శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన చైత్ర (6) ఇటీవల 'సెరిబ్రల్ అబ్సెస్' అనే మెదడు సంబంధ వ్యాధితో బాధపడుతూ రుయా ఆసుపత్రికి వచ్చారు. వైద్య పరీక్షల్లో కంజన్టల్ సైనాటిక్ హార్ట్ డిసీజ్ కూడా ఉందని వైద్యులు గుర్తించారు. సుమారు రెండు గంటల పాటు శ్రమించిన డాక్టర్ సుదర్శన అగర్వాల్, డాక్టర్ అనంత కిరణ్, డాక్టర్ రాధ చిన్నారులకు మత్తుమందు ఇవ్వకుండా లోకల్ అనస్థీషియా ద్వారా శస్త్ర చికిత్స పూర్తిచేశారు. ఈ చికిత్సలో డాక్టర్ వివేకానంద, డాక్టర్ వంశీ, డాక్టర్ పవిత్ర, డాక్టర్ తిరుపతి రెడ్డితో కూడిన వైద్యుల బృందం పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి అమరావతి కాపునాడు మద్దతు



అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడసెంట్రల్): కాపులకు ఏ ప్రభుత్వం అందించని సంక్షేమ ఫలాలను సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీకి ప్రభుత్వం అందించినందున తమ పూర్తి మద్దతు ఆ పార్టీకే తెలుపుతున్నామని అమరావతి కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు (కబాడీ శ్రీను) స్పష్టం చేశారు. విజయవాడ లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కాపులను చంద్రబాబు మోసం చేస్తే.. సీఎం జగన్ అన్ని విషయాల్లో పెద్దపీట వేశారన్నారు. కాపులను మోసం చేసిన టీడీపీకి ఎందుకు ఓటెయ్యాలని ప్రశ్నించారు. సెంట్రల్‌లో వెలంపల్లి శ్రీనివాసరావు గెలవబోతున్నారని తెలిపారు. బోండా ఉమా 420 చీటర్ అన్నారు. చెన్నుపాటి ఓ సెక్స్ రాకెట్ అని విమర్శించారు.

సీఎం జగన్ చిత్రపటంతో మోకాళ్లపై దుర్గమ్మ చెంతకు



ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రను సీఎం జగన్ దిగ్విజయంగా పూర్తి చేసుకుని క్షేమంగా ఇంటికి తిరిగి చేరితే దుర్గమ్మ దర్శనానికి మోకాళ్లపై వస్తానని మొక్కుకున్నానని విజయవాడ పైపుల రోడ్డుకు చెందిన పట్నాల శ్రీదేవి తెలిపారు. ఇంద్రకీలాద్రి పాత మెట్లను చేతిలో సీఎం జగన్ చిత్రపటాన్ని పట్టుకుని శ్రీదేవి శుక్రవారం మోకాళ్లపై ఎక్కారు. జగన్ క్షేమంగా ఇంటికి చేరితే మోకాళ్లపై గుడికి వస్తానని మొక్కుకున్నానన్నారు.

మీ తండ్రి కోసం పోరాడిన నాకు మీరిచ్చే గౌరవం ఇదా?

షర్మిలను సూటిగా ప్రశ్నించిన ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి

- షర్మిల చెప్పేవన్నీ పచ్చి అబద్ధాలే.. రాజకీయ లబ్ధి కోసమే అసత్య ఆరోపణలు
- ఎమ్మెల్యే శంకర్రావు వల్లే నాడు వైఎస్‌ఆర్ పేరు ఎఫ్ఐఆర్‌లో చేర్చారు
- వైఎస్‌ఆర్‌ను కేసుల్లో ఇరికిస్తుంటే అన్యాయమని భావించి కేసులు వేశాను
- నాతో ఎవరూ కేసులు వేయించలేదు.. అప్పటికి జగన్‌ను చూడనేలేదు
- నా కంప్లైంట్‌లో వైఎస్సార్ ముద్దాయి అని ఎక్కడాలేదు
- షర్మిల చెప్పినట్టు నేనే వైఎస్‌ఆర్ మీద కేసు వేస్తే ఏ శిక్షకైనా సిద్ధమే
- నా నిజాయితీ, నిబద్ధత మీద షర్మిల దెబ్బ కొట్టారు
- నేను ఇది కాదు అనుకుంటే చరిత్రలో హీనులుగా మిగిలిపోతారు
- చంద్రబాబు మాట్లాడిన మాటలు, భాషనే షర్మిల మాట్లాడారు



సాక్షి, అమరావతి: దివంగత మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డిని వేధించిన వారికి ఎదురొడ్డి, పోరాటం చేసిన తనను అభినందించాల్సింది పోయి ఆరోపణలు చేస్తారా అంటూ ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిలను అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ప్రశ్నించారు. మీ తండ్రి కోసం పోరాడినందుకు నాకు మీరు ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసమే షర్మిల తనపై అసత్య ఆరోపణలు చేశారని, ఆమె చెప్పేవన్నీ పచ్చి అబద్ధాలని మండిపడ్డారు. తన వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగేలా షర్మిల మాట్లాడారని విమర్శించారు. ఆయన శుక్రవారం తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకర్రావు వల్లే ఆనాడు వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు ఎఫ్ఐఆర్‌లో చేర్చారని గుర్తు చేశారు. వైఎస్‌పై ఆరోపణలు చేస్తూ శంకర్రావు హైకోర్టుకు లేఖ రాశారని, దీనిపై హైకోర్టు విచారణకు ఆదేశించిందని తెలిపారు. టీడీపీ నేత ఎర్రన్నాయుడు ఈ కేసులో ఇంప్లీడ్ అయ్యారని చెప్పారు. 2011 ఆగస్టు 17న వైఎస్ రాజశేఖర రెడ్డి, జగన్ పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారని తెలిపారు. మహానుభావుడైన వైఎస్ మీద ఆరోపణలు చేయడం, ఆయన్ని కేసుల్లో ఇరికించారని, ఈ అన్యాయాన్ని భరించలేక తాను కేసులు వేశానని చెప్పారు. తనతో ఎవరూ కేసులు వేయించలేదన్నారు. 2011 డిసెంబరులో తాను కేసు వేసే నాటికి కనీసం వైఎస్ జగన్‌ని చూడనే లేదని చెప్పారు. ఈ వాస్తవాలను తెలుసుకొని షర్మిల మాట్లాడాలని అన్నారు. అప్పటి జీవోలకు, వైఎస్ జగన్‌కు ఏం సంబంధం ఉందని ప్రశ్నించారు.

అర్హుడిని కాబట్టే ఏజీ అయ్యాను

తన నాలెడ్జ్ మీద, నిజాయితీ, నిబద్ధత మీద షర్మిల దెబ్బకొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఇది కాదు అనుకుంటే చరిత్రలో హీనులుగా మిగిలిపోతారని అన్నారు. న్యాయవాద వృత్తిలో తన ప్రతిభ ఏమిటో షర్మిల తెలుసుకొని మాట్లాడాలని అన్నారు. తాను అర్హుడిని కాబట్టే అడిషనల్ అడ్వకేట్ జనరల్ అయ్యానని స్పష్టం చేశారు. తన ప్రతిభేమిటో ఇటీవలి కాలంలో చూడలేదా అని ప్రశ్నించారు. షర్మిల మాటలు చాలా అన్యాయమని, దుర్మార్గమని అన్నారు.

షర్మిల మాట్లాడుతున్నవి చంద్రబాబు మాటలే!

'షర్మిల అలవోకగా అబద్ధాలు చెబుతున్నారు. గతంలో బాబు మాట్లాడిన మాటలు, భాషనే సేమ్ టు సేమ్ (మక్కికి మక్కి) షర్మిల మాట్లాడారు. మీరు మాట్లాడినట్లే చంద్రబాబు కూడా గతంలో నాపై మాట్లాడారు. మీ స్క్రిప్టు చంద్రబాబు పంపిందా లేక మీదా అని అడగడం లేదు. తండ్రి మీద షర్మిలకు ప్రేమ ఉంటే శంకర్రావు రాసిన లేఖ చదవాలి. ఈ దుర్మార్గపు క్రీడలో నన్ను లాగడం దారుణం. మీ రాజకీయ యుద్ధం కోసం నన్నెందుకు లాగుతారు? మీ రాజకీయాలు ఎలాగైనా చేసుకోండి. నా పేరు ప్రస్తావించొద్దు' అని స్పష్టం చేశారు.

నన్ను రాజకీయాలు ప్రభావం చేయవు, చేయలేవు

'నేను న్యాయవాదిని, నన్ను వ్యక్తులు, రాజకీయాలు ప్రభావం చేయవు, చేయలేవు. నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉందో షర్మిల మాటల్లో నిజం అంతే ఉంది. పూర్తిగా అవగాహన లేకుండా మాట్లాడుతుంది. వ్యక్తిగతంగా హననం చేశారు. షర్మిల చేసిన వ్యాఖ్యలకు కలత చెందాను.' అంటూ షర్మిల మాటల వీడియోను ప్రదర్శించారు. 'ఆమె రాజకీయ లబ్ధి కోసం అబద్ధాలు మాట్లాడారు. అయినా నేను వ్యక్తిగత హోదాలోనే జవాబు చెబుతున్నాను. హాఫ్ నాలెడ్జ్‌తో నిరాధారమైన ఆరోపణలు చేశారు. ఇది చాలా ప్రమాదకరం' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్, సీబీఐ కలిసే వైఎస్‌ఆర్‌ను ఇరికించాయి

'వైఎస్‌ఆర్‌ను కాంగ్రెస్, సీబీఐ కలిసే కేసుల్లో ఇరికించాయి. ఇది నేను నిరూపించటానికి సిద్ధం. ఎఫ్ఐఆర్ 9వ పేరాలో వైఎస్ రాజశేఖర రెడ్డిని ముద్దాయిగా చేశారు. ఎఫ్ఐఆర్ చదువుకోండి. ఇంత దుర్మార్గమైన క్రీడ సీబీఐ ఆడుతుంటే చూడలేక ఓ న్యాయవాదిగా కేసు వేశాను. ఏ పాపం తెలియని వైఎస్‌ఆర్‌ను, వైఎస్ జగన్‌ను వెంటాడుతుంటే.. ఆ అన్యాయానికి వ్యతిరేకంగా నేను చేసిన చిరు ప్రయత్నమది. వైఎస్‌ను వేధించిన వారికి ఎదురొడ్డి పోరాటం చేశా. ఆయన మీద కేసు పెట్టటం అన్యాయమని వాదించాను. వేరే 14 మందిని బాధ్యులుగా చేయాలని మాత్రమే కేసు వేశాను. నేను వేసిన కంప్లైంట్‌లో వైఎస్సార్ ముద్దాయి అని ఎక్కడైనా ఉందా? ఆ కాపీలను పంపిస్తా. షర్మిల చదువుకుంటే వాస్తవాలు తెలుస్తాయి. వైఎస్ జగన్ చెబితే, జగన్ ప్రోద్బలంతోనే వైఎస్ రాజశేఖర రెడ్డి పేరు చేర్చానని షర్మిల చెబుతున్నారు. ఎంత నిస్సిగ్గుగా ఈ మాట చెప్పారు! ఆమె చెప్పినట్టు నేనే వైఎస్‌ఆర్ మీద కేసు వేస్తే ఏ శిక్షకైనా సిద్ధమే' అని పొన్నవోలు చెప్పారు.

కార్యకర్తలపై కిమిడి తిట్ల పురాణం

- 'ఆగంద్రా.. వెధవల్లారా' అంటూ మైక్‌లో కార్యకర్తల్ని దూషించిన కళా వెంకటరావు
- సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న వీడియో

చీపురుపల్లి: ఆయనది నలభై ఏళ్ల రాజకీయ అనుభవం. పొరుగు జిల్లా నుంచి ఇటీవల వలస వచ్చిన ఆ సీనియర్ విజయనగరం జిల్లా చీపురుపల్లి టీడీపీ అభ్యర్థి కిమిడి కళావెంకటరావు. ఈ నెల 24న నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం చీపురుపల్లి మూడు రోడ్ల కూడలిలో సభ నిర్వహించారు. ఓ వైపు ఎండ.. మరోవైపు ఉన్న కొద్దిపాటి కార్యకర్తలు మెల్లగా జారుకున్నారు. సభ వద్ద ఉన్న కొద్దిపాటి కార్యకర్తలు అదే పనిగా గోల చేశారు. అంతే కిమిడి కళావెంకటరావుకు చిర్రెత్తుకొచ్చింది. మైక్‌లోనే 'ఆగంద్రా.. పనికిమాలిన వెధవల్లారా. పదిమంది కూడా రాలేదు. ఏంటీ ఉద్యోగం' అంటూ తిట్ల పురాణం అందుకున్నారు. దీంతో కార్యకర్తలందరూ ఒక్కసారిగా కంగుతిన్నారు. నిన్నగాక మొన్న నియోజకవర్గానికి వచ్చి ఏకంగా బూతులు తిట్టడమేమిటన్న చర్చ కార్యకర్తల్లో సాగుతోంది. ఈ వీడియోను కార్యకర్తలే సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఇది ప్రస్తుతం చీపురుపల్లిలో హాట్ టాపిగా మారింది.

భాషాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

- ప్రపంచ భాషలకు మాతృమూర్తి సంస్కృతం
- దేశ సంస్కృతి, సంప్రదాయాలకు ఇదే నిలువెత్తు నిదర్శనం
- విద్యార్థులు దేశ సేవకు అంకితం కావాలి
- ఎన్ఎస్‌యూ స్నాతకోత్సవంలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్



ఉపరాష్ట్రపతిని సన్మానిస్తున్న వర్సిటీ అధికారులు

తిరుపతి సిటీ/తిరుమల: భాషాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ స్పష్టం చేశారు. శుక్రవారం తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం (ఎన్ఎస్‌యూ) మూడవ స్నాతకోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. సంస్కృతం మన సాంస్కృతిక వారసత్వ సంపదని.. దీనిని పరిరక్షించుకోవడం, ప్రచారం చేయడాన్ని యువతతో పాటు ప్రతి ఒక్కరూ కర్తవ్యంగా భావించాలన్నారు. సంస్కృతం దైవభాష అని, సర్వ భాషలకు మాతృమూర్తిగా ఉందని చెప్పారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలకు ఇదే నిలువెత్తు నిదర్శనమని స్పష్టం చేశారు. ఇక్కడి సంస్కృత భాష ఇతిహాసం పరిశీలిస్తే భాషాపరమైన ఎన్నో సంస్కరణలు ఉన్నాయని, అందుకోసం వినూత్న పాఠ్యాంశాలు, పరిశోధనలను ప్రోత్సహించాల్సిన అవసరముందన్నారు. సంస్కృతం పవిత్రమైనదని, మనలను దైవికానికి అనుసంధానించి ప్రపంచంపై సమగ్ర అవగాహన కల్పిస్తుందన్నారు. సంస్కృత విద్యాలయం శాస్త్రాల అధ్యయన కేంద్రంగా విరాజిల్లుతోందన్నారు. విలువైన ప్రాచీన రాత ప్రతులను సంరక్షించాలంటే డిజిటలైజేషన్ సరైన మార్గమన్నారు. ఏ భాషనైనా సమాజంలో వినియోగించి, సాహిత్యాన్ని కూర్చినప్పుడే మనుగడ సాధిస్తుందన్నారు. సంస్కృతం కేవలం విద్యా విషయక సాధనం కాదని, జ్ఞానోదయంతో కూడిన వైవిధ్యమైన సాహిత్యమని కొనియాడారు. అమూల్యమైన వారసత్వానికి విద్యార్థులు వారధులుగా మారాలని పిలుపునిచ్చారు. సంస్కృతంలోని జ్ఞానసంపదను భావితరాలకు చేరేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు దేశ సేవకు అంకితం కావాలని పిలుపునిచ్చారు. స్నాతకోత్సవం సందర్భంగా వివిధ కోర్సులలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఉప రాష్ట్రపతి బంగారు పతకాలను, నగదు బహుమతులను అందజేశారు. 67 మంది బంగారు పతకాలు, 580 మంది వివిధ కోర్సులలో పట్టాలు అందుకున్నారు. అనంతరం వర్సిటీ అధికారులు ధన్‌ఖడ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ కులపతి ఎస్.గోపాలస్వామి, వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, ఐసర్ డైరెక్టర్ సంతను భట్టాచార్య పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ఉప రాష్ట్రపతి



భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఉదయం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న ఉప రాష్ట్రపతికి టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి సాదరంగా ఆహ్వానించగా, అర్చక బృందం ఆలయ మర్యాదలతో ఇస్తికఫాల్ స్వాగతం పలికింది. ధ్వజస్తంభానికి నమస్కరించిన అనంతరం ఉప రాష్ట్రపతి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో ఉప రాష్ట్రపతికి వేదాశీర్వచనం చేశారు. ఈవో శ్రీవారి శేషవస్త్రాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఆలయం వెలుపల ఉప రాష్ట్రపతి మీడియాతో మాట్లాడుతూ.. దేశ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని శ్రీవారిని ప్రార్థించినట్టు తెలిపారు. తిరుమల క్షేత్రం ప్రాచీన భారతీయ సంస్కృతి, నాగరికతలో మహోన్నతమైనదని అన్నారు. టీటీడీ పరిపాలన, భక్తులకు అందిస్తున్న సేవలు అన్ని మతాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు.

రేణిగుంటలో హైకోర్టు సీజే ధీరజ్ సింగ్‌ఠాకూర్‌కు ఘన స్వాగతం


నేడు చిత్తూరులో నూతన కోర్టు భవనాలకు ప్రారంభోత్సవం



జస్టిస్ ఠాకూర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

రేణిగుంట(తిరుపతి జిల్లా): రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌కు రేణిగుంట విమానాశ్రయంలో శుక్రవారం సాయంత్రం ఘన స్వాగతం లభించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందనరావుతో కలిసి వచ్చిన ఆయనకు జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జేసీ ధ్యాన్‌చంద్ర, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, పలువురు జిల్లా న్యాయమూర్తులు, విమానాశ్రయ అధికారులు పుష్పగుచ్ఛాలను అందించి స్వాగతం పలికారు. చిత్తూరులో శనివారం జరిగే నూతన కోర్టు భవనాల ప్రారంభోత్సవానికి వీరు హాజరుకానున్నారు.


దుర్గమ్మ సేవలో జస్టిస్ హరినాథ్



జస్టిస్ హరినాథ్ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈఈ కోటేశ్వరరావు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన న్యాయమూర్తికి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, ఆలయ ఈఈ కోటేశ్వరరావు, ఏఈవో ఎన్.రమేష్‌బాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందచేశారు.

శాస్త్రోక్తంగా జగన్మాతకు కుంభోత్సవం



అమ్మవారి ఆలయం వద్ద కుంభ అన్నరాశి



స్త్రీ వేషధారణలో కుంభహారతి ఇస్తున్న దృశ్యం

శ్రీశైలం టెంపుల్: లోక కల్యాణార్థం జగన్మాత శ్రీభ్రమరాంబాదేవికి వార్షిక కుంభోత్సవం శాస్త్రోక్తంగా శుక్రవారం నిర్వహించారు. ప్రాతఃకాల పూజల అనంతరం అమ్మవారికి ఏకాంతంగా ఆలయ అర్చకులు నవావరణ పూజ, త్రిశతి, ఖడ్గమాల, అష్టోత్తర కుంకుమ పూజలు, జప పారాయణలు జరిపారు. అనంతరం తొలి విడత సాత్విక బలిగా అమ్మవారికి గుమ్మడికాయలు, కొబ్బరికాయలు, నిమ్మకాయలను సమర్పించారు. అలాగే హరిహరరాయగోపుర ద్వారం వద్దనున్న మహిషాసురమర్దిని అమ్మవారి(కోటమ్మ)కి ప్రత్యేక పూజలు జరిపి, సాత్వికబలి నిర్వహించారు. సాయంత్రం శ్రీమల్లికార్జున స్వామివారికి ప్రదోషకాల పూజల అనంతరం అన్నాభిషేకం జరిపించారు. అమ్మవారికి ఎదురుగా ఉండేలా సింహ మండపం వద్ద అన్నాన్ని కుంభరాశిగా సమర్పించారు. సంప్రదాయాన్ని అనుసరించి స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతి ఇచ్చారు. అనంతరం రెండో విడత సాత్వికబలిగా గుమ్మడికాయలు, కొబ్బరికాయలు సమర్పించారు. అనంతరం అమ్మవారి నిజరూప దర్శనం భక్తులకు కల్పించారు.

వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): వేసవి సెలవుల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే పలు ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు విజయవాడ డివిజన్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎం.మండ్రూప్‌కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రెన్ నంబర్ 07025 మే 9వ తేదీన రాత్రి 8.30 కాచిగూడలో బయలుదేరి, ఉదయం 8 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ ట్రెన్ 07026 నంబర్‌తో 10వ తేదీ సాయంత్రం 5.10కి కాకినాడ టౌన్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 4.50కి కాచిగూడకు చేరుతుంది. ట్రెన్ నంబర్ 07271 మే 10వ తేదీ రాత్రి 9.20కి సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు కాకినాడ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు 07272 నంబర్‌తో 11వ తేదీ రాత్రి 9గంటలకు కాకినాడలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.30కు సికింద్రాబాద్ చేరుతుంది. అదేవిధంగా ట్రెన్ నంబర్ 07175 మే 11వ తేదీన రాత్రి 11 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.35కు నరసాపూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు 07176 నంబర్‌తో 13న సాయంత్రం 6గంటలకు నరసాపూర్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5 గంటలకు హైదరాబాద్ చేరుతుంది. మే 13వ తేదీన ట్రెన్ నంబర్ 07487 నాందేడ్‌లో మధ్యాహ్నం 2.25కు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.10కి కాకినాడ టౌన్‌కు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు 07488 నంబరుతో 14న సాయంత్రం 6.30కి కాకినాడ టౌన్‌లో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 3.10కి నాందేడ్ చేరుకుంటుంది.

పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు

ట్రాక్ మరమ్మతుల కారణంగా పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఎం.మండ్రూప్‌కర్ తెలిపారు. భద్రాచలం రోడ్డు-విజయవాడ (ట్రెన్ నంబర్ 07278) రైలు ఈనెల 22 నుంచి మే 26 వరకు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. విజయవాడ-భద్రాచలం (ట్రెన్ నంబర్ 07979) ఈనెల 22 నుంచి మే 26 వరకు, డోర్నకల్-విజయవాడ (ట్రెన్ నంబర్ 07755) రైలు ఈనెల 29 నుంచి మే 22 వరకు, విజయవాడ-డోర్నకల్ (07756) రైలు ఈనెల 29 నుంచి మే 22 వరకు రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తిరుపతి-ఆదిలాబాద్ (17405)ట్రెన్‌ను ఈనెల 29 నుంచి మే 10 వరకు, 16 నుంచి 22వ తేదీ వరకు గూడూరు, గుంటూరు, పగిడిపల్లి, సికింద్రాబాద్ మీదుగా దారి మళ్లించనున్నట్లు వివరించారు.

టీడీపీ హయాంలోనే దళితులపై దాడులు

- కారంచేడు, నీరుకొండ, చుండూరు, కంచికచర్ల ఘటనలే అందుకు సాక్ష్యం
- మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య



ఒంగోలు: టీడీపీ హయాంలోనే తరతరాలుగా దళితులపై దాడులు జరుగుతున్నాయని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య మండిపడ్డారు. కారంచేడు, నీరుకొండ, చుండూరు, కంచికచర్ల ఘటనలే అందుకు సాక్ష్యమని చెప్పారు. తమ సోదరులపై కారంచేడులో టీడీపీ ప్రభుత్వ హయాంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి బంధువులు చేసిన మారణకాండను నేటికీ మరువలేమన్నారు. చంద్రబాబు హయాంలోనే అట్రాసిటీ కేసులు విపరీతంగా నమోదయ్యాయన్నారు. స్థానిక ఓ హోటల్ హాలులో శుక్రవారం నిర్వహించిన మాలల ఆత్మీయ సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా మాలమహానాడు వైఎస్సార్ సీపీ వైపే ఉందని స్పష్టం చేశారు. మంద కృష్ణ మాదిగను అడ్డం పెట్టుకుని ఎస్సీ వర్గీకరణ పేరుతో చంద్రబాబు మాలమాదిగలను మోసం చేశారని చెప్పారు. కేవలం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించాలనే కుట్రతో పెత్తందారులంతా ఒక్కటిగా వచ్చి ఓట్లు కొల్లగొట్టాలని చూస్తున్నారని విమర్శించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త ట్రాక్టర్ దహనం

శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థి బొజ్జల స్వగ్రామంలో టీడీపీ దాష్టీకం



శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా): శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి స్వగ్రామం ఊరందూరులో ఆ పార్టీ వారు దాష్టీకాలకు తెగబడుతున్నారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త దిలీప్ ట్రాక్టర్‌ను గురువారం రాత్రి తగులబెట్టారు. గ్రామంలో తమకు ఎవరూ ఎదురు ఉండకూడదని గతంలో కూడా దిలీప్‌ను ఇబ్బందిపెట్టిన టీడీపీ నేతలు, కార్యకర్తలు ఈ దారుణానికి దిగారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాలిపోయిన ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. తనను టీడీపీలో చేరాలని బలవంతపెట్టారని, తాను వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతుండటంతో ట్రాక్టర్ తగులబెట్టారని దిలీప్ ఎమ్మెల్యేకి చెప్పారు. ఈ సందర్భంగా దిలీప్ కుటుంబానికి ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో బొజ్జల గోపాలకృష్ణారెడ్డి పోటీ చేసినప్పుడు వ్యతిరేకంగా ప్రచారం చేసేందుకు వచ్చిన మోహన్‌బాబును బాంబులతో బెదిరించినట్లు చెప్పారు. తమ కుటుంబానికి టీడీపీ నుంచి ప్రమాదం పొంచి ఉందని దిలీప్ తల్లి ఆందోళన వ్యక్తం చేశారు.

లేచింది మహిళా లోకం..


త్రిపురలోని గోయెనంగ్ పారాలో బ్రు తెగ ఓటర్లు


అస్సాంలోని మోరిగావ్‌లో చిన్నారులతో తల్లులు..


యూపీలోని బులంద్ షహర్‌లో ఎడ్లబండిపై దోలక్ వాయిస్తూ..


రాజస్తాన్‌లోని జోధ్‌పూర్‌లో గిరిజనులు..


కర్ణాటక రాజధాని బెంగళూరులో ముస్లిం ఓటర్లు..


మహారాష్ట్రలోని అమరావతిలో బీజేపీ అభ్యర్థి నవనీత్ కౌర్


యూపీలోని మథురలో ఓటేసేందుకు వచ్చిన సన్యాసినులు


అస్సాంలోని బక్సాలో బోడో గిరిజన వృద్ధ మహిళలు..


యూపీలోని మథురలో యువ ఓటర్లు..


కేరళలో సెల్ఫీ తీసుకుంటూ..

పోలింగ్ 63.5%

- స్వల్ప ఉద్రిక్తతలు మినహా ప్రశాంతంగా పోలింగ్
- 13 రాష్ట్రాల్లోని 88 స్థానాలకు ముగిసిన ఓటింగ్
- వడదెబ్బతో ముగ్గురు ఓటర్ల దుర్మరణం

న్యూఢిల్లీ: స్వల్ప చెదురుమదురు ఘటనలు మినహా సార్వత్రిక ఎన్నికల రెండో దశ పోలింగ్ శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. 13 రాష్ట్రాల్లోని 88 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో శుక్రవారం రాత్రి ఎనిమిది గంటలకు అందిన సమాచారం ప్రకారం 63.5 శాతం పోలింగ్ నమోదైందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. పోలింగ్ సమయంలోపు పోలింగ్‌బూత్‌కు వచ్చిన ఓటర్లను ఓటింగ్‌కు అనుమతించారు. దీంతో పోలింగ్ శాతం ఇంకాస్త పెరిగే అవకాశముందని ఈసీ పేర్కొంది. కొన్ని చోట్ల ఈవీఎంల మొరాయింపు, బోగస్ ఓట్ల ఆరోపణలు, చిన్నపాటి ఘర్షణలు మినహా అన్ని చోట్లా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. వడగాలులు, ఎండవేడిమిని తట్టుకుని సైతం ఓటర్లు ఎన్నికల స్ఫూర్తిని చాటారు. వాస్తవానికి 89 స్థానాల్లో పోలింగ్ జరగాల్సి ఉంది. కానీ మధ్యప్రదేశ్‌లోని బైతూల్‌లో బీఎస్పీ అభ్యర్థి హఠాన్మరణంతో అక్కడ ఓటింగ్‌ను మే 7వ తేదీకి మార్చారు. శుక్రవారం కేరళలోని అన్ని 20 స్థానాలకు ఒకేసారి పోలింగ్ జరిగింది. కర్ణాటకలో 14, రాజస్తాన్‌లో 13, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్‌లో చెరో 8, మధ్యప్రదేశ్ 6, అస్సాం, బిహార్‌లలో చెరో ఐదు, ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్‌లలో చెరో 3, మణిపూర్, త్రిపుర, జమ్మూకశ్మీర్‌లలో ఒక్కొక్క స్థానంలో పోలింగ్ జరిగింది.


శశిథరూర్


డీకే శివకుమార్


సిద్ధరామయ్య


నిర్మలా సీతారామన్

స్వల్ప ఘర్షణలు, వడదెబ్బ మరణాలు

కేరళలో కొన్ని చోట్ల ఈవీఎంలు పనిచేయలేదు. వడదెబ్బ కారణంగా కేరళలో వేర్వేరు పోలింగ్ కేంద్రాల వద్ద ముగ్గురు ఓటర్లు చనిపోయారు. కోజికోడ్‌లో ఒక పోలింగ్ ఏజెంట్ మరణించారు. ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ జిల్లాలో పోలింగ్ డ్యూటీలో ఉన్న ఒక మధ్యప్రదేశ్ జవాను సర్వీస్ రైఫిల్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మణిపూర్‌లోని తంగ్‌ఖుల్ నాగా జిల్లాలో కాంగ్రెస్, ఎన్‌పీఎఫ్ మద్దతుదారులకు మధ్య జరిగిన గొడవల్లో ఈవీఎంలు ధ్వంసమయ్యాయి.

బెంగాల్ నుంచి ఈసీకి 300 ఫిర్యాదులు

మతం ప్రాతిపదికన ఓట్లేయాలంటూ సోషల్‌మీడియాలో వీడియో పోస్ట్‌చేశారంటూ బెంగళూరు సౌత్ బీజేపీ అభ్యర్థి తేజస్వీ సూర్యపై పోలీసులు కేసు నమోదుచేశారు. మరో బీజేపీ నేత సీటీ రవి మీదా కేసు నమోదైంది. పోలింగ్‌కు సంబంధించి పశ్చిమబెంగాల్ నుంచి ఈసీకి 300 ఫిర్యాదులొచ్చాయి. కాంగ్రెస్ నేత శశిథరూర్, కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, 'టీవీ' రాముడు అరుణ్ గోవిల్, కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సోదరుడు డీకే సురేశ్(కాంగ్రెస్), కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి(జేడీఎస్)లు పోటీచేస్తున్న స్థానాల్లోనూ పోలింగ్ ముగిసింది. బీజేపీ నేతలు హేమా మాలిని, గజేంద్ర షెకావత్‌లు హ్యాట్రిక్ విజయం కోసం ఎదురుచూస్తున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఈ 88 స్థానాల్లో ఎన్‌డీఏ కూటమి 56 చోట్ల, యూపీఏ కూటమి 24 చోట్ల విజయం సాధించాయి.

రాష్ట్రం	పోలింగ్ శాతం
కేరళ	70.22
కర్ణాటక	69.23
రాజస్తాన్	64.60
మహారాష్ట్ర	57.83
ఉత్తరప్రదేశ్	54.85
మధ్యప్రదేశ్	57.88
అస్సాం	71.11
బిహార్	55.08
ఛత్తీస్‌గఢ్	73.05
పశ్చిమబెంగాల్	71.84
మణిపూర్	77.32
త్రిపుర	79.46
జమ్మూకశ్మీర్	71.91

సైడ్‌లైట్స్

- ఓటేసి వస్తే డిస్కౌంట్ ధరకే ఆహారపదార్థాలు అందిస్తామని బెంగళూరులో పలు హోటళ్లు, కెఫేలు, మిఠాయి దుకాణాలు ప్రకటించాయి. కొన్ని దుకాణాలు ఉచితంగానూ ఇచ్చాయి. దీంతో ఓటేసిన ఓటర్లు లడ్డూ, దోసె, కాఫీ, ఇతర ఆహార పదార్థాల కోసం ఆయా షాపుల వద్ద క్యూ కట్టారు.
- ఛత్తీస్‌గఢ్‌లోని శివానీ గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని పెళ్లి మండపం లాగా తీర్చిదిద్దారు. వివాహ మంత్రోచ్ఛారణలను ప్లే చేశారు.
- దక్షిణ కన్నడ నియోజకవర్గ పరిధిలోని పవూర్ ఉలియా ద్వీపం నుంచి 150కిపైగా ఓటర్లు పోలింగ్ కేంద్రానికి పడవల్లో వచ్చి మరీ ఓటేసి వెళ్లారు
- కోటా–బూందీ నియోజకవర్గంలో 108 ఏళ్ల బామ్మ భూరీ భాయ్ వీల్‌చైర్‌లో వచ్చి ఓటేశారు.
- దక్షిణ కన్నడ జిల్లాలోని మారుమూల గిరిజన బంజరుమాలె గ్రామంలో ఉన్న మొత్తం 111 మంది ఓటేసి 100 శాతం పోలింగ్‌ను నమోదుచేశారు.
- ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్, కాంకేర్ పరిధిలోని 45 గ్రామాల ప్రజలు తొలిసారిగా సొంతూళ్లలో ఓటేశారు.
- కనీస సదుపాయాలు లేవని, అభివృద్ధి జరగలేదని కొన్ని నియోజకవర్గాల్లోని కొన్ని గ్రామాల ప్రజలు ఎన్నికలను బహిష్కరించారు.

పోలింగ్ ముగిసిన స్థానాలు

రాష్ట్రం	తొలి విడత	రెండో విడత
అరుణాచల్‌ప్రదేశ్ (2)	2	-
అస్సాం (14)	5	5
బిహార్ (40)	4	5
ఛత్తీస్‌గఢ్ (11)	1	3
కర్నాటక (28)	-	14
కేరళ (20)	-	20
మధ్యప్రదేశ్ (29)	6	6
మహారాష్ట్ర (48)	5	8
మణిపూర్ (2)	1	1
మేఘాలయ (2)	2	-
మిజోరం (1)	1	-
నాగాలాండ్ (1)	1	-
రాజస్తాన్ (25)	12	13
సిక్కిం (1)	1	-
తమిళనాడు (39)	39	-
త్రిపుర (2)	1	1
ఉత్తరప్రదేశ్ (80)	8	8
ఉత్తరాఖండ్ (5)	5	-
పశ్చిమబెంగాల్ (42)	3	3
అండమాన్ (1)	1	-
జమ్మూ కశ్మీర్ (5)	1	1
లక్షద్వీప్ (1)	1	-
పుదుచ్చేరి (1)	1	-

నోట్: రాష్ట్రాల పక్కన బ్రాకెట్లో ఉన్నది మొత్తం స్థానాలు

ఈవీఎంల ట్యాంపరింగ్ అసాధ్యం

తేల్చిచెప్పిన సుప్రీంకోర్టు ధర్మాసనం

- ఈవీఎంలలో అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ కాలేదు
- వంద శాతం వీవీప్యాట్ స్లిప్పుల లెక్కింపు కుదరదు
- మళ్లీ బ్యాలెట్ పేపర్ విధానం అంటే ఎన్నికల సంస్కరణలు రద్దయినట్లే
- దాఖలైన అన్ని పిటిషన్లు కొట్టివేత

సాక్షి, న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను(ఈవీఎం) ట్యాంపరింగ్ చేయడం అసాధ్యమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పోలింగ్ బూత్‌ల ఆక్రమణ, దొంగ ఓట్లు వేయడం వంటి అక్రమాలను ఈ యంత్రాలతో అడ్డుకోవచ్చని, ఇవి పూర్తిగా భద్రతతో కూడినవని తేల్చిచెప్పింది. ఈవీఎంలలో అవకతవకలు జరిగినట్లు ఇప్పటిదాకా ఎక్కడా నిర్ధారణ కాలేదని పేర్కొంది. ఈవీఎంలపై అనుమానాలు నిరాధారమని తేల్చిచెప్పింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో నమోదైన ఓట్లతో వంద శాతం వీవీప్యాట్ స్లిప్పులను సరిపోల్చడం(క్రాస్–వెరిఫికేషన్) కుదరని వెల్లడించింది. ఈవీఎంలలో నమోదైన ఓట్లతో వంద శాతం వీవీప్యాట్ స్లిప్పులను క్రాస్–వెరిఫికేషన్ చేయాలని, వీవీప్యాట్ స్లిప్పులు బ్యాలెట్ బాక్సులో వేయాలని, ఎన్నికల్లో మళ్లీ పేపర్ బ్యాలెట్ విధానం తీసుకురావాలని కోరుతూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం ఒకే అభిప్రాయంతో రెండు తీర్పులు వెలువరించింది. ఈవీఎంలపై వస్తున్న అపోహలు, అనుమానాలకు సంబంధించి ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించి, వాటన్నింటినీ ధర్మాసనం నివృత్తి చేసుకుంది. అనంతరమే తీర్పు ఇస్తున్నట్లు స్పష్టం చేసింది. అన్ని పిటిషన్లు కొట్టివేస్తున్నట్లు తెలియజేసింది.

సింబల్ లోడింగ్ యూనిట్లు భద్రపర్చాలి

జస్టిస్ సంజీవ్ ఖన్నా తన తీర్పును వెలువరిస్తూ ఎన్నికల సంఘానికి కొన్ని సూచనలు చేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత సింబల్ లోడింగ్ యూనిట్లను(ఎస్ఎల్‌యూ) సీల్ చేసి, కంటైనర్‌లో భద్రపర్చి, ఈవీఎంలతోపాటు స్ట్రాంగ్‌రూమ్‌లో కనీసం 45 రోజులపాటు స్టోర్ చేయాలని చెప్పారు. రెండు, మూడు స్థానాల్లో నిలిచిన అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు ఈవీఎంల తయారీ సంస్థకు చెందిన ఇంజినీర్లు ఆయా యంత్రాల మైక్రో కంట్రోలర్లను ధ్రువీకరించడానికి అనుమతిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫలితాలు ప్రకటించిన ఏడు రోజుల లోపు తగిన రుసుము చెల్లించి మైక్రో కంట్రోలర్ల ధ్రువీకరణను ఎన్నికల్లో రెండు, మూడో స్థానాల్లో నిల్చిన అభ్యర్థులు కోరవచ్చని, ఒకవేళ ఈవీఎం ట్యాంపరింగ్‌కు గురైనట్లు తేలితే ఆ సొమ్ము సదరు అభ్యర్థులకు తిరిగి చెల్లించాలని సూచించారు.

ఈవీఎంలతో లాభాలివే..

ఈవీఎంలను తారుమారు చేయొచ్చనే పిటిషనర్ల వాదనల్లో వాస్తవం లేదని ధర్మాసనం పేర్కొంది. ఈవీఎం, వీవీప్యాట్ ఉపయోగాలను వివరించింది. ''ఇది బ్యాటరీతో పనిచేస్తుంది. బటన్ నొక్కడం ద్వారా ఓటు నమోదవుతుంది. దీనివల్ల బ్యాలెట్ పేపర్‌తో ఎదురయ్యే చెల్లని ఓట్ల వంటి సమస్యలు ఉండవు. నిమిషానికి నాలుగు కంటే ఎక్కువ ఓట్లను ఈవీఎం అనుమతించదు. దీంతో పోలింగ్ బూత్‌ల ఆక్రమణకు అవకాశం ఉండదు. ఓట్ల లెక్కింపు వేగంగా పూర్తవుతుంది. ఈవీఎంలో బీప్ సౌండ్ ద్వారా తమ ఓటును ఓటర్లు తక్షణమే ధ్రువీకరించుకోవచ్చు. వీవీప్యాట్ స్లిప్పును ప్రత్యక్షంగా చూడొచ్చు'' అని తెలిపింది.

ఆ స్లిప్పులు ఇవ్వడం ఆచరణ సాధ్యం కాదు

ఓటర్లు వీవీప్యాట్ స్లిప్పులు తీసుకొని బ్యాలెట్ బాక్సులో వేయాలన్న అభ్యర్థన కూడా తిరస్కరిస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. తమ ఓటు కచ్చితంగా నమోదు అయిందని, లెక్కించడానికి వీలుగా ఉందని నిర్ధారించుకోవడం ఓటర్ల ప్రాథమిక హక్కు అని వివరించింది. అయితే వీవీప్యాట్ స్లిప్పులను వంద శాతం భౌతికంగా లెక్కించాలనడం ఆ హక్కుతో సమానం కాదని అభిప్రాయపడింది. ఓటర్ల హక్కులు ఇతర చర్యల ద్వారా కాపాడవచ్చని వెల్లడించింది. సుబ్రహ్మణ్య స్వామి వర్సెస్ కేంద్ర ఎన్నికల సంఘం కేసు తర్వాత వీవీప్యాట్‌లు ప్రవేశపెట్టారని, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు తర్వాత పార్లమెంటరీ నియోజకవర్గంలోని ఒక అసెంబ్లీ సెగ్మెంట్ లేదా అసెంబ్లీ సెగ్మెంట్‌లోని ఐదు పోలింగ్ స్టేషన్లలోని వీవీప్యాట్‌ల లెక్కింపు ప్రారంభమైందని ధర్మాసనం గుర్తుచేసింది. ఓటర్లకు భౌతికంగా వీవీప్యాట్ స్లిప్పులు ఇవ్వడం ఆచరణ సాధ్యం కాదని స్పష్టం చేసింది. ఇలా స్లిప్పులు ఇచ్చే విధానం దుర్వినియోగం, వివాదాలకు దారి తీసే అకాశం ఉందని పేర్కొంది. 2019 ఎన్నికల్లో 20,687 వీవీప్యాట్‌ల స్లిప్పులను భౌతికంగా లెక్కించారని, ఒక్క దాంట్లోనూ మిస్‌మ్యాచ్ గుర్తించలేదని ధర్మాసనం గుర్తుచేసింది. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని మైదుకూరు అసెంబ్లీ నియోజకవర్గం పోలింగ్ స్టేషన్ నెంబర్ 63లో ఈవీఎంలో వ్యత్యాసం గుర్తించారని తెలిపింది. ఈవీఎంలో మాక్ పోలింగ్ డేటాను ప్రిసైడింగ్ అధికారి తొలగించకపోవడంతో ఆ వ్యత్యాసం వచ్చినట్లు తేలిందని పేర్కొంది.

మళ్లీ బ్యాలెట్ ఓటింగ్‌తో నష్టమే

బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటింగ్ నిర్వహించాలన్న పిటిషనర్ల అభ్యర్థనను జస్టిస్ సంజీవ్ ఖన్నా తన తీర్పులో తోసిపుచ్చారు. బ్యాలెట్ పేపర్ విధానంలో కొన్ని లోపాలు, నష్టాలు ఉన్నాయని తెలిపారు. ఆ పాత విధానానికి మళ్లీ వెళ్లడం అనేది ఎన్నికల సంస్కరణలు రద్దు చేయడమే అవుతుందని పేర్కొన్నారు. దేశంలో 97 కోట్ల మంది ఓటర్లు, పోటీ చేసే అభ్యర్థుల సంఖ్య, పేపర్ బ్యాలెట్‌తో ఎదురయ్యే సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఈ విధానానికి వెళ్లాలని చెప్పలేమన్నారు. ఈ అంశంపై జస్టిస్ దీపాంకర్ దత్తా స్పందిస్తూ.. పేపర్ బ్యాలెట్ వ్యవస్థకు మళ్లీ తీసుకురావడం అనే ప్రశ్న ఉత్పన్నం కాకూడదని, ఈవీఎంలను మరింత అభివృద్ధి చేసి, మెరుగైన ఎన్నికల వ్యవస్థను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈవీఎంలపై ఓటర్లలో సందేహాలు సృష్టించడం ద్వారా ఓటింగ్ ప్రక్రియను నిర్వీర్యం చేయడానికి పిటిషనర్లు ప్రయత్నిస్తున్నారన్న ఎన్నికల సంఘం వాదనతో ఆయన ఏకీభవించారు.

ప్రతిపక్షాలకు గట్టి చెంపదెబ్బ

- వీవీప్యాట్ స్లిప్పులపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం: మోదీ
- ఈవీఎంలపై అనుమానాలు సృష్టించేందుకు కాంగ్రెస్ యత్నం
- ప్రజలకు ఆ పార్టీ క్షమాపణ చెప్పాలి
- ప్రధాని మోదీ డిమాండ్
- బిహార్, పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల ప్రచారం

అరారియా/ముంగేర్/మాల్డా: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎం), వీవీ ప్యాట్ స్లిప్పుల విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నానని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఈ తీర్పు కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష కూటమికి గట్టి చెంపదెబ్బ అని స్పష్టం చేశారు. ఈవీఎంలకు వ్యతిరేకంగా ప్రజల్లో అనుమానాలు సృష్టించే పాపానికి పాల్పడినందుకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని అన్నారు. శుక్రవారం బిహార్‌లోని అరారియా, ముంగేర్, పశ్చిమ బెంగాల్‌లోని మాల్డాలో సార్వత్రిక ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ మాట్లాడారు. అలాగే ఉత్తర ప్రదేశ్‌లోని బరేలీలో రోడ్ షోలో పాల్గొన్నారు. 'కాంగ్రెస్ లూటీ.. జీవించి ఉన్నప్పుడు, మరణించిన తర్వాత కూడా' అనే కొత్త నినాదం వినిపించారు. వారసత్వ పన్ను ద్వారా ప్రజల ఆస్తులను కొట్టేయడానికి కాంగ్రెస్ కుట్రలు చేస్తుంటే 'ఇండియా' కూటమి భాగస్వామ్య పక్షాలు నోరుమెదపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు వాటికి ఇష్టమైన ముస్లిం ఓటు బ్యాంక్‌కు మేలు చేయడానికి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లు, హక్కులను దోచేయడానికి కుట్రలు సాగిస్తున్నాయని మరోసారి మండిపడ్డారు. బహిరంగ సభల్లో నరేంద్ర మోదీ ఇంకా ఏం చెప్పారంటే..



ఆటలు సాగడం లేదనే ఈవీఎంలపై కుట్ర

''కాంగ్రెస్ సహా విపక్ష 'ఇండియా' కూటమి పార్టీలు గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఎన్నికల్లో లెక్కలేనన్ని అక్రమాలకు పాల్పడేవి. పోలింగ్ బూత్‌లను ఆక్రమించేవి. దొంగ ఓట్లు వేయించేవి. వ్యతిరేకంగా ఓట్లు పడిన చోట బ్యాలెట్ బాక్సులను మాయం చేసేవి. అప్పట్లో బలవంతులదే రాజ్యం. పేదలు, దళితులు, గిరిజనులకు ఓటు వేసే అవకాశం ఉండేది కాదు. వారి ఓటును ఇంకెవరో వేసేవారు. ఈవీఎంలను ప్రవేశపెట్టిన తర్వాత విపక్షాల ఆటలు సాగడం లేదు. అందుకే ఈవీఎంలపై తప్పుడు ప్రచారానికి తెరతీశాయి. మళ్లీ బ్యాలెట్ పేపర్ల ద్వారా ఎన్నికలు నిర్వహించాలని పట్టుబట్టాయి. విపక్షాలకు చెంపపెట్టు లాంటి తీర్పును సుప్రీంకోర్టు ఇవాళ ప్రకటించింది.

వనరులపై మొదటి హక్కు పేదలకే..

నేను వెనుకబడిన కులంలో జన్మించా. వెనుకబడిన తరగతుల ప్రజల కష్టాలేమిటో నాకు తెలుసు. స్వయంగా అనుభవించా. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఓబీసీలకు దక్కాల్సిన ప్రయోజనాలను ముస్లింలకు కట్టబెడుతోంది. సొంత లాభం కోసం ఓబీసీల రిజర్వేషన్లను దోచుకుంటోంది. చట్టవిరుద్ధంగా ముస్లింలకు రిజర్వేషన్లు కల్పిస్తోంది. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశమంతటా ఓబీసీలతోపాటు ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లకు సైతం ఇదే గతి పడుతుంది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను ఓటుబ్యాంకు రాజకీయాల కోసం పక్కదారి పట్టిస్తామంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. ఇది మోదీ గ్యారంటీ''

రెండు దశల్లో ఎన్డీయేకు అనుకూల ఓటింగ్

సార్వత్రిక ఎన్నికల్లో తొలి రెండు దశల్లో ఎన్డీయేకు అనుకూలంగా ఓటింగ్ జరిగిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం పోలింగ్ ముగిసిన అనంతరం 'ఎక్స్'లో పోస్టు చేశారు. రెండు దశల్లో తమ కూటమికి ప్రజల నుంచి లభించిన అసమానమైన మద్దతు విపక్ష 'ఇండియా' కూటమికి తీరని ఆవేదన మిగిల్చిందని తెలిపారు.

సీఏఏపై ప్రతిపక్షాల దుష్ప్రచారం

''ఓటు బ్యాంక్‌ను సంతృప్తిపర్చడానికి పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)పై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయి. సీఏఏను వ్యతిరేకించడం దారుణం. ఇతర దేశాల్లో మతపరమైన వివక్షకు గురై భారత్‌కు శరణార్థులుగా వలసవచ్చిన హిందువులు, సిక్కులు, బౌద్ధులపై ఎందుకంత విద్వేషం? వారికి మన దేశ పౌరసత్వం ఇవ్వడాన్ని ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? సీఏఏ అనేది బాధితులకు పౌరసత్వం ఇవ్వడానికే తప్ప పౌరసత్వం లాక్కోవడానికి కాదు''

ఇక వేదికపై కన్నీళ్లు పెడతాడేమో

మోదీపై రాహుల్ గాంధీ విసుర్లు



విజయపుర(కర్ణాటక): కపట నాటకాలతో ప్రచార వేదికను కన్నీటితో తడిపేస్తాడేమో అంటూ ప్రధాని మోదీపై రాహుల్ గాంధీ విమర్శల వర్షం కురిపించారు. కర్ణాటకలోని విజయపుర జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కాంగ్రెస్ ప్రచార కార్యక్రమంలో రాహుల్ ప్రసంగించారు. ''ఇటీవలికాలంలో బీజేపీ ప్రచారవేదికలపై మోదీ ప్రసంగాలు వినే ఉంటారు. ఆయనకు ఓటమి భయం పట్టుకుంది. ఈసారి వేదికపై ఆయన కన్నీళ్లు పెట్టుకుంటారేమో. ప్రజాసమస్యల నుంచి ఓటర్ల దృష్టిని ఏమార్చే ప్రయత్నంచేస్తారు. అందుకే ఆయన ఒకసారి చైనా గురించి మాట్లాడతారు. ఇంకోసారి పాకిస్తాన్ ఊసెత్తుతారు. మరోసారి ప్లేట్లు, గిన్నెలు కొట్టమంటారు. ఇంకోసారి మొబైల్‌ఫోన్ల టార్చ్‌లైట్ ఆన్ చేయమంటారు. దేశంలో పేదరికం, నిరుద్యోగం, పెరిగిన ధరలు ఇలా మూడు, నాలుగు అత్యంత ప్రధానమైన సమస్యలు తిష్టవేశాయి. వీటిని రూపుమాపే శక్తి ఒక్క కాంగ్రెస్‌కే ఉంది. మోదీ హయాంలో అమలవుతున్న పథకాలతో దళితులు, ఓబీసీ, గిరిజనులు, మైనారిటీలు, పేద జనరల్ కేటగిరీ ప్రజలకు ఎలాంటి మేలు జరగట్లేదు. బిలియనీర్లకు మోదీ ఇచ్చిన వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని మేం అధికారంలోకి వస్తే పేదలకు పంచుతాం. అగ్నివీర్‌లుగా 18–21 ఏళ్ల యువత మూడేళ్లు సైన్యంలో పనిచేశాక వారి ఉద్యోగాలను మోదీ లాగేసుకుంటున్నారు. యువతను అవమానిస్తున్న ఇలాంటి అగ్నివీర్ పథకాన్ని రద్దుచేస్తాం. జనంపై మోదీ జీఎస్టీ పెనుభారం మోపారు. కర్ణాటక ప్రజలకు మోదీ అన్యాయం చేశారు. మేం అధికారంలోకి వచ్చాక జీఎస్టీ విధానంలో కాంగ్రెస్ మార్పులు తీసుకొస్తుంది. కర్ణాటక ప్రజలకు జరిగిన అన్యాయాన్ని రూపుమాపి న్యాయం చేస్తుంది. ఈసారి లోక్‌సభ ఎన్నికలు గతంలోలాగా ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికలు కావు. దేశ చరిత్రలోనే తొలిసారిగా ఒక వ్యక్తి(మోదీ), ఒక పార్టీ(బీజేపీ) దేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువలను నాశనం చేసేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో వచ్చిన ఎన్నికలు ఇవి' అని రాహుల్ వ్యాఖ్యానించారు.

బీర్భూమ్‌లో బీజేపీ అభ్యర్థి నామినేషన్ రద్దు

కోల్‌కతా: సాంకేతిక కారణాలతో పశ్చిమబెంగాల్‌లోని బీర్భూమ్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి దేబాశిష్ ధార్ దాఖలుచేసిన నామినేషన్ పత్రాలను జిల్లా ఎన్నికల అధికారి శుక్రవారం తిరస్కరించారు. అయితే బీజేపీ మరో నేత దేబ్తాను భట్టాచార్యతో బీజేపీ గురువారమే నామినేషన్ వేయించింది. ధార్ పోటీ నుంచి తప్పుకోవడంతో భట్టాచార్య బీజేపీ అభ్యర్థిగా ప్రచారం మొదలెట్టారు. భట్టాచార్యకు పోటీగా అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ తరఫున శతాబ్ది రాయ్ బరిలో నిలిచారు.

అనంతనాగ్ పోలింగ్ వాయిదా వద్దు

ఈసీకి ఒమర్, మెహబూబా ముఫ్తీ లేఖ

సాక్షి, న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ –రాజౌరీ లోక్‌సభ స్థానానికి పోలింగ్‌ను వాయిదా వేయొద్దంటూ నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) నేత ఒమర్ అబ్దుల్లా, పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ కేంద్ర ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. షెడ్యూల్ ప్రకారం మే 7న ఇక్కడ ఎన్నికలు జరగాల్సి ఉంది. ప్రతికూల వాతావరణం కారణంగా దక్షిణ కశ్మీర్‌ను పూంఛ్–రాజౌరీతో కలిపే కీలకమైన మొఘల్ రోడ్డును అధికారులు మూసివేసే అవకాశమున్నందున పోలింగ్‌ను వాయిదా వేయాలంటూ బీజేపీ, మరో ముగ్గురు అభ్యర్థులు ఈసీని కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ రోడ్డును తెరిచే ఉంచేలా స్థానిక యంత్రాంగాన్ని ఆదేశించాలంటూ ఈసీని కోరారు.

మైనారిటీలకు బీఫ్ తినే హక్కు ఇవ్వాలనుకుంటోంది: కాంగ్రెస్‌పై యోగి ధ్వజం

లక్నో: యూపీ సీఎం యోగి కాంగ్రెస్ పార్టీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బీఫ్ తినే హక్కు మైనారిటీలకు ఇవ్వాలని ఆ పార్టీ భావిస్తోందని, అది గోవధతో సమానమవుతుందని అన్నారు. 'తమకు నచ్చిన ఆహారం తినే స్వేచ్ఛను మైనారిటీలకు కల్పించాలని కాంగ్రెస్ అనుకుంటోంది. అంటే, గోవధను అనుమతించడమే అవుతుంది. కాంగ్రెస్ వాళ్లు మాత్రం గోవులను వధించే వారి చేతుల్లో పెట్టాలనుకున్నారు. భారత్ ఇందుకు అంగీకరిస్తుందా?'అని మొరాబాద్ జిల్లాలో జరిగిన ర్యాలీలో సీఎం యోగి ప్రజలను ప్రశ్నించినట్లు యూపీ బీజేపీ తెలిపింది.

నేటి నుంచి సునీతా కేజ్రీవాల్ ప్రచారం

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ సతీమణి సునీతా కేజ్రీవాల్ శనివారం నుంచి లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని ఆమ్ ఆద్మీ పార్టీ తెలిపింది. శుక్రవారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆప్‌కు చెందిన మంత్రి ఆతిశీ విలేకరులతో మాట్లాడారు. శనివారం సునీత రోడ్ షోలో పాల్గొంటారని, ఆదివారం పశ్చిమ ఢిల్లీలో ప్రచారం చేస్తారని చెప్పారు. ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణంలో సీఎం కేజ్రీవాల్ అక్రమ అరెస్టుకు నిరసనగా 'జైల్ కా జవాబ్ ఓట్ సే'పేరుతో ప్రచారం చేస్తున్నామని తెలిపారు. పంజాబ్, హరియాణా, గుజరాత్ రాష్ట్రాల్లో సునీత ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారన్నారు.

పోలీసు కాల్పుల్లో భారత సంతతి వ్యక్తి మృతి

న్యూయార్క్: మహిళపై దాడి కేసులో అరెస్ట్ చేసేందుకు వెళ్లిన పోలీసులను వాహనంతో గుద్దిన భారత సంతతికి చెందిన వ్యక్తి ఒకరు పోలీసు కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయారు. టెక్సాస్‌లోని శాన్ ఆంటోనియోలో ఏప్రిల్ 21వ తేదీన ఘటన చోటుచేసుకుంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సచిన్ సాహూ(42) తన రూంమేట్ అయిన ఓ మహిళ(51)ను వాహనంతో ఢీకొట్టాడు. దీంతో, ఆమె తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. తనను పట్టుకునేందుకు వచ్చిన పోలీసులపైకి సాహూ బీఎండబ్ల్యూను నడిపాడు. ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. మరో పోలీసు జరిపిన కాల్పుల్లో సాహూ ప్రాణాలు కోల్పోయాడు. 'కొంతకాలంగా సాహూ మానసిక సమస్యలతో బాధపడుతున్నాడు'అని మాజీ భార్య లియా గోల్డ్‌స్టీన్ పేర్కొంది.

ఇకపై ఏటా రెండుసార్లు సీబీఎస్‌ఈ పరీక్షలు!

న్యూఢిల్లీ: సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్‌ఈ) బోర్డు పరీక్షలను ప్రతిఏటా రెండుసార్లు నిర్వహించడానికి రంగం సిద్ధమవుతోంది. 2025–26 విద్యాసంవత్సరం నుంచి బోర్డు పరీక్షలను రెండుసార్లు నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని కేంద్ర విద్యా శాఖ సీబీఎస్‌ఈకి సూచించింది. సీబీఎస్‌ఈలో సెమిస్టర్ విధానం ప్రవేశపెట్టే ఆలోచన లేదని అధికార వర్గాలు స్పష్టం చేశాయి. ప్రతి సంవత్సరం రెండు సార్లు బోర్డు పరీక్షల నిర్వహణపై కేంద్ర విద్యాశాఖ, సీబీఎస్‌ఈ అధికారులు వచ్చే నెలలో స్కూల్ ప్రిన్సిపాళ్లతో సమావేశం కానున్నట్లు తెలిసింది.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
శనివారం । 27 । ఏప్రిల్ । 2024



నెమలి వేణుగోపాలుడి సేవలో..

గంపలగూడెం: నెమలి వేణుగోపాలస్వామిని వైఎస్సార్ సీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు దర్శించుకున్నారు.



నూతన యాగశాలలో పూజలు

దుర్గగుడిలోని యాగశాలలో శుక్రవారం నిర్వహించిన పూజల్లో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాలవలవన్, దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ పాల్గొన్నారు. -8లో



	కనిష్టం	గరిష్టం
నందిగామ	27.7	42.6
జగ్గయ్యపేట	26	43
మచిలీపట్నం	28	36
గుడివాడ	27	40

న్యూస్‌రీల్

హోరాహోరీగా చెస్ టోర్నీ



విజయవాడస్పోర్ట్స్: స్పార్క్ చెస్ అకాడమీ మొదటి అంతర్జాతీయ ఓపెన్ ఫిడే రేటింగ్ టోర్నమెంట్ రెండో రోజు హోరాహోరీగా సాగింది. కానూరులోని షామ్‌రాక్ స్కూల్లో జరుగుతున్న ఈ పోటీలు శుక్రవారం సాయంత్రానికి మూడు రౌండ్లు ముగిశాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టాప్ సీడర్లు ఎండీ ఇమ్రాన్ (విజయవాడ), డి.లక్ష్మణరావు (ఏలూరు), ఎస్.శ్రీచరణ్ (వైజాగ్), ఎన్.విహాన్ కార్తికేయ (వైజాగ్) టోర్నీలో ముందంజలో కొనసాగుతున్నారు. ఈ నెల 30వ తేదీ వరకు ఈ పోటీలు కొనసాగుతాయి. రెండో రోజు పోటీలను స్ప్రింగ్ బోర్డ్ ఇంటర్నేషనల్ ప్లే స్కూల్ డైరెక్టర్ ఎం.బాబురాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. చీఫ్ ఆర్బిటర్ జి.వి.కుమార్, జాతీయ ఆర్బిటర్లు కిరణ్, మునలయ్య, నిర్వాహకులు తాళ్ల నరేష్ పర్యవేక్షించారు.

మార్గదర్శకాలకు అనుగుణంగా నామినేషన్ల పరిశీలన



మైలవరం:ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా నామినేషన్‌లు పరిశీలన ప్రక్రియ చేపట్టినట్లు మైలవరం నియోజకవర్గ ఎన్నికల అధికారి పి.సంపత్‌కుమార్ తెలిపారు. తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన నామినేషన్‌ల పరిశీలన ప్రక్రియను ఎన్నికల వ్యయ పరిశీలకులు సౌరభ్ శర్మ, మదన్ కుమార్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారమే నామినేషన్‌ల పరిశీలన జరిగిందని, ఎటువంటి అవాంచనీయ ఘటనలకు తావు లేకుండా నిర్వహించామని చెప్పారు. తిరువూరు, విజయవాడ పశ్చిమ, విజయవాడ సెంట్రల్, మైలవరం అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులుగా సౌరబ్ శర్మ వ్యవహరిస్తున్నారు. అదే విధంగా విజయవాడ తూర్పు, నందిగామ, జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గాలకు వ్యయపరిశీలకులుగా మదన్‌కుమార్ ఉన్నారు.

పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలి



పెనమలూరు: సాధారణ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని కేంద్ర ఎన్నికల పరిశీలకుడు నరహరసింగ్ బంగర్ అన్నారు. ఆయన శుక్రవారం పెనమలూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం, పెనమలూరు, పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పోలింగ్‌బూత్‌లను పరిశీలించారు. తొలుత ఆయన నియోజకవర్గంలో ఉన్న 24 మంది సెక్టార్ అధికారులతో సమావేశం నిర్వహించారు. హోమ్ ఓటింగ్ విధి విధానాలను వివరించి తగిన సూచనలు చేశారు. తరువాత పెనమలూరు, పోరంకి పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ రోజు ఎటువంటి లోపాలు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. బీఎల్‌వోలు విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ డి.రాజు, పెనమలూరు తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ కుమార్‌బాబు, బూత్ లెవల్ అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

యార్డులో 62,153 బస్తాల మిర్చి విక్రయం

గుంటూరు: గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 59,655 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 62,153 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.18,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.20,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 42,701 బస్తాల మిర్చి నిల్వలున్నాయి.

ప్రచార పర్వం



విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం పాయకాపురంలో ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాస్ శుక్రవారం ప్రచారం చేశారు. వృద్ధులను ఆత్మీయంగా పలకరించి ఓట్లు అభ్యర్థించారు.



విజయవాడ తూర్పు నియోజకవర్గం18వ డివిజన్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ పర్యటించారు. ఓ టిఫిన్ బండి వద్ద అట్లు వేసి అందరినీ ఆకట్టుకున్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు.



విజయవాడ పశ్చిమ నియోజకవర్గం రైల్వేహాల్ సమీపంలో ఎమ్మెల్యే అభ్యర్థి అసిఫ్ శుక్రవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఓ ఇస్త్రీ బండి వద్ద దుస్తులు ఐరన్ చేస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని విన్నవించారు.

ఓటమి భయంతో వసంత!

- డబ్బుతో అడ్డదారులు తొక్కడానికి ప్రయత్నాలు
- రూ.కోట్లు కుమ్మరిస్తూ నాయకులకు ఎర
- సామాన్యుడిపై పోటీకి వణుకుతున్న వైనం
- ఆగర్భశత్రువుతో చేతులు కలిపి ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిన కృష్ణప్రసాద్

సాక్షి ప్రతినిధి విజయవాడ:మైలవరంలో సామాన్యుడైన వైఎస్సార్ సీపీ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు దెబ్బకు, టీడీపీ అభ్యర్థి వసంత వెంకటకృష్ణ ప్రసాద్ విలవిల్లాడుతున్నారు. తిరుపతిరావుకు నియోజకవర్గ ప్రజల నుంచి అనూహ్య మద్దతు లభిస్తోంది. ప్రచారంలో జనాలు అడుగడుగునా నీరాజనాలు పలుకుతున్నారు. దీంతో ఆయన ప్రచారంలో ఊహించని విధంగా దూసుకు పోతున్నారు. రోజు రోజుకు సర్నాల గ్రాఫ్ అమాంతం పెరుగుతోంది. నామినేషన్ కార్యక్రమానికి ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. గ్రామాల్లో పార్టీ క్యాడరే స్టార్ క్యాంపెయినర్లుగా మారి తిరుపతిరావు యాదవ్ తరఫున ప్రచారం చేస్తూ దన్నుగా నిలుస్తున్నారు. దీంతో టీడీపీ మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వసంత వెంకటకృష్ణ ప్రసాద్‌ని ఓటమి భయం వెంటాడుతోంది. వైఎస్సార్ సీపీకి వెన్నుపోటు పొడిచి టీడీపీలో చేరిన ఆయనకు వైఎస్సార్ సీపీ అభ్యర్థి అతి సామాన్యుడు సర్నాల తిరుపతిరావు పట్ట పగలే చుక్కలు చూపిస్తున్నారు. ఐదేళ్ల జగనన్న వివక్ష రహిత సంక్షేమ, అభివృద్ధి పాలన చూసి ఓటు వేయమని సర్నాల తన ప్రచారంలో దూసుకు పోతుంటే ఓటమి భయంతో గెలుపు కోసం అడ్డదారులే అస్త్రాలుగా వసంత వెంకటకృష్ణప్రసాద్ ముందుకు సాగుతున్నారు.

రూ.కోట్లు కుమ్మరించి నాయకుల బేరం....

పార్టీ మారి అదే నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న క్రమంలో నియోజకవర్గ ప్రజల నుంచి వసంత కృష్ణ ప్రసాద్ తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకున్నారు. రూ.కోట్లు కుమ్మరించైనా పరువు దక్కించుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు ప్రజలను విస్మయానికి గురిచేస్తున్నాయి. టీడీపీ అభ్యర్థిగా ప్రకటించక ముందు నుంచి టీడీపీలో దేవినేని ఉమా వర్గం నుంచి తీవ్ర వ్యతిరేక పవనాలు వీయడంతో వారిని తన పక్కకు తిప్పుకునేందుకు రూ.కోట్లు వెదజల్లారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. వైఎస్సార్ సీపీ నాయకులను సైతం తన వైపు తిప్పుకునేందుకు తాయిలాలను ప్రకటించి భంగపడ్డారు. చిన్నా చితకా నాయకులు తప్ప వేరెవ్వరూ వసంత వైపు వెళ్లేందుకు తాయిలాలకు తలొగ్గకపోవడంతో టీడీపీ కార్యకర్తలకే కండువాలు కప్పి వైఎస్సార్ సీపీ నుంచి వలసల పేరుతో మరో నాటకానికి తెరలేపారు. ద్వితీయ స్థాయి నాయకులకు వారి స్థాయిని బట్టి బేరం పెట్టి కొనుగోలు చేసే ప్రయత్నం చేస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. ఈ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్న ప్రజలు వసంత చేష్టలను చూసి ఛీకొడుతున్నారు.



మైలవరం నియోజకవర్గంలో మైనర్లకు టీడీపీ కండువాలు కప్పిన చిత్రం (ఫైల్)



దేవినేని ఉమా, వసంత కృష్ణ ప్రసాద్ కలిసి ఉన్న ఫొటో

మైనర్లకు సైతం పార్టీ కండువాలు....

టీడీపీలో చేరికలు పేరుతో కొత్త నాటకానికి తెరలేపిన వసంత, పార్టీలో చేరేవారు లేకపోవడంతో ప్రచారానికి వెళ్లి ప్రతి గ్రామంలో చేరికల పేరుతో దశాబ్దాలుగా టీడీపీతోనే ఉన్న వ్యక్తులకు కండువాలు కప్పడం ప్రారంభించారు. అంతటితో ఆగకుండా ఒక్కొక్కరికి రూ.200, బిర్యానీలు ఆశ చూపి మరీ మైనర్‌లకు కండువాలు కప్పారని ఇటీవల ఆరోపణలు వెల్లువెత్తాయి. గతంలో టీడీపీలో చేరిన వ్యక్తులకే మరోసారి కండువాలు కప్పడం, ఇల్లు తప్ప బయటి ప్రపంచం తెలియని సొంత పార్టీకి చెందిన గృహిణులకు సైతం పార్టీ కండువాలు కప్పుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

దశాబ్దాలుగా రాజకీయ వైరం

దశాబ్దాలుగా రాజకీయ వైరం ఉండి వసంత వెంకటకృష్ణప్రసాద్‌తో పాటు ఆయన తండ్రి నాగేశ్వరరావు సైతం దేవినేని ఉమామహేశ్వరరావుపై పోటీ చేసి ఓడిపోయారు. దీనికి ప్రతీకారంగా ఉమాకి రాజకీయ భవిష్యత్తు లేకుండా చేయాలనే సంకల్పంతో వైఎస్సార్ సీపీలో చేరి 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనంతో గెలుపొందిన వసంత ఐదేళ్ల పాటు ఒకరిపై ఒకరు అనుచిత వ్యాఖ్యలు చేసుకున్నారు. అంతటితో ఆగకుండా వెంకటకృష్ణప్రసాద్‌పై దేవినేని ఉమామహేశ్వరరావు నాలుగు కేసులు పెట్టిస్తే, వసంత ప్రోద్బలంతో అతని అనుచరుడు డ్రైవర్ పెట్టిన కేసులో దేవినేని ఉమ జైలుకి సైతం పోయి వచ్చారు. దేవినేని ఉమా మైలవరం మాయలోడు అని వసంతను అంటే, వసంత మైలవరం వీరప్పన్ అని దేవినేని ఉమా ఘాటు వ్యాఖ్యలు చేయడంతో పాటు సగటు మనిషి వినలేని ఎన్నో మాటలు మాట్లాడుతూ ఒకరిపై ఒకరు దూషించుకున్నారు. అయితే నేడు సామాన్యుడు తిరుపతిరావుని వైఎస్సార్ సీపీ బరిలోకి దింపడంతో ఓటమి భయంతో వసంత తన ఆత్మగౌరవాన్ని సైతం తాకట్టుపెట్టి దేవినేనితో చేతులు కలపడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. స్వార్థ రాజకీయాల కోసం దిగజారితే చూస్తూ ఊరుకోబోమంటూ బాహాటంగానే చెబుతున్నారు. ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెబుతామని హెచ్చరిస్తున్నారు.

దివ్యాంగ విద్యార్థులకు సమగ్ర శిక్షణ

- 170 మందికి ఉపకరణాల నిర్ధారణ పరీక్షలు
- పథకాలు సద్వినియోగం చేసుకోవాలి
- సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ కె.రాములు నాయక్



ఉపకరణాల నిర్ధారణ శిబిరంలో వివరాలు నమోదు చేసుకుంటున్న తల్లిదండ్రులు

కంకిపాడు: దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు సమగ్రశిక్ష ద్వారా లభించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ కె.రాములు నాయక్ సూచించారు. దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల నిర్ధారణ శిబిరం కంకిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ రాములు నాయక్ మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థుల సంక్షేమానికి సమగ్రశిక్ష పాటుపడుతుందన్నారు. సమగ్ర శిక్ష ద్వారా ఇప్పటికే ఫిజియోథెరపీ క్యాంపులు, హోం బేస్డ్ విద్య, డిజిటల్ విద్యలో భాగంగా ట్యాబ్‌లు పంపిణీ, అలవెన్సులు అందుతున్నాయన్నారు. శిబిరంలో డాక్టర్ ఎం.జయకుమార్, డాక్టర్ బి.నాగజ్యోతి, డాక్టర్ ఎస్.సుధా ప్రసూజ, డాక్టర్ పి.తేజస్వి, డాక్టర్ వి.లావణ్య 170 మంది దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల నిర్ధారణ పరీక్షలు చేశారు. ఎంఈఓలు బీవీ శేషగిరిరావు, కేఎస్‌వీ ప్రసాద్, సహాయ సహిత విద్య సమన్వయకర్త ఏడుకొండలు, జిల్లా సెక్టోరల్ అధికారులు ఎస్.రాంబాబు, టి.నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ

- పార్లమెంట్‌కు 19 మంది
- ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 106 మంది నామినేషన్ల ఆమోదం
- వీడియో రికార్డింగ్ ద్వారా స్క్రూట్నీ



నామినేషన్ల స్క్రూట్నీలో కలెక్టర్ ఢిల్లీరావు, పరిశీలకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల పరిశీలన (స్క్రూట్నీ) ప్రక్రియ ముగిసింది. వీడియో రికార్డింగ్ ద్వారా అత్యంత పారదర్శకంగా నిర్వహించారు. నామినేషన్లు ఆమోదం పొందిన అభ్యర్థుల జాబితాలను రిటర్నింగ్ అధికారులు ఫారం -4 ద్వారా వెల్లడించారు. ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ పార్లమెంట్ స్థానానికి 34 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. 19 మంది అభ్యర్థుల నామినేషన్లు మాత్రమే ఆమోదం పొందాయి. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను మొత్తం 176 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో 106 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందగా మిగిలిన 70 మంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి.

- విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి గుర్తింపు పొందిన, రిజిస్టర్డ్, స్వతంత్ర అభ్యర్థులు మొత్తం 34 మంది నామినేషన్లు వేశారు. వీరిలో 19 మంది అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లు ఆమోదం పొందాయి. వివిధ కారణాల చేత 15 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించారు.
- తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 18 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో 13 మంది నామినేషన్లు ఆమోదం పొందగా 5 గురు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి.
- మైలవరం నియోజకవర్గంలో 27 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వీటిలో 12 మంది నామినేషన్లు చెల్లుబాటయ్యాయి. మిగిలిన 15 మంది నామినేషన్లు వివిధ కారణాలతో తిరస్కరించారు.
- జగ్గయ్యపేట నియోజకవర్గంలో 23 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా 14 మంది నామినేషన్లు ఆమోదం పొందాయి. 9 మంది నామినేషన్లు చెల్లుబాటు కాలేదు.
- నందిగామ నియోజకవర్గంలో మొత్తం 17 మంది నామినేషన్లు వేశారు. 11 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందాయి. 6 గురు అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించారు.
- విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో మొత్తం 38 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వీటిలో 17 మంది నామినేషన్లు చెల్లుబాటు కాగా 21 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి.
- విజయవాడ తూర్పు నియోజకవర్గంలో మొత్తం 27 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వీరిలో 17 మంది నామినేషన్లు ఆమోదం పొందాయి. మిగిలిన 10 మంది నామినేషన్లు తిరస్కరించారు.
- విజయవాడ సెంట్రల్‌కు సంబంధించి మొత్తం 26 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో 22 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందగా మిగిలిన 4 గురు అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించారు.

ఆహ్లాదకరంగా డంపింగ్ యార్డు



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో వర్మీ కంపోస్టు తయారీ తొట్టిలు



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం



డంపింగ్ యార్డు షెడ్డు చుట్టూ పూల మొక్కలు



డంపింగ్ యార్డులో కూరగాయ మొక్కల పెంపకం

- ప్రకృతి వ్యవసాయం కింద కూరగాయలు, ఆకుకూరల పెంపకం
- వర్మీ కంపోస్టు సిద్ధం

పెనుగంచిప్రోలు: డంపింగ్ యార్డు అంటే దుర్వాసన.. ఎక్కడ చూసిన వ్యర్థాలు, అపరిశుభ్ర వాతావరణం అనే భావన ఉంటుంది. మండల కేంద్రం పెనుగంచిప్రోలులో మాత్రం అందుకు భిన్నంగా గ్రామ పంచాయతీ నిర్వహణలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ఎంతో సుందరంగా తీర్చిదిద్దుకుంటోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎటువంటి ఆలనాపాలనా లేకుండా మురుగు కూపంగా ఉన్న ఈ కేంద్రం నేడు సర్పంచి వేల్పుల పద్మకుమారి ఆధ్వర్యంలో దినదినాభివృద్ధి చెందుతోంది. డంపింగ్ యార్డు అంటే కేవలం చెత్త సేకరణ కేంద్రంగానే కాకుండా చూడగానే ఆహ్లాదం అందించే కేంద్రంగా మార్చామని, స్వచ్ఛ గ్రామంగా తీర్చి దిద్దేందుకు మొక్కలు నాటి సంరక్షిస్తున్నామంటారు పద్మకుమారి.



తయారైన వర్మీ కంపోస్టు

పూల మొక్కలు, కూరగాయల సాగుతో ఆహ్లాదకర వాతావరణం..

చెత్త సంపద కేంద్రం చుట్టూ అందమైన పూల మొక్కలు వేయడంతో ఆహ్లాదకర వాతావరణం కనిపిస్తోంది. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఏటీఎం కార్యక్రమం కింద పలు రకాల కూరగాయలు, ఆకుకూరల సాగు చేపట్టారు. దీంతో ప్రకృతి వ్యవసాయ సాగుతో పాటు అదనపు ఆదాయం కూడా సమకూరనుంది. గతంలో వంగ, టమాటా, ఆకుకూరలు, బంతిపూలు కూడా సాగు చేసి పంచాయతీకి ఆదాయ మార్గాలు అన్వేషించారు.

వర్మీ కంపోస్టు ఎరువు తయారీ..

యార్డులో నాడెప్ తొట్లు, వర్మీ కంపోస్టు తయారీకి పిట్లు ఏర్పాటు చేశారు. గ్రామంలో తడి, పొడి చెత్త వేరు చేసి తెచ్చేందుకు 250 ఇళ్లకు ఒక క్లాప్ మిత్ర చొప్పున గ్రామంలో మొత్తం 16 మంది ఉన్నారు. వారు తెచ్చిన అన్నం, కూరగాయల వ్యర్థాలు వంటి తడి చెత్తను నాడెప్ తొట్లలో 60 రోజుల పాటు కుళ్ల పెట్టడం జరుగుతుంది. తర్వాత దానిని మరో తొట్టిలో వేసి పైన పేడతో కప్పడం జరుగుతుంది. 20 రోజుల తర్వాత వానపాములు వేసి పైన పట్టాలు కప్పి తడపటంతో వర్మీ కంపోస్టు తయారవుతుంది. ప్రస్తుతం నాణ్యమైన వర్మీ కంపోస్టు ఎరువు సిద్ధంగా ఉంది. కిలో రూ. 10 చొప్పున కావలసిన రైతులకు విక్రయించడం జరుగుతుందని సర్పంచి తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలి సూచించారు.

దుర్గగుడిలో దాతల కోసం ప్రత్యేక సెల్



అమ్మ వారి చిత్రపటానికి పూజలు చేస్తున్న కమిషనర్ సత్యనారాయణ, ఈవో



ఈవో రామరావుకు విరాళం అందజేస్తున్న కడియాల వంశీకృష్ణ దంపతులు

- తొలి రోజే భారీగా విరాళాలు
- స్వర్ణశోభితం కానున్న అమ్మవారి ఆలయం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో దాతల కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని సమాచార కేంద్రం సమీపంలో ఈ సెల్‌ను నెలకొల్పారు. ప్రత్యేక సెల్‌కు దేవదాయ శాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అమ్మవారి చిత్రపటానికి ఈవో రామరావుతో కలిసి పూజలు చేశారు. అమ్మవారి ఆలయం బంగారు తాపడం పనుల నిమిత్తం డోనర్ సెల్‌లో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం పలువురు భక్తుల నుంచి విరాళాలు సేకరించారు. అమ్మవారి ఆలయ బంగారు తాపడం పనులకు సంబంధించి పోస్టర్‌ను కమిషనర్ ఆవిష్కరించారు. బంగారు తాపడం పనులకు ఈఈ కోటేశ్వరరావు రూ.1,01,116 విరాళాన్ని కమిషనర్ సత్యనారాయణ, ఈవో రామరావుకు అందచేశారు. మొర్ల వెంకట శివరామకృష్ణ రూ. 1,01,116, విజయవాడకు చెందిన కడియాల వంశీకృష్ణ రూ. 10 లక్షల విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం తర్వాత దాతలకు ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టువస్త్రాలు అందించారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి మోడరన్‌ పెంటాథ్లాన్‌కు 'రౌతు'



గన్నవరం: జాతీయ స్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య మోడరన్‌ పెంటాథ్లాన్‌ అండర్‌–19 పోటీలకు స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎస్‌.రవీంద్రభవాని శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల తిరుపతిలో జరిగిన అంతర్‌ జిల్లాల పెంటాథ్లాన్‌ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థి రౌతు రాకేష్‌ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచినట్లుగా పేర్కొన్నారు. అతని ప్రతిభను గుర్తించిన సెలక్టర్లు మహారాష్ట్రలోని అమరావతిలో ఈ నెల 27 నుంచి జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారని తెలిపారు. ఈ సందర్భంగా రాకేష్‌తో పాటు అతనికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ విద్య ఉపాధ్యాయులు ధనియాల నాగరాజు, మీరాసాహెబ్‌ను ఉపాధ్యాయ బృందం అభినందించినట్లుగా పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

పెనమలూరు: గంగూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి రామాపురంకాలనీ ప్రాంతానికి చెందిన కందుల లింగయ్య(70) విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిపై పోరంకి నుంచి సైకిల్‌ పై కంకిపాడుకు వెళ్తున్నారు. కరెంట్‌ ఆఫీస్‌ సమీపంలో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీ కొట్టింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన లింగయ్యను 108 వాహనంలో పటమటలో ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

దుర్గగుడి నూతన యాగశాలలో పూజలు

హాజరైన ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్‌



యాగశాలలో నిర్వహించిన హోమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌.కరికాల వలవన్‌, కమిషనర్‌ సత్యనారాయణ, ఈవో రామరావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో కొత్తగా నిర్మించిన యాగశాలలో శుక్రవారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాధాకృష్ణుల విగ్రహం వద్ద దేవస్థానం యాగశాల నిర్మాణం చేపట్టింది. ఇక్కడ పూజా కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌.కరికాల వలవన్‌, దేవదాయ శాఖ కమిషనర్‌ ఎస్‌.సత్యనారాయణ విచ్చేశారు. తొలుత ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించి నూతన యాగశాలలోకి ప్రవేశించారు. అనంతరం యాగశాల పద్మపీఠంపై ఆలయ అర్చకులు గణపతి పూజ, కలశస్థాపన వాస్తు హోమం అనంతరం చండీహోమం చేశారు. దేవస్థాన స్థానాచార్య శివప్రసాద్‌శర్మ, ఆలయ వైదిక కమిటీ సభ్యులు యజ్ఞనారాయణమూర్తి, మురళి, ఇతర అర్చకులు హోమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. చండీహోమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కమిషనర్‌, ఆలయ ఈవో కె.ఎస్‌.రామరావు, యాగశాల నిర్మాణ దాత సంగా నరసింహారావు, విజయలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. అనంతరం యాగశాలలో జగన్మాత స్వరూపానికి అక్షర స్వరూపంగా శ్రీమహాభాగవతం పుస్తకాన్ని కరికాల వలవన్‌, సత్యనారాయణ ఆవిష్కరించి భక్తులకు, ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం పూర్ణాహుతిని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. నూతన యాగశాల నిర్మాణానికి సహకరించిన దాత సంగా నరసింహారావు, విజయలక్ష్మి దంపతులను ఆలయ ఈవో కె.ఎస్‌.రామరావు శాలువా కప్పి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. మరో నెల కాలంలో తుది మెరుగులు దిద్దుకుని పూర్తి స్థాయిలో యాగశాల అందుబాటులోకి రానుందని ఆలయ అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ కోటేశ్వరరావు, ఎల్‌. రమాదేవి, ఏఈవోలు ఎన్‌. రమేష్‌ బాబు, చంద్రశేఖర్‌, దేవదాయ శాఖ స్థపతి పి.పరమేశ్వరప్ప, ఆలయ స్థపతి కె.షణ్ముఖ వెంకటేష్‌, డీఈ వెంకటేశ్వరావు, ఏఈ అశోక్‌, ఇంజినీరింగ్‌ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



యాగశాల నిర్మాణ దాత నరసింహారావును సత్కరిస్తున్న ఈవో రామరావు

కారు, ఆటో ఢీ

10 మందికి గాయాలు

పెనుగంచిప్రోలు: కారు, ఆటో ఢీకొన్న ఘటనలో 10 మంది గాయపడిన ఘటన మండల పరిధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. గ్రామంలో ఒక పెళ్లికి హాజరైన వారు కారులో వత్సవాయి మండలం మక్కపేట వైపు వెళ్తూ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టారు. రెండు వాహనాలు బోల్తా కొట్టాయి. ప్రమాదంలో కారు బెలూన్లు ఓపెన్‌ అయ్యాయి. ఆటో నడుపుతున్న మక్కపేట గ్రామానికి చెందిన డేవిడ్‌తో పాటు ఆటో, కారులో ప్రయాణిస్తున్న 10 మందికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్‌ రెంటాల డేవిడ్‌, ఆటోలో ప్రయాణిస్తున్న పెనుగంచిప్రోలుకు చెందిన చల్లా తిరుపతమ్మ, ఉప్పుతోల సరిత, కొరదల బిందు, పాత కంచలకు చెందిన బత్తుల ఈశ్వరమ్మ, ఖమ్మం జిల్లా అప్పగుర్తికి చెందిన బాలగని కృపావతి, బాలగాని అఖిల, గుడిబండకు చెందిన బత్తుల నర్మద, ఖమ్మంకు చెందిన బోడెపూడి రాజ్యలక్ష్మి, లక్ష్మీపురం గ్రామానికి చెందిన బి.సత్యవతిలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి అనంతరం ఏడుగురిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి, ముగ్గురిని ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ పి. రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌బీఐ హోం లోన్‌ బ్రాంచి ప్రారంభం



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తమ బ్యాంకు సిబ్బంది హోంలోన్స్‌ను సాధ్యమైనంత త్వరగా సులభతరంగా మంజూరు చేస్తారని స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా (ఎస్‌బీఐ) అమరావతి ప్రధాన కార్యాలయం చీఫ్‌ జనరల్‌ మేనేజర్‌ నవీన్‌ చంద్ర ఝూ చెప్పారు. విజయవాడ ఎంజీ రోడ్డులోని ఎస్‌బీఐ హోం లోన్‌ బ్రాంచ్‌ను నవీన్‌ చంద్ర ఝూ శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహరుణాలను తక్కువ వడ్డీ రేట్లకు అందజేస్తున్నామని చెప్పారు. ఎస్‌బీఐ అందించే రుణాల గురించి తమ బ్యాంకు ఏ బ్రాంచిలోనైనా సంప్రదించవచ్చని చెప్పారు. ఇప్పటికే తమ వద్ద రుణాలు తీసుకున్న ఖాతాదారులు, అవసరమైన వారిని తమ బ్యాంకుకు తీసుకువచ్చి బ్యాంకు సిబ్బందికి పరిచయం చేసి ఎస్‌బీఐ వ్యాపారాభివృద్ధికి సహకరించాల్సిందిగా ఆయన కోరారు. ఎస్‌బీఐ విజయవాడ బ్రాంచ్‌ డీజీఎం మనీష్‌ కుమార్‌ సింగ్‌, ఏజీఎం వీవీ జగదీష్‌కుమార్‌, బ్యాంకు ఉద్యోగులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

29న సీఎం వైఎస్‌. జగన్‌ బహిరంగ సభ



ఏర్పాట్లపై చర్చిస్తున్న కిలారి రోశయ్య, తలశిల, లేళ్ల అప్పిరెడ్డి, అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 29వ తేదీన పొన్నూరుకు రానున్నారు. పట్టణంలోని అంబేడ్కర్‌ సెంటర్‌లో జరగనున్న భారీ బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. సీఎం సభ ఏర్పాట్లను వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణలు శుక్రవారం పరిశీలించారు. 29న మధ్యాహ్నం 3 గంటలకు అంబేడ్కర్‌ సెంటర్‌లో జరిగే బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తలశిల రఘురాం విలేకరులతో మాట్లాడుతూ సీఎం వైఎస్‌ జగన్‌ పాల్గొనే బహిరంగ సభకు పెద్దసంఖ్యలో ప్రజలు హాజరవుతున్న నేపథ్యంలో అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్‌ జగన్‌ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ పొన్నూరు నియోజకవర్గ ప్రజలను పలకరించేందుకు సీఎం వైఎస్‌. జగన్‌మోహన్‌ రెడ్డి ఈ నెల 29న వస్తున్నారని తెలిపారు.

టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్నిపై ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు అందజేస్తున్న గౌస్‌ మొహిద్దీన్‌

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన విజయవాడ పార్లమెంట్‌ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్‌(చిన్ని)పై చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్‌ జిల్లా వక్ఫ్‌బోర్డ్‌ చైర్మన్‌ షేక్‌ గౌస్‌ మొహిద్దీన్‌ కోరారు. ఈ మేరకు ఆయన వైఎస్సార్‌ సీపీ లీగల్‌ టీం సభ్యుడు సత్యనారాయణ రెడ్డి, పార్టీ నాయకుడు షేక్‌ కరీముల్లాతో కలిసి శుక్రవారం భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గౌస్‌ మొహిద్దీన్‌ మాట్లాడుతూ కేశినేని చిన్ని ప్రచారంలో ఎన్నికల నియమావళిని అడ్డగోలుగా ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల పశ్చిమ నియోజకవర్గం భవానీపురంలో తన సోదరి శ్రీదేవితో ఎన్నికల ప్రచారం చేయించిన సందర్భంలో ఆమె స్థానిక ముస్లిం మహిళలను ఉద్దేశించి 'మీకు అల్లా ఎంతో టీడీపీ కూడా అంతేనని, అల్లాతో సమానంగా టీడీపీని చూడాలి' అంటూ అల్లాను కించపరచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రపంచంలో ఏ వ్యక్తిగానీ, సంస్థగానీ, పార్టీగానీ అల్లాకు సమానం కాలేరని, అటువంటి అల్లాను నమ్మినట్లుగానే టీడీపీని నమ్మాలని శ్రీదేవి చెప్పడం వెనుక కేశినేని శివనాథ్‌(చిన్ని) కుట్ర ఉందని పేర్కొన్నారు. ఇది తప్పనిసరిగా ఎన్నికల నియమావళి ఉల్లంఘన కిందకు వస్తుందని తెలిపారు. అల్లాహ్‌ సాక్షిగా టీడీపీకి ఓటెయ్యాలని ఆమె ప్రమాణాలు చేయించడం పూర్తిగా ఎన్నికల నియమావళిని తుంగలో తొక్కినట్లేనన్నారు. ఇందుకు సంబంధించిన తగిన ఆధారాలను (వీడియో) పోలీసులకు సమర్పించామని చెప్పారు. సంఘటనపై శ్రీదేవి, కేశినేని శివనాథ్‌(చిన్ని)పై చర్యలు తీసుకోవాలని కోరారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని



నెమలిలో వైఎస్సార్‌ సీపీలో చేరిన దేవస్థానం మాజీ చైర్మన్‌ రామాంజనేయులుకు కండువా కప్పుతున్న కేశినేని నాని, స్వామిదాసు

గంపలగూడెం: ఏపీలో జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని వైఎస్సార్‌ సీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని అన్నారు. ఆయన ఎన్నికల పర్యటనలో భాగంగా తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసుతో కలసి మండలంలోని ఉమ్మడదేవరపల్లి, నెమలి, కొణిజెర్ల, ఊటుకూరు గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ 650 హామీలు ఇచ్చి ఏ ఒక్కదాన్ని అమలుచేయకుండా మోసగించిన చంద్రబాబు నాయుడిని, ఆ పార్టీని రాష్ట్ర ప్రజలు మరచిపోయారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన వాటినే కాకుండా ప్రజా సంక్షేమానికి ఎక్కువ పథకాలను అమలుచేసిన ఘనత జగనన్నదే అన్నారు. దేశానికే ఆదర్శవంతమైన సంక్షేమ పథకాలను అమలుచేసిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా హృదయాల్లో నిలిచిపోయారని తెలిపారు. జగన్‌ మోహన్‌రెడ్డిని ప్రజలు అన్నగా, యువత మామయ్యగా పోల్చుకుని గుండెల్లో పెట్టుకున్నారన్నారు. అలాంటి వ్యక్తిని ప్రజలు హృదయాల నుంచి తొలగించడం ఎవరికీ సాధ్యం కాదని తెలిపారు. కరోనా లాంటి క్లిష్టపరిస్థితుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలను ఆయన తీసుకున్నారని కొనియాడారు. మే 13న జరిగే సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలో 175 శాసన సభ స్థానాలను, 25 పార్లమెంట్‌ స్థానాలను వైఎస్సార్‌ సీపీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని ఏడు శాసనసభ స్థానాల్లో వైఎస్సార్‌ సీపీ అభ్యర్థులు విజయఢంకా మోగిస్తారన్నారు. నెమలిలో శ్రీ వేణుగోపాలస్వామి మాజీ చైర్మన్‌ మైలవరపు రామాంజనేయులు పార్టీలో చేరగా కేశినేని నాని శాలువా కప్పి ఆహ్వానించారు. ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కోట శామ్యూల్‌, వైఎస్సార్‌ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కావూరి వినయ్‌కుమార్‌, మండల పార్టీ అధ్యక్షులు చావా వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు చెరుకు నర్సారెడ్డి, గోగులమూడి చెన్నాకేశవ రెడ్డి, ఆలపాటి ఉమామహేశ్వరరావు, బొల్లా కరుణాకరరావు, యనమద్ది నాగమల్లేశ్వరరావు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ చైర్మన్లు, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఈ ఏడాది రూ. 1,350 కోట్ల టర్నోవర్‌ లక్ష్యం

విజయ డెయిరీ పాలక వర్గ సమావేశంలో చైర్మన్‌ ఆంజనేయులు



రిషితను సత్కరిస్తున్న డెయిరీ చైర్మన్‌, పాలక వర్గ సభ్యులు, అధికారులు

చిట్టినగర్‌(విజయవాడపశ్చిమ): గత ఆర్థిక సంవత్సరం రూ. 1,200 కోట్ల టర్నోవర్‌ సాధించిన కృష్ణా మిల్క్‌ యూనియన్‌, ఈ ఏడాది రూ. 1,350 కోట్ల టర్నోవర్‌ లక్ష్యంగా ముందుకు సాగుతుందని చైర్మన్‌ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. ది కృష్ణా మిల్క్‌ యూనియన్‌ (విజయ డెయిరీ) పాలక వర్గ సమావేశం శుక్రవారం పాలప్రాజెక్టు ఆవరణలోని బోర్డు మీటింగ్‌ హాల్లో జరిగింది. సమావేశంలో చైర్మన్‌ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వర్‌ బాబు, ఇతర పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం చైర్మన్‌ చలసాని ఆంజనేయులు మీడియాతో మాట్లాడారు. గత ఏడాది రూ. 1,200 కోట్ల టర్నోవర్‌, తొమ్మిది శాతం వృద్ధితో పాటు 8 శాతం పాల సేకరణ పెరిగిందన్నారు. ఈ ఏడాది రూ. 1,350 కోట్ల టర్నోవర్‌ లక్ష్యంగా అందరూ పని చేస్తామన్నారు. ఏ సంస్థైనా గత ఏడాది ఏ మేర పని చేశామనే చర్చించుకుంటాయని, కృష్ణా మిల్క్‌ యూనియన్‌ మాత్రం ఈ ఏడాది కచ్చితంగా ఇంత వృద్ధి సాధించాలనే లక్ష్యంతో నిర్దిష్టంగా పని చేస్తుందన్నారు. ప్రతి 15 రోజులకు పాడి రైతులకు బిల్లుల చెల్లింపుతో పాటు 4 నెలలకు ఒకసారి కచ్చితంగా బోనస్‌ ఇస్తోంది కృష్ణా మిల్క్‌ యూనియన్‌ ఒక్కటేనన్నారు.

పాడి రైతు బిడ్డకు రూ. 35 వేలు ప్రోత్సాహకం

కృష్ణా జిల్లా పెదపారపూడి మండలం వెంట్రప్రగడ గ్రామానికి చెందిన కృష్ణా మిల్క్‌ యూనియన్‌ పాడి రైతు కొల్లిపల్లి తిరుమలరావు కుమార్తె కొల్లిపల్లి రిషిత ఈ ఏడాది విడుదలైన ఇంటర్‌ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. శుక్రవారం నిర్వహించిన బోర్డు సమావేశంలో రిషితతో పాటు ఆమె తండ్రి తిరుమలరావును చైర్మన్‌, ఇతర పాలక మండలి సభ్యులు శాలువాతో సత్కరించారు. పాడి రైతు కుమార్తె 470 మార్కులకు గాను 466 మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. మిల్క్‌ యూనియన్‌ తరఫున రూ. 25 వేలు, వెంట్రప్రగడ సంఘం తరఫున సంఘ అధ్యక్షులు చలసాని చక్రపాణి రూ. 10 వేల చెక్కులను అందచేశారు. పాడి రైతుల బిడ్డలు ఉన్నత విద్యను అభ్యసించడానికి విజయ డెయిరీ సాయం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బోర్డు డైరెక్టర్లు, సమితి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నగదు పంపిణీ వ్యవహారంలో నలుగురు టీడీపీ నేతలపై కేసు



పాస్టర్లకు నగదు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు (ఫైల్‌)

నందిగామ: నియోజకవర్గంలోని పలువురు పాస్టర్లను ప్రలోభాలకు గురిచేస్తూ నగదు పంపిణీ చేస్తున్న వ్యవహారంలో నలుగురు టీడీపీ నాయకులపై నందిగామ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై దుర్గామహేశ్వరరావు తెలిపిన సమాచారం ప్రకారం పట్టణ శివారులో మున్నేటి తీరంలోని ఆర్‌ఎస్‌ గార్డెన్స్‌లో గురువారం టీడీపీ నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. దీని తర్వాత పలువురు పాస్టర్లకు టీడీపీ నాయకులు నగదు పంపిణీ చేస్తున్నారని ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో టీడీపీ నేతలు ఉన్నం నరసింహారావు, ఏచూరి రాము, కత్తురోజు శ్రీనివాసాచారి, ఐలపోగు ప్రశాంత్‌లపై పలు సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆగిఉన్న లారీని మరో లారీ ఢీ

డ్రైవర్‌ మృతి

కంచికచర్ల : రోడ్డు పక్కన ఆగిఉన్న లారీని వెనుక నుంచి వస్తున్న మరో లారీ ఢీకొనగా డ్రైవర్‌ మృతి చెందారు. ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ పెంకె వెంకట సత్యసుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల ప్రకారం జగ్గయ్యపేట కాకానినగర్‌కు చెందిన సోమరోతు వెంకటేశ్వరరావు(57) ట్యాంకర్‌ డ్రైవర్‌. ఇబ్రహీంపట్నంలోని వీటీపీఎస్‌కు వెళ్తున్న ట్యాంకర్‌ మండలంలోని పరిటాల బైపాస్‌ రోడ్డు వద్దకు రాగానే రోడ్డు పక్కన ఆగిఉన్న లారీని ఢీకొట్టింది. ఘటనలో వెంకటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. ట్యాంకర్‌ ముందుభాగం నుజ్జునుజ్జైంది. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పుట్టెంట్రుకలకు రూ.516..?

- కేశ ఖండనశాలలోల అక్రమ వసూళ్లపై భక్తుడి ఫిర్యాదు
- ఈవో దృష్టికి 'వసూళ్ల' వ్యవహారం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): చిన్నారి పుట్టెంట్రుకలు తీయడానికి రూ.516తోపాటు మేనమామ మేనల్లుడికి దిష్టితీసి డబ్బులు ఇవ్వాలంటూ డిమాండ్‌ చేసిన నాయీ బ్రాహ్మణుడిపై ఓ భక్తుడు ఆలయ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారం గురువారం ఉదయం జరగగా, దీనిపై ఆలయ ఈవో కె.ఎస్‌.రామరావు సీరియస్‌ అయ్యారు. జరిగిన విషయాన్ని పూర్తిగా విచారణ చేయాలని సంబంధిత శాఖ అధికారులను కోరారు. ఈ వ్యవహారంలో కేశఖండనశాల ఏఈవో, సూపరింటెంటెంట్‌ డబ్బులు తీసుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాల్సి ఉండగా, ఆ వ్యక్తిని కాదని మరో ఇద్దరిపై కావాలనే కక్ష సాధింపు చర్యలు తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఆ ఇద్దరూ శుక్రవారం ఆలయ ఈవోను కలిసి జరిగిన విషయాన్ని తెలియజేశారు. వివరాల్లోకి వెళితే.. అమలాపురానికి చెందిన కొప్పిశెట్టి శేఖర్‌ కుటుంబం కనకదుర్గమ్మ దర్శనానికి ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. వారు అమ్మవారికి తలనీలాలు సమర్పించడానికి కేశఖండనశాలకు వెళ్లారు. కౌంటర్‌లో శేఖర్‌ తనతో పాటు ఇద్దరు పిల్లలకు గుండ్లు, ఆడవారికి కత్తెర్లు ఇవ్వడానికి ఐదు టోకెన్లు తీసుకున్నారు. అనంతరం మొదటి అంతస్తుకు చేరుకోగా అక్కడి ఆలయ సిబ్బంది శేఖర్‌ను 22 నంబర్‌ కౌంటర్‌కు వెళ్లాల్సిందిగా సూచించారు. ఆ సమయంలో 22, 23 నంబర్ల కౌంటర్లలో తలనీలాలు తీసే వ్యక్తులు లేరు. అ పక్కనే ఉన్న 24వ నంబర్‌ కౌంటర్‌లో విధులు నిర్వహిస్తున్న పమ్మి నగేష్‌ తాను తలనీలాలు తీస్తానని చెప్పాడు. 22, 23 కౌంటర్లలోని వారిద్దరూ టిఫిన్‌కు వెళ్లారని, వారి టోకెట్లు కూడా తానే చేస్తున్నట్లు నగేష్‌ ఆ భక్తుడితో పేర్కొన్నాడు.

అదనంగా ఇవ్వాలని..

శేఖర్‌ తన 8 నెలల చిన్న కుమారుడికి తలవెంట్రుకలు తీయాలని కోరగా, నగేష్‌ రూ.516 ఇవ్వాలని అడిగాడు. శేఖర్‌ అంత ఇచ్చుకోలేనని రూ. వంద తీసుకుని పుట్టెంట్రుకలు తీయాలని అడిగాడు. దీనికి ససేమిరా అన్న నగేష్‌ ఆ చిన్నారి మేనమామ వచ్చి డబ్బులు దిష్టి తీసి కూడా అదనంగా ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. దీంతో శేఖర్‌ రూ. 516 ఇచ్చి మిగిలిన వారికి రూ. 50 చొప్పున ఇచ్చి తలవెంట్రుకలు సమర్పించారు. ఈ వ్యవహారంపై అక్కడే ఉన్న సిబ్బంది దృష్టికి తీసుకెళ్లగా, ఫిర్యాదుల పుస్తకంలో రాయాలని సూచించారు. తన ఊరు నుంచి విజయవాడకు బస్సు టికెట్‌ రూ. 375 మాత్రమేనని, అంత కంటే ఎక్కువ డబ్బులు పుట్టెంట్రుకలు తీసేందుకు తీసుకోవడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు.

భక్తుడి ఫిర్యాదు

జరిగిన విషయం మొత్తం ఫిర్యాదు నమోదు చేయడమే కాకుండా విచారణ నిమిత్తం తన ఫోన్‌ నంబర్‌ సైతం ఇచ్చి వెళ్లారు. ఈ వ్యవహారంపై కేశఖండనశాల ఏఈవో జంగం శ్రీనివాస్‌, సూపరింటెండెంట్‌ డీవీవీ సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేస్తూ 22, 23వ నంబర్‌ కౌంటర్లలో విధులు నిర్వహించే సంతోష్‌, సూరిబాబుల డ్యూటీ నిలుపు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంలో సంబంధం లేని తమ డ్యూటీలు ఎలా నిలుపు చేస్తారని వారు ప్రశ్నించారు. దీంతో శుక్రవారం నగేష్‌ డ్యూటీ కూడా నిలిపేసినట్లు తెలుస్తోంది. సెక్షన్‌లో కీలకంగా వ్యవహరించే ఏఈవో, సూపరింటెంటెంట్లు కావాలనే 22, 23వ కౌంటర్లలో వారిని నిలిపివేసినట్లు కేశఖండనశాలలో ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారం ఆలయ ఈవో రామరావు దృష్టికి వెళ్లడంతో సదరు అధికారుల నుంచి వివరణ అడిగారు. ఆలయ ఈవోని కలిసి జరిగిన వ్యవహారంతో పాటు కేశఖండనశలలో ఏం జరుగుతుందో వివరించామని ఇద్దరు నాయీ బ్రాహ్మణులు పేర్కొంటున్నారు.



క్లుప్తంగా

అభివృద్ధి చేసిన వారిని ఆదరించండి



లబ్బీపేట(విజయవాడతూర్పు): నాలుగున్నరేళ్లుగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేసిన వారిని ఆదరించాలని, రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేయాలని వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ సోదరి దేవినేని క్రాంతి అన్నారు. ఆమె శుక్రవారం 9, 13, 19వ డివిజన్‌లలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ప్రజలకు మంచి చేసిన వారిని ఆశీర్వదించాలన్నారు. రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావాల్సిన అవసరాన్ని తెలియజేశారు. మోసపూరిత హామీలు ఇవ్వకుండా, ఇచ్చిన హామీలు నెరవేర్చేవారిని ఆదరించాలన్నారు. ఆమె వెంట ప్రచారంలో ఆ డివిజన్ ఇన్‌చార్జి వల్లూరు ఈశ్వరప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు గద్దె కల్యాణ్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆటోనగర్(విజయవాడతూర్పు): స్క్యూబ్రిడ్జి సెక్షన్ పరిధిలోని విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ తెలిపారు. పకీరుగూడెం, ప్రగతినగర్, శ్రీరాం నగర్, చంద్రమౌళిపురం, ఎంజీ రోడ్డు బెంజిసర్కిల్ ప్రాంతంతో పాటు మైత్రేయవీధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని, వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

బ్యాడ్మింటన్‌లో విద్యార్థుల ప్రతిభ



పటమట(విజయవాడతూర్పు): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని పటమట ఎన్ఆర్ఐ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి చైతన్య అన్నారు. ఎస్ఎస్ దండమూడి రాజగోపాలచారి స్టేడియంలో జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో తమ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలవటం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. శుక్రవారం పోటీల్లో గెలుపొందిన 8వ తరగతి చదువుతున్న సయ్యద్ హజైఫా, సాయి సందీప్‌లను అభినందించారు. ప్రిన్సిపాల్ లక్ష్మణరావు, కోచ్ గంగాధరరావు, పాఠశాల ఇన్‌చార్జి తుషార తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఊంజల్ సేవ



గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలో వేం చేసి ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం ఊంజల్ సేవ కార్యక్రమం నిర్వహించారు. శ్రీసీతారాముల కల్యాణం జరిగి పదహారు రోజులు పూర్తయ్యిన సందర్భంగా ఆలయ అర్చకుడు ఎన్.రామాచార్యులు నేతృత్వంలో ఈ వేడుక జరిపారు. తొలుత స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, విశేష అర్చనలు నిర్వహించారు. భక్తులచే శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం, ద్వాదశ ప్రదక్షిణలు జరిపారు. అనంతరం భక్తుల గీతాలాపన మధ్య శ్రీసీతారామచంద్ర స్వామివారికి పల్లకి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసమారాధన చేశారు. పలువురు పుర ప్రముఖులు, పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సాయి గీతామందిర వార్షికోత్సవం



పెనమలూరు: కానూరులో శుక్రవారం సాయి గీతామందిరం 26వ వార్షికోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జామున 5.15 గంటలకు కాగడా హారతి, 6.10 గంటలకు 108 లీటర్ల ఆవుపాలతో అభిషేకం, ఉదయం 8.30 గంటలకు పల్లకీపూజ, అనంతరం మల్లెలార్చన, మధ్యాహ్నం 12 గంటలకు హారతి బాబాకు ఇచ్చారు. తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ వెంకటేశ్వరరావు బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు షిర్డీ సాయి బాబాను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఐదు వేల మంది భక్తులను అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

జెండా.. అజెండా.. అభివృద్ధే

- ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి దేవినేని అవినాష్
- చేసిన మంచిని చూపుతూ ఓట్లు అభ్యర్థిస్తున్న వైనం
- రూ.650 కోట్లతో అభివృద్ధి, రూ. 924 కోట్ల మేర సంక్షేమం ఇచ్చామంటూ ప్రజల్లోకి..



విజయీభవ.. ప్రచారంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతున్న అవినాష్‌ను దీవిస్తున్న వృద్ధురాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నియోజకవర్గంలో ఐదేళ్లుగా చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలను ఉటంకిస్తూ, రానున్న రోజుల్లో చేయబోయే పనులను వివరిస్తూ వైఎస్సార్ సీపీ తూర్పు అభ్యర్థి దేవినేని అవినాష్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ప్రజలకు చేసిన మంచిని చెబుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఆయనతో పాటు, ఆయన భార్య దేవినేని సుధీర, సోదరి దేవినేని క్రాంతి నియోజకవర్గంలో రోజుకు ఐదారు డివిజన్‌లలో ప్రచారంతో చుట్టేస్తున్నారు. వీరితో పాటు వైఎస్సార్ సీపీ విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ కుమార్తెలు శ్వేత, హైమాలు ప్రచారంలో పాల్గొంటున్నారు.

ఇంటింటికీ సంక్షేమం..

తూర్పు నియోజకవర్గంలో నవరత్నాల ద్వారా రూ.924 కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశామని.. మరో రూ.300 కోట్లు విలువైన ఇంటి స్థలాలను 32,211 కుటుంబాలకు అందించామని అవినాష్ ప్రజలకు వివరిస్తున్నారు. గతంలో ఏ నాయకులు, ఏ ప్రభుత్వం అందించని విధంగా, సిఫార్సులకు, రాజకీయాలకు తావు లేకుండా సంక్షేమ పథకాలు అందించిన తీరును గుర్తు చేస్తున్నారు.

దమ్ముగా అభివృద్ధిని చూపుతూ..

టీడీపీ అభ్యర్థి గద్దె రామ్మోహన్ పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న తూర్పులో చేసిన అభివృద్ధి ఏమీ లేదని.. కానీ తాను కేవలం పార్టీ ఇన్‌చార్జిగా ఉంటూ సీఎం జగన్ తోడ్పాటుతో రూ. 650 కోట్లతో అభివృద్ధి చేశామని వివరిస్తున్నారు. రూ.370 కోట్లతో రిటైనింగ్ వాల్, రూ.120 కోట్లతో బెంజిసర్కిల్ రెండో ఫ్లై ఓవర్, నాడు–నేడులో స్కూళ్ల అభివృద్ధి, రూ.20 కోట్లతో అధునాతన సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేశామని చెబుతున్నారు. నియోజకవర్గంలోని రూ.150 కోట్లతో 21 డివిజన్‌లలో చేసిన అభివృద్ధి పనులను లెక్కలు, చిత్రాలతో సహా చూపుతూ ప్రచారంలో దూసుకెళ్తున్నారు.

ప్రత్యర్థుల ఆరోపణలు తిప్పికొడుతూ..

తాము చెప్పుకునేందుకు ప్రజలకు చేసింది ఏమీ లేక టీడీపీ నేతలు అబద్ధాలు, అసత్య ప్రచారాలతో నిత్యం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని చెబుతున్న అవినాష్.. వారి ఆరోపణలు తిప్పికొడుతూ ప్రజల్లోకి వెళ్తున్నారు. వాళ్లు చేస్తున్న గారడీలు, మాయలను ప్రజలకు వివరిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలోనే సంచలనంగా మారిన కాల్‌మనీ సెక్స్‌రాకెట్‌కు కేంద్ర బిందువు తూర్పు నియోజకవర్గమే కాక, అందులో సూత్రధారులెవరో కూడా ప్రజలకు వివరిస్తూ మంచి మనస్సున్న వారినే ఆదరించాలని కోరుతున్నారు.

నిత్యం ప్రజల్లోనే..



దేవినేని అవినాష్ నిత్యం ప్రజల్లోనే, ప్రజల మధ్యనే ఉంటూ, వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నారు. వాటిలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించినవి ఎన్నో ఉన్నాయి. ప్రజల్లో ఉండే వ్యక్తినే గెలిపించేందుకు తూర్పు ప్రజలు సైతం నిర్ణయించుకున్నారు.

– చోడిశెట్టి సుజాత, మాజీ కార్పొరేటర్

చేసిందే చెబుతున్నారు..



నియోజకవర్గంలో నాలుగున్నరేళ్లుగా చేసిన అభివృద్ధిని దమ్ముగా చెబుతూ దేవినేని అవినాష్ ప్రజల్లోకి వెళ్తున్నారు. కానీ పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న గద్దె రామ్మోహన్ ఏమి చేశారో చెప్పలేకపోతున్నారు. కళ్లకు కనిపిస్తున్న అభివృద్ధిని చూసి అందరూ ఓట్లు వేయాలి.

– షేక్ మునీర్ అహ్మద్, రాష్ట్ర కన్వీనర్, ముస్లిం జేఏసీ

భారీ మెజారిటీతో గెలిపించండి



ఓటర్లకు కరపత్రాలు అందజేసి ఓట్లు అభ్యర్థిస్తున్న దేవినేని సుధీర, కేశినేని హైమా

కృష్ణలంక(విజయవాడతూర్పు): అసెంబ్లీ స్థానానికి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దేవినేని అవినాష్‌ను, విజయవాడ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేశినేని శ్రీనివాస్(నాని)ను ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని దేవినేని అవినాష్ సతీమణి దేవినేని సుధీర అన్నారు. శుక్రవారం కృష్ణలంక, 21వ డివిజన్‌లోని లాల్‌బహదూర్ శాస్త్రీ రోడ్డు, పెద్దివారి వీధి, మసీదు వీధి, సుబ్బరాయ నగర్ ప్రాంతాలలో కేశినేని నాని కుమార్తె హైమా, పార్టీ శ్రేణులతో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసి సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధిని వివరించారు. కరపత్రాలు అందజేసి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా సుధీర మాట్లాడుతూ అవినాష్ గెలుపుతోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గత పదేళ్లు ఎమ్మెల్యేగా గద్దె రామ్మోహన్ చేయలేని అభివృద్ధిని నియోజకవర్గ ఇన్‌చార్జిగా అవినాష్ చేసి చూపించారన్నారు. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యేగా అవినాష్‌ను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో 21వ డివిజన్ కార్పొరేటర్ పుప్పాల కుమారి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి చూడండి.. ఆశీర్వదించండి

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి దేవినేని అవినాష్



ఆరో డివిజన్‌లో ప్రచారం చేస్తున్న దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): గడచిన ఐదేళ్లలో నియోజకవర్గంలో అన్ని రకాలుగా అభివృద్ధి చేశామని, అభివృద్ధిని చూసి వచ్చే నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి దేవినేని అవినాష్ విజ్ఞప్తి చేశారు. రాణిగారితోట, 18వ డివిజన్‌లోని కంచర్ల కోటయ్య వీధి, తమ్మిన పోతురాజు వీధి, మిరియాల వారి వీధి, సంగుల పేరయ్య వీధి ప్రాంతాలలో శుక్రవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేసి రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి నియోజకవర్గాన్ని రూ.650 కోట్లతో అభివృద్ధి చేశామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ రూ.950 కోట్ల సంక్షేమ ఫలాలు అందించామన్నారు. రూ.25 కోట్లతో డివిజన్‌లో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, కమ్యూనిటీ హాల్, పార్కు, 108కు రూమ్, స్ట్రీట్ లైట్స్, నూతన యూజీడీ, వాటర్ పైప్‌లైన్లు వంటి అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేశామన్నారు. వరద ముంపు నుంచి శాశ్వత పరిష్కారంగా రూ.125 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మించామన్నారు. రిటైనింగ్ వాల్ వెంబడి రూ.12కోట్లతో కృష్ణమ్మ జలవిహార్‌ను ఏర్పాటు చేశామన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో డివిజన్‌లో అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గద్దె గాలికొదిలేశారని, మాటల తప్ప చేతలు లేవని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని)ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. 18వ డివిజన్ కార్పొరేటర్ వెంకట సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే కొండ ప్రాంతాల అభివృద్ధి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే కొండ ప్రాంతాల్లో అభివృద్ధి జరిగిందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ చెప్పారు. శుక్రవారం సాయంత్రం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 6వ డివిజన్‌లోని అప్పలనాయుడు వీధి, చలసాని వారి వీధి, గంగానమ్మ వీధి, గుమ్మడి వారి వీధి, నాపరాళ్ల వీధి వంటి కొండపై ప్రాంతాల్లో అవినాష్ ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అవినాష్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ సేవలను ప్రజల గడప దగ్గరకు తీసుకువచ్చి అందిస్తున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అమర్, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఇజ్జాడ తేజతో పాటుగా వైఎస్సార్ సీపీ డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రైడేను ప్రతి ఒక్కరూ పాటించాలి



నీటి తొట్టెల్లో పెరుగుతున్న లార్వాను చూపుతున్న మలేరియా అధికారులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రతి శుక్రవారం డ్రైడేగా ప్రతి ఒక్కరూ పాటించడంతో పాటు ఇంటి పరిసరాల్లో ఉన్న నీటి తొట్టెలను శుభ్రం చేసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సుబ్బారావు పేర్కొన్నారు. 56వ డివిజన్ పరిధిలోని 35 గజాలు, పాత రాజరాజేశ్వరిపేట పరిసరాల్లో శుక్రవారం డ్రైడేను నిర్వహించారు. మలేరియా ఇన్‌స్పెక్టర్ ఎస్.రాంబాబు పర్యవేక్షణలో ఆయా ప్రాంతాల్లోని ప్రజలు నీటిని నిల్వ చేసే తొట్టెలు, ప్లాస్టిక్ డబ్బాలను పరిశీలించారు. నిల్వ ఉన్న నీటిలో దోమల లార్వా వృద్ధి చెందడంతో లార్వా నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. వారంలో ఒక రోజు నీటిని నిల్వ చేసే డబ్బాలు, తొట్టెలను కడిగి శుభ్రం చేసుకోవడంతో పాటు ఎండలో ఒక రోజు పూర్తిగా తడి ఆరేలా ఉంచాలన్నారు. కల్వర్టు కింద దోమల లార్వా వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్స్, శానిటరీ సెక్రటరీలు, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

సీఆర్పీఎఫ్ బలగాలతో కవాతు



రామవరప్పాడు: రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని రాజుల బజారు, కాపుల బజారు, బల్లెంవారి వీధిల్లో శుక్రవారం పటమట పోలీస్‌స్టేషన్ సిబ్బంది, సీఆర్పీఎఫ్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సెంట్రల్ ఏసీపీ భాస్కర్‌రావు నేతృత్వంలో శాంతి భద్రతల పరిరక్షణ నిమిత్తం కవాతును చేపట్టారు. ప్రజలు స్వచ్ఛందంగా ఓటును వినియోగించుకోవాలని అవగాహన పరుస్తూ, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మేమున్నామన్న భరోసా ప్రజలకు కల్పిస్తూ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పటమట సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నున్నలో ఫ్లాగ్‌మార్చ్..

నున్న(విజయవాడరూరల్): ప్రజలు తమ ఓటును నిర్భయంగా వేయాలని ప్రజలకు పోలీసులు భరోసానిస్తూ శుక్రవారం నున్న గ్రామంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ పి.హెచ్.డి రామకృష్ణ ఆదేశాల మేరకు నున్న గ్రామంలో లైబ్రరీసెంటర్, పడమర బజారు, గౌడబజారు, కుమ్మరిబజారు, కోటకట్ట సెంటర్, వికాస్ కాలేజీ రోడ్డు, బోడపాడు పరిసర ప్రాంతాల్లో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ చేపట్టారు. రాజకీయ పార్టీల ఒత్తిళ్లకు భయపడకుండా ప్రజలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ప్రచారం చేశారు. నున్న పోలీసు స్టేషన్ సీఐ ఎన్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, సీఆర్పీఎఫ్ జవాన్లు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ పెరిగింది

డీటీసీ పురేంద్ర



షోరూంను ప్రారంభిస్తున్న డీటీసీ పురేంద్ర

ఆటోనగర్(విజయవాడతూర్పు): గత రెండు సంవత్సరాలుగా ఆటో ఎలక్ట్రికల్ వాహనాల వాడకం రోజు రోజుకు పెరిగిపోతుందని డెప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్(డీటీసీ) ఎం. పురేంద్ర అన్నారు. శుక్రవారం జవహర్ ఆటోనగర్ ఆర్టీసీ డిపో ఎదురు బజాజ్ త్రీ వీలర్స్ అధీకృత డీలర్ వరుణ్ బజాజ్ సరికొత్త షోరూం, వర్క్ షాప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పురేంద్ర మాట్లాడుతూ గత కొన్ని నెలల నుంచి ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు ఊపందుకుంటున్నాయన్నారు. పెట్రోల్ ధరలు పెరిగిపోవడం వల్ల ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలు పెరిగిందన్నారు. వరుణ్ మాట్లాడుతూ ఆటోనగర్ కస్టమర్లకు చేరువలో ఆధునిక హంగులతో సరికొత్త బజాజ్ త్రీవీలర్ షోరూం, వర్క్‌షాప్ ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఐబీయూ రీజనల్ మేనేజర్ సేల్స్ ఆర్. కేశవమూర్తి, కార్తికేయ, బి. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మేధో సంపత్తి హక్కులపై అవగాహన పెంచుకోవాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు మేధో సంపత్తి హక్కులపై అవగాహన పెంచుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం ఇండస్ట్రీయల్ ప్రామోషన్ ఆఫీసర్ వేణు కేసం అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఈడీసీ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఐపీఆర్ డేను పురస్కరించుకొని మేధో సంపత్తి హక్కులపై అవగాహన సదస్సును ఆ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణు కేసం మాట్లాడుతూ మేధో సంపత్తి హక్కుల ద్వారా దేశానికి అద్భుతమైన ఆదాయం లభిస్తుందన్నారు. మేధో సంపత్తి హక్కులపై సరైన అవగాహన లేకపోవటం వల్ల చాలా మంది మంచి ఆదాయాన్ని కోల్పోతున్నారన్నారు. వీటిపై విద్యార్థులు పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవటం ద్వారా విస్తృతమైన ఉపాధి అవకాశాలను పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ ఏ రమాదేవి, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ వి. విజయదుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చుకల సంరక్షణపై యువత దృష్టి పెట్టాలి



దాలినాయుడును సత్కరిస్తున్న సిద్ధార్థ కళాశాల అధ్యాపకులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పిచ్చుకల సంరక్షణపై యువత దృష్టి పెట్టాలని విశాఖపట్నానికి చెందిన హరిత వికాష్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పాలుపర్తి దాలినాయుడు అన్నారు. పీబీ సిద్ధార్థ కళాశాల జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలోని సెమినార్ హాలులో పిచ్చుకల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం జరిగింది. దాలినాయుడు మాట్లాడుతూ జీవ వైవిధ్యంలో పిచ్చుకల పాత్ర చాలా ప్రధానమైనదని చెప్పారు. పెరుగుతున్న నగరీకరణ, సెల్‌ఫోన్ టవర్ల నుంచి వెలువడే రేడియేషన్ ప్రభావం వల్ల వాటి సంతతి క్రమంగా అంతరించిపోతుందన్నారు. పిచ్చుకలను కాపాడుకోవాల్సిన అవసరం మనుషులకు చాలా ఉందన్నారు. పిచ్చుకల సంరక్షణ కోసం అవకాశం ఉన్న చోట వరి కంకులు ఉంచాలని సూచించారు. అనంతరం కళాశాల ఆవరణలో ఉన్న సరస్వతి మందిరం దగ్గర, ఉద్యానవనంలో ఉన్న చెట్ల కొమ్మలకు వరి కంకులను విద్యార్థులు కట్టారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, ప్రిన్సిపాల్ ఎం. రమేష్ అధ్యాపకులు కలిసి దాలినాయుడును సత్కరించారు. సిద్ధార్థ కళాశాల పూర్వ విద్యార్థి సుంకర నాగభూషణం, సిద్ధార్థ కళాశాల వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి.శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నున్న చెక్‌పోస్టులో ముమ్మరంగా తనిఖీలు



నున్న(విజయవాడరూరల్): ఎన్నికల నేపథ్యంలో నున్న గ్రామంలోని పవర్‌గ్రిడ్ వద్ద చెక్‌పోస్టులో తనిఖీలను అధికారులు ముమ్మరం చేశారు. విజయవాడ వైపు నుంచి నూజివీడు, అలాగే సత్తుపల్లి, విసన్నపేట, ఏలూరు ప్రాంతాల నుంచి విజయవాడ వైపు రాకపోకలు సాగిస్తున్న వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఆర్టీసీ బస్సులతో పాటు అన్ని వాహనాలను తనిఖీ చేస్తున్నారు. బస్సుల్లో ప్రయాణికుల బ్యాగులను పరిశీలిస్తున్నారు. మూడు రోజుల క్రితం తెలంగాణకు చెందిన శ్రీనివాసరావు అనే వ్యక్తి నుంచి రూ.4.50 లక్షలను ఆర్టీసీ బస్సులో పట్టుకున్నారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. అప్పటి నుంచి ప్రతి ఆర్టీసీ బస్సును తనిఖీ చేస్తున్నారు. 24/7 పోలీసులు, ప్రత్యేక అధికారుల బృందం వాహనాలను తనిఖీ చేస్తున్నట్టు నున్న పోలీసు స్టేషన్ సీఐ ఎన్.దుర్గాప్రసాద్ తెలిపారు.

పార్టీకి గుడ్ బై చెప్పిన పీసీసీ కార్యదర్శి



రాజీనామా చూపుతున్న పోతిన బేసుకంటేశ్వరుడు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, సర్దార్ మరుపిళ్ల చిట్టి కాంగ్రెస్ కేంద్ర కార్యాలయం అధ్యక్షుడు పోతిన బేసికంటేశ్వరుడు తన పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని పార్టీ అధిష్టానికి పంపినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజయవాడలోని సర్దార్ మరుపిళ్ల చిట్టి కాంగ్రెస్ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్దార్ మరుపిళ్ల చిట్టి కాంగ్రెస్ కేంద్ర కార్యాలయాన్ని 1935లో నాటి స్వాతంత్య్ర సమరయోధులు, మాజీ ఎమ్మెల్యే మరుపిళ్ల చిట్టి వంటి మహనీయులు ప్రారంభించారన్నారు. జిల్లాలో మొదటి కాంగ్రెస్ కార్యాలయమన్నారు. అప్పటి నుంచి పలు తరాలుగా కాంగ్రెస్ పార్టీని ఇక్కడ కాపాడుకుంటూ ముందుకు సాగుతున్నామన్నారు. అయితే ఇటీవల కాంగ్రెస్ పార్టీ తీసుకుంటున్న నిర్ణయాలు, ముందుకు సాగుతున్న తీరు గందరగోళంగా ఉందన్నారు. కార్యకర్తలను, నాయకులను అడిగి ఏ నిర్ణయం చేయటం లేదన్నారు. ప్రధానంగా ప్రస్తుత పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తన కుటుంబ గొడవలను పార్టీకి ముడిపెట్టి నాయకులను, కార్యకర్తలను గందరగోళానికి గురి చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో 40 ఏళ్లుగా పార్టీలో చురుకైన పాత్ర పోషించిన తన లాంటి ఎందరో నాయకులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దాంతో పార్టీకి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నామన్నారు. సమావేశంలో పార్టీ నగర ప్రధాన కార్యదర్శి పైలా బాల శ్రీనివాసరావు, సీనియర్ నేత పణుకు రమేష్ ఉన్నారు.

29న మండల పరిషత్ సమావేశం

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 29వ తేదీ ఉదయం 10 గంటలకు ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ ఎ.శ్రీరమ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఎంపీడీఓ విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఈ నెల 27 నుంచి జూన్ ఏడో తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి కె.రమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరం నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరంలో చిన్నారులకు పుస్తక పఠనం, కథ చెప్పించడం, చదివించడం, పుస్తక సమీక్ష, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్ (క్రాఫ్ట్), డ్రామా, స్పోకెన్ ఇంగ్లీష్, కవితలు, సులువుగా గణితం నేర్పించడం, సంగీతం, డాన్స్, భగవద్గీత శ్లోకాలు, చదరంగం, క్యారమ్స్, యోగా వంటి అంశాల్లో నిపుణులు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు.

ఉచిత వేసవి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అన్నసంతర్పణ సమితి ట్రస్ట్ ఆధ్వర్యాన దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో మే 2వ తేదీ నుంచి నిర్వహించనున్న ఉచిత వేసవి శిక్షణ తరగతులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు గుండ దిలీప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటి నుంచి 10వ తరగతి విద్యార్థులకు వెస్ట్రన్, ఫోక్ డాన్స్, డ్రాయింగ్, కేలిగ్రఫీ, క్రాఫ్ట్ వర్క్, క్లే వర్క్, యోగ, భరతనాట్యం తదితర అంశాల్లో ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. మరింత సమాచారం కోసం 8247500651లో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా...

టీడీపీ పాలనలో బలిపీఠంపై ప్రజారోగ్యం

వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు పి.గౌతమ్‌రెడ్డి



సాక్షి, అమరావతి: టీడీపీ హయంలో మద్యం తాగిన చాలా మంది అనారోగ్యాల బారిన పడ్డారని, కొందరు చనిపోయారని వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు పూనూరు గౌతమ్‌రెడ్డి చెప్పారు. టీడీపీ పాలనలో ప్రజారోగ్యం బలిపీఠంపై ఉండేదన్నారు. టీడీపీ పాలనాకాలంలో పేదల జీవితాల్లో పెను సంక్షోభం ఏర్పడిందని చెప్పారు. ఆయన శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పిచ్చిమందుతో తుచ్ఛమైన దోపిడీ చేసింది చంద్రబాబు ప్రభుత్వమేనని ధ్వజమెత్తారు. 'సీఎం జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి రామోజీరావుకు నిద్ర రావటంలేదు. చంద్రబాబును ముఖ్య మంత్రి చేద్దామని ఈనాడు ద్వారా ఎంత ప్రయత్నించినా జాకీపెట్టి లేపినా లేవటం లేదు. అందుకే ప్రతిరోజు ఈనాడు పేపర్ అంతా సీఎం జగన్ గురించి, ప్రభుత్వం గురించి వార్తలు రాస్తున్నారు. కానీ రామోజీ విషపు రాతలను ప్రజలు నమ్మటం లేదు.' అని గౌతం రెడ్డి అన్నారు.

రెండోసారీ జగనే సీఎం..

వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంత్‌నాయక్



సాక్షి, అమరావతి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను రెండోసారి కూడా సీఎం చేసుకోవడమే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల లక్ష్యమని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్‌నాయక్ అన్నారు. శుక్రవారం తాడేపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన 90 శాతం మంది ప్రజలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిన వారని, స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి పూర్తి స్థాయిలో వీరి సమగ్ర అభివృద్ధికి తగిన ప్రాధాన్యం దక్కలేదన్నారు. జగన్ సీఎం అయ్యాక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధే ప్రధాన అజెండాగా పాలన సాగిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 శాతం నామినేటెడ్ పదవులను ఇచ్చిన ఘనత దేశంలో సీఎం జగన్‌కే దక్కిందన్నారు. సీఎం జగన్ పాలనలో మేలుపొందిన ప్రతి కుటుంబం మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మళ్లీ జగన్‌ను సీఎంను చేసుకునేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.



విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాల



శరవేగంగా కొనసాగుతున్న మూలపేట పోర్టు నిర్మాణ పనులు

ఐదేళ్ల ప్రయాణం అద్భుతం

గతంలో ఇద్దరు కలిస్తే సమస్యలు, కష్టాలపై ఏకరువు

ఇప్పుడు ప్రభుత్వ సాయంపై మాట్లాడుతున్నారు

ఉత్తరాంధ్ర మనోగతం ఇదీ

అర్హులందరికీ సీఎం జగన్ పథకాలతో లబ్ధి చేకూర్చారు



ఉద్దానం ప్రాంత ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు మెళియాపుట్టి వద్ద నిర్మించిన రక్షిత నీటి శుద్ధి కేంద్రం

సాక్షి, అమరావతి: ''ఎంతో మంది ముఖ్యమంత్రులను చూశాం కానీ వంద శాతం సామాన్యుల గురించి ఆలోచిస్తూ అభివృద్ధి – సంక్షేమ ప్రయాణాన్ని ఒక్క జగనన్న పాలనలోనే చూస్తున్నాం. ఇవాళ విశాఖ కేజీహెచ్ కార్పొరేట్ ఆస్పత్రిని తలపిస్తోంది. పక్కనే ఉన్న అనకాపల్లి జిల్లాలో హెల్త్ సెంటర్‌కు వెళ్లినా అన్ని మందులు అందుబాటులో ఉన్నాయి. గతంలో ఇవే ఆస్పత్రులకు వెళ్లాలంటే భయమేసేది. ఇక ప్రభుత్వ స్కూళ్లు అయితే అద్భుతం. అక్కడ చదివే పిల్లలను చూస్తుంటే ముచ్చటేస్తుంది. చక్కటి యూనిఫారంలో బూట్లు, టై ధరించి వెళ్తుంటే ఎంతో ఆనందం కలుగుతుంది. మన విద్య, వైద్య రంగాలు ఎంతో బాగుపడ్డాయి. ప్రభుత్వం ఎలా పనిచేస్తుందో చెప్పడానికి ఈ రెండు ఉదాహరణలు చాలవా?'' నవరత్నాలతో దాదాపు రూ.3 లక్షలు లబ్ధి పొందిన విశాఖలోని సాగర్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ నరసింగరావు అంతరంగం ఇది! పేదల జీవన ప్రమాణాలను పెంపొందిస్తూ సంక్షేమం – అభివృద్ధి బాటలో సాగుతున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ఏ రంగాన్ని చూసినా మెరుగుపడ్డ పరిస్థితులే కనిపిస్తున్నాయి. గతంలో ఇద్దరు వ్యక్తులు కలిస్తే తమ సమస్యలు, కష్టాలపై చర్చించుకునేవారని ఇప్పుడు ప్రభుత్వం అందిస్తున్న సాయంపై మాట్లాడుకుంటున్నారని పేర్కొంటున్నారు.



కార్పొరేట్ ఆస్పత్రిని తలపిస్తున్న విశాఖ కేజీహెచ్‌లోని పీడియాట్రిక్ ఐసీయూ

దశాబ్దాలుగా ఉద్దానం ప్రజలను వేధిస్తున్న కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కారం

దశాబ్దాలుగా వెనుకబాటుకు గురైన ఉత్తరాంధ్రలో స్పష్టమైన వ్యత్యాసం కనిపిస్తోంది. శ్రీకాకుళంలో దశాబ్దాలుగా ఉద్దానం ప్రజలను వేధిస్తున్న కిడ్నీ సమస్యకు సీఎం వైఎస్ జగన్ శాశ్వత పరిష్కారం చూపించారు. ఇక్కడ నెలకొల్పిన నీటిశుద్ధి ప్రాజెక్టుతో 800కి పైగా గ్రామాల ప్రజల ఆరోగ్యానికి భరోసానిచ్చారు. తరతరాల కష్టాలకు విముక్తి కల్పించిన ఈ నీటిని అమృత జలంగా అభివర్ణిస్తున్నారు. అంతేకాకుండా పలాసలో రూ.74 కోట్లతో ఏర్పాటు చేసిన వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఇక్కడి బాధితులకు మెరుగైన సేవలు అందిస్తోంది. శరవేగంగా పనులు జరుగుతున్న మూలపేట పోర్టు ఉత్తరాంధ్ర ప్రజల ఉపాధికి భరోసా కల్పించనుంది. చరిత్రలో నిలిచిపోయే ఈ మూడు ప్రాజెక్టులు శ్రీకాకుళం జిల్లాకు వచ్చాయంటే సీఎం జగన్ చొరవతోనే సాధ్యమైందని స్థానికులు పేర్కొంటున్నారు. గతంలో ఈ ప్రాంతంలోని కిడ్నీ బాధితులు విశాఖలోని కేజీహెచ్‌కు వెళ్లేవారు. ఇప్పుడు వ్యయ ప్రయాసలు లేకుండా స్థానికంగా ఉత్తమ చికిత్స అందుబాటులోకి రావడంపై హర్షం వ్యక్తమవుతోంది. శ్రీకాకుళంను అభివృద్ధి పథంలో సాగుతున్న జిల్లాగా మార్చారని పేర్కొంటున్నారు. విజయనగరంలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుచేశారు. విశాఖ, కాకినాడ జిల్లాలో వచ్చిన పరిశ్రమలతో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తోందని ఆనందం వ్యక్తమవుతోంది.

గొప్ప పాలకుడు..



నాకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు రాకున్నా మా కాలనీలో చాలా మందికి అందుతున్నాయి. పిల్లలకు నాణ్యమైన చదువులు అందుబాటులోకి వచ్చాయి. గతంలో నా వయసు వాళ్లు పెన్షన్ కోసం వ్యయ ప్రయాసలు, పడిగాపులు కాసిన రోజులు గుర్తున్నాయి. ఇప్పుడు వలంటీర్లు ఇంటికే వచ్చి పెన్షన్ ఇవ్వడంతో పాటు ప్రభుత్వ పథకాల గురించి చక్కగా వివరిస్తున్నారు. అర్హత ఉంటే అందరికీ ఇప్పిస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇంత గొప్ప పాలకుడిని చూడలేదు.

– రంధి వరలక్ష్మి, కొమ్మాది (విశాఖపట్నం)

ఇంతకంటే ఏం కావాలి?



వైఎస్ జగన్ సీఎం కాకముందు ప్రభుత్వ బడులు ఎలా ఉన్నాయో నాకు బాగా తెలుసు. గతంలో ప్రభుత్వం ఇచ్చే రూ.వెయ్యి పెన్షన్ తెచ్చుకునేందుకు వృద్ధులు అవస్థలు పడుతూ వెళ్లడం చూశా. ఇప్పుడు ఏ ఇంటికి ఏది కావాలన్నా వలంటీర్లు వచ్చి ఇస్తున్నారు. సీఎం జగనన్న చిరస్థాయిగా నిలిచిపోతారు. శ్రీకాకుళం జిల్లాకు ఆయన చేసిన మేలు ఎవరూ చేయలేదు. మూలపేట పోర్టు, పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్ రాకతో పాటు ఉద్దానం ప్రజలకు జీవితాన్ని ప్రసాదించారు. నా భర్త ఉద్యోగ రీత్యా మాకు సంక్షేమ పథకాలు రావు. కానీ నా చుట్టూ ఉన్నవారు ఆ పథకాలతో ఆనందంగా ఉన్నారు. ఇంతకంటే కావాల్సిందేముంటుంది?

– పి. సంతోషిమణి, శ్రీకాకుళం

జగన్ అద్భుత పాలన అందించారు



మేం ప్రభుత్వ ఉద్యోగులుగా పదవీ విరమణ చేశాం. మాకు ప్రభుత్వ పథకాలకు అర్హత లేదు. మా నివాస ప్రాంతంలో ఏళ్ల తరబడి వేధిస్తున్న భారీ డ్రైనేజీ సమస్యను ఈ ప్రభుత్వం రూ.కోటి వెచ్చించి పరిష్కరించింది. సచివాలయాలు, వలంటీర్ లాంటి విప్లవాత్మక వ్యవస్థలను తెచ్చింది. ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్య సురక్షతో ఇంటికే వైద్య సేవలు అందిస్తోంది. ప్రభుత్వ విద్య, వైద్య రంగాలు బలోపేతమయ్యాయి. ఇవి మచ్చుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. సీఎం జగన్ అద్భుత పాలనతో ఎన్నో గొప్ప పథకాలు తీసుకువచ్చారు. ఇలాంటి నాయకుడి వెంట ఉండడం సంతృప్తినిస్తుంది.

– పైలా పుష్పవతి, రిటైర్డ్ ఉద్యోగి, మధురవాడ

పార్టీలకు అతీతంగా పథకాలు



నా ఆదాయం రీత్యా ఎలాంటి ప్రభుత్వ పథకాలు వర్తించకున్నా సీఎం జగన్ పాలనలో సామాన్యుల జీవితాలు బాగుపడ్డాయి. గతంలో విజయనగరం జిల్లా ప్రజలు అత్యవసర వైద్య సేవలు కోసం కేజీహెచ్ వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ప్రభుత్వ వైద్య కళాశాల రావడంతో స్థానికులకు ఇక్కడే మెరుగైన వైద్యం అందుతోంది. ఎక్కువ మంది మెడిసిన్ చదువుకునేందుకు అవకాశం లభించింది. జేఎన్‌టీయూ కూడా వచ్చింది. ఇక సంక్షేమమంటారా.. పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంతో పోలిస్తే ఇప్పుడు విజయనగరం చాలా అభివృద్ధి చెందింది. తాగునీటి సమస్య లేదు. రోడ్లు మెరుగుపడ్డాయి.

– ఎల్వీఆర్ నాయుడు, విజయనగరం

ఇలాగైతే కష్టం... గ్యారంటీగా గెలవం

హామీలతో ముంచేద్దాం


సాక్షి, అమరావతి: జనసేన, బీజేపీతో జట్టుకట్టినా ఘోర పరాజయం తప్పదని ఆందోళన చెందుతున్న టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అలవికాని బోగస్ హామీలు గుప్పించేందుకు సన్నద్ధమయ్యారు. గతేడాది మే 28న రాజమహేంద్రవరంలో నిర్వహించిన మహానాడులో కర్ణాటక, తెలంగాణలలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను కాపీ కొట్టి సూపర్ సిక్స్ ముసుగుతో మినీ మేనిఫెస్టో అంటూ ప్రకటించారు. ఆ హామీలు కర్ణాటక, తెలంగాణలలో నీరుగారిపోవడం.. చంద్రబాబు అంటేనే మోసాలకు మరోపేరు అని ప్రజలు గుర్తించడంతో 'సూపర్ సిక్స్'ను ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో ఇంటింటికీ కేజీ బంగారం, బెంజ్ కారు తరహాలో బోగస్ హామీలతో మేనిఫెస్టోను వదిలేందుకు చంద్రబాబు కసరత్తు చేస్తున్నారు. ఆ మేనిఫెస్టోను తాను ప్రకటిస్తే జనం పొరపాటున కూడా నమ్మరని పసిగట్టిన చంద్రబాబు ప్రధాని నరేంద్ర మోదీతో దాన్ని విడుదల చేయించేందుకు ఎత్తులు వేస్తున్నారు.

ముఖచిత్రాన్ని మార్చేసిన 'సిద్ధం' సభలు, బస్సు యాత్ర..

సార్వత్రిక ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేస్తూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరుసగా భీమిలి, దెందులూరు, రాప్తాడు, మేదరమెట్లలో నిర్వహించిన 'సిద్ధం' సభలకు జనం పోటెత్తడంతో ఒకదానికి మించి మరొకటి గ్రాండ్ సక్సెస్ అయ్యాయి. ప్రజాక్షేత్రంలో సీఎం జగన్‌ను ఒంటరిగా ఎదుర్కోలేక చంద్రబాబు తాడేపల్లిగూడెంలో పవన్‌కళ్యాణ్‌తో కలిసి నిర్వహించిన జెండా సభ, ప్రధాని మోదీని రప్పించి చిలకలూరిపేటలో నిర్వహించిన సభకు జనం మొహం చాటేయడంతో అట్టర్ ఫ్లాప్ అయ్యాయి. అవకాశవాద పొత్తును జనం ఛీకొట్టారనడానికి జెండా సభ, చిలకలూరిపేట సభ నిదర్శనంగా నిలిస్తే.. సీఎం జగన్‌పై ప్రజల విశ్వాసానికి ప్రతీకగా 'సిద్ధం' సభలు నిలిచాయని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచార సభలకు ఏ ప్రాంతంలోనూ జన స్పందన కనిపించడం లేదు. మరోవైపు ఎన్నికల తొలి విడత ప్రచారంలో భాగంగా గత నెల 27 నుంచి ఈ నెల 24 వరకూ 23 జిల్లాల్లో సీఎం వైఎస్ జగన్ నిర్వహించిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రకు ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పలికారు.

మళ్లీ 'ఫ్యాన్' ప్రభంజనం ఖాయం

రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని సీఎం జగన్ బస్సు యాత్ర సమూలంగా మార్చేసిందని.. పోటీ ఏకపక్షమేనని.. వైఎస్సార్‌సీపీ విజయం లాంఛనమేనని పరిశీలకులు తేల్చి చెబుతున్నారు. నామినేషన్ల ఘట్టం ముగిసింది. ఎన్నికల్లో పోటీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ, కూటమి అభ్యర్థులు తేలాక జాతీయ మీడియా సంస్థలు, ప్రతిష్టాత్మక పొలిటికల్ కన్సల్టెన్సీలు నిర్వహించిన 20 సర్వేల్లో "ఫ్యాన్" మరోసారి ప్రభంజనం సృష్టించడం ఖాయమని తేల్చాయి. సీ-ఓటర్ సర్వే ఒక్కటి మాత్రమే కూటమి విజయం సాధిస్తుందని పేర్కొంది. అయితే సీ-ఓటర్ నిర్వహించే సర్వేలకు ఏమాత్రం విశ్వసనీయత ఉండదు. 2004, 2009లో ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ గెలుస్తుందని సీ-ఓటర్ పేర్కొనగా ఆ రెండు సందర్భాల్లోనూ కాంగ్రెస్ విజయం సాధించడం గమనార్హం. 2019 ఎన్నికల్లోనూ టీడీపీ గెలుస్తుందని సీ-ఓటర్ ఢంకా భజాయిస్తే వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయం సాధించింది.



తీవ్ర ఫ్రస్టేషన్‌తో ఊగిపోతున్న బాబు..

సీఎం జగన్ బస్సు యాత్ర సృష్టించిన ప్రకంపనలతోపాటు ఏకంగా 20కిపైగా జాతీయ మీడియా సంస్థలు, పొలిటికల్ కన్సల్టెన్సీలు నిర్వహించిన సర్వేల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి ఘనవిజయం సాధిస్తుందని తేల్చిచెప్పడంతో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమిలో నైరాశ్యం నెలకొంది. నామినేషన్ల ఘట్టంలోనే కాడి పారేస్తున్నాయి. తీవ్ర ఫ్రస్టేషన్ (నిరాశ, నిస్పృహ)తో సీఎం జగన్‌పై నోరు పారేసుకుంటున్నారు. ఇటీవల విజయనగరంలో ప్రజాగళం సభలో సీఎం జగన్‌ను తూలనాడే క్రమంలో.. నెత్తిపై రూపాయి పెడితే పైసాకు కొనుక్కోవడానికి కూడా పవన్ కళ్యాణ్ పనికి రారంటూ చంద్రబాబు తన మనసులో మాట బయట పెట్టడమే అందుకు నిదర్శనం. ఇక చంద్రబాబు భార్య భువనేశ్వరి తన వద్ద పనిచేసే బడుగుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా బూతుపురాణం వల్లించడం వారి ఫ్రస్టేషన్‌కు పరాకాష్ట. వైఎస్సార్‌సీపీ శ్రేణులపై భౌతిక దాడులకు దిగాలంటూ టీడీపీ, జనసేన కార్యకర్తలను చంద్రబాబు, పవన్ కళ్యాణ్ రెచ్చగొడుతుండటం చూస్తే వారిలో ఫ్రస్టేషన్ ఏ స్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు.

అప్పటిలాగే బోగస్ హామీలతో ఇప్పుడూ..

విభజన నేపథ్యంలో 2014 ఎన్నికల్లోనూ జనసేన, బీజేపీలతో జట్టుకట్టిన చంద్రబాబు వ్యవసాయ రుణాలు, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తా.. ఇంటికో ఉద్యోగం లేదా నెలకు రూ.2 వేల చొప్పున నిరుద్యోగ భృతిగా ఇస్తానంటూ నాడు 650కిపైగా అలవికాని హామీలిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ, పవన్ కళ్యాణ్, తన ఫోటోలను ముద్రించిన పత్రంతో ముఖ్యమైన హామీలంటూ తన సంతకం చేసి మరీ ఇంటింటికీ పంపి ప్రచారం చేయించారు. అనంతరం చంద్రబాబు అధికారంలోకి వచ్చాక వాటిని తుంగలో తొక్కి ప్రజలను నిలువునా మోసం చేశారు. ప్రజలు ఎక్కడ నిలదీస్తారోనన్న భయంతో ఎన్నికల మేనిఫెస్టోను ఏకంగా టీడీపీ వెబ్‌సైట్ నుంచి చంద్రబాబు మాయం చేయించారు. ఇప్పుడూ అదే కూటమిగా జట్టు కట్టిన చంద్రబాబు 2014 తరహాలోనూ బోగస్ హామీలతో మరోసారి ప్రజలను బురిడీ కొట్టించేందుకు ఎన్నికల మేనిఫెస్టోపై కసరత్తు చేస్తున్నారు. ఆ మేనిఫెస్టోను తాను ప్రకటిస్తే ప్రజలు ఛీకొడతారని గుర్తించడంతో మే 3వ తేదీన రాష్ట్రంలో నిర్వహించే సభలో ప్రధాని మోదీతో విడుదల చేయించేందుకు సిద్ధమైనట్లు టీడీపీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

జాతీయ మీడియా సంస్థలు, ప్రతిష్టాత్మక పొలిటికల్ కన్సల్టెన్సీల సర్వేల్లో వెల్లడైంది ఇదీ..

సర్వే సంస్థ పేరు	పార్టీ గెలిచే శాసనసభ స్థానాలు		
	వైఎస్సార్‌సీపీ	టీడీపీ-జనసేన -బీజేపీ కూటమి	పోటాపోటీ
పోల్‌స్ట్రాటజీ గ్రూప్	120-130	45-55	0
న్యూస్‌ఎరినా ఇండియా	121	38	16
థర్డ్ విజన్(నాగన్న)	103	39	33
జన్‌ధర్ ఇండియా	125	50	0
డబ్ల్యూఆర్‌పీ స్ట్రాటజీస్	104-115	50-60	0
బి-ప్రాక్	118-138	13-37	--
ఆత్మసాక్షి	97-118	54-62	0
రేస్	132-138	37-42	0
రేణుకా పోతినేని	134	41	0
జన్‌మత్ పోల్స్	122-125	44-46	0
పొలిటికల్ క్రిటిక్	122	53	0
పొలిటికల్ వ్యూస్	117-128	46-58	0
ఎస్‌ఎఫ్‌వో పొలిటికల్ సర్వే	122	53	0
డెక్కన్ 24/7	131	44	0
భారత్ పొలిటికల్ సర్వే	150-156	19-25	0
యాక్చువల్ ఇండియా	108-116	50-59	0
ఫస్ట్‌స్టెప్ సొల్యూషన్	135	40	0

రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలపై జాతీయ మీడియా, పొలిటికల్ కన్సల్టెన్సీల సర్వేలు తేల్చింది ఇదీ..:

సర్వే సంస్థ పేరు	గెలిచే స్థానాలు		
	వైఎస్సార్‌సీపీ	టీడీపీ-జనసేన -బీజేపీ కూటమి	పోటాపోటీ
టైమ్స్‌నౌ-ఈటీజీ రీసెర్చ్	19-20	4-5	0
న్యూస్‌ఎరినా ఇండియా	20	5	0
జన్మత్ పోల్స్	15-17	6-8	0
పోల్‌స్ట్రాటజీ గ్రూప్	19-21	4-6	0
థర్డ్ విజన్(నాగన్న)	20-21	4-5	0
టీవీ9 భారత్ వర్ష్	13	12	0
ఆత్మసాక్షి	16	6	3
జన్‌ధర్ ఇండియా	17	8	0
జీన్యూస్-మ్యాట్రిజ్	19	6	0
టైమ్స్‌నౌ-మ్యాట్రిజ్	19	6	0
పొలిటికల్ క్రిటిక్	21	4	0
పొలిటికల్ వ్యూస్	17-19	6-8	0
ఎస్‌ఎఫ్‌వో పొలిటికల్ సర్వే	20	5	0
డెక్కన్ 24/7	19	6	0
భారత్ పొలిటికల్ సర్వే	21-23	2-4	0
ఎన్‌డీటీవీ	16	9	0
ఫస్ట్ స్టెప్ సొల్యూషన్స్	22	3	0
డబ్ల్యూఆర్‌పీ స్ట్రాటజీస్	20	4	1
ఇండియాటీవీ-సీఎన్‌ఎక్స్	15	10	0

టీడీపీకి యనమల కృష్ణుడు గుడ్‌బై

త్వరలో వైఎస్సార్‌సీపీలో చేరతామని ప్రకటన



సాక్షిప్రతినిధి, కాకినాడ : శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడి సోదరుడు యనమల కృష్ణుడు టీడీపీకి గుడ్‌బై చెప్పారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పదవికీ రాజీనామా చేశారు. ఈ విషయాన్ని కృష్ణుడు శుక్రవారం తునిలో మీడియా సమావేశంలో వెల్లడించారు. ప్రస్తుత టీడీపీలో మోసపూరిత రాజకీయాలతో విసుగెత్తిపోయే రాజీనామా చేయాల్సి వచ్చిందన్నారు. ఎందుకు టీడీపీని వీడాల్సి వస్తోందో తదితర వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో మంత్రి దాడిశెట్టి రాజా, పార్టీ ఉభయ గోదావరి జిల్లాల కో-ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి, చలమలశెట్టి సునీల్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్టు తెలిపారు. ఎలాంటి పదవులు ఆశించకుండా వైఎస్సార్‌సీపీ విజయం కోసం పనిచేస్తామని కృష్ణుడు స్పష్టం చేశారు. తెలుగు యువత కాకినాడ అధ్యక్షుడు యనమల శివరామకృష్ణ, తుని ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ పోల్నాటి శేషగిరిరావు, కోటనందూరు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి లెక్కల భాస్కర్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పేకేటి హరికృష్ణ, మాజీ ఎంపీపీ గొల్లపల్లి రాంబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గొల్లపల్లి నూకరాజు, పేరూరి కిశోర్, కొలగాని వెంకటరమణ, యాదల ప్రసాద్, మట్ల జోగారావు, మడదా దండు, బద్ది సతీష్ తదితరులు టీడీపీకి రాజీనామా చేసినవారిలో ఉన్నారు.

చార్జింగ్‌లేని పార్టీలు చార్జిషీట్ల హడావుడి

వైఎస్సార్‌సీపీ నాయకురాలు వాసిరెడ్డి పద్మ

సాక్షి, అమరావతి: 'ఎన్నికల్లో సింగిల్‌గా పోటీచేసే ధైర్యంలేని బీజేపీ, టీడీపీ, జనసేన కలిసి చార్జిషీట్ అంటూ హడావుడి చేస్తున్నాయి. చార్జింగ్‌లేని పార్టీలు కామెడీ షో చేస్తున్నట్లుగా చార్జిషీట్ విడుదల వ్యవహారం ఉంది.' అని వైఎస్సార్‌సీపీ నాయకురాలు వాసిరెడ్డి పద్మ విమర్శించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ 'సీఎం జగన్ ప్రభుత్వంపై అభాండాలు, అవాస్తవాలతో చార్జిషీట్‌ను రూపొందించారు. దొంగలందరూ కలిసి పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభిస్తే ఎంత కామెడీగా ఉంటుందో ఈ కూటమి నేతలందరూ చార్జిషీట్ అంటూ మాట్లాడితే అలాగే ఉంటుంది' అని అన్నారు. ఇక ఎన్డీఏ కూటమి విడుదల చేసిన చార్జిషీట్ మొత్తం అవాస్తవాలేనని, దానిని ప్రజలు నమ్మబోరని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కాకుమాను రాజశేఖర్ అన్నారు.

క్లుప్తంగా...

కులాల మధ్య చిచ్చు పెట్టడం చంద్రబాబు నైజం

- మాల మహానాడు రాష్ట్ర కమిటీ ప్రకటన
- వైఎస్సార్‌సీపీకి సంపూర్ణ మద్దతు



మాట్లాడుతున్న అన్నవరపు కిషోర్, చిత్రంలో మాలమహానాడు నేతలు

పట్నంబజారు: రాజకీయంగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అంతమే తమ పంతమని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు కిషోర్ ప్రకటించారు. గుంటూరు చంద్రమౌళినగర్ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం మాల మహానాడు రాష్ట్ర కమిటీ నేతలు విలేకరుల సమావేశం నిర్వహించారు. అన్నవరపు కిషోర్ మాట్లాడుతూ.. టీడీపీలో మాలలకు జరుగుతున్న అన్యాయంపై చంద్రబాబును కలిసి వివరిద్దామని వెళితే.. ఆయన సొంత మీడియా తామంతా మద్దతు ఇస్తున్నట్లు వార్తలు రాశాయని ధ్వజమెత్తారు. కులాల మధ్య చిచ్చు పెట్టడం చంద్రబాబునాయుడికి వెన్నతో పెట్టిన విద్య అని మండిపడ్డారు. తొలి నుంచి దళితులంటే చంద్రబాబుకు చిన్నచూపేనని విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీల్లోని రెండు కులాలు తనకు రెండు కళ్లతో సమానమని చెప్పడాన్ని హర్షిస్తున్నామని చెప్పారు. ఇద్దరికీ సమప్రాధాన్యం ఇచ్చే సీఎం వైఎస్ జగన్ వెంటే దళితులమంతా నడుస్తామని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీకి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ మాల మహానాడు రాష్ట్ర కమిటీ శుక్రవారం ఒక తీర్మానం చేసిందని వివరించారు. మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసి కెనడి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం వెంకట్రావు, పలువురు రాష్ట్ర కమిటీ నేతలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి పద్మశాలి, చేనేతల మద్దతు

- చేనేత, వీవర్స్ సంఘాల నేతలు



వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలుపుతున్న పద్మశాలి, చేనేత సంఘాల నాయకులు

సీతంపేట(విశాఖ ఉత్తర): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పద్మశాలీలు, చేనేతలందరూ వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు చిక్కా సత్యనారాయణ, వీవర్స్ విభాగం ఉపాధ్యక్షుడు పెంటపల్లి వెంకట్ తెలిపారు. స్థానిక శంకరమఠం రోడ్డులోని పద్మశాలి భవనంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 20లక్షలకు పైగా, విశాఖ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 1.2లక్షల మందికిపైగా పద్మశాలి కులస్తులు ఉన్నారని, అయినా ఆయా కులాలకు టీడీపీ, బీజేపీ, జనసేన ఒక్కసీటు కూడా కేటాయించకుండా అన్యాయం చేశాయన్నారు. పద్మశాలీలను, చేనేతలను గౌరవిస్తూ సీఎం వైఎస్ జగన్ ఎన్నో పదవులు ఇచ్చారని తెలిపారు. ప్రస్తుత ఎన్నికల్లో మంగళగిరి, ఎమ్మిగనూరు అసెంబ్లీ సీట్లను చేనేత వర్గాలకు కేటాయించారని వివరించారు. అందువల్లే వైఎస్సార్‌సీపీకి చేనేతలు, పద్మశాలీలు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. విశాఖ జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషిచేస్తామని ప్రకటించారు. ఏపీ పద్మశాలి సంఘం పెద్దల కమిటీ చైర్మన్ తెడ్లాపు వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి పలివెల ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి సీఎం జగన్ పెద్దపీట

- దేవదాయ, ధర్మదాయ శాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు జ్వాలపురం శ్రీకాంత్




మాట్లాడుతున్న జ్వాలపురం శ్రీకాంత్, చిత్రంలో ఇంతియాజ్

కర్నూలు(టౌన్): అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన బ్రాహ్మణుల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ ఐదేళ్లలో రూ.780 కోట్లు ఖర్చు చేసిందని దేవదాయ, ధర్మదాయ శాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జ్వాలపురం శ్రీకాంత్ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక నరసింగరావుపేటలోని వైఎస్సాఆర్‌సీపీ కర్నూలు నగర కార్యాలయంలో కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ఏ రోజూ బ్రాహ్మణ సమాజం గురించి పట్టించుకోలేదని చెప్పారు. పైగా దేవాలయాలను కూలదోయడంతో పాటు అర్చకులను ఇబ్బందులకు గురిచేశాడన్నారు. సీఎం జగన్ నాయకత్వంలో నలుగురు బ్రాహ్మణులకు ఎమ్మెల్యేలుగా, 18 మంది కార్పొరేటర్లు, విశాఖ అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్‌గా, హస్తకళల కార్పొరేషన్, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్లకు సలహాదారులుగా ఈ ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు.

కూటమికి రె'బెల్స్'





- సత్యవేడు బరిలో మరో ముగ్గురు టీడీపీ నేతలు
- తిరుపతి పార్లమెంట్‌కు మరో బీజేపీ నేత నామినేషన్
- ఆ 4 చోట్ల స్థానిక నేతలను నమ్మని కూటమి అభ్యర్థులు
- పక్క ప్రాంత వాసులకు ఎన్నికల బాధ్యతలు అప్పగించిన వైనం
- రేణిగుంట విమానాశ్రయంలో అర్ధరాత్రి కూటమి నేతలతో చంద్రబాబు, పవన్ చర్చలు

సాక్షి, తిరుపతి: కూటమి అభ్యర్థులకు రెబల్స్ బెడద తలనొప్పిగా మారింది. మొదటి నుంచి పార్టీ కోసం జెండా మోసి, కోట్ల రూపాయలు వెచ్చించి పనిచేసిన నేతలను పక్కనపెట్టి నిన్నగాక మొన్న వచ్చినవారికి టికెట్లు కేటాయించడాన్ని టీడీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇన్నాళ్లు తామే లేకపోతే నియోజకవర్గాల్లో టీడీపీ కనుమరుగయ్యేదని, అటువంటి తమకు విలువ లేకుండా చేస్తారా? అంటూ మండిపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో కొందరు రెబల్స్‌గా నామినేషన్లు వేశారు. మరికొన్ని చోట్ల మొదటినుంచి పార్టీ కోసం పని చేస్తున్న స్థానిక నాయకులను కాదని, పక్క ప్రాంతం నుంచి తెచ్చుకున్న వారికి ఎన్నికల బాధ్యతలు అప్పగించటంపై భగ్గుమంటున్నారు. తిరుపతి లోక్‌సభతోపాటు తిరుపతి, శ్రీకాళహస్తి, గంగాధరనెల్లూరు, చిత్తూరు అసెంబ్లీ స్థానాల నుంచి బరిలో ఉన్న కూటమి అభ్యర్థులకు రెబల్స్ బెడదతో పాటు అసంతృప్తుల సెగ చల్లారటంలేదు. అసంతృప్తులను బుజ్జగించేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ గురువారం అర్ధరాత్రి వారితో రేణిగుంట విమానాశ్రయంలో చర్చలు జరిపారు. అధినేతలే రంగంలోకి దిగినా.. పార్టీ కోసం నిజాయితీగా పనిచేసిన టీడీపీ నేతలు ససేమిరా అంటున్నారు. తిరుపతి లోక్‌సభ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా వరప్రసాద్ బరిలో ఉన్నారు. ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఐఏఎస్ అధికారి దాసరి శ్రీనివాసులు తిరుపతి ఎంపీ అభ్యర్థిగా గురువారం నామినేషన్ దాఖలు చేశారు.

సత్యవేడులో ససేమిరా..

సత్యవేడు టీడీపీ అభ్యర్థి కోనేటి ఆదిమూలం, ఆయన కుమారుడు సుమన్ గతంలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులను చిత్రహింసలకు గురిచేశారనే ఆరోపణలున్నాయి. అటువంటి వ్యక్తిని చంద్రబాబు అభ్యర్థిగా ఎంపిక చేయటంపై మాజీ ఎమ్మెల్యే హేమలత, గత ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయిన జె.డి.రాజశేఖర్, ఎన్ఆర్‌వి రమేష్ రెబల్స్‌గా నామినేషన్లు దాఖలు చేశారు. ఆదిమూలం అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ.. టీడీపీ శ్రేణులు ఆందోళనలు చేసినా చంద్రబాబు పట్టించుకోలేదు. ఆదిమూలం ఇచ్చిన ప్యాకేజీకి ఆశపడి అతడిని అభ్యర్థిగా ఖరారు చేస్తే తామెందుకు సహకరిస్తామని రెబల్స్ ప్రశ్నిస్తున్నారు.

అమ్మో.. 'ఆరణి'?

తిరుపతి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు గురించి తెలుసుకున్న స్థానిక నాయకులు, ఓటర్లు ముక్కున వేలేసుకుంటున్నారు. చిత్తూరు ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు స్థానిక ప్రజలకు ఒక్క మంచిపని కూడా చేయకపోగా.. పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వ భూములను బినామీ పేర్లతో ఆక్రమించుకోవటంతో పాటు చిత్తూరు కార్పొరేషన్‌లో ప్రతిపనికి పర్సెంటేజీ వసూలు చేస్తూ అధికారులను సైతం చిత్రహింసలకు గురిచేశారనే ఆరోపణలున్నాయి. తన గెలుపునకు పనిచేసిన వైఎస్సార్‌సీపీ శ్రేణులను వాడుకుని పూర్తిగా పక్కనపెట్టేశారు. తన ఓటమి కోసం పనిచేసిన వారిని పక్కనపెట్టుకుని పనులు, పదవులు ఇచ్చి నాలుగేళ్లపాటు వారి ద్వారా కోట్లు సంపాదించారనే విమర్శలున్నాయి. ఇదిలా ఉంటే.. తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మకు, ఆరణి శ్రీనివాసులుకు దామినేడు భూముల విషయంలో వివాదాలున్నాయి. ఆ భూముల విషయంలో శ్రీనివాసులు తన ఇంటికి వచ్చి బెదిరించినట్లు సుగుణమ్మ విలేకరుల ఎదుటే వాపోయారు కూడా. ఇటువంటి వ్యక్తికి సహకరించేది లేదని తిరుపతి ఓటర్లు బాహాటంగానే చెబుతున్నారు.



తిరుపతి ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న దాసరి శ్రీనివాసులు

స్థానిక కార్యకర్తలకు విలువ ఇవ్వని అభ్యర్థులు

చిత్తూరు, గంగాధరనెల్లూరు కూటమి అభ్యర్థులు గురజాల జగన్మోహన్, థామస్ స్థానికులు కాదు. గురజాల గుడిపాలలో పుట్టినా.. పెరిగింది, వ్యాపారాలు అన్నీ బెంగుళూరులోనే. కర్ణాటకలోనే స్థిరపడ్డారు. ఈ ఇద్దరు స్థానిక నాయకులకు విలువ ఇవ్వకపోగా.. ప్రతిపని కర్ణాటక, తమిళనాడు నుంచి తెప్పించుకున్న మనుషులకు పురమాయిస్తున్నారు. ఒకవేళ స్థానిక నాయకులు ఒకరిద్దరికి పనులు అప్పజెప్పినా.. వారిపై నిఘా ఉంచుతున్నారు. శ్రీకాళహస్తిలో బొజ్జల సుధీర్‌రెడ్డి కూటమి నేతలను పెద్దగా పట్టించుకోవటంలేదనే ప్రచారం జరుగుతోంది. బొజ్జల అనే పేరే బ్రాండ్ అని, ఎస్.సి.వి.నాయుడు, కోలా ఆనంద్, సత్రవాడ మునిరామయ్య, వినూత తమ కుటుంబం తరువాతేనని చెబుతున్నట్లు టీడీపీ నాయకుడొకరు చెప్పినట్లు తెలిసింది.

బాబు కోసమే పవన్ రాజకీయాల్లోకి..

- చంద్రబాబును సీఎం చేయాలనే లక్ష్యంతో పవన్ పనిచేస్తున్నారు
- చంద్రబాబు కిర్లంపూడిని పాకిస్తాన్ చేశాడు
- జగన్ అమలు చేస్తున్న పథకాలే పేదల కడుపు నింపుతున్నాయి
- మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ



సమావేశంలో మాట్లాడుతున్న ముద్రగడ. పక్కన ఉండి నియోజకవర్గ అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు

సాక్షి, భీమవరం: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ రాజకీయాల్లోకి వచ్చింది ప్రజాసేవ చేయడానికి కాదని, చంద్రబాబుకు సేవ చేసేందుకేనని మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం ఎద్దేవా చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండిలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు అధ్యక్షతన జరిగిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబును సీఎం చేయాలనే లక్ష్యంతో పవన్ పని చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పవన్ సినిమాల్లో మాత్రమే హీరో అని, రాజకీయాల్లో కాదన్నారు. అభిమానులకు ఫోన్ నంబర్ ఇవ్వని వ్యక్తిని.. ఎలా అభిమానిస్తారని ప్రశ్నించారు. కాపు ఉద్యమం చేసినప్పుడు గాని, చంద్రబాబు తన కుటుంబంపై దాడి చేయించినప్పుడు గాని, కాపులపై చంద్రబాబు అక్రమంగా కేసులు పెట్టించినప్పుడు గాని పవన్ ఎందుకు నోరు మెదపలేదని నిలదీశారు.

చంద్రబాబు కిర్లంపూడిని పాకిస్తాన్ చేశాడు

రామరాజ్యం తెస్తానని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ముద్రగడ ఎద్దేవా చేశారు. కాపు ఉద్యమ సమయంలో కిర్లంపూడిని చంద్రబాబు పాకిస్తాన్ చేశాడన్నారు. గ్రామంలో అడుగు పెట్టడానికి కూడా అనేక ఆంక్షలు పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. అధికార దాహంతో చంద్రబాబు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తానేం చేస్తాడో చెప్పుకోకుండా సీఎం జగన్ అమలు చేస్తున్న పథకాలను మరింత పకడ్బందీగా అమలు చేస్తామని చెప్పుకోవడం ఆయన విజనరీకి నిదర్శనమన్నారు.

ఓదార్పు యాత్రలో జగన్ వెన్నంటే ఉన్నా..

ఓదార్పు యాత్రకు తూర్పు గోదావరి జిల్లాలో తానే నాయకత్వం వహించానని, 23 రోజులపాటు జగన్ వెన్నంటే ఉన్నానని ముద్రగడ చెప్పారు. తర్వాత కొంతమంది తీరువల్ల పార్టీకి దూరమయ్యానన్నారు. ప్రస్తుత రాజకీయ పరిణామాల్లో రాష్ట్రం, పేదల భవిష్యత్ కోసం తాను వైఎస్సార్‌సీపీలోకి వచ్చానని చెప్పారు. ఎటువంటి పదవులూ ఆశించకుండా పార్టీలో చేరానని, అధికారంలోకి వచ్చాక సీఎం జగన్ పదవి ఇస్తే తీసుకుంటానే తప్ప, పదవి ఇవ్వమని తాను అడగనని స్పష్టం చేశారు. ఈరోజు పేదల నోట్లోకి ఐదు వేళ్లు వెళుతున్నాయంటే సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే కారణమన్నారు. మరోసారి జగన్ సీఎం కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, అందుకోసమే జిల్లాల వారీగా పర్యటిస్తూ పార్టీ విజయానికి పనిచేస్తున్నానని ముద్రగడ వివరించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు మాట్లాడుతూ.. ముద్రగడ కాపుల కోసం పనిచేస్తే, పవన్ ప్యాకేజీ కోసం పనిచేస్తున్నారన్నారు. క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, కాపు సంఘం నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉప్మాలు, కాఫీలకు అమ్ముడుపోకండి

- జగన్‌కు ఓటేస్తే మీ నాశనాన్ని మీరు తెచ్చుకున్నట్టే
- మీ ఆస్తులను కూడా తాకట్టు పెట్టేస్తారు.. ఆడవారికి రక్షణ ఉండదు
- మలికిపురంలో పవన్ వ్యాఖ్యలు



సాక్షి అమలాపురం/ మలికిపురం: ఉప్మాలకు, కాఫీలకు అమ్ముడుపోకండి అంటూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఓటర్లపట్ల అవమానకరంగా మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం మలికిపురంలో శుక్రవారం సాయంత్రం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. సీఎం జగన్‌కు ఓటు వేస్తే మీ నాశనాన్ని మీరు తెచ్చుకున్నట్టేనని, మీ మీద మీరు పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నట్టేనని అంటూ వ్యాఖ్యానించారు. జగన్ మరోసారి వస్తే మీ ఆస్తులను కూడా తాకట్టు పెట్టేస్తారన్నారు. పట్టా పుస్తకాల మీద జగన్ బొమ్మ ఎందుకని ప్రశ్నించారు. సంక్షేమం పేరుతో ఇస్తోంది జగన్ తాతల సొమ్ము కాదని, మన డబ్బేనన్నారు. అప్పులు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయడం సరికాదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వస్తే ఆడవారికి రక్షణ ఉండదని చెప్పారు. జగన్ సొంత చెల్లి కట్టుకున్న చీరల మీద కామెంట్స్ చేస్తారా అని ప్రశ్నించారు. కోనసీమలో గోదావరి ఉన్నా తాగు నీరు లేదన్నారు. రైతులు సాగు సమ్మె చేశారని, రైతులకు ఎకరాకు రూ.25 వేలు నష్టం వస్తోందని, ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలుకు లక్ష నిబంధనలు పెట్టారన్నారు. ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెడుతున్నారన్నారు. ఎమ్మెల్యే రాపాక అవినీతి అంతా ఇంతా కాదని చెప్పారు. కోనసీమ రైతులు కష్టాల్లో ఉంటే ఆయన 5 ఎకరాల్లో ఇల్లు కట్టుకున్నారని విమర్శించారు. దళితుడుని చంపిన అనంతబాబు రోడ్ల మీద తిరుగుతున్నాడన్నారు. అమలాపురం అల్లర్లలో ఉన్న అన్యం సాయి మంత్రి విశ్వరూప్ వెంట ఉన్నారంటే అల్లర్లకు కారణమెవరో తెలుసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన ఒక్కొక్క అవినీతిపరుడిని రోడ్ల మీదకు లాక్కొస్తామని చెప్పారు. జగన్‌ను గులక రాయితో కొట్టిన వాడిని పట్టుకున్నారని, అంతర్వేదిలో రథం తగలబెట్టిన నిందితులను పట్టుకోలేదని అన్నారు. రాజకీయాల లోకి వచ్చి ప్రతి అడ్డమైన ఎదవతో మాటలు పడుతున్నానన్నారు. తనను ఓడించడం కోసం 40 మంది ఎర్రచందనం స్మగ్లర్లను పిఠాపురంలో దింపారని ఆరోపించారు.

సమయం లేదు.. మాట్లాడలేను..

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామంలో జరగాల్సిన సభకు పవన్ ఆలస్యంగా వచ్చారు. ఆయన వచ్చేసరికి రాత్రి 9.48 గంటలు కావడంతో సభ ముగించడానికి 9 నిమిషాలే మిగిలింది. దీంతో ఇక్కడ తాను ఏమీ మాట్లాడలేనంటూ క్లుప్తంగా చెప్పేసి పవన్ వెళ్లిపోయారు..

మాదిగాని గురునాథం ఓ బ్లాక్ మెయిలర్

- నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికే వరప్రసాదరావు



సాక్షి,అమరావతి: సోషల్ డెమొక్రటిక్ ఫ్రంట్ అధ్యక్షుడు మాదిగాని గురునాథం డబ్బు కోసం ఏ గడ్డి తినడానికైనా వెనుకాడబోడని, బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు కేరాఫ్‌గా మారాడని నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికే వరప్రసాదరావు ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన తాడేపల్లిలో మీడియాతో మాట్లాడారు. టీడీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ రూ.కోట్లు ఇస్తున్నారని గురునాథం దళితులందరినీ ప్రలోభపెడుతున్నారని చెప్పారు. 'తనకి నచ్చినంత డబ్బు, ప్రభుత్వంలో కోరిన పదవులు ఇస్తే వైఎస్సార్‌సీపీ నాయకులు మంచోళ్లు .. ఇవ్వకపోతే దోపిడీ దారులు' అంటూ ఎల్లో మీడియాలో కూర్చొని సంబంధం లేని విషయాల్లో వైఎస్సార్‌సిపీ ముఖ్యనేతలు వైవీ సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డిపై విమర్శలు చేయడం దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. బహుజన పరిరక్షణ సమితి చేసే ఆందోళనలతో గురునాథానికి సంబంధం లేదని, మొదట్లో అప్పుడప్పుడు శిబిరం వద్దకు వచ్చి కూర్చొనేవారని, అలా మాటామంతి కలిపేవారని చెప్పారు. బహుజన పరిరక్షణ సమితి పేరెత్తే అర్హత గురునాథానికి లేదని, డబ్బు కోసం ఏదిపడితే అది మాట్లాడి ఆరోపణలు చేస్తే.. తగిన బుద్ధి చెబుతామని వరప్రసాదరావు హెచ్చరించారు.

విదేశీ పెట్టుబడులను 'వేమిరెడ్డి' చూపించలేదు

- ఆయన ఎన్నికల్లో పోటీకి అనర్హుడని ఫిర్యాదు చేశా
- నెల్లూరు వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరు టీడీపీ లోక్‌సభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విదేశాల్లో పలు వ్యాపారాలు చేస్తూ అక్కడ పెట్టుబడులు పెట్టిన విషయాన్ని ఎన్నికల అఫిడవిట్‌లో పొందుపరచలేదని నెల్లూరు వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్‌లోని జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో శుక్రవారం జరిగిన నామినేషన్ల పరిశీలన కార్యక్రమంలో ఆయన పాల్గొని వేమిరెడ్డి అఫిడవిట్‌పై పలు అభ్యంతరాలను వ్యక్తంచేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వేమిరెడ్డి విదేశాల్లోని పెట్టుబడులను అఫిడవిట్‌లో పొందుపరచలేదన్నారు. అలాగే, దేశంలోని పలు ఆస్తులు, కంపెనీల్లో షేర్లను కూడా వెల్లడించలేదని చెప్పారు. సెక్షన్ 9(ఏ) ప్రకారం వీపీఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ద్వారా కేంద్ర ప్రభుత్వంతో సంబంధం ఉన్న సంస్థలతో, సింగరేణి కాలరీస్‌లో కూడా పనులు చేశారన్నారు. అఫిడవిట్‌లో ఈ అంశాలను పొందుపరచకపోవడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమన్నారు. దీంతో వేమిరెడ్డి ఎన్నికల్లో పోటీకి అనర్హుడుగా తేల్చాలని ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశానన్నారు. కానీ, ఎన్నికల అధికారి తమ ఫిర్యాదులను తిరస్కరించారని చెప్పారు. ఈ విషయంలో న్యాయ నిపుణులను సంప్రదించి ముందుకెళ్తామన్నారు.

పవన్ ఆస్తులు, అప్పుల చిట్టా అంతా మాయే!: పోతిన



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పవన్‌కళ్యాణ్ 13 ఏళ్లకే ఎస్ఎస్ఎల్‌సీ పూర్తి చేసిన మేధావి అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత పోతిన మహేష్ ఎద్దేవా చేశారు. పవన్‌కళ్యాణ్ అఫిడవిట్‌పై శుక్రవారం మీడియాకు మరో వీడియోను విడుదల చేశారు. పవన్ పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన నేపథ్యంలో ఆయన సమర్పించిన అఫిడవిట్ తప్పుల తడకగా ఉందన్నారు. ఆయన చెబుతున్న వివరాలకు, వాస్తవాలు చాలా దూరంగా ఉన్నాయన్నారు. 1971లో జన్మించిన పవన్ 15 ఏళ్ల వయస్సు అంటే సుమారుగా 1986లో పదో తరగతి పూర్తి చేసి ఉండాలని, కానీ ఆయన చెప్పే ఎస్ఎస్ఎల్‌సీ 13 ఏళ్లకే పూర్తి చేసినట్లుగా అఫిడవిట్‌లో పేర్కొన్నారని తెలిపారు. తల్లి నుంచి వచ్చిన ఆస్తుల విషయంలోనూ చాలా అబద్ధాలు చెబుతున్నారని పేర్కొన్నారు. అద్దె అపార్ట్‌మెంట్‌లో ఉండే పవన్ 2014లో జనసేనను స్థాపించారన్నారు. అయితే ఆయన కొనుగోలు చేసిన ఆస్తులన్నీ 2018 నుంచి 2024 మధ్య మాత్రమేనని చెప్పారు. సినిమాలు అపజయం పాలైన సమయంలోనే ఆయన ఆస్తులు కొనుగోలు చేశారంటే అందులో మర్మమేంటో తెలపాలని పోతిన డిమాండ్ చేశారు.

దళితులు గంజాయి తాగే కొడుకులు

- ప్రతి కుటుంబంలో ఉంటారు
- రాత్రి పిచ్చి లేస్తే తండ్రి, తల్లి మెడ మీదనో కత్తిపెట్టి గొంతులు కోస్తారు
- దళిత యువతపై నోరు పారేసుకున్న ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు
- బూర్ల వ్యాఖ్యలపై దళిత వర్గాల ఆగ్రహం



మాట్లాడుతున్న బూర్ల రామాంజనేయులు, ఎంపీ అభ్యర్థి పెమ్మసాని

ప్రత్తిపాడు: చంద్రబాబునాయుడు మొదలుకొని తెలుగుదేశం పార్టీలో నాయకులంతా దళిత ద్వేషులని మరో నాయకుడు నిరూపించాడు. ఎస్సీలుగా పుట్టాలని ఎవరైన కోరుకుంటారా అంటూ సీఎంగా ఉన్నప్పుడు చంద్రబాబే హేళనగా మాట్లాడితే.. ఆ పార్టీలో పలువురు నాయకులు పలుమార్లు దళితులను తూలనాడి, దాడులు చేసిన సంఘటనలు కోకొల్లలు. తాజాగా ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు దళిత యువకుల గురించి అతి నీచమైన పదజాలంతో మాట్లాడారు. 'గంజాయి తాగే కొడుకులు' అంటూ ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడిన మాటలపై దళిత వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. బూర్ల రామాంజనేయులు శుక్రవారం పెదనందిపాడు మండలం ఉప్పలపాడులో టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ప్రధాన కూడళ్లలో ప్రసంగాలు చేశారు. అందులో భాగంగానే గ్రామంలోని ఓ కూడలి వద్ద బూర్ల రామాంజనేయులు దళిత యువకులను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారు. 'జగన్ పాలనలో గంజాయి విచ్చలవిడిగా దొరుకుతుండటం వలన యువత గంజాయికి అలవాటు పడి రోడ్డు మీద వెళ్లే కుటుంబాన్ని ఆపి కొట్టే పరిస్థితి తెచ్చారు. ఇది చాలా చోట్ల జరుగుతోంది. ప్రతి కుటుంబంలో గంజాయి తాగే కొడుకులుంటారు. వాళ్లు రాత్రి పిచ్చి లేస్తే తండ్రి, తల్లి మెడ మీద కత్తి పెట్టి గొంతులు కోస్తారు' అంటూ దళిత యువతపై నోరు పారేసుకున్నారు. ఇలా దళిత యువకులనుద్దేశించి అనుచితంగా మాట్లాడటం స్థానికంగా పెను దుమారాన్ని రేపుతోంది. దళితులంటే ఇంత చులకనా.. అంటూ బూర్ల వ్యాఖ్యలపై పలువురు మండిపడుతున్నారు.

ఉండిలో రఘురామ ఉక్కిరిబిక్కిరి

- ప్రచారంలో దూసుకుపోతున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి
- గట్టి కౌంటర్ ఇచ్చిన శివరామరాజు
- సొంత పార్టీలో అసమ్మతి జ్వాలలు.. ప్రచారానికి ప్రజల నుంచి స్పందన కరువు
- ఇప్పటి నుంచే ఓటమికి కారణాలు వెతుక్కుంటున్న రఘురామ

సాక్షి, భీమవరం: పైన పటారం.. లోనలొటారంలా తయారైంది పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి రఘురామకృష్ణరాజు పరిస్థితి. సిట్టింగ్ ఎమ్మెల్యే నుంచి సీటు ఈజీగా లాగేసుకున్న ఆయన్ను.. ఒకపక్క అధికారపక్షం జోరు, మరోపక్క టీడీపీ రెబల్ పోరు, సొంతగూటిలో పైకి కనిపించని అసమ్మతి సెగలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ప్రచారానికి ప్రజల నుంచి స్పందన కరువైనా పైకి మాత్రం గాంభీర్యం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సీఎం జగన్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం వివరిస్తూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు ప్రచారంలో దూసుకుపోతున్నారు. గ్రామగ్రామానా అధికార వైఎస్సార్‌సీపీకి లభిస్తున్న జనాదరణ చూసి రఘురామకు మింగుడుపడటం లేదు. పోలింగ్‌కు మరో రెండు వారాలు మాత్రమే గడువుండగా అసలు టీడీపీ కేడర్ ఎవరో కూడా ఆయనకు తెలియని పరిస్థితి నెలకొంది.

శివరామ వ్యూహంతో గింగిరాలు..

తనకు టికెట్ ఇవ్వకుండా అవమానించిన టీడీపీకి గుణపాఠం చెప్పాలన్న గట్టి పట్టుదలతో మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజు ఉన్నారు. రెబల్‌గా పోటీ చేయకుండా తనకు మద్దతు తెలపాలని రఘురామ పలు రకాలుగా ఒత్తిళ్లు తెచ్చినా తగ్గేది లేదని శివరామ కరాఖండీగా తేల్చిచెప్పినట్టు సమాచారం. తొలుత స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగాలని భావించినప్పటికీ.. చివరకు ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడం ద్వారా టీడీపీకి దిమ్మతిరిగే కౌంటరిచ్చారు. భారీ ర్యాలీతో రఘురామకు చెమటలు పట్టేలా అట్టహాసంగా తరలివెళ్లారు. రఘురామపై నాన్ రెసిడెంట్ ఉండి (ఎన్ఆర్‌యూ) నినాదంతో శివరామ వర్గం ముందుకు వెళుతోంది. రేపు ప్రజలు, పార్టీ నాయకులు ఎక్కడికి వెళ్లాలి, ఎవరిని కలవాలనే ప్రశ్నలను సంధిస్తోంది.

ఓటమి నెపం రామరాజుపైకి..

నామినేషన్, ఎన్నికల ప్రచారంలో రఘురామకు ప్రజల నుంచి స్పందన కనిపించపోవడం ఆయన శిబిరాన్ని నిరాశకు గురిచేస్తోంది. ప్రస్తుతం నియోజకవర్గంలో రఘురామ మూడో స్థానంలో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఎన్నికల్లో ఓటమి పాలైతే ఆ నెపాన్ని ఎమ్మెల్యే రామరాజు, ఆయన వర్గంపై వేసేసి చేతులు దులిపేసుకుని వెళ్లిపోవాలన్న ఆలోచనలో ఆయన ఉన్నట్టు టీడీపీ కేడర్ అనుకుంటున్నారు. లోపల ఓటమి భయం వేధిస్తున్నా పైకి రఘురామ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని నియోజకవర్గంలో చర్చించుకుంటున్నారు.

బెట్టింగ్ బ్యాచ్ అంటూ అనుచిత వ్యాఖ్యలు

సొంత పార్టీలో అసమ్మతి రఘురామకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. ఎమ్మెల్యే రామరాజు సీటును మార్చవద్దంటూ పదిరోజుల క్రితం నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ నాయకుల సామూహిక రాజీనామాలకు సంతకాల సేకరణ, ఆమరణ నిరాహార దీక్షలు చేయడం, టీడీపీ జిల్లా కార్యాలయం ముట్టడి తదితర ఆందోళనలు నిర్వహించిన విషయం విదితమే. ఆందోళన చేసిన వారంతా బెట్టింగ్ రాయుళ్లేనంటూ రఘురామ చేసిన అనుచిత వ్యాఖ్యలు పార్టీలో అంతర్గతంగా అసమ్మతి జ్వాలలు రగిలిస్తూనే ఉన్నాయి. రాజకీయ ప్రయోజనాల కోసం ఇప్పుడు ఇద్దరు నేతలూ కలిసినప్పటికీ బెట్టింగ్ రాయుళ్లు, తమవన్నీ డ్రామాలంటూ అవమానించిన వ్యక్తి కోసం మనసు చంపుకుని ఎలా పనిచేస్తామని ద్వితీయశ్రేణి నాయకులు, కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు.

క్లుప్తంగా...

రేపటి నుంచి సీఎం జగన్ ఎన్నికల ప్రచారం

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 28 ఆదివారం నుంచి ఎన్నికల ప్రచారం చేయనున్నారు. తాడిపత్రిలో ఉదయం నిర్వహించే సభతో ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. ప్రతిరోజూ 3 నియోజకవర్గాల్లో బహిరంగ సభలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు అనంతపురం జిల్లా తాడిపత్రి బహిరంగ సభ ద్వారా ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడుతున్నారు. అదే రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు తిరుపతి జిల్లా వెంకటగిరి, 3 గంటలకు ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా కందుకూరులో జరగనున్న బహిరంగ సభల్లో పాల్గొని ప్రసంగించనున్నారు.

4 వరకు ఏపీ పీజీ సెట్ దరఖాస్తు గడువు

ఏయూ క్యాంపస్: రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంఏ, ఎంసీజే, ఎంఎల్ఐసీ, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎమ్మెస్సీ టెక్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీ పీజీ సెట్ 2024 దరఖాస్తు గడువు మే 4వ తేదీతో ముగియనుందని కన్వీనర్ ఆచార్య జి.శశిభూషణరావు ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుముతో మే 25 వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని పేర్కొన్నారు. అర్హత కలిగినవారు www.cetr.aprche.ap.gov.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పాఠ్యపుస్తకాలకు న్యూలుక్

1, 2 తరగతులు మినహా
మిగతావాటికి ముఖ చిత్రాలు మార్పు

సాక్షి, అమరావతి: 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 1–10వ తరగతి వరకు పాఠ్యపుస్తకాలను www.cse.ap.gov.inలో అందుబాటులో ఉంచినట్లు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ శుక్రవారం తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికి 1, 2 తరగతులు మినహా మిగతా అన్ని తరగతుల పాఠ్యపుస్తక ముఖచిత్రాలను మారుస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖచిత్రాల ఆధారంగా సులభంగా పుస్తకాలను గుర్తించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. పాఠ్యాంశాలపై మరింత పట్టు సాధించేలా వేసవి సెలవుల్లో విద్యార్థులను ప్రోత్సహించాలని డీఈవోలకు సూచించారు. ద్విభాషా పాఠ్య పుస్తకాల రూపంలో ఉన్న సైన్స్, సామాజిక శాస్త్ర పాఠ్య పుస్తకాలను కథలుగా చదవడం ద్వారా సబ్జెక్టులపై అవగాహన పెరిగి, విద్యార్థులకు ఇంగ్లిష్‌పై పట్టు వస్తుందని తెలిపారు.

బాబు, పవన్‌పై కఠిన చర్యలు తీసుకోండి

సాక్షి, అమరావతి: సీఎం జగన్‌ను వ్యక్తిత్వ హననం చేస్తూ దూషణలు చేసిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని.. వారిద్దరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాని (ఈసీ)కి వైఎస్సార్‌సీపీ నేతలు ఫిర్యాదు చేశారు. ఈనెల 24న నెల్లిమర్ల సభలో ముఖ్యమంత్రిని దూషిస్తూ వారిద్దరూ ప్రసంగించారని తెలిపారు. ఈనెల 25న రాజంపేట, రైల్వేకోడూరు సభల్లోనూ సీఎం జగన్‌తోపాటు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిలను తూలనాడుతూ బాబు, పవన్ ప్రసంగించి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని ఫిర్యాదు చేశారు. ఇక వివేకా హత్యకు సంబంధించిన వ్యవహారం కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ.. దానిపై కూడా వ్యాఖ్యలు చేశారని వైఎస్సార్‌సీపీ నేతలు వివరించారు.

ఎవరి పిటిషన్లతోనో చార్జిషీట్‌లో పేరు పెట్టరు

షర్మిల వ్యాఖ్యలపై
సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ



సాక్షి, విశాఖపట్నం: ఎవరో పిటిషన్ పెట్టినంత మాత్రాన చార్జిషీట్‌లో వ్యక్తుల పేర్లు పెట్టే ప్రసక్తే ఉండదని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ (జేడీ) వీవీ లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. చార్జిషీట్‌లో వైఎస్ఆర్ పేరుని వైఎస్ జగన్ చేర్పించారంటూ షర్మిల అబద్ధపు వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఆయన విశాఖలో టీవీ ఛానెళ్లకి ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పందించారు. తాను ఉన్నంతవరకు వైఎస్ఆర్ పేరు పెట్టాలన్న పిటిషన్ ఏమీ రాలేదని స్పష్టం చేశారు. ఒక వ్యక్తి మరణించి ఉంటే వారిని నిందితుడిగా చార్జిషీట్‌లో చూపించబోమన్నారు. కానీ.. ఆ వ్యక్తి గురించి ఛార్జిషీట్‌లో పొందుపరిచి ఉంటుందని తెలిపారు. చార్జిషీట్‌లో మరణించిన వ్యక్తి భూమిక, వారి వివరాలు రాస్తాం తప్ప.. స్పెషల్‌గా వాళ్ల పేర్లు రాసే అవసరం ఉండదన్నారు. సీబీఐ, పోలీస్ ఇన్వెస్టిగేషన్‌లోనూ ఇదే పద్ధతిని అనుసరిస్తామన్నారు. చార్జిషీట్ అంటే.. విచారణ చేసిన తర్వాత దర్యాప్తు బృందం అధికారి అప్పటివరకూ సేకరించిన వివరాల ప్రకారం ఎవరెవరు నేరాలకు పాల్పడ్డారో వారి పేర్లని పొందుపరిచేదే అని చెప్పారు. ఎవరిని నిందితులుగా చేర్చాలి, ఎవరి పేర్లు చార్జిషీట్లో పెట్టి విచారించాలన్నది ఇన్వెస్టిగేటింగ్ ఏజెన్సీనే నిర్ణయిస్తుందని తెలిపారు. ఇందులో బయట వ్యక్తులు చెప్పిన పేర్లు పెట్టే పరిస్థితి ఎక్కడా ఉండదని స్పష్టం చేశారు. అలా అయితే.. ఎవరెవరో వచ్చి చెప్పిన ప్రతి వ్యక్తి పేరునూ ఛార్జిషీట్లో పెట్టాల్సి ఉంటుందని, ఇది ఎప్పుడూ జరగదని చెప్పారు.

చెల్లే విధంగా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోండి

నిబంధనలు చదివి హడావుడి లేకుండా ఓటు వేయండి.. క్రాస్ మార్క్ లేదా టిక్ మాత్రమే చేయాలి




సాక్షి, అమరావతి: పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే వారు అన్ని నిబంధనలు చదివి హడావుడి లేకుండా నిర్దేశించిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటుహక్కు వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ఒక ప్రకటనలో కోరింది. ప్రతి ఓటు చెల్లేవిధంగా నిబంధనలు పాటిస్తూ ఓటు వేయాలంటూ పలు సూచనలు ఇచ్చింది. రాష్ట్రంలో ఎన్నికల విధులు నిర్వర్తించే పోలింగ్ అధికారులు, పోలీస్ సిబ్బంది, వీడియోగ్రాఫర్లు, డ్రైవర్లతోపాటు సర్వీస్ ఓటరుగా నమోదైన సైనికదళాల సిబ్బంది, వైకల్యం 40 శాతానికిపైగా

డిక్లరేషన్ ఫారం, కవర్ ఏ విడివిడిగా ఉంచాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం సూచనలు

ఉన్న దివ్యాంగులు, 85 సంవత్సరాల వయసు దాటిన వృద్ధులు, ప్రస్తుతం కోవిడ్ బాధితులు, అత్యవసర సేవలుగా గుర్తించిన ప్రభుత్వశాఖల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పిస్తోంది. ఇందులో సర్వీసు ఓటర్లకు ఎలక్ట్రానికల్లీ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ విధానం ద్వారా అవకాశం కల్పిస్తుండగా మిగిలిన వారు రిటర్నింగ్ అధికారి నిర్దేశించిన తేదీల్లో ఏర్పాటు చేసిన ఓటర్స్ ఫెసిలిటేషన్ సెంటర్లో ఓటుహక్కు వినియోగించుకోవాలి. హోమ్ ఓటింగ్ ఎంచుకున్న వారు రిటర్నింగ్ అధికారి ఏర్పాటు చేసిన పోలింగ్ టీమ్ సహకారంతో ఇంటివద్దే ఓటుహక్కు వినియోగించుకోవచ్చు.



ఈ విధంగా ఓటు వేయాలి

- మీ ఓటు ఉన్న పోలింగ్ స్టేషన్ (బూత్) (పార్ట్ నంబర్) నంబర్, ఓటర్ల జాబితాలో మీ ఓటు క్రమసంఖ్య తెలుసుకోవాలి.
- ఓటరు తన ఎపిక్ కార్డుగానీ, భారత ఎన్నికల సంఘం గుర్తించిన ఇతర గుర్తింపుపత్రంతోగానీ ఫెసిలిటేషన్ సెంటర్‌కు వెళ్లాలి.
- ప్రతి ఓటరుకు పోస్టల్ బ్యాలెట్ పేపర్‌తోపాటు కొన్ని ఫారాలు, కవర్లు ఇస్తారు. అసెంబ్లీ బ్యాలెట్ పేపరు, కవర్ 13బీ, 13సీ గులాబీ (పింక్) రంగులో ఉంటాయి. లోక్‌సభ బ్యాలెట్ పేపరు తెలుపు రంగులోను, కవర్ 13బీ, 13సీ నీలం (గ్రీన్) రంగులోను ఉంటాయి. ఇందులో ఫారం 13 ఏ– డిక్లరేషన్, ఫారం 13బీ కవర్ ఏ (చిన్న, లోపల కవర్), ఫారం 13సీ కవర్ బీ (పెద్ద, బయట కవర్), ఫారం 13డీ ఓటరుకి సూచనలు ఉంటాయి.
- ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌లోకి వెళ్లి, బ్యాలెట్ పేపర్ మీద ఓటును నచ్చిన అభ్యర్థికి క్రాస్‌మార్క్ ద్వారా లేదా టిక్ రూపంలో నమోదు చేయాలి.
- బ్యాలెట్ పేపర్ మీద సంతకం చేయరాదు. ఓటరు గుర్తింపు తెలిపే ఏ విధమైన గుర్తులు రాయరాదు. ఈ విధంగా చేస్తే ఆ ఓటును పరిగణనలోకి తీసుకోరు.
- ఫారం 13ఏ డిక్లరేషన్ ఫారంలో బ్యాలెట్ పేపర్ సీరియల్ నంబరు రాసి సంతకం చేయాలి. ఫారం 13ఏలో ఓటరు గుర్తింపును గెజిటెడ్ అధికారి ధ్రువీకరించాలి. ఇందుకోసం ఫెసిలిటేషన్ సెంటర్ల వద్ద గెజిటెడ్ ఆఫీసర్లు అందుబాటులో ఉంటారు.
- ఓటు నమోదు చేసిన బ్యాలెట్ పేపర్‌ను ఫారం 13బీ అంటే ఇన్నర్ కవర్‌లో పెట్టి సీల్ చేయాలి. ఆ కవర్‌పై ఓటరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి చిరునామా రాయాలి. ఇన్నర్ కవర్ ఏ పై పోస్టల్ బ్యాలెట్ సీరియల్ నంబరు రాయాలి. ఇన్నర్ కవర్ ఏ లో బ్యాలెట్ పేపర్ మాత్రమే ఉండాలి. బ్యాలెట్ పేపర్‌ని సీల్‌చేసి పెట్టిన కవర్ ఏ, డిక్లరేషన్ ఫారాన్ని విడివిడిగా ఫారం 13సీ అనగా కవర్ బీలో పెట్టి సీల్‌చేసి సంబంధిత రిటర్నింగ్ అధికారి చిరునామా రాయాలి. కవర్ బీ పై ఓటరు సంతకం చెయ్యాలి. ఈ కవరును అక్కడ ఏర్పాటు చేసిన బాక్సులో వేయాలి.
- పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే వారు ముఖ్యంగా గుర్తుపెట్టుకోవాల్సిన అంశం ఏమిటంటే ఓట్ల లెక్కింపు కేంద్రంలో కవర్ బీని తెరవగానే, కవర్ ఏ, ఓటరు డిక్లరేషన్ ఫారం విడివిడిగా లేకపోతే ఆ పోస్టల్ బ్యాలెట్ కవర్ ఏని పరిగణనలోకి తీసుకోరు.

మరోసారి మోసం చేయడానికే కూటమి

- అధికారం కోసమే అమలు చేయలేని హామీలు
- అద్దంకి అభివృద్ధికి సహకారం అందిస్తా
- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



అద్దంకి: అమలు చేయలేని హామీలతో ప్రజలను మరోసారి మోసం చేసి అధికారం చేజిక్కించుకునేందుకు టీడీపీ కూటమి ప్రజల ముందుకు వస్తోందని రాజ్యసభ్యుడు, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. 2014లో టీడీపీ ఇదే విధంగా కూటమి కట్టి అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని గుర్తు చేశారు. బాపట్ల జిల్లా అద్దంకి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో జన్మభూమి కమిటీల పేరుతో ఏ విధంగా రాష్ట్రాన్ని దోచుకుందో అందరికీ తెలుసన్నారు. అందుకే 2019లో ప్రజలు వైఎస్సార్‌సీపీకి అధికారం కట్టబెట్టిన విషయం గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన తరువాత పాదయాత్రలో ఇచ్చిన హామీలతోపాటు నవరత్నాల పథకాల ద్వారా పేద బడుగు, బలహీన వర్గాల వారికి మేలు చేసిందని చెప్పారు. అర్హతే ప్రామాణికంగా పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్ ప్రభుత్వానిదే అన్నారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల సేవలతో గ్రామస్థాయిలో పాలన అందించిన ప్రభుత్వం వైఎస్సార్‌సీపీది అన్నారు. నాడు–నేడు ద్వారా వైద్యశాలలు, పాఠశాలలను తీర్చిదిద్దామని చెప్పారు. ఇంకా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. కార్యకర్తలు, నాయకులు ఇంటింటికీ వెళ్లి వాస్తవాలు తెలియజేసి అద్దంకిలో హనిమిరెడ్డిని ఎమ్మెల్యేగా, బాపట్ల ఎంపీగా నందిగం సురేష్‌ను గెలిపించాలని కోరారు. అద్దంకిని అభివృద్ధి చేసే బాధ్యత తాను, అయోధ్య రామిరెడ్డి తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

ఓటు అడిగే అర్హత వైఎస్సార్‌సీపీకే ఉంది

చెప్పిన హామీలు నెరవేర్చిన వైఎస్సార్‌సీపీకే ఓటు అడిగే అర్హత ఉందని రాజ్యసభ సభ్యుడు, పార్టీ కో–ఆర్డినేటర్ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి అన్నారు. టీడీపీ కూటమి గతంలో ఇచ్చిన హామీల్లో 20 శాతం కూడా అమలు చేయలేదన్నారు. మళ్లీ టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి కట్టి ప్రజల ముందుకొచ్చినా ప్రజలు నమ్మరన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో 87% మందికి మేలు జరిగిందని చెప్పారు. మిగిలిన 13% పథకాలు అవసరం లేనివారని చెప్పారు. అత్యధిక శాతం ప్రజలు వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారని, మరికొద్ది రోజులు కష్టపడితే మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కనకారావు మాట్లాడుతూ ఈ ఎన్నికలు నిజానికి, అబద్ధానికి మధ్య జరగబోతున్నాయని చెప్పారు. గత ప్రభుత్వంలో స్కీములంటే స్కాములే అన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డి, బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

అంధులు, బధిరుల విద్యాలయాల్లో అడ్మిషన్లు

- 491 సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ
- ఆరు ఆశ్రమ పాఠశాలలు, ఒక ప్రభుత్వ బధిరుల జూనియర్ కాలేజీలో అవకాశం

సాక్షి, అమరావతి: ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్య అందిస్తోంది. ఇందుకోసం ప్రత్యేక ఉపాధ్యాయులతో బోధన చేపట్టింది. రాష్ట్రంలో మూడు అంధులు, మూడు బధిరుల ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ బధిరుల జూనియర్ కళాశాలల్లో మొత్తం 491 సీట్ల భర్తీకి చర్యలు చేపట్టినట్టు రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సంచాలకులు వి.రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు కావాల్సిన వారు దరఖాస్తు చేసుకోవాలని శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో కోరారు. ఆయా పాఠశాలల్లో దరఖాస్తులు స్వీకరిస్తారని, ఐదేళ్ల వయసుపైబడి ఉన్నవారు ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు దరఖాస్తుకు జత చేసి పంపాలన్నారు.

	ఊరు	తరగతి	ఖాళీలు	సెల్ నంబర్లు
అంధుల ఆశ్రమ పాఠశాల	విజయనగరం	1–8	38	9494914959, 8317548039
	విశాఖపట్నం	1–10	48	9014456753, 9866542313
	హిందూపురం	1–10	98	6302242130, 9490010115
	బాపట్ల బధిరుల ఆశ్రమ జూనియర్ కాలేజీ	ఇంటర్ ఫస్ట్ ఇయర్	25	9491795728, 9949004094
బధిరుల ఆశ్రమ పాఠశాల	విజయనగరం	1–8	21	9440437629, 9000013640
	బాపట్ల	1–10	153	9491795728, 9949004094
	ఒంగోలు	1–10	108	9441943071, 9985837919

ఆధారాల్లేకున్నా జైలులో ఉంచడం రాజ్యాంగ విరుద్ధం

సాక్షి, హైదరాబాద్: తనకు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లేకపోయినా 32 నెలలుగా జైలులో ఉంచడం రాజ్యాంగ సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని వైఎస్ వివేకా హత్య కేసులో నిందితుడు సునీల్ యాదవ్ తెలంగాణ హైకోర్టులో వాదనలు వినిపించారు. తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. న్యాయవాది టీఎల్ నయన్‌కుమార్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ జరిపారు. సునీల్ యాదవ్ తరఫున సీనియర్ న్యాయవాది బి.రమేశ్ వాదనలు వినిపిస్తూ.. వివేకా హత్య కేసులో సునీల్ యాదవ్‌కు సంబంధం లేకపోయినా అన్యాయంగా ఇరికించారని చెప్పారు. హత్య కేసుకు వినియోగించిన గొడ్డలిని కాలువలో పడేశారన్నది సునీల్‌పై ప్రధాన ఆరోపణ అని, అదే నిజమైతే ఇప్పటివరకు ఆ ఆయుధం ఎందుకు దొరకలేదని అన్నారు. మరో నిందితుడు దస్తగిరి వాంగ్మూలం తప్ప సునీల్ యాదవ్‌కు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారమూ లేదని, ఇంతకాలం జైల్లో ఉంచటం అతని హక్కులను హరించడమే అవుతుందన్నారు. ఆధారాల్లేకుండా జైలులో ఉంచడం సుప్రీం తీర్పులకు విరుద్ధమన్నారు. బెయిల్ మంజూరు చేయాలని కోరారు.

ఎన్డీయే అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు రద్దు

ఎమ్మెల్సీ ఇసాక్ బాషా



నంద్యాల (సిటీ): ఏపీలో పొరపాటున ఎన్డీయే అధికారంలోకి వస్తే.. ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తారని ఎమ్మెల్సీ ఇసాక్ బాషా అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, టీడీపీ, జనసేనలు ముస్లింల హక్కులను నిర్వీర్యం చేసేందుకు కంకణం కట్టుకున్నాయని ధ్వజమెత్తారు. ఇటీవల కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ముస్లింలకు ప్రభుత్వం ఇస్తున్న 4శాతం రిజర్వేషన్లను రద్దు చేస్తామని చెప్పడం సరికాదన్నారు. వెనుకబడిన ముస్లింల అభివృద్ధికి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఇచ్చిన రిజర్వేషన్లు ఎత్తేస్తామని చెప్పడం విడ్డూరమని చెప్పారు. ఎన్డీయే కుట్రలో భాగంగానే సీఏఏ, ఎన్ఆర్సీల ద్వారా ముస్లింల స్థానికతపై దెబ్బతీసేలా అడుగులు పడుతున్నాయన్నారు. ముస్లింలకు రిజర్వేషన్లు వద్దన్న వారు వారి ఓట్లు ఎలా కావాలని కోరుతున్నారని చంద్రబాబును ప్రశ్నించారు. కుల మతాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమాభివృద్ధిని అందిస్తున్న వైఎస్ జగన్‌కు ముస్లింలంతా మద్దతివ్వాలని పిలుపునిచ్చారు.

దళితులపై చింతమనేని దాడి

- ఆస్పత్రి పాలైన ఐదుగురు యువకులు

పెదవేగి: ఏలూరు జిల్లా దెందులూరు ఎమ్మెల్యే అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ శుక్రవారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో దళిత యువకుడిపై దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ఏలూరు జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. పెదవేగి మండలం దిబ్బగూడెం–లక్ష్మీపురంలో టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ శుక్రవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దళిత యువకుడైన యర్రా చంటిబాబు తమకు జగనన్న ప్రభుత్వంలో అంతా మంచే జరిగిందని చెప్పగా.. చింతమనేని బూతు పురాణం లంకించుకున్నారు. 'నేను పోటీలో లేకపోతే నిన్ను గుద్దుకు చంపేసేవాడిని.. కొజ్జా నా కొడకా..' అంటూ ఆ యువకుడిపై దాడికి పాల్పడి తీవ్రంగా గాయపరిచారు. ప్రచారంలో పట్టుమని 10 మంది లేకపోవడంతో తీవ్ర నిరాశలో చింతమనేని పిచ్చెక్కినవాడిలా ప్రవర్తించాడని, ఓట్ల కోసం వచ్చి తమపై దౌర్జన్యమేమిటని కాలనీ వాసులు విరుచుకుపడ్డారు.

అనుచరుల్ని ఉసిగొల్పి మరో నలుగురిపై..

అనంతరం లక్ష్మీపురం నుంచి రామసింగవరం చేరుకున్న చింతమనేని తన అనుచరుల్ని ఉసిగొల్పి గ్రామానికి చెందిన దళిత యువకులు జెర్రిపోతుల మధు, జుజ్జువరపు రాజేష్‌తోపాటు కూచింపూడి గ్రామానికి చెందిన రామానుజం పవన్‌కుమార్, రామానుజం శివసాయిపై చింతమనేని దాడి చేయించగా.. నలుగురికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఏలూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, బీసీ రాష్ట్ర నాయకుడు అశోక్‌గౌడ్ పరామర్శించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

షర్మిల పొరపాటు.. కాంగ్రెస్‌కు గ్రహపాటు

ఇద్దరి నామినేషన్లను తిరస్కరించిన రిటర్నింగ్ అధికారి

తెనాలి రూరల్: కాంగ్రెస్ పార్టీ ఏపీ అధ్యక్షురాలు షర్మిల చేసిన పొరపాటు కారణంగా గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురైంది. షర్మిల తెనాలిలో ఏకంగా ఇద్దరు వ్యక్తులకు బీఫాం ఇచ్చింది. అందులో ఒకరికి తెలంగాణలో ఓటు హక్కు ఉంది. శుక్రవారం వీటిని పరిశీలించిన రిటర్నింగ్ అధికారి.. ఆ నామినేషన్లను తిరస్కరించారు. వివరాలు.. కాంగ్రెస్ పార్టీ తరఫున తెనాలిలోని బాలాజీరావుపేటకు చెందిన షేక్ బషీద్ ఈ నెల 22న నామినేషన్ దాఖలు చేశారు. 23వ తేదీన షర్మిల తెనాలి మార్కెట్ వద్ద సభ నిర్వహించి.. బషీద్‌ను కాంగ్రెస్ అభ్యర్థిగా పరిచయం చేశారు. ఆయనకు ఓటు వేయాలని కోరారు. కాగా, పదేళ్లుగా తెనాలిలో కాంగ్రెస్ పార్టీని నడిపిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ చందు సాంబశివుడికి కనీస సమాచారం ఇవ్వకుండా బషీద్ పేరును ప్రకటించడంపై స్థానిక నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఈనెల 24వ తేదీన డాక్టర్ సాంబశివుడికి షర్మిల మరో బీఫాంను అందజేశారు. 25వ తేదీన ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను అందజేశారు. శుక్రవారం జరిగిన స్క్రూటినీలో బషీద్, సాంబశివుడు కాంగ్రెస్ బీఫాంలను పొందుపరిచినట్టు ఎన్నికల అధికారులు గుర్తించారు. తొలుత నామినేషన్ వేసిన బషీద్‌కు ఇచ్చిన బీఫాంను రద్దు చేస్తున్నట్టు అధికారిక ధ్రువీకరణ లేకపోవడంతో డాక్టర్ చందు సాంబశివుడి నామినేషన్ తిరస్కరణకు గురైంది. మరోవైపు బషీద్‌కు తెలంగాణలో ఓటు హక్కు ఉందని తేలడంతో.. ఆయన నామినేషన్‌ను కూడా అధికారులు తిరస్కరించారు. దీంతో కాంగ్రెస్ పార్టీ తెనాలి రేసు నుంచి అవుట్ అయ్యింది.

ముస్లిం రిజర్వేషన్లపై కూటమి కుటిల నీతి

సాక్షి, అమరావతి: ముస్లిం రిజర్వేషన్లపై బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి కుటిల నీతి ప్రదర్శిస్తోందని, కులాలు, మతాలుగా విభజించి లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తోందని ఏపీ ముస్లిం ఐక్య కార్యాచరణ కమిటీ(జేఏసీ) రాష్ట్ర కన్వీనర్ షేక్ మునీర్ అహ్మద్ అన్నారు. ఒక పథకం ప్రకారమే ముస్లిం మైనార్టీల రిజర్వేషన్లను తెరపైకి తెచ్చి ప్రజలను మతాల పేరుతో విభజించి రాజకీయ లబ్ధి పొందేందుకు పెద్ద కుట్ర జరుగుతోందని శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వాస్తవానికి ముస్లిం రిజర్వేషన్లు మతపరమైనవి కావని, సామాజికంగా వెనుకబడిన ముస్లింలను గుర్తించి 2004లో అప్పటి సీఎం వైఎస్సార్ రిజర్వేషన్లు ఇచ్చినట్టు తెలిపారు. విద్యా, ఉపాధి రంగాల్లో తక్కువ ప్రాతినిధ్యం ఉన్న ముస్లిం సమూహాలకు తొలుత ఐదు శాతం బీసీ రిజర్వేషన్లు కల్పించిన వైఎస్సార్.. రిజర్వేషన్లు 50శాతం మించకూడదన్న సుప్రీం ఆదేశాలతో 4 శాతం ఇచ్చినట్టు తెలిపారు. 2004 ఎన్నికల్లో తాను కూడా ముస్లింలకు రిజర్వేషన్లు ఇస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారని, ఆ ఎన్నికల్లో అధికారం చేపట్టిన వైఎస్సార్ రిజర్వేషన్లు కల్పిస్తే.. వాటిని అడ్డుకునేందుకు చంద్రబాబు కోర్టులో కేసులు వేయించిన సంగతి ముస్లింలు మరిచిపోలేదని పేర్కొన్నారు. వాస్తవాలు ఇలా ఉంటే.. ఇప్పుడు ఎన్నికల్లో లబ్ధి కోసం ఉద్దేశపూర్వకంగానే బీజేపీ కూటమి మత ప్రాతిపదికన రిజర్వేషన్లు చెల్లవని అబద్ధపు ప్రచారం చేయడం సరికాదన్నారు. ఏపీలో ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, పీయూష్ గోయల్ ప్రకటించారని, ఈ రిజర్వేషన్లు కొనసాగిస్తానని సీఎం జగన్ ఒక్కరే గట్టిగా చెబుతున్నారని, ఈ విషయంలో బాబు తన వైఖరేంటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా టీడీపీలోని ముస్లిం సమూహాలు బయటికొచ్చి కూటమి కపటత్వాన్ని ఖండించాలని కోరారు.

షర్మిలను నమ్మితే సర్వనాశనమే

వైఎస్సార్‌టీపీ మాజీ నేతల ధ్వజం

కడప రూరల్: తెలంగాణలో రాజన్న రాజ్యం తెస్తానంటే తాము గుడ్డిగా షర్మిలను నమ్మి మోసపోయామని వైఎస్సార్ తెలంగాణ పార్టీ మాజీ నేతలు ధ్వజమెత్తారు. వైఎస్సార్‌ను అభిమానించే తాము ఆమెకు అండగా నిలబడితే.. ఆమె తమను, కార్యకర్తలను నిలువునా నట్టేట ముంచారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో వైఎస్సార్‌టీపీ విలీనం ఒక చీకటి ఒప్పందమన్నారు. అన్నకు రాఖీ కట్టి ఆ అన్ననే మోసం చేసిన ఆమె ప్రజలకు ఏం మేలు చేస్తారని ప్రశ్నించారు. ఏపీ ప్రజలు ఆమెను నమ్మి మోసపోవద్దన్నారు. ఎన్నికల తర్వాత ఆమె విదేశాలకు వెళ్లిపోతారన్నారు. మోరుసుపల్లి షర్మిలను నమ్ముకోకండి..ఉన్నది అమ్ముకోకండని పిలుపునిచ్చారు. కడపలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం వైఎస్సార్‌టీపీ మాజీ నేత, ఆ పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేసిన డేవిడ్ శాంతిరాజు మాట్లాడుతూ ఏపీలో జగనన్న నేతృత్వంలో రాజన్న రాజ్యం నడుస్తోందని, తెలంగాణలో కూడా రాజన్న రాజ్యం తేవడానికే వచ్చానని చెప్పడంతో ఆమెకు అండగా నిలిచామన్నారు. తమ ఆస్తులను కూడా అమ్ముకొని పార్టీ కోసం పనిచేశామన్నారు. అయితే అక్కడ ఎన్నికలకు మూడు నెలల ముందు నుంచే షర్మిల అండర్ గ్రౌండ్‌లోకి వెళ్లిపోయారని ఆరోపించారు. రేవంత్ రెడ్డిని ఓటుకు నోటు దొంగ..దొంగకే తాళాలు అప్పగించారని విమర్శించి.. చివరికి ఆయన సమక్షంలోనే కాంగ్రెస్ పార్టీలో వైఎస్సార్‌టీపీని విలీనం చేశారని మండిపడ్డారు. షర్మిల వైఎస్సార్ ఖ్యాతిని చెరిపేసేలా కుటిల రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.



నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌టీపీ మాజీ నేతలు

షర్మిల వల్ల 500 కుటుంబాలు నాశనం..

షర్మిల వల్ల తెలంగాణలో 500 కుటుంబాలు రాజకీయంగా సర్వనాశనం అయ్యాయని డేవిడ్ శాంతిరాజు తెలిపారు. వైఎస్సార్‌టీపీ ఎస్టీ సెల్ మాజీ నేత బానోత్ రాజశేఖర్ మాట్లాడుతూ షర్మిల రాజకీయంగా కొనసాగాలంటే తెలంగాణ ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి ఎన్ఓసీ తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైఎస్సార్‌కు నిజమైన వారసుడు సీఎం జగన్

- వైఎస్సార్ ఆశయాలను నెరవేరుస్తున్నారు
- వారసురాలినంటూ షర్మిల చెప్పుకోవడం విడ్డూరం
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



ఒంగోలు: వైఎస్సార్‌కు నిజమైన వారసుడు సీఎం వైఎస్ జగన్ అని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు తెలిపారు. వైఎస్సార్ ఆశయాలను వైఎస్ జగన్ నెరవేరుస్తున్నారని కొనియాడారు. వైఎస్సార్ వారసురాలినంటూ షర్మిల చెప్పుకోవడం విడ్డూరమన్నారు. ఒంగోలులో శుక్రవారం సుధాకర్ బాబు మీడియాతో మాట్లాడారు. ప్రతిక్షణం ప్రజల హృదయాల్లో నిలిచిపోయేలా సీఎం వైఎస్ జగన్ పరిపాలిస్తున్నారని కొనియాడారు. వైఎస్సార్ వారసురాలినంటూ వస్తున్న వైఎస్ షర్మిల, వారి చిన్నాన్న కుమార్తె సునీతల వ్యవహారం చూస్తే బైబిల్‌లో 'తప్పిపోయిన కుమారుల కథ' గుర్తుకు వస్తుందన్నారు. అందులో రెండో కుమారుడి మాదిరే చివరకు షర్మిల, సునీత కూడా విజయమ్మను ఆశ్రయించి.. ఆమె ద్వారా సీఎం జగన్‌ను క్షమించమని అడిగే రోజులు తప్పకుండా వస్తాయని చెప్పారు. సోదరుడిపై రాజకీయపరంగా విమర్శలు చేసేటప్పుడు వారి మాటతీరు సరిగా ఉండాలన్నారు. కుటుంబపరమైన అంశంపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం సరికాదన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకే కాంగ్రెస్‌లో చేరినట్లు షర్మిల చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఎక్కడా ఎక్కి రాలేక చివరకు కనుచూపు మేరలో కూడా లేని కాంగ్రెస్ పార్టీలో చేరి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ప్రజలు ఓట్లేయరని చెప్పారు. వైఎస్ వివేకా హత్య కేసును రాష్ట్రంలో ఉన్న తాము ప్రభావితం చేయడం సాధ్యపడదనేది తెలుసుకోవాలన్నారు. ప్రత్యేక హోదా పాపం ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టీదే అని, నాడే పార్లమెంట్‌లో ప్రత్యేక హోదా చట్టం చేసి ఉంటే నేడు ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కు మే 13న గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

జగన్ కాళ్ల కింద రైతులు

పీసీసీ అధ్యక్షురాలు షర్మిల



దెందులూరు/తిరువూరు/చింతలపూడి: రైతులను వైఎస్సార్ నెత్తిన పెట్టుకుంటే సీఎం వైఎస్ జగన్ తన కాళ్ల కింద పెట్టుకున్నారని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల మండిపడ్డారు. శుక్రవారం ఆమె ఏలూరు జిల్లా దెందులూరు, చింతలపూడి, ఎన్టీఆర్ జిల్లా తిరువూరుల్లో ఎన్నికల ప్రచార సభల్లో మాట్లాడారు. మన రాష్ట్రంలో అప్పు లేని రైతు లేడని.. దానికి కారణం జగనేనని ఆరోపించారు. ఏటా రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి దానిలో నుంచి నిధులు ఇస్తామన్నారు.. ఇచ్చారా అని ప్రశ్నించారు. ఐదేళ్ల అధికారంలో ఉన్న జగన్ గుడ్డి గుర్రానికి పళ్లు తోమారా అని నిలదీశారు. మూడు రాజధానులు ఏర్పాటు చేస్తానని చెప్పి ఒక్కదాన్ని అయినా కట్టారా అని ప్రశ్నించారు. పక్క రాష్ట్రాలు అభివృద్ధిలో దూసుకుపోతున్నా.. మనకు చేతిలో చిప్ప తప్ప ఏమీ లేదన్నారు. ఏటా సంక్రాంతికి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారని.. ఎన్ని విడుదల చేశారని నిలదీశారు. కుంభకర్ణుడైనా ఆరు నెలలే నిద్రపోతాడని, జగన్ ఐదేళ్లు నిద్రపోయారని మండిపడ్డారు.

సాక్షి బిజినెస్
శనివారం
27-4-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	609	73,730
నిఫ్టీ ▽	150	22,420

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	15,972	▲ 362
డోజోన్స్	38,303	▲ 217
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,140	▲ 61
డాక్స్	18,616	▲ 244
షాంఘై	3,089	▲ 36
నికాయ్	37,935	▲ 306

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	72,448 ▲	354
బంగారం (99.5 స్వచ్ఛత)	72,158 ▲	353
వెండి (కేజీ)	81,374 ▲	476

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారతీయ	84.19	85.17
£	బ్రిటన్ పౌండ్	భారతీయ	101.81	106.76
€	యూరో	భారతీయ	87.13	91.68
¥	జపాన్ ఎన్ (100)	భారతీయ	41.00	66.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	భారతీయ	52.05	56.89
S$	సింగపూర్ డాలర్	భారతీయ	58.96	63.67
SAR	సౌదీ రియాల్	భారతీయ	21.32	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయ	21.80	23.58
¥	చైనా యువాన్	భారతీయ	10.38	12.45

సాండూర్ మాంగనీస్ చేతికి ఆర్జాస్ స్టీల్

బెంగళూరు: స్పెషల్ స్టీల్ ఉత్పత్తులను తయారు చేసే ఆర్జాస్ స్టీల్‌లో (ఏఎస్‌పీఎల్) నియంత్రణాధికారాలు ఉండే వాటాలను కొనుగోలు చేయనున్నట్లు సాండూర్ మాంగనీస్ అండ్ ఐరన్ ఓర్స్ వెల్లడించింది. ఇందుకోసం పీఈ సంస్థ ఏడీవీ పార్ట్‌నర్స్‌తో షేర్ల కొనుగోలు ఒప్పందం కుదుర్చుకున్నట్లు వివరించింది. ఈ డీల్ కోసం సంస్థ విలువను రూ. 3,000 కోట్లుగా లెక్కగట్టారు. ఆర్జాస్‌కు ఆంధ్రప్రదేశ్‌లోని తాడిపత్రిలో, పంజాబ్‌లోని మండీ గోబింద్‌గఢ్‌లో మొత్తం రెండు ప్లాంట్లు ఉన్నాయి. ప్రస్తుతం ఈ ప్లాంట్లను విస్తరిస్తున్నారు. ఆటోమొబైల్స్‌తో పాటు ఎనర్జీ, రైల్వేస్, డిఫెన్స్, ఇంజినీరింగ్ తదితర విభాగాల సంస్థలకు ఉత్పత్తులు అందిస్తోంది.

ఎల్‌ఎస్‌పీలకు ఆర్‌బీఐ కొత్త నిబంధనలు

ముంబై: బ్యాంకులకు ఏజెంట్లుగా వ్యవహరించే లెండింగ్ సర్వీస్ ప్రొవైడర్స్ (ఎల్‌ఎస్‌పీ)కు రిజర్వ్ బ్యాంక్ కొత్త నిబంధనలు ప్రతిపాదించింది. వీటి ప్రకారం భావి రుణాలిచ్చేందుకు సిద్ధంగా ఉన్న అన్ని ఆర్థిక సంస్థల ఆఫర్లను భావి రుణ గ్రహీతలకు డిజిటల్ రూపంలో ఎల్‌ఎస్‌పీలు తెలియజేయాల్సి ఉంటుంది. ఈ విధానంలో, ఆఫర్ ఇస్తున్న ఆర్థిక సంస్థ (ఆర్‌ఈ) పేరు, రుణ మొత్తం, లోన్ కాల వ్యవధి, వార్షిక పర్సంటేజీ రేటు ఇతరత్రా కీలక నిబంధనలు, షరతులు మొదలైన వివరాలు ఉండాలి. రుణ గ్రహీత తనకు అందుబాటులో ఉన్న వివరాలను బట్టి సముచిత నిర్ణయం తీసుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

27-4-2024 ఫామ్ ధర...	
విశాఖ	400-00
చిత్తూరు	453-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	380-00
విజయవాడ	380-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	350-00
వరంగల్	352-00
రిటైల్ ధర	4.10

భారత్ వృద్ధి 6.6 శాతం: డెలాయిట్ ఇండియా



న్యూఢిల్లీ: భారత్ ఎకానమీ ఏప్రిల్‌తో ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024-25) 6.6 శాతం వృద్ధిని నమోదుచేసుకుంటుందని డెలాయిట్ ఇండియా పేర్కొంది. వినియోగ వ్యయం, ఎగుమతులు తిరిగి పుంజుకోవడం, పెట్టుబడుల పునరుత్తేజం వృద్ధికి దోహదపడే అంశాలుగా తాజా ఎకనమిక్ అవుట్‌లుక్‌లో వివరించింది. మధ్య-ఆదాయ తరగతి వేగవంతమైన వృద్ధి కొనుగోలు శక్తి పెరుగుదలకు దారితీస్తోందని తెలిపింది. దీనితో ప్రీమియం లగ్జరీ ఉత్పత్తులు, సేవలకు డిమాండ్ కూడా మెరుగుపడుతున్నట్లు తెలిపింది. 2030-31 నాటికి మధ్యస్థ-అధిక-ఆదాయ విభాగాల సంఖ్య రెండు కుటుంబాలలో ఒకటిగా ఉంటుందని అంచనావేసింది. ఈ ధోరణి ప్రైవేట్ వినియోగదారుల వ్యయ వృద్ధికి దారితీస్తుందని విశ్వసిస్తున్నట్లు విశ్లేషించింది. ప్రస్తుతం ఈ సంఖ్య నాలుగు కుటుంబాల్లో ఒకటిగా ఉందని తెలిపింది. మార్చితో ముగిసిన గత ఆర్థిక సంవత్సరం వృద్ధి రేటు అంచనాలను మెరుగుపరుస్తూ ఇది 7.6 శాతం నుంచి 7.8% శ్రేణిలో ఉంటుందని తెలిపింది. జనవరిలో వేసిన 6.9%-7.2% రేటు అంచనాలను గణనీయ స్థాయిలో పెంచడం గమనార్హం.

ఐదు రోజుల ర్యాలీకి బ్రేక్

వారాంతాన లాభాల స్వీకరణ ● బ్యాంకులు, ఫైనాన్స్, కన్జూమర్ షేర్లు డీలా



ముంబై: ఇన్వెస్టర్ల లాభాల స్వీకరణతో స్టాక్ సూచీలు శుక్రవారం దాదాపు ఒక శాతం కుదేలయ్యాయి. బ్యాంకులు, ఫైనాన్షియల్, కన్జూమర్ డ్యూరబుల్ షేర్లు డీలా పడ్డాయి. మిశ్రమ అంతర్జాతీయ సంకేతాలు ఇందుకు తోడయ్యాయి. సెన్సెక్స్ 609 పాయింట్లు పతనమై 73,730 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 150 పాయింట్లు నష్టపోయి 22,420 వద్ద నిలిచింది. దీంతో సూచీల అయిదు రోజుల లాభాలకు బ్రేక్ పడింది. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు ప్రథమార్ధమంతా లాభ నష్టాల మధ్య ట్రేడయ్యాయి. మిడ్ సెషన్ నుంచి అమ్మకాల తీవ్రత పెరగడంతో పూర్తిగా నష్టాల్లోకి జారుకున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 723 పాయింట్లు నష్టపోయి 73,617 వద్ద నిలిచింది. నిఫ్టీ 185 పాయింట్లు క్షీణించి 22,385 వద్ద ఇంట్రాడే కనిష్టానికి దిగివచ్చాయి.

వొడాఫోన్ ఐడియాలో తనకున్న మొత్తం వాటా 2.87%(144 కోట్ల షేర్లు)ను ఏటీసీ టెలికం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఓపెన్ మార్కెట్ ద్వారా విక్రయించింది. ఈ లావాదేవీ విలువ రూ.1,840 కోట్లు.

అపోలో 24/7లో అడ్వెంట్‌కు వాటా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అపోలో హాస్పిటల్స్ గ్రూప్‌నకు చెందిన అపోలో హెల్త్‌కో (అపోలో 24/7) తాజాగా ప్రైవేట్ ఈక్విటీ సంస్థ అడ్వెంట్ ఇంటర్నేషనల్ నుంచి రూ.2,475 కోట్ల వాటా మూలధనం సమకూర్చుకుంటోంది. ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు శుక్రవారం ప్రకటించింది. లావాదేవీలో భాగంగా అపోలో గ్రూప్‌లో భాగమైన హోల్‌సేల్ ఫార్మా డిస్ట్రిబ్యూషన్ కంపెనీ కీమెడ్ ప్రైవేట్ లిమిటెడ్, ఆన్‌లైన్ హెల్త్‌కేర్ కంపెనీ అపోలో 24/7 విలీనం కానున్నాయి. విలీనం తర్వాత ఏర్పడే అపోలో హెల్త్‌కో కంపెనీలో 12.1 శాతం వాటాకై కంపల్సరీ కన్వర్టబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ రూపంలో రెండు విడతల్లో అడ్వెంట్ పెట్టుబడి చేస్తుంది. అపోలో హెల్త్‌కోను రూ.22,481 కోట్లుగా విలువ కట్టారు. ఇందులో అపోలో 24/7ను రూ.14,478 కోట్లు, కీమెడ్‌ను రూ.8,003 కోట్లుగా విలువ కట్టారు. అపోలో హెల్త్‌కో కంపెనీలో అపోలో హాస్పిటల్స్‌కు 59.2 శాతం, కీమెడ్‌కు 25.7 శాతం వాటా ఉంటుంది.

మారుతీ రికార్డుల స్పీడ్

- షేరుకి రూ. 125 డివిడెండ్
- 21 లక్షల వాహన విక్రయాలు
- క్యూ4 లాభం రూ. 3,878 కోట్లు

న్యూఢిల్లీ: కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ గత ఆర్థిక సంవత్సరం (2023-24) చివరి త్రైమాసికంతోపాటు పూర్తి ఏడాదికి ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 48 శాతం జంప్‌చేసి రూ. 3,878 కోట్లను తాకింది. ఇది రికార్డుకాగా.. ఇందుకు జోరందుకున్న ఎస్‌యూవీ అమ్మకాలు, తగ్గిన కమోడిటీ ధరలు, వ్యయ నియంత్రణలు సహకరించాయి. అంతక్రితం ఏడాది(2022-23) క్యూ4లో కేవలం రూ. 2,624 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా షేరుకి రూ. 125 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం రూ. 30,822 కోట్ల నుంచి రూ. 36,697 కోట్లకు ఎగసింది. ఈ కాలంలో 13 శాతం అధికంగా 5,84,031 వాహనాలు విక్రయించింది. వీటిలో దేశీయంగా 5,05,291 యూనిట్లు విక్రయిస్తే.. 22% అధికంగా 78,740 వాహనాలు ఎగుమతి చేసింది.

టాప్ ఎక్స్‌పోర్టర్

మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి మారుతీ వాహన విక్రయాలు సరికొత్త రికార్డును నెలకొల్పుతూ 20 లక్షల యూనిట్లను అధిగమించాయి. దాదాపు 9 శాతం వృద్ధితో 21,35,323 యూనిట్లు అమ్ముడయ్యాయి. వీటిలో దేశీ విక్రయాలు 18,52,256కాగా.. 2,83,067 వాహనాలను ఎగుమతి చేసింది. తద్వారా మొత్తం ప్యాసింజర్ వాహన దేశీ ఎగుమతుల్లో 42 శాతం వాటాను ఆక్రమించింది. వెరసి వరుసగా మూడో ఏడాదిలోనూ టాప్ ఎక్స్‌పోర్టర్‌గా నిలిచింది. ఇక 2023-24లో నికర లాభం 64 శాతం దూసుకెళ్లి రూ. 13,209 కోట్లను అధిగమించింది. నికర అమ్మకాలు 20 శాతం వృద్ధితో రూ. 1,34,938 కోట్లకు చేరగా.. 2022-23లో ఇవి రూ. 1,12,501 కోట్లుగా నమోదయ్యాయి. క్యూ4 సహా పూర్తిఏడాదికి లాభాలు, అమ్మకాలలో సరికొత్త రికార్డులు సాధించినట్లు కంపెనీ పేర్కొంది.

ఈ ఏడాది ఎలక్ట్రిక్ వాహనాలు



"ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తొలి ఎలక్ట్రిక్ వాహనాన్ని ఉత్పత్తి చేస్తున్నాం. తొలిగా వీటిని యూరోపియన్ దేశాలకు ఎగుమతి చేయనున్నాం."
-ఆర్‌సీ భార్గవ, మారుతీ చైర్మన్



లాభాల స్వీకరణతో మారుతీ షేరు బీఎస్‌ఈలో 1.7 శాతం నీరసించి రూ. 12,687 వద్ద ముగిసింది.

హెచ్‌సీఎల్ టెక్ లాభం ఫ్లాట్

క్యూ4లో రూ. 3,986 కోట్లు ● షేరుకి రూ. 18 డివిడెండ్



ఐటీ సేవల దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ (2023-24) చివరి త్రైమాసికంతోపాటు పూర్తి ఏడాదికి ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం దాదాపు యథాతథంగా రూ. 3,986 కోట్లకు చేరింది. అయితే గతేడాది క్యూ3(అక్టోబర్-డిసెంబర్)లో సాధించిన రూ. 4,350 కోట్లతో త్రైమాసికవారీగా పోలిస్తే 8.4 శాతం క్షీణించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 18 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. మే 15కల్లా చెల్లించనుంది. మొత్తం ఆదాయం 7 శాతంపైగా బలపడి రూ. 28,499 కోట్లకు చేరింది.

3-5 శాతం వృద్ధి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) మొత్తం ఆదాయంలో 3-5 శాతం స్థాయిలో వృద్ధి అందుకోగలమని హెచ్‌సీఎల్ టెక్ తాజా అంచనాలు(గైడెన్స్) ప్రకటించింది. 18-19 శాతం ఇబిట్ మార్జిన్లు సాధించగలమన్న విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. గతేడాది క్యూ4లో 17.6 శాతం ఇబిట్ మార్జిన్లు ప్రకటించింది. ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు 19.4 శాతం నుంచి 12.4 శాతానికి దిగివచ్చింది.

10,000 మంది ఫ్రెషర్స్‌కు చాన్స్

హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ గతేడాది తరహాలోనే ఈ ఏడాది(2024-25) 10,000 మంది ఫ్రెషర్స్‌కు ఉద్యోగాలు కల్పించనున్నట్లు వెల్లడించింది. త్రైమాసికవారీగా క్యూ4లో 1,537 మంది ఉద్యోగులు జత కలిశారు. దీంతో సిబ్బంది సంఖ్య 2,27,481కు చేరింది. 2023-24లో హెచ్‌సీఎల్ టెక్ నికర లాభం 6 శాతం పుంజుకుని రూ. 15,702 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం సైతం 8 శాతంపైగా ఎగసి రూ. 1,09,913 కోట్లకు చేరింది.

హెచ్‌సీఎల్ టెక్ షేరు బీఎస్‌ఈలో 2% నష్టంతో రూ. 1,472 వద్ద ముగిసింది.

ఎస్‌బీఐ కార్డ్ లాభం ప్లస్



ఎస్‌బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్ సర్వీసెస్ చివరి త్రైమాసికంతోపాటు పూర్తి ఏడాదికి పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం 11 శాతం ఎగసి రూ. 662 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం సైతం 14 శాతం వృద్ధితో రూ. 4,475 కోట్లకు చేరింది. వడ్డీ ఆదాయం 28 శాతం పుంజుకుని రూ. 2,139 కోట్లను తాకింది. ఫీజు, కమిషన్ ఆదాయం 6 శాతం అధికమై రూ. 2,209 కోట్లయ్యింది. పూర్తి ఏడాదికి నికర లాభం 7 శాతం బలపడి రూ. 2,408 కోట్లకు చేరింది.

సాక్షి స్పోర్ట్స్

ఐపీఎల్‌లో నేడు
ఢిల్లీ × ముంబై (మ. 3:30 నుంచి)
లక్నో × రాజస్తాన్ (రాత్రి 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

పరుగుల పంజా...

- పంజాబ్ కింగ్స్ సంచలనం
- 262 లక్ష్యాన్ని ఛేదించి ఘనవిజయం
- టి20 చరిత్రలోనే ఇదే అత్యధికం
- 8 వికెట్లతో ఓడిన కోల్‌కతా
- బెయిర్‌స్టో అజేయ సెంచరీ
- శశాంక్ మెరుపు ఇన్నింగ్స్



బెయిర్‌స్టో


శశాంక్ సింగ్

37 ఫోర్లు... 42 సిక్సర్లు... ఇరు జట్లు కలిపి ఏకంగా 523 పరుగులు... ఈడెన్ గార్డెన్స్ పరుగుల వరదతో తడిసి ముద్దయింది. ఈ సీజన్ ఐపీఎల్‌లో భారీ స్కోర్ల సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ మరో మ్యాచ్‌లో 'రన్'రంగం కొనసాగింది ... అయితే ఈసారి తొలుత బ్యాటింగ్ చేసిన జట్టే కాకుండా రెండో టీమ్ కూడా అంతే బదులుగా జవాబిచ్చింది. ఫలితంగా టి20 చరిత్రలోనే రికార్డు ఛేదనతో మ్యాచ్ ముగిసింది... పేలవ ఆటతో వెనుకబడి ఒక్క విజయం కోసం తపిస్తున్న పంజాబ్ కింగ్స్ అసాధారణ బ్యాటింగ్‌తో భారీ లక్ష్యాన్ని ఛేదించడమే పెద్ద విశేషం. సొంతగడ్డపై 261 పరుగులు చేసి కోల్‌కతా నిశ్చింతగా నిలబడగా... తామూ తగ్గమంటూ రెచ్చిపోయిన కింగ్స్ మరో 8 బంతులు ఉండగానే 262 పరుగులతో ఘన విజయాన్నందుకుంది. వరుస వైఫల్యాల తర్వాత మెరుపు సెంచరీతో చెలరేగిన బెయిర్‌స్టో, యువ ఆటగాడు శశాంక్ ఈ మ్యాచ్‌లో పంజాబ్ హీరోలుగా నిలిచారు.

కోల్‌కతా: పంజాబ్ కింగ్స్ ఎట్టకేలకు జూలు విదిల్చింది. వరుసగా నాలుగు ఓటముల తర్వాత అత్యద్భుత ప్రదర్శనతో ఆ జట్టు కీలక విజయాన్ని అందుకుంది. శుక్రవారం జరిగిన పోరులో పంజాబ్ 8 వికెట్ల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 261 పరుగులు చేసింది. ఫిల్ సాల్ట్ (37 బంతుల్లో 75; 6 ఫోర్లు, 6 సిక్స్‌లు), సునీల్ నరైన్ (32 బంతుల్లో 71; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించగా, వెంకటేశ్ అయ్యర్ (23 బంతుల్లో 39; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. అనంతరం పంజాబ్ 18.4 ఓవర్లలో 2 వికెట్లకు 262 పరుగులు సాధించి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జానీ బెయిర్‌స్టో (48 బంతుల్లో 108 నాటౌట్; 8 ఫోర్లు, 9 సిక్స్‌లు), శశాంక్ సింగ్ (28 బంతుల్లో 68 నాటౌట్; 2 ఫోర్లు, 8 సిక్స్‌లు), ప్రభ్ సిమ్రన్ సింగ్ (20 బంతుల్లో 54; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) అసాధ్యంగా అనిపించిన లక్ష్యాన్ని ఛేదించి చూపించారు.

శతక భాగస్వామ్యం...

సొంత మైదానంలో కోల్‌కతా ఇన్నింగ్స్ జోరుగా సాగింది. టోర్నీలో తమ ఫామ్‌ను కొనసాగిస్తూ ఓపెనర్లు సాల్ట్, నరైన్ మరోసారి మెరుపు వేగంతో జట్టుకు శుభారంభం అందించారు. వీరిద్దరి ధాటికి పవర్‌ప్లే ముగిసేసరికి జట్టు 76 పరుగులు చేసింది. 7 ఓవర్లలోపే 3 క్యాచ్‌లు వదిలేసిన పంజాబ్ ప్రత్యర్థికి సహకరించింది. ఈ క్రమంలో నరైన్ 23 బంతుల్లో, సాల్ట్ 25 బంతుల్లో అర్ధ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. 10 ఓవర్లు ముగిసేసరికి స్కోరు 137/0 కాగా... ఎట్టకేలకు 11వ ఓవర్లో పంజాబ్ తొలి వికెట్ పడగొట్టగలిగింది. ఓపెనర్లు వెనుదిరిగిన తర్వాత కూడా నైట్‌రైడర్స్ జోరు తగ్గలేదు. వెంకటేశ్ దూకుడుగా ఆడగా... రసెల్ (12 బంతుల్లో 24; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), శ్రేయస్ (10 బంతుల్లో 28; 1 ఫోర్, 3 సిక్స్‌లు) కూడా ధాటిని ప్రదర్శించారు. దాంతో 15.2 ఓవర్లలో స్కోరు 200 పరుగులకు చేరింది. చివరి 5 ఓవర్లలో కేకేఆర్ 71 పరుగులు సాధించింది.

వీర విధ్వంసం...

ఛేదనలో పంజాబ్ ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్, బెయిర్‌స్టో కూడా చెలరేగారు. ప్రభ్‌సిమ్రన్ ఒకదశలో 10 బంతుల వ్యవధిలో 4 సిక్స్‌లు, 2 ఫోర్లు బాదాడు. 18 బంతుల్లోనే అతని హాఫ్ సెంచరీ పూర్తయింది. అనుకూల్ వేసిన ఓవర్లో బెయిర్‌స్టో వరుసగా 4, 6, 4, 4, 6తో చెలరేగాడు. వీరిద్దరు 36 బంతుల్లో 93 పరుగులు జోడించిన తర్వాత తొలి వికెట్ తీసి కోల్‌కతా కాస్త ఊరట చెందింది. అయితే 23 బంతుల్లో హాఫ్ సెంచరీ అందుకున్న తర్వాత బెయిర్‌స్టో మరింత ధాటిగా ఆడాడు. కొద్దిసేపు రోసో (16 బంతుల్లో 26; 1 ఫోర్, 2 సిక్స్‌లు) అతనికి సహకరించాడు. ఆరు వరుస ఇన్నింగ్స్‌లలో వైఫల్యాల తర్వాత ఎట్టకేలకు ఈ మ్యాచ్‌లో 45 బంతుల్లో శతకాన్ని చేరుకున్నాడు. మరోవైపు శశాంక్ ఎక్కడా తగ్గకుండా సిక్సర్లతో విరుచుకు పడ్డాడు. చమీరా ఓవర్లో అతను కొట్టిన 3 సిక్సర్లతో పంజాబ్ విజయానికి చేరువైంది. ఆఖరి 3 ఓవర్లలో 34 పరుగులు కావాల్సి ఉండగా... హర్షిత్ వేసిన 18వ ఓవర్లోనే శశాంక్ 3 సిక్స్‌లు, ఫోర్ బాదగా 25 పరుగులు రావడంతో పంజాబ్ గెలుపు లాంఛనమే అయింది. బెయిర్‌స్టో, శశాంక్ మూడో వికెట్‌కు 37 బంతుల్లోనే అభేద్యంగా 84 పరుగులు జత చేశారు.

స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: సాల్ట్ (బి) స్యామ్ కరన్ 75; నరైన్ (సి) బెయిర్‌స్టో (బి) చహర్ 71; వెంకటేశ్ అయ్యర్ (రనౌట్) 39; రసెల్ (సి) హర్షల్ (బి) అర్ష్‌దీప్ 24; శ్రేయస్ (సి) రబడ (బి) అర్ష్‌దీప్ 28; రింకూ సింగ్ (సి) అశుతోష్ (బి) హర్షల్ 5; రమణ్‌దీప్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 261.** వికెట్ల పతనం: 1-138, 2-163, 3-203, 4-246, 5-253, 6-261. **బౌలింగ్:** స్యామ్ కరన్ 4-0-60-1, అర్ష్‌దీప్ 4-0-45-2, హర్షల్ 3-0-48-1, రబడ 3-0-52-0, రాహుల్ చహర్ 4-0-33-1, హర్‌ప్రీత్ 2-0-21-0.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రభ్‌సిమ్రన్ (రనౌట్) 54; బెయిర్‌స్టో (నాటౌట్) 108; రోసో (సి) శ్రేయస్ (బి) నరైన్ 26; శశాంక్ (నాటౌట్) 68; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (18.4 ఓవర్లలో 2 వికెట్లకు) 262.** వికెట్ల పతనం: 1-93, 2-178. **బౌలింగ్:** చమీరా 3-0-48-0, హర్షిత్ 4-0-61-0, అనుకూల్ 2-0-36-0, నరైన్ 4-0-24-1, వరుణ్ 3-0-46-0, రసెల్ 2-0-36-0, రమణ్‌దీప్ 0.4-0-9-0.

262 టి20 క్రికెట్ చరిత్రలోనే అత్యధిక పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన జట్టుగా పంజాబ్ కింగ్స్ రికార్డు నెలకొల్పింది. గతంలో ఈ రికార్డు దక్షిణాఫ్రికా (259/4 : వెస్టిండీస్‌పై మార్చి 26న, 2023లో) జట్టు పేరిట ఉంది.

42 ఐపీఎల్ మ్యాచ్‌లో అత్యధిక సిక్స్‌లు నమోదైన మ్యాచ్‌గా పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్ మ్యాచ్ గుర్తింపు పొందింది. ఈ సీజన్‌లోనే సన్‌రైజర్స్ హైదరాబాద్, ముంబై ఇండియన్స్ మ్యాచ్‌లో 38 సిక్స్‌లు వచ్చాయి.

24 ఐపీఎల్ టోర్నీలో ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన జట్టుగా పంజాబ్ కింగ్స్ గుర్తింపు పొందింది. ఈ సీజన్‌లోనే ఢిల్లీ క్యాపిటల్స్‌తో, బెంగళూరు జట్లతో జరిగిన మ్యాచ్‌ల్లో సన్‌రైజర్స్ 22 సిక్స్‌లు చొప్పున కొట్టింది.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	8	7	1	14	0.698
కోల్‌కతా	8	5	3	10	0.972
హైదరాబాద్	8	5	3	10	0.577
లక్నో	8	5	3	10	0.148
చెన్నై	8	4	4	8	0.415
ఢిల్లీ	9	4	5	8	-0.386
గుజరాత్	9	4	5	8	-0.974
పంజాబ్	9	3	6	6	-0.187
ముంబై	8	3	5	6	-0.227
బెంగళూరు	9	2	7	4	-0.721

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

'మిక్స్‌డ్' ఫైనల్లో సురేఖ-అభిషేక్ జోడీ

కాంస్యం కోసం ధీరజ్-అంకిత ద్వయం పోరు



షాంఘై (చైనా): ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-1 టోర్నీలో భారత ఆర్చర్ల జోరు కొనసాగుతోంది. కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ-అభిషేక్ వర్మ (భారత్) జోడీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో జ్యోతి సురేఖ-అభిషేక్ ద్వయం 155-151తో బెసెరా-మెండెజ్ (మెక్సికో) జంటను ఓడించింది. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ బొమ్మదేవర ధీరజ్-అంకిత (భారత్) జోడీ కాంస్య పతకం కోసం పోటీ పడనుంది. సెమీఫైనల్లో ధీరజ్ -అంకిత 0-6తో లిమ్ సిహైన్-కిమ్ వూజిన్ (కొరియా) చేతిలో ఓడిపోయారు. రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ధీరజ్ మూడో రౌండ్‌లో 4-6 తో కెన్ సాంచెజ్ (స్పెయిన్) చేతిలో ఓటమి చవిచూశాడు. భారత్‌కే చెందిన తరుణ్‌దీప్ రాయ్ క్వార్టర్ ఫైనల్లో 3-7తో టిమినో (స్పెయిన్) చేతిలో పరాజయం పాలయ్యాడు. మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో భారత స్టార్ దీపిక కుమారి క్వార్టర్ ఫైనల్లో 6-4తో జెన్ హన్ యంగ్ (కొరియా)పై నెగ్గి సెమీఫైనల్ చేరింది.

పరుగు ఇవ్వకుండానే 7 వికెట్లు

మహిళల టి20ల్లో ఇండోనేసియా బౌలర్ రొమాలియా రికార్డు



బాలి: ఇండోనేసియా టీనేజ్ బౌలర్ రొమాలియా మహిళల అంతర్జాతీయ టి20ల్లో అసాధారణ రికార్డును లిఖించింది. మంగోలియాతో జరిగిన ఐదో టి20 మ్యాచ్‌లో 17 ఏళ్ల స్పిన్నర్ రొమాలియా (7/0) అసలు ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా 7 వికెట్లు పడగొట్టి... అనామక జట్ల మధ్య జరిగిన అంతర్జాతీయ మ్యాచ్‌లో చరిత్ర పుటలకెక్కింది. తద్వారా 2021లో నెదర్లాండ్స్ బౌలర్ ఫ్రెడరిక్ ఓవర్‌డిక్ (7/3) ఫ్రాన్స్‌పై నెలకొల్పిన రికార్డును చెరిపేసింది. మొదట ఇండోనేసియా మహిళల జట్టు 20 ఓవర్లలో 5 వికెట్లకు 151 పరుగులు చేసింది. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన మంగోలియా 16.2 ఓవర్లలో 24 పరుగులకే కుప్పకూలింది. రొమాలియా (3.2-3-0-7) వేసిన 3.2 ఓవర్లలో 3 మెయిడిన్లు కావడం విశేషం. ఆమె స్పిన్ ఉచ్చులో పడి ఏకంగా ఐదుగురు బ్యాటర్లు ఎర్డెనెసుడ్ (0), అనుజిన్ (0), నమూంజుల్ (0), నరంజెరెల్ (0), ఎన్క్‌జుల్ (0) ఖాతానే తెరవలేకపోయారు.

టైటిల్ నిలబెట్టుకోవాలనే లక్ష్యంతో...

థామస్ కప్ బరిలో భారత పురుషుల జట్టు
● తొలి మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌తో 'ఢీ'



చెంగ్డూ (చైనా): రెండేళ్ల క్రితం థామస్ కప్ టోర్నమెంట్‌లో తొలిసారి విజేతగా నిలిచి పెను సంచలనం సృష్టించిన భారత పురుషుల జట్టు అదే ఫలితాన్ని ఈసారీ పునరావృతం చేయాలనే పట్టుదలతో ఉంది. ఈ నేపథ్యంలో శనివారం మొదలయ్యే ఈ ప్రతిష్టాత్మక టీమ్ ఈవెంట్‌లో భారత జట్టు బరిలోకి దిగనుంది. గ్రూప్ 'సి'లో ఇండోనేసియా, థాయ్‌లాండ్, ఇంగ్లండ్‌లతో కలిసి భారత్ పోటీపడనుంది. నేడు జరిగే తొలి మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌తో భారత్ 'ఢీ'కొంటుంది. మహిళల టీమ్ ఈవెంట్ అయిన ఉబెర్ కప్‌లో భారత జట్టు ద్వితీయ శ్రేణి క్రీడాకారిణులతో బరిలోకి దిగనుంది. సింధు, అశ్విని పొన్నప్ప, తనీషా, గాయత్రి, ట్రెసా ఈ టోర్నీకి దూరంగా ఉన్నారు. గ్రూప్ 'ఎ'లో కెనడా, చైనా, సింగపూర్‌లతో కలిసి భారత్ ఉంది. నేడు జరిగే తొలి మ్యాచ్‌లో కెనడాతో భారత్ ఆడుతుంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



జైత్రయాత్ర





ఒకరు ఖూనీకోరు.. మరొకరు దౌర్జన్యాలకు మారుపేరు
బెట్టింగ్ బంగార్రాజు ఒకరైతే.. దాడులు, కిడ్నాపుల కింగ్ ఒకరు
ఉన్నత స్థానానికి ఎదగడానికి కుట్రలు,
కుతంత్రాలు, హత్యల మార్గాన్నే ఎంచుకున్న చంద్రబాబు..
ఈ సారి ఖూనీకోరులు, దౌర్జన్యకారుల్ని ఎంపిక చేసి సీట్లు కట్టబెట్టారు.
తనకు తగ్గ టీంను ఎన్నికల బరిలోకి దించారు.
అడుగడుగునా అడ్డదారుల్లో ముందుకెళ్తూ.. ఎదురొచ్చిన వారిని అడ్డుతొలగించుకుంటూ.. రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించిన చంద్రబాబు టీం ఇది..

కరడుగట్టిన నేరస్తుడు జూలకంటి బ్రహ్మారెడ్డికి మాచర్ల..
రంగా హత్య కేసు నిందితుడు వెలగపూడికి వైజాగ్ ఈస్ట్..
బెట్టింగ్ బంగార్రాజు బీటెక్ రవికి పులివెందుల..
దౌర్జన్యాలు, అక్రమాలకు మారుపేరు చింతమనేనికి దెందులూరు..
నేరాల్లో దిట్ట కందికుంటకు కదిరి..
దౌర్జన్యాలు, కిడ్నాపుల క్వీన్ అఖిలప్రియకు ఆళ్లగడ్డ..
కానిస్టేబుల్ కన్ను పోగొట్టిన చల్లా బాబుకు పుంగనూరు..
హత్య కేసు నిందితుడు శ్యాంబాబుకు పత్తికొండ..

బాబు దృష్టిలో వీరంతా సచ్చీలురు. శాంతిభద్రతలు కాపాడే ప్రజాప్రతినిధులు. రాష్ట్రంలో శాంతి భద్రతలపై నీతి వచనాలు చెప్పే చంద్రబాబు టీంలోని వీరు ఎన్నికైతే రాష్ట్రంలో పరిస్థితిని మనం ఊహించుకోవచ్చు.

ఖూనీకోరులు, నేరస్తులు..

హంతకులు, కరడుగట్టిన నేరస్తులకు టికెట్లు కట్టబెట్టిన చంద్రబాబు..

బ్రహ్మారెడ్డి పేరు చెబితేనే హడల్

పల్నాడు ప్రాంతంలో జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేరు చెబితేనే సామన్యులు ఉలిక్కిపడతారు. చంద్రబాబు సీఎంగా ఉండగా 2001లో ఏడుగురు కాంగ్రెస్ కార్యకర్తలను అత్యంత పాశవికంగా హత్య చేసిన కేసులో నేరస్తుడు. దుర్గికి చెందిన కాంగ్రెస్ నేత సాంబిరెడ్డి తన అనుచరులతో వస్తుండగా ఆ వాహనాన్ని లారీతో ఢీకొట్టి సాంబిరెడ్డిని హత్యచేశారు. పారిపోతున్న సాంబిరెడ్డి అనుచరులను వెంటాడి నరికి చంపిన కరుడుకట్టిన హంతకుడు బ్రహ్మారెడ్డి. అప్పుడు అతని తల్లి దుర్గాంబ ఎమ్మెల్యేగా ఉండడంతో ఆ అండ చూసుకుని ఈ హత్యలకు పాల్పడిన విషయం అందరికి తెలిసిందే. ఈ కేసు కోర్టులో నిలబడలేదు. ఇరువర్గాలు రాజీ పడడంతో కేసు వీగిపోయింది. బ్రహ్మారెడ్డిని ఈ హత్యల తర్వాత టీడీపీలో చాలా ఏళ్ల దూరం పెట్టారు. మాచర్లలో అభ్యర్థి దొరక్కపోవడంతో బ్రహ్మారెడ్డిని వెతికి తీసుకొచ్చి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చేశారు. మాచర్లలో ఆయన కాలుమోపాక మళ్లీ రౌడీయిజం, నేరాలు పెరిగిపోయాయి.

రంగా హత్య కేసు నిందితుడికి అందలం

వంగవీటి మోహన రంగా హత్య కేసులో నిందితుడు విశాఖపట్నం తూర్పు అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు. 1988లో విజయవాడలో రంగా హత్య సంచలనం రేపింది. హత్య చేసినవారిలో రామకృష్ణబాబు ఉన్నారని చెబుతారు. ఆ కేసులో అతన్ని ఐదో నిందితుడిగా చేర్చారు. ఆ తర్వాత ప్రాణ భయంతో రామకృష్ణబాబు విశాఖ పారిపోయారు. అక్కడే స్థిరపడి దౌర్జన్యాలు, రౌడీయిజంతో రాజకీయ నేతగా ఎదిగారు. ఆయన ఎదిగేందుకు చంద్రబాబు సాయపడ్డారు. టీడీపీలో మంచి అవకాశాలు కల్పించారు. విశాఖ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉంటూ దౌర్జన్యాలు కొనసాగిస్తున్నారు.

-మిగతా IIIలో

నాడు బాబు & గ్యాంగ్ ఎక్కడ?



చెయ్యని పనులు చేసినట్లు చెప్పుకోవడంలో, కళ్లార్పకుండా అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబు తర్వాతే ఎవరైనా. ఇతరులు చేసిన మంచి పనులను తన ఖాతాలో వేసుకోవడంలో కూడా ఈ పెద్దమనిషిది అందెవేసిన చేయి. ప్రజలకు నిజంగా ఏదైనా కష్టం వచ్చినప్పుడు మాత్రం ఆ దరిదాపుల్లో ఉండడు. తీరా ఆ సమస్య పరిష్కారమయ్యాక తగుదునమ్మా అంటూ తెరపైకి వచ్చి వీరంగం వేయడం ఈయన గారికే చెల్లింది. కరోనా విలయ తాండవం చేసినప్పుడు చంద్రబాబు అండ్ గ్యాంగ్ స్పందించిన తీరు తెలుగు ప్రజలెవ్వరూ మరచిపోరు.

2020–21లో 'కరోనా' పేరు వినగానే ప్రతి ఒక్కరికీ ఏసీ గదుల్లోనూ చెమటలు పట్టేవి. మనిషి కనిపిస్తేనే ఆమడ దూరం పారిపోయే పరిస్థితి. పారాసెటిమాల్ మాత్ర కావాలని అడిగితే, అనుమానంగా చూస్తూ మెడికల్ స్టోర్ నుంచి బయటకు విసిరేసే దుస్థితి. ఈ మహమ్మారి సృష్టించిన కల్లోలం కారణంగా ప్రపంచ వ్యాప్తంగా లక్షల మంది మృత్యువాత పడ్డారు. ఎన్నో దేశాలు ఆర్థిక వినాశనాన్ని చవి చూశాయి. అన్ని రాష్ట్రాల్లోనూ ప్రభుత్వాలు దాదాపు చేతులెత్తేశాయి. పరిస్థితి దైవాధీనంగా మారింది.

ఇలాంటి సమయంలో రాజకీయ నాయకులంతా రాజకీయాలకు అతీతంగా ఆ విపత్తును ఎదుర్కోవాలి. అయితే ప్రజల సంగతి దేవుడెరుగు.. హైదరాబాద్‌లో అయితే మంచి ఆస్పత్రులు ఉన్నాయని ఇదే చంద్రబాబు, లోకేశ్, ఆయన కుటుంబ సభ్యులు, ఆయన దత్తపుత్రుడు పవన్ కల్యాణ్, పురందేశ్వరిలు రాత్రికి రాత్రే అక్కడికెళ్లి దాక్కున్నారు. సొంత పార్టీ నేతలు, కార్యకర్తలను సైతం పట్టించుకున్న పాపాన పోలేదు. మేమున్నామంటూ ధైర్యం చెప్పిన దాఖలాలు లేవు. పైగా వైరస్ కారణంగా దేశంలో 20 నుంచి 50 లక్షల మంది చనిపోయే అవకాశం ఉందని, తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హైదరాబాద్ నుంచి జూమ్ ప్రెస్‌మీట్‌లలో ప్రకటనలు జారీ చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు.

2020-21లో కరోనా విలయ తాండవం

- హైదరాబాద్‌లో దాక్కున్న చంద్రబాబు, లోకేశ్, పవన్, పురందేశ్వరి
- వలంటీర్ల సైన్యంతో సమర్థవంతంగా ఎదుర్కొన్న సీఎం జగన్
- కోవిడ్ చికిత్స కేంద్రాలుగా వందలాది ఆస్పత్రులు
- ఉచిత వైద్యంతో లక్షలాది మంది ప్రాణాలు కాపాడిన ప్రభుత్వం
- ఆరోగ్యశ్రీ పరిధిలోకి కరోనా.. రూ.4 వేల కోట్లకు పైగా ఖర్చు

సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం మాత్రం కరోనాపై అలుపెరుగని పోరు సాగించింది. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికీ భరోసా కల్పించింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో యుద్ధ ప్రాతిపదికన సౌకర్యాలు కల్పించింది. ఆక్సిజన్ సిలిండర్లు, ఇంజక్షన్లు, మందులు, పౌష్టికాహారం, టెలి మెడిసిన్, ఇంటింటా పరీక్షలు.. ఇలా దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజలకు అండగా నిలిచింది.

-పూర్తి వివరాలు IVలో


గుసగుస

'లావొ'క్కింతయు లేక..



లావొక్కింతయు లేదు.. ధైర్యము విలోలంబయ్యె.. గజేంద్రమోక్షంలో గజరాజు వేదనకు పోతన అక్షరరూపం. వైఎస్సార్‌సీపీలో ఐదేళ్లు గౌరవ మర్యాదలకు లోటు లేకుండా అధికారం అనుభవించి, ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిన నర్సారావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయల పరిస్థితి కూడా అటూఇటుగా సేమ్ టు సేమ్. తను బరిలో ఉన్న లోక్‌సభ పరిధిలోని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల కోసం దండిగా నిధులు పార్టీ అధిష్టానానికి ధారబోశారట. అయినా ఓ ఇద్దరు ఎమ్మెల్యేలు తమ ఎన్నికల ఖర్చు కోసం తలో రూ.20 కోట్లు అడుగుతున్నారట. ఇవ్వకుంటే తమ వరకు మాత్రమే ప్రచారం చేసుకుంటామని హెచ్చరిస్తున్నారట. దీంతో నేరక పార్టీ మారి, ఈ రొంపిలో ఇరుక్కుపోయానే.. అని తలపట్టుక్కూర్చున్నారట మన 'లావు'రాయలు.

కుయ్యో మొర్రో.. కూన




స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రాతినిధ్యం వహిస్తున్న ఆమదాలవలసలో వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యమని తేలిందట. పొత్తులపై నమ్మకంతో గెలుపు ధీమా పెట్టుకున్న టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్‌కు మిత్రుడైన ఓ పోలీస్ ఉన్నతాధికారే ఈ విషయాన్ని చెప్పారట. కూన చుట్టూ ఉన్న కోటరీ వల్లే ఈ పరిస్థితి వచ్చిందని తన బృందంతో చేపట్టిన సర్వే ద్వారా తేల్చి చెప్పారు. ఈ విషయాన్ని ఆ కోటరీ సభ్యులు ఓ ముగ్గురు ఉండగానే 'కూన'కు చెప్పారట. మండలాలవారీగా పంపిణీ చేసిన నగదులో ఒక్కొక్కరు ఎంతేసి నొక్కేశారో కూడా లెక్కతేల్చారట. దీంతో వెంట ఉన్న వారిని నమ్మక, కొత్తవారిని నమ్ముకోలేక డబ్బులు మిగుల్చుకునే పనిలోపడ్డారట.

మాస్టారూ.. ఎవరీమె?

ఎన్నికల కోసం కట్టుకున్న భార్యను కాదనుకున్నావా నారాయణా?

ఆస్తుల్లో భార్యకు వాటాలిచ్చావు.. బిడ్డను కన్నావు.. ఇప్పుడు కాదంటావా?
ఎన్నికల అఫిడవిట్‌లో ఇద్దరు భార్యలున్నట్లు చూపని మాజీ మంత్రి
రెండో భార్య కుమార్తెను 'గంటా' కుమారుడితో వివాహం జరిపించలేదా?
నీ ఎడ్యుకేషనల్ సొసైటీలో రెండో భార్య ఇందిర డైరెక్టర్‌గా ఎలా ఉంది?
గత అఫిడవిట్, ప్రస్తుత అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చిన 'పొంగూరు'
మొన్న మరదలిని వంచించావు..ఇప్పుడు కట్టుకున్న భార్యనే కాదనుకుంటావా?
మహిళలను మోసం చేసే నీవు సింహపురి మహిళలకు ఏం చెబుతావు?
నారాయణ అఫిడవిట్‌పై వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అభ్యంతరాలు



ఒక డాక్యుమెంట్లో ఇందిర భర్త నారాయణగా పేర్కొన్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నారాయణ విద్యాసంస్థల అధినేతగా మాజీ మంత్రి పొంగూరు నారాయణ ఎన్నికల వేళ సత్యాన్ని సమాధిచేసి తన రాజకీయ పదవి కోసం తాళి కట్టిన భార్యనే కాదనుకున్నాడన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. నారాయణతో మూడు దశాబ్దాల పాటు అన్యోన్య దాంపత్య జీవితం పంచుకున్న ఆమె ప్రస్తుతం ఎవరు? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నికల అఫిడవిట్‌లో తనకు ఒక భార్య, కుమార్తెను మాత్రమే చూపారు. రెండో భార్య ఆమె కుమార్తెను చూపించకపోవడంతో గత నాలుగు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అభివృద్ధి మంత్రాన్ని పఠిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నారాయణ మహిళలను వంచించిన విషయంలో సింహపురి మహిళలకు ఏమని సమాధానం చెబుతారు.


తప్పుల కుప్ప.. ఆ 'అఫిడవిట్'

టీడీపీ నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి నారాయణ చిక్కుల్లో పడ్డాడు. భారత ఎన్నికల సంఘం నిబంధనలను సవాల్ చేస్తూ తన నామినేషన్ పత్రంతో సమర్పించిన అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం పొందుపరిచారు. ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం ఒక భార్య ఉన్న వారే రాజ్యాంగబద్ధ పదవులకు అర్హులు. ఇంకో భార్య ఉన్నప్పటికీ విడాకులు అయినా ఇచ్చి ఉండాలి. అయితే నారాయణ విద్యాసంస్థల అధినేతగా నారాయణ వ్యక్తిగత జీవితం 'తెరిచిన పుస్తకం'. నారాయణకు ఇద్దరు భార్యలు ఉన్న విషయం అందరికీ తెలిసిందే.

2014లో ఇలా..

2014లో ఎమ్మెల్సీ నామినేషన్ సందర్భంగా సమర్పించిన అఫిడవిట్‌లో తన భార్య పి. రమాదేవిగా, శారిణి (రెండో భార్య ఇందిర కుమార్తె), కుమారుడు నిషింత్‌ను డిపెండెంట్‌లుగా చూపించారు. వీరు కొడుకు, కూతురు అయినప్పటికి

-మిగతా IIIలో



ఫ్యాక్షన్ రాజకీయాలతో ఎదిగి అదే రక్కసికి బలైన భర్త అడుగు జాడల్లోనే నడిచిన ఆమె ఆ నియోజకవర్గంలో కొడుకుతో కలిసి దమనకాండ సాగించారు.
గత ప్రభుత్వ హయాంలో మంత్రి పదవి, అధికారం అండతో చెలరేగిపోయారు.
హత్యారాజకీయాలను ప్రోత్సహించారు. 'సు నీతు'లు వల్లించే ఆమె అలవికాని అవినీతికి పాల్పడ్డారు.
ప్రజాధనం లూటీ చేశారు. రూ.కోట్లు దోచేశారు.

సకుటుంబ సమేత 'రక్తచరిత్ర'!

-వివరాలు IIIలో

భువనేశ్వరి పేరుతో ఆడియో హల్‌చల్

- పోరా.. పో ఇక్కడ నుంచి.. లం.. కొడకా..
- పెద్ద కుటుంబంలో పుట్టినదాన్ని నేను..
- పత్రికల్లో రాయడానికి వీలు లేనంత అసభ్యంగా కొన్ని పదాలు
- 36 గంటలుగా వివిధ సోషల్ మీడియా వేదికల్లో వైరల్
- ఎప్పుడు, ఎవరిపై ఇలా ఆగ్రహంతో ఊగిపోయారన్న దానిపై విస్తృతంగా చర్చ
- టికెట్ కోసం వచ్చిన దళిత నాయకుడిపై మాట్లాడారని కొందరు.. కుప్పం స్టీరింగ్ కమిటీ సభ్యులపై అని మరికొందరు..
- కొన్ని సామాజిక వర్గాలను కించ పరిచేలా వ్యాఖ్యలు
- తప్పు పడుతున్న వివిధ కుల సంఘాల నాయకులు
- చంద్రబాబు కుటుంబ సభ్యుల తీరే అంతంటూ రాజకీయ వర్గాల్లో చర్చ



చెత్త నా కొడుకులు..

చెత్త బుట్టలో పుట్టారు..

సాక్షి, అమరావతి

పోరా.. పో ఇక్కడ నుంచి లం..కొడకా..

నేను నీకంటే పెద్ద ఇంటిలో పుట్టిన దాన్ని. చెత్త నా కొడుకులు. చెత్త బుట్టలో పుట్టి కూడా వేషాలు వేస్తారు.

దేనికీ పనికిరారు.. అడుక్కు తింటానికి కూడా.. బాస్టర్డ్. మీ అందరినీ మానిటర్ చేయలేక (పర్యవేక్షించలేక) నేను చస్తున్నా..

తప్పుడు నా కొడకా, ఊడిగం చేసే కుక్క..

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి తిట్ల దండకంతో కూడిన ఆడియో ఒకటి గురువారం రాత్రి నుంచి వివిధ సోషల్ మీడియా వేదికల్లో హల్‌చల్ చేస్తోంది. కేవలం ఒక్క భువనేశ్వరి మాటలు మాత్రమే ఆ ఆడియో టేపుల్లో వినిపిస్తోంది. అందులో కొన్ని పదాలు పత్రికలో రాయడానికి వీలు లేనంత అసభ్యంగా ఉన్నాయి. ఆమె ఎప్పుడు, ఎవరిని ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేసి ఉంటారన్న దానిపై అటు తెలుగుదేశం పార్టీ శ్రేణులతో పాటు, ఇటు రాష్ట్రంలోని రాజకీయ వర్గాలందరిలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. చంద్రబాబు పోటీ చేస్తున్న కుప్పం నియోజకవర్గంలో భర్త నామినేషన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ఆమె ఈ నెల 18, 19, 20 తేదీల్లో కుప్పం నియోజకవర్గంలో పర్యటించారు. ఆ సమయంలో.. కొందరు స్థానిక టీడీపీ నాయకులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేసిన మాటలుగా టీడీపీలో చర్చ సాగుతోంది. 'కుప్పంలో లోకేశ్ తన సొంత మనుషులతో ఓ స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. ఈ కమిటీ సభ్యులు కొందరు నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి బాగోలేదని చెప్పారు. ఆ పరిస్థితిని మార్చడంలో భాగంగా ఎక్కువగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అయిన ఖర్చుకు సంబంధించి బిల్లులు పెట్టిన సందర్భంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు' అని కుప్పం టీడీపీ నాయకులు చెబుతున్నారు. కాగా, మొదటి నుంచి పార్టీ కోసం పని చేస్తూ.. చంద్రబాబు కుటుంబ సభ్యులందరితో పరిచయం ఉన్న ఓ దళిత నాయకుడు ప్రస్తుత ఎన్నికల్లో తన టికెట్ కోసం భువనేశ్వరిని కలిసి సిఫార్సు కోసం ప్రయత్నించినప్పుడు ఆమె ఈ రకంగా ఆగ్రహావేశాలతో ఊగిపోయారన్న చర్చ కూడా సాగుతోంది. అయితే భువనేశ్వరి మాటలతో కూడిన ఆ ఆడియో టేపుల్లోని మాటలు సమాజంలో కొన్ని వర్గాల వారిని బాగా కించ పరిచేలా ఉండడంతో వివిధ కుల సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.

బుగ్గన నామినేషన్ పత్రాలపై టీడీపీ ఓవరాక్షన్

డోన్ టౌన్: నామినేషన్ పత్రాల స్క్రూటినీ సమయంలో టీడీపీ ప్రతినిధులతోపాటు కొంతమంది ఇండిపెండెట్లు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సమర్పించిన పత్రాలపై అత్యుత్సాహం ప్రదర్శించారు. మంత్రి సమర్పించిన ఒరిజినల్ అఫిడవిట్లు తమకు ఇవ్వాలని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో టీడీపీ ప్రతినిధులు డిమాండ్ చేయగా.. మంత్రి అనుచరులు అందుకు నిరాకరించారు. ఈ సమయంలో కొంత ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో రిటర్నింగ్ అధికారి మహేశ్వరరెడ్డి సర్ది చెప్పారు. అనంతరం ప్రత్యర్థులు చేసిన ఫిర్యాదులకు సమాధానం ఇవ్వాలని రిటర్నింగ్ అధికారి బుగ్గన ప్రతినిధులకు నోటీసులు జారీ చేశారు. దీంతో ఈ విషయాన్ని వారు మంత్రి బుగ్గన దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. స్పందించిన ఆయన.. తమ ప్రతినిధులు, లీగల్ సెల్ సభ్యులు ద్వారా ఫిర్యాదులకు వివరణతో కూడిన పత్రం సమర్పించడంతో రిటర్నింగ్ అధికారి సంతృప్తి చెందారు. దీంతో బుగ్గన నామినేషన్ పత్రాలకు ఆమోదం తెలుపుతూ ధ్రువీకరణ పత్రం జారీ చేశారు. అయితే.. కొన్ని చానల్స్ తప్పుడు కథనాలను వండి వార్చాయి. బుగ్గన నామినేషన్ రద్దు, తిరస్కరణ, జగన్‌కు షాక్ అంటూ స్క్రోలింగ్ ఇవ్వడంతో ప్రజలు ఆశ్చర్యపోయారు.

ఒక్క స్థానం.. ఇద్దరు ఎంపీలు!

ఒక్క లోక్‌సభ నియోజకవర్గానికి ఇద్దరు ఎంపీలుంటారా? ఇద్దరేం ఖర్మ... ముగ్గురు కూడా ఉన్నారు! ఎప్పుడు? ఎలా?

మన దేశంలో రాజకీయాలు చాలా క్లిష్టంగా ఉన్నాయని ఇప్పుడనుకుంటున్నాం. కానీ స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో జరిగిన ఎన్నికల సమయంలో మరింత సంక్లిష్టంగా ఉన్నాయి. సాధారణంగా ఒక్క నియోజకవర్గానికి ఒక్కరే ప్రాతినిధ్యం వహిస్తారు. ఎన్నికలు జరిగేదే ఆ ప్రతినిధిని ఎన్నుకోవడానికి. కానీ తొలి రెండు సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం పలు నియోజకవర్గాలకు ఇద్దరేసి ఎంపీలను ఎన్నుకున్నారు. 1961లో రద్దయ్యే దాకా ఇది కొనసాగింది. కొన్ని నియోజకవర్గాలకైతే ముగ్గురు ఎంపీలూ ఉన్నారు! దళితులు, గిరిజన సమూహాల వంటి అణగారిన వర్గాలకు పార్లమెంటులో ప్రాతినిధ్యం పెంచేందుకు ఈ ఏర్పాటు కల్పించారు.



తొలి ఎన్నికల్లో...

మొట్టమొదటి ఎన్నికల సమయంలో లోక్‌సభలో 400 స్థానాలున్నాయి. వీటిలో 314 స్థానాలకు ఒక్క ఎంపీ ఉండగా, 86 నియోజకవర్గాలకు ఒక జనరల్, మరొక షెడ్యూల్ కులాల ప్రతినిధి చొప్పున ఇద్దరేసి ఎంపీలు ఎన్నికయ్యారు. ఇలా ఇద్దరు ఎంపీలున్న నియోజకవర్గాలు యూపీలో 17, నాటి మద్రాసు రాష్ట్రంలో 13, బిహార్‌లో 11, బాంబేలో 8 ఉన్నాయి. పశ్చిమబెంగాల్‌లోని నార్త్ బెంగాల్ నియోజకవర్గానికయితే ఏకంగా ముగ్గురు ఎంపీలు ప్రాతినిధ్యం వహించారు!

1957లో...

సీట్ల పునర్విభజన అనంతరం 1957 సార్వత్రిక ఎన్నికల్లో 494 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో ఇద్దరు ఎంపీల స్థానాలు 57కు తగ్గాయి. వీటిలో అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 18, ఆంధ్రప్రదేశ్‌లో 8, బిహార్‌లో 8, పశ్చిమబెంగాల్‌లో 8, బాంబేలో 8, మద్రాసులో 7 స్థానాలకు ఇద్దరు ఎంపీలు ప్రాతినిధ్యం వహించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఓటుకు సుముహూర్తం!

మధ్యాహ్నం 2 గంటలకు వివాహ సుముహూర్తం. వధువు నుదుటిపై జీలకర్ర బెల్లం పెట్టాల్సిన వరుడు కంగారుగా పోలింగ్ స్టేషన్ వైపు వడివడిగా అడుగులు వేస్తున్నాడు. అతడిని కొందరు అనుసరిస్తున్నారు. అక్కడున్న వారికి అతడు కొత్త పెళ్లి కొడుకు అని తెలుస్తోంది. అయినా కానీ, ఏంటా! అనుకుంటూ ఆశ్చర్యంగా చూస్తున్నారు. పెళ్లి ఎవరికైనా జీవితంలో అత్యంత ముఖ్యమైన ఘట్టం. ఈ విషయం అతడికీ తెలుసు. కానీ, పెళ్లితోపాటు, ప్రజాస్వామ్యంలో ఓటు వేయడం కూడా అంతే ముఖ్యమని భావించడమే ఈ వరుడి ప్రత్యేకతగా చెప్పుకోవాలి. మహారాష్ట్రలోని అమరావతి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో వదార్‌పుర ప్రాంతంలో కనిపించింది ఈ దృశ్యం. రెండో దశలో భాగంగా మహారాష్ట్రలోని ఎనిమిది లోక్‌సభ స్థానాలకు శుక్రవారం పోలింగ్ నిర్వహించారు. షేర్వాణీ, తలపాగా ధరించిన నవ వరుడు ఆకాశ్‌ను పోలింగ్ స్టేషన్ ముందు ఏఎన్‌ఐ వార్తా సంస్థ పలకరించింది. అతడు తన ఓటింగ్ కార్డు చూపిస్తూ, ఓటు వేసేందుకు వచ్చినట్లు చెప్పాడు. తల్లితోపాటు, మామయ్య అతడి వెంట ఉన్నాడు. ''పెళ్లి వేడుక ముఖ్యమే. మరి ఓటు?. మధ్యాహ్నం 2 గంటలకు పెళ్లి''అని ఆకాశ్ చెప్పడంతో తోటి ఓటర్లు శభాష్ అని మెచ్చుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాలపైకి చేరగా, యూజర్లు ఎవరికి తోచిన తీరులో వారు స్పందిస్తున్నారు. ఓటు విలువను గుర్తు చేసిన ఆకాశ్‌ను అభినందిస్తున్నారు. మరొకరు అయితే.. కాబోయే వధువు ఆలోచనల్లో తేలిపోతూ ఓటును విస్మరించే వారేమో!

– సాక్షి, నేషనల్ డెస్క్





గిర్ సఫారీలో... మళ్లీ వార్ వన్‌సైడే!

గుజరాత్‌లో హ్యాట్రిక్ క్లీన్‌స్వీప్‌పై బీజేపీ కన్ను

కనీస పోటీ కూడా ఇవ్వలేక కాంగ్రెస్ ఆపసోపాలు

ఏ ఆటగాడైనా సొంత పిచ్‌పై బరిలోకి దిగితే ప్రత్యర్థులకు చుక్కలే. మరి అలాంటిది దేశాన్ని నడిపిస్తున్న కెప్టెన్, వైస్ కెప్టెన్ తమ సొంత రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో స్కెచ్ గీస్తే పరిస్థితి ఎలా ఉంటుంది! వార్ వన్‌సైడే! గుజరాత్‌లో గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో అక్షరాలా అదే జరిగింది. రాష్ట్రంలో మొత్తం 26 లోక్‌సభ స్థానాలనూ 2014, 2019 ఎన్నికల్లో విపక్షాలకు ఒక్కటీ దక్కకుండా క్లీన్‌బౌల్డ్ చేశారు మోదీ, అమిత్ షా. ఒకప్పుడు కాంగ్రెస్‌కు పట్టున్న ఈ పశ్చిమ రాష్ట్రం మోదీ రాకతో పూర్తిగా కమలనాథుల గుప్పెట్లోకి వెళ్లిపోయింది. ఈసారీ క్లీన్‌స్వీప్ చేసి హ్యాట్రిక్ కొట్టాలని చూస్తున్న కాషాయదళాన్ని కాంగ్రెస్ ఏ మేరకు అడ్డుకుంటుందన్నది ఆసక్తికరం...

– సాక్షి, నేషనల్ డెస్క్

గుజరాత్‌లో ఎన్నికలేవైనా బీజేపీ దెబ్బకు పార్టీలన్నీ చుక్కలు లెక్కబెడుతున్నాయి. గత రెండు లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీ ఒంటరిగా పోటీ చేసి మొత్తం సీట్లు తమ ఖాతాలో వేసుకుంది. 2009లో 11 సీట్లు గెలిచి బీజేపీకి గట్టి పోటీ ఇచ్చిన హస్తానికి ఆ తర్వాత రాష్ట్రం నుంచి లోక్‌సభలో పదేళ్లుగా ప్రాతినిధ్యమే లేకుండా పోయింది. 2019 ఎన్నికల్లోనైతే ఇరు పార్టీల ఓట్ల శాతంలో ఏకంగా 30 శాతానికి పైగా అంతరముండటం విశేషం. బీజేపీకి 62.21 శాతం ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 32.11 దక్కాయి మిగతా పార్టీలేవీ ఇక్కడ పెద్దగా సోదిలో లేవు. గత ఎన్నికల్లో 25 చోట్ల పోటీ చేసిన బీఎస్పీకి నోటా కంటే తక్కువ ఓట్లు పడ్డాయి!

స్టేట్ స్కాన్ – బీజేపీ సమరోత్సాహం...

గుజరాత్‌లో రాజకీయం మోదీకి ముందు, తర్వాత అన్నట్టుగా మారిపోయింది. బీజేపీ దిగ్గజ నేత కేశూభాయ్ పటేల్ అనారోగ్యం, ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలతో 2001 అక్టోబర్‌లో మోదీ అనూహ్యంగా ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టారు. ఏడాదికే 2002 నాటి గోద్రా రైలు దహనంలో 60 మంది కరసేవకుల మరణం మతకల్లోలాలకు దారి తీసి రాష్ట్రాన్ని కుదిపేసింది. సీఎంగా వాటి అదుపులో మోదీ వైఫల్యంపై తీవ్ర విమర్శలు చివరికి అసెంబ్లీ రద్దుకు దారితీశాయి. అయితే హిందుత్వ అంశాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లి అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించారు మోదీ. ఆ తర్వాత కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ కూటమి కేంద్రంలో పదేళ్ల అధికారంలో కొనసాగినా గుజరాత్‌లో మోదీ పీఠాన్ని మాత్రం కదపలేకపోయింది. అద్వానీకి ప్రత్యామ్నాయంగా 2013లో ఎన్డీఏ ప్రధాని అభ్యర్థిగా మోదీ జాతీయ రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో గుజరాత్‌లోని వడోదరతో పాటు వ్యూహాత్మకంగా యూపీలోని వారణాసి నుంచీ పోటీ చేసి రెండింటా ఘనవిజయం సాధించారు. బీజేపీకి ఒంటి చేత్తో మెజారిటీ దక్కించి ప్రధాని పగ్గాలు చేపట్టారు. మోదీకి సేనాపతిగా పేరొందిన అమిత్ షా కూడా గుజరాత్‌లో బీజేపీ పాతుకుపోవడంలో కీలకంగా నిలిచారు. 2001 నుంచి 2014 దాకా గుజరాత్ సీఎంగా చక్రం తిప్పిన మోదీ ప్రధానిగా కూడా రాష్ట్రాభివృద్ధిపై బాగా దృష్టి పెట్టారు. దాంతో గుజరాత్ ఆర్థిక వ్యవస్థ పరుగులు తీసింది. అయినా 2017 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ భారీగా పుంజుకుంది. కానీ 2022 ఎన్నికల్లో మళ్లీ చతికిలపడింది. 182 సీట్లకు బీజేపీ ఏకంగా 156 స్థానాలతో దుమ్మురేపింది. ఈ లోక్‌సభ ఎన్నికల్లోనూ కమలనాథులు అభివృద్ధి అజెండాతో పాటు అయోధ్య రామమందిర సాకారం తదితర అంశాలను బలంగా ప్రచారం చేస్తున్నారు.

కాంగ్రెస్.. 'ఇండియా' పోటీనిచ్చేనా!

గుజరాత్‌లో ఎంతో కొంత పుంజుకోవడానికి కాంగ్రెస్ ఆపసోపాలు పడుతూనే ఉంది. కానీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా 60 సీట్లు కోల్పోయి 17కు పరిమితమైంది. ఆమ్ ఆద్మీ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యంగా 5 సీట్లు గెలుచుకుని రాష్ట్రంలో భవిష్యత్తుకు పునాదులు వేసుకుంది. ఈ నేపథ్యంలో పొత్తులో భాగంగా కాంగ్రెస్ 24 చోట్ల పోటీ చేస్తుండగా భావనగర్, బారుచ్ స్థానాల్లో ఆప్ బరిలో ఉంది. రైతులు, యువత, మహిళలు, ఓబీసీలు, ఎస్సీ, ఎస్టీలపై ఇండియా కూటమి హామీల వర్షం కురిపిస్తోంది. వాటినే ప్రచారాస్త్రాలుగా మలచుకుంటోంది. కాంగ్రెస్ మేనిఫెస్టోలోనూ వాటికే పెద్దపీట వేయడం తెలిసిందే. మోదీ హయాంలో దేశవ్యాప్తంగా నిరుద్యోగం, ద్రవ్యోల్బణం చుక్కలనంటాయంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రచారం చేస్తున్నారు. పేదల పొట్టగొట్టి అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు దోచిపెడుతున్నారంటూ ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆప్ చీఫ్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు ప్రభావం గుజరాత్‌లో ఎలా ఉంటుందన్నది ఆసక్తికరం. విపక్షాలపై బీజేపీ కక్షగట్టి నేతలను వరుసగా జైలుపాలు చేస్తోందన్న ఇండియా కూటమి ప్రచారం ఏ మేరకు ఫలిస్తుందో చూడాలి. సోనియా, రాహుల్, ప్రియాంకతో పాటు కాంగ్రెస్ నుంచి 40 మంది స్టార్ క్యాంపెయినర్లు గుజరాత్‌లో ప్రచారం చేస్తున్నారు. ఆప్ తరఫున కేజ్రీవాల్ భార్య సునీతా కేజ్రీవాల్ ప్రచార బాధ్యతలను భుజాన వేసుకున్నారు. ఆప్ కీలక నేతలు పంజాబ్ సీఎం భగవంత్ మాన్ తదితరులు కూడా రంగంలోకి దిగారు.



కమలం బోణీ!

గుజరాత్‌లో ఇంకా పోలింగైనా జరగకుండానే తొలి 'కమలం' విరబూసింది! కాషాయ దళం బోణీ కొట్టేసింది. సూరత్ లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థి ముకేశ్ దలాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థి నీలేశ్ కుంభనీని ప్రతిపాదించిన నేతల సంతకాల్లో తేడా ఉండటంతో నామినేషన్ తిరస్కరణకు గురవడమే ఇందుకు కారణం. కాంగ్రెస్ ప్రత్యామ్నాయ అభ్యర్థి సురేశ్ పడ్సాలా నామినేషన్ కూడా పలు కారణాలతో తిరస్కరణకు గురైంది. ఆ వెంటనే పోటీలో ఉన్న ఇతర పార్టీల అభ్యర్థులంతా నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దాంతో ముకేశ్ ఏకగ్రీవంగా గెలుపొందినట్లు ఈసీ ప్రకటించింది.

సర్వేలన్నీ కమలం వైపే

దాదాపు అన్ని సర్వేలూ బీజేపీకే జై కొడుతున్నాయి. ఈసారి కూడా మొత్తం సీట్లను చేజిక్కించుకుని హ్యాట్రిక్ కొడుతుందని అంచనా వేయడం విశేషం.

యూపీఏ మన్మోహనం

ఎనిమిదేళ్ల తర్వాత కాంగ్రెస్‌కు అధికారం | **బీజేపీని ముంచిన 'ఇండియా షైనింగ్'**

2004లో ఏప్రిల్ 20 నుంచి మే 10 దాకా నాలుగు విడతల్లో పోలింగ్ జరిగింది. బీజేపీ ఇచ్చిన 'ఇండియా షైనింగ్' (భారత్ వెలిగిపోతోంది) నినాదం ఎన్డీఏ పుట్టి ముంచింది. బీజేపీ పాలనలో దేశం అంధకారంలోకి నెట్టిందన్న కాంగ్రెస్ ప్రచారం ప్రజల్లోకి బాగా వెళ్లింది. కాంగ్రెస్ 145 చోట్ల విజయం సాధిస్తే బీజేపీ 44 స్థానాలు కోల్పోయి 138కి పరిమితమైంది. ఎన్డీఏ కూటమి బలం 185కి పడిపోయింది. యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (యూపీఏ) పేరిట పలు పార్టీలను కాంగ్రెస్ ఒక్కతాటిపైకి తెచ్చి ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మద్దతు కూడగట్టింది. 335 సీట్లతో మన్మోహన్ సారథ్యంలో యూపీఏ సర్కారు ఏర్పడి ఐదేళ్లూ విజయవంతంగా పాలించింది. లెఫ్ట్ ఫ్రంట్‌తో పాటు బీఎస్పీ, ఎస్పీ, కేరళ కాంగ్రెస్ బయటి నుంచి మద్దతిచ్చాయి.

అనూహ్యంగా మన్మోహన్

విపక్షాలతో పాటు సొంత పార్టీ వాళ్లు కూడా తన జాతీయతను ప్రశ్నిస్తుండటంతో ప్రధాని పదవి చేపట్టరాదని సోనియాగాంధీ నిర్ణయించుకున్నారు. ప్రణబ్ ముఖర్జీ వంటి ఆశావహులను కాదని విశ్వాసపాత్రుడైన మన్మోహన్‌సింగ్‌ను ఆ పదవికి ఎంచుకున్నారు. పీవీ ప్రభుత్వంలో అనుకోకుండా కేంద్ర ఆర్థిక మంత్రి అయిన ఆయన అంతే అనూహ్యంగా అత్యున్నత పీఠమూ అధిరోహించారు. మచ్చలేని నేత కావడంతో ఆయన అభ్యర్థిత్వానికి యూపీఏ భాగస్వామ్య, మిత్రపక్షాలు కూడా అంగీకరించాయి. దేశ తొలి హిందూయేతర, సిక్కు ప్రధానిగా మన్మోహన్ చరిత్ర సృష్టించారు.

ముందస్తు పొత్తులు

14వ లోక్‌సభ ఎన్నికలు ఎన్డీఏ, యూపీఏ కూటముల పోరాటంగా సాగాయి. ఎన్డీఏ భాగస్వాములు కాని టీడీపీ, అన్నాడీఎంకేతోనూ బీజేపీ సీట్ల సర్దుబాటు చేసుకుంది. కాంగ్రెస్ కూడా ఎన్నికలకు ముందే జాతీయ స్థాయిలో కూటమి ఏర్పాటు చేయాలనుకున్నా సాధ్యపడలేదు. దాంతో లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారిగా రాష్ట్రాల స్థాయిలో ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకుంది. పశ్చిమబెంగాల్, త్రిపుర, కేరళల్లో సీపీఎం, సీపీఐ స్వతంత్రంగా పోటీ చేశాయి. కాంగ్రెస్, ఎన్డీఏ పక్షాలతో నేరుగా పోటీ పడ్డాయి. ఏపీ, పంజాబ్‌లో కాంగ్రెస్‌తో సీట్ల పంపకం చేసుకున్నాయి. తమిళనాడులో డీఎంకేతో కలిసి పోటీ చేశాయి. యూపీలో ఎస్పీ, బీఎస్పీతో కాంగ్రెస్, బీజేపీ పరస్పరం పోటీపడ్డాయి.



గతం

ఐదేళ్ల పాలనలో అంతా వెలిగిపోతోందన్న భావన. ఆర్థిక సంస్కరణలు. ఇటు వాజ్‌పేయి కటౌట్. దాంతో ధీమాగా ఆర్నెల్ల ముందే ఎన్నికలకు వెళ్లిన బీజేపీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. ఉప ప్రధాని అద్వానీ ఏకంగా 8,500 కిలోమీటర్లు భారత యాత్ర చేసినా లాభం లేకపోయింది. ఫలితంగా 2004లో జరిగిన 14వ లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ అధికారం కోల్పోయింది. యూపీఏ పేరిట కాంగ్రెస్ చేసిన సంకీర్ణ ప్రయోగం ఫలించి పార్టీని ఎనిమిదేళ్ల తర్వాత కేంద్రంలో అధికారంలోకి తెచ్చింది...

– సాక్షి, నేషనల్ డెస్క్

విశేషాలు...

- ఒపీనియన్ పోల్స్, ఎగ్జిట్ పోల్స్ ఎన్డీఏకు 250–275 స్థానాల దాకా వస్తాయని పేర్కొన్నాయి. తీరా చూస్తే ఈ అంచనాలన్నీ తుస్సుమన్నాయి.
- దేశ చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోయే నిర్ణయాలకు యూపీఏ తొలి ఐదేళ్ల కాలంలో అడుగులు పడ్డాయి. వాటిల్లో సమాచార హక్కు చట్టం ముఖ్యమైనది. 2005 అక్టోబర్ 15 నుంచి అమల్లోకి వచ్చింది.
- 2006 ఫిబ్రవరి 2 నుంచి అమల్లోకి వచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం గ్రామీణ కూలీలకు ఎంతో ఆసరా అయింది.
- 2005 జూలై 18న మన్మోహన్ అమెరికా పర్యటన సందర్భంగా ఆ దేశంతో కీలకమైన అణు సహకార ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం పౌర అవసరాలకు అణు ఇంధన వినియోగానికి అమెరికా నుంచి టెక్నాలజీ సాయం లభించింది.
- అన్ని ధ్రువీకరణలకు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాల బదిలీకి వీలు కల్పిస్తున్న ఆధార్‌ను యూపీఏ సర్కారు ప్రవేశపెట్టింది.
- రాహుల్ గాంధీ తొలిసారి యూపీలోని అమేథీ నుంచి ఎన్నికల బరిలోకి దిగి విజయం సాధించారు. ప్రియాంక సైతం తొలిసారి కాంగ్రెస్ తరఫున ప్రచారం చేశారు.

పద్నాలుగో లోక్‌సభలో పార్టీల బలాబలాలు
(మొత్తం స్థానాలు 543)

పార్టీ	స్థానాలు
కాంగ్రెస్	145
బీజేపీ	138
సీపీఎం	43
ఎస్పీ	36
ఆర్జేడీ	24
బీఎస్పీ	19
డీఎంకే	16
శివసేన	12
సీపీఐ	10
బిజు జనతాదళ్	11
స్వతంత్రులు	5
ఇతరులు	84

పరిచయం

ప్రణతీ షిండే
పక్కింటి అమ్మాయి



ప్రణతి షిండే... మహారాష్ట్రకు తొలి దళిత ముఖ్యమంత్రి, కేంద్ర మాజీ మంత్రి సుశీల్‌కుమార్ షిండే కూతురిగా రాజకీయాల్లోకి వచ్చారు. కాలేజీ క్యాంటీన్‌లో చీజ్-క్యాప్సికమ్ శాండ్‌విచ్, బయట చీజ్ ఆనియన్ దోశ తింటూ ముంబై నగరంలో పచార్లు కొట్టిన అల్లరి పిల్ల.. తిరుగులేని రాజకీయ నాయకురాలవుతుందని తండ్రి కూడా ఊహించలేదు. లా పూర్తయ్యాక స్వచ్ఛంద సంస్థ నడుపుతున్నప్పుడు ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా చూశారు ప్రణతి. కలుపుగోలుతనం, ఆకట్టుకునే తత్వంతో షోలాపూర్ ప్రజల మనసును గెలుచుకున్నారు. షోలాపూర్ సిటీ సెంట్రల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ కొట్టిన ప్రణతి.. ఇప్పుడు షోలాపూర్ నుంచే లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగుతున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

హ్యాట్రిక్ విజయం..

రాజకీయాల్లో ఎంట్రీకి వారసత్వంగా పనికొచ్చినా ఒక మహిళగా రాజకీయాల్లో నిలదొక్కుకోవడానికి, తండ్రి పేరు నిలబెట్టడానికి చాలా కష్టపడాల్సి వచ్చిందని చెప్తారు ప్రణతి. తన మంచి పనులే మళ్లీ మళ్లీ గెలిపించాయని గుర్తు చేసుకుంటారు. షోలాపూర్‌లో బీడీ, పవర్‌లూమ్ పరిశ్రమలు ఎక్కువ. అక్కడి కార్మికుల్లో తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లినవారే ఎక్కువ. తెలుగులో మాట్లాడుతూ వారి హృదయాల్లో స్థానం సంపాదించారామె. 2009, 2014, 2019ల్లో వరుస విజయాలతో హ్యాట్రిక్ కొట్టారు. 2021 నుంచి పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఈసారి షోలాపూర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. ఇక్కడ షిండే 2014, 2019ల్లో వరుసగా రెండుసార్లు ఓడిపోయారు. బీజేపీ సిట్టింగ్ ఎంపీ జై సిద్ధేశ్వర స్వామి స్థానంలో రామ్ సత్పుతేను బరిలో దించింది. వాస్తవానికి షిండేను, ప్రణతిని పార్టీలో చేర్చుకునేందుకు బీజేపీ తీవ్ర ప్రయత్నాలే చేసింది. షిండే ఈ సంగతి బహిరంగంగా చెప్పారు. "కాంగ్రెస్ సంస్కృతిలో పుట్టి పెరిగా. సెక్యులర్ భావజాలాన్ని వదులుకొని ఇంకో పార్టీలోకి వెళ్లలేను" అని ప్రణతి కూడా స్పష్టం చేశారు. తెలుగు వారితో పాటు ముస్లిం ఓట్లు కూడా బాగా ఉన్న షోలాపూర్‌లో ప్రణతి కాంగ్రెస్ జెండా ఎగరేసి విజయ పరంపరను కొనసాగిస్తారేమో చూడాలి.

ఇంగ్లిష్ రెట్రో సంగీతం.. సినిమాలు

1980 డిసెంబర్ 9న సుశీల్‌కుమార్ షిండే, ఉజ్వల దంపతులకు జన్మించారు ప్రణతి. తండ్రి ఎస్సీ, తల్లి కాయస్థ. ముగ్గురు కూతుళ్లలో తనే చిన్న. ముంబై సెయింట్ జేవియర్స్ కాలేజ్ నుంచి పొలిటికల్ సైన్స్, అర్థ శాస్త్రంలో డిగ్రీ చేశారు. ముంబై ప్రభుత్వ కళాశాలలో న్యాయ శాస్త్రం చదివారు. రాజకీయాల్లో ఇందిరాగాంధే తనకు ప్రేరణ అంటారు. భర్తను పోగొట్టుకున్న బాధను దిగమింగి దేశంకోసం మొండి పట్టుదలతో నిలిచిన సోనియా కూడా స్ఫూర్తేనంటారు. సంగీతమంటే ఇష్టం. అందులోనూ ఇంగ్లిష్ రెట్రోను ఇష్టపడతారు. సినిమాలన్నా మక్కువే. ప్రణతి జంతు ప్రేమికురాలు కూడా.

చిన్న వయస్కురాలిగా అసెంబ్లీలో రికార్డు

డిగ్రీ పూర్తవుతూనే 2000 సంవత్సరంలో ప్రజా జీవితంలోకి వచ్చారు ప్రణతి. 'జై జుయ్' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి తండ్రి నియోజకవర్గమైన షోలాపూర్‌లో మహిళలు, యువతతో కలిసి పనిచేశారు. స్వయం సహాయక బృందాలతో చిన్న తరహా పరిశ్రమలు పెట్టించారు. 2008లో క్రియాశీల రాజకీయాల్లో ప్రవేశించారు. 2009 ఎన్నికల్లో షోలాపూర్ సిటీ సెంట్రల్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేశారు. పక్కింటి అమ్మాయిలా కనిపించిన ప్రణతిని జనం అక్కున చేర్చుకున్నారు. సుదీర్ఘ ప్రసంగాల కంటే ప్రజలను నేరుగా కలుస్తూ వారికి దగ్గరయ్యారు. వారి మనసులతో పాటు, షోలాపూర్ అసెంబ్లీ స్థానాన్నీ గెలిచారు. అప్పుడామెకు కేవలం 28 ఏళ్లు. నాటి అసెంబ్లీలో అత్యంత పిన్న వయస్కురాలిగా చరిత్ర సృష్టించారు.

ఇదిగో నవరత్నాల వెలుగులు



ఆ ఇంట అప్పుల ఊసులు లేవు..

ఆ కుటుంబంపై విధి చిన్న చూపు చూసింది. కుటుంబ పెద్ద హఠాన్మరణం తీరని శోకాన్ని మిగిల్చింది. పెద్ద దిక్కుగా ఉండాల్సిన కొడుకును అనారోగ్యం బలితీసుకుంది. దివ్యాంగురాలైన కుమార్తె, వితంతువుగా మారిన కోడలు, మనవరాలు ఉన్న ఆ కుటుంబ భారాన్ని ఆ గృహిణి నెత్తిన వేసుకుంది. ఖర్చే మినహా సంపాదన లేక అప్పులు చేస్తూ బతుకు బండిని లాగింది. గత ప్రభుత్వ సాయం లేక అంధకారమైన ఆ కుటుంబం నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాలతో కొత్త కాంతులీనుతోంది.

-పట్నంబజారు (గుంటూరు)

పాత గుంటూరులో ఆరిగ రాజేశ్వరి కుటుంబం నివశిస్తోంది. ఆమె భర్త కృష్ణారెడ్డి 25 సంవత్సరాల క్రితమే మృతి చెందాడు. వీరికి కుమారుడు వీరారెడ్డి, దివ్యాంగురాలైన కుమార్తె నాగలక్ష్మి ఉన్నారు. పిల్లల చిన్నతనంలోనే భర్త మృతితో ఏంచేయాలో పాలుపోని పరిస్థితి రాజేశ్వరికి ఏర్పడింది. అష్టకష్టాలు పడి



పిల్లలను పెద్దచేసింది. కొడుకుకి వివాహం చేసింది. వీరికి ఒక అమ్మాయి కూడా పుట్టింది. కొడు కు చిన్న చిన్న పనులు చేస్తూ తీసుకొచ్చే అరకొర సంపాదనతోనే కుటుంబం నడిచేది. ఈ తరుణంలో వీరారెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో వారి బతుకు చిత్రం ఛిద్రమైంది. దివ్యాంగురాలైన కుమార్తె.. కుమారుడు మృతితో ఒంటరి అయిన కోడలు.. కళ్లెదుట కనపడుతున్న మనమరాలి భవిష్యత్తు.. వృద్ధ వయస్సు లో వారికి అండగా నిలబడిన ఆమె తండ్రిని చూసుకోవాల్సిన బాధ్యత ఆమెపై పడింది.

ఆదుకోని టీడీపీ ప్రభుత్వం

జీవనం దుర్లభంగా మారిన రాజేశ్వరి కుటుంబాన్ని గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కేవలం రూ. 200 పింఛనుతో ఈ కుటుంబాన్ని ఆమె నెట్టుకొచ్చింది. ఆ పింఛను తీసుకోవడానికి నానా పాట్లు పడాల్సి వచ్చేది. అప్పులు చేస్తూ బతుకు బండిని లాగుతూ వచ్చింది. గత పాలకులు వారికి ఎటువంటి ఆర్థిక సహాయం కూడా అందించకపోవడంతో దిక్కుతోచని స్థితి ఏర్పడింది.

సంక్షేమ పరవళ్లు ఇలా.. (రూపాయల్లో)	
పింఛన్లు	4,53,000
అమ్మ ఒడి	60,000
రైతు భరోసా	40,500
ఆరోగ్యశ్రీ	1,60,000
మొత్తం	7,13,500

జగనే దిక్కయ్యారు..!



నా భర్త ఆరిగ కృష్ణారెడ్డి 25 సంవత్సరాల క్రితమే మృతి చెందాడు. నా కుమారుడు వీరారెడ్డి కూడా ఆరేళ్ల క్రితమే అనారోగ్యంతో మృతి చెందాడు. నా కుమార్తె నాగలక్ష్మీ పుట్టకతోనే దివ్యాంగురాలు. మా కుటుంబానికి ఏ దిక్కు లేకపోయినా.. మా ఇంటి బిడ్డలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న సంక్షేమ పథకాలతోనే మా కటుంబం నడుస్తోంది. నాకు వృద్ధాప్య పింఛన్.. నా కుమార్తె నాగలక్ష్మికి దివ్యాంగ పింఛను, నా కోడలు కల్పనకు వితంతు పింఛను ప్రభుత్వం అందజేస్తోంది.

– ఆరిగ రాజేశ్వరి, పాత గుంటూరు

మీకు తెలుసా?

ఈ ఐదేళ్లలో ఆరోగ్యశ్రీ ద్వారా సేవలు అందుకున్న వారు **45,10,645**

ఇందు కోసం ప్రభుత్వం వెచ్చించిన సొమ్ము (ఆరోగ్య ఆసరా సహా) రూ.**14,887** కోట్లు

ఖూనీకోరులు, నేరస్తులే..

మొదటి పేజీ తరువాయి

అరాచకానికి కేరాఫ్ చింతమనేని

అరాచకానికి మారుపేరు దెందులూరు టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్.. ప్రశాంతమైన దెందులూరు నియోజకవర్గంలో తన దాడులతో అల్లకల్లోలం రేపారు. సొంత పార్టీ నేతలే అతని అరాచకాల్ని భరించలేకపోయారు. దుగ్గిరాలకు చెందిన ప్రభాకర్ జులాయిగా తిరిగేవాడు. ప్రారంభంలో రౌడీ షీటర్‌గా దాడులకు తెగబడేవారు. ఏలూరు పోలీసులు అరెస్టు చేసి అండర్‌వేర్‌తో లాకప్‌తో కూర్చోబెట్టిన ఉదంతాలు కూడా ఉన్నాయి. ఇసుక అక్రమ రవాణా, దౌర్జన్యాలకు కేరాఫ్ ప్రభాకర్‌కు చంద్రబాబు దెందులూరు సీటు ఇచ్చి ఎమ్మెల్యేను చేశారు. ఎమ్మెల్యే అయ్యాక అతని దౌర్జన్యాలు మితిమీరాయి. అధికారుల్ని బెదిరించడం దాడులు చేయడం నిత్యకృత్యం. మంత్రి వట్టి వసంతకుమార్‌పై దాడి చేసిన ఘనుడు. ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకున్నారనే అక్కసుతో తహసీల్దార్ వనజాక్షిపై దాడి రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. ఆయనపై వంద కేసులున్నాయి.

బెట్టింగ్, హత్య కేసులో నిందితుడు బీటెక్ రవి

నేరస్తుడిగా ఉన్న మారెడ్డి రవీందర్‌రెడ్డి (బీటెక్ రవి)ని రాజకీయాల్లో పైకి తీసుకువచ్చి ప్రోత్సహించారు చంద్రబాబు. పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురం సర్పంచ్ రామలింగారెడ్డి హత్య కేసులో బీటెక్ రవి నిందితుడిగా ఉన్నారు. క్రికెట్ బెట్టింగ్‌లో అరెస్టయిన చరిత్ర రవిది. రౌడీ కార్యాకలాపాలతో రాజకీయ నేతగా ఎదిగిన అతన్ని చంద్రబాబు ఎమ్మెల్సీగా చేసి ఇప్పుడు పులివెందుల ఎమ్మెల్యే సీటు కేటాయించారు.

అఖిలప్రియ అంటే హడలే..

ఆళ్లగడ్డ అభ్యర్థి భూమా అఖిలప్రియ దౌర్జన్యాలకు అంతేలేదు. కిడ్నాప్ కేసులో నిందితురాలిగా ఉన్నారు. జాతీయ హాకీ ప్లేయర్ ప్రవీణ్‌రావు, అతని ఇద్దరు సోదరులను 2019లో కిడ్నాప్ చేయించి బీభత్సం సృష్టించారు. ఈ కేసులో ఆమె అరెస్టయి కొద్దిరోజులు జైల్లో ఉన్నారు. పలువురిపై దాడులు, దౌర్జన్యాలు చేసి నియోజకవర్గంలో అందరినీ భయభ్రాంతులకు గురిచేసే ఆమెకు సీటిచ్చారు.

అల్లరిమూకలతో కలిసి పోలీసులపై చల్లా బాబు దాడి

చల్లా రామచంద్రారెడ్డి అలియాస్ చల్లా బాబు గతేడాది చంద్రబాబు పుంగనూరు పర్యటన సందర్భంగా జరిగిన విధ్వంసంలో కీలకమైన వ్యక్తి. పోలీసులపైనే దాడి చేసి ఒక కానిస్టేబుల్ కన్ను పోగొట్టారు. అల్లరి మూకలను వెంటబెట్టుకుని మారణాయుధాలతో పోలీసులపై దాడి చేశారు. రొంపిచర్ల మండలంలో జరిగిన పలు దాడులు, దౌర్జన్యాలతో రౌడీగా ముద్రపడ్డారు. ఆయనకు చంద్రబాబు పుంగనూరు సీటు ఇచ్చారు.

కేఈ శ్యాంబాబుపై హత్య కేసు



కర్నూలు జిల్లా పత్తికొండ టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు హత్య కేసులో నిందితుడు. 2017లో వైఎస్సార్‌సీపీ నేత చెరుకులపాడు నారాయణరెడ్డి హత్య కేసులో ఆయన పాత్ర కూడా ఉన్నట్లు నిర్ధారణవడంతో కోర్టు ఆ కేసులో నిందితుడిగా చేర్చింది. వైఎస్సార్‌సీపీ నేతగా నారాయణరెడ్డి ఎదుగుదలను జీర్ణించుకోలేక ఆయనను హత్య చేయించినట్లు ఆరోపణలున్నాయి. డోన్, పత్తికొండ నియోజకవర్గాల్లో దౌర్జన్యాలకు పాల్పడిన చరిత్ర శ్యాంబాబుది.

కందికుంటపై లెక్కలేనన్ని కేసులు..

అనంతపురం జిల్లా కదిరి టీడీపీ అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ పరిటాల రవి అనుచరుడిగా ఉండగా అనేక దౌర్జన్యాలకు పాల్పడ్డారని చెబుతారు. ఒక రేప్ కేసులోనూ వెంకట ప్రసాద్ నిందితుడిగా ఉన్నట్లు గతంలో ఏడీఆర్ తన నివేదికలో పేర్కొంది. హత్య, హత్యాయత్నం కేసులు ఆయనపై ఉన్నాయి. అక్రమంగా ఆయుధాలు కలిగి ఉన్నారనే ఆరోపణలకు సంబంధించిన కేసులూ ఉన్నాయి. చెక్ బౌన్స్ కేసులైతే లెక్కలేనన్ని.. నకిలీ డీడీల కేసులో నిందితుడిగా ఉన్నారు. ఆ కేసును ఇటీవలే కోర్టు కొట్టివేయడంతో చంద్రబాబు వెంటనే సీటిచ్చారు.

హత్య కేసు నిందితుడు కొల్లు రవీంద్ర



హత్య కేసులో నిందితుడిగా ఉన్న కొల్లు రవీంద్రకు మచిలీపట్నం సీటు ఇచ్చారు. మచిలీపట్నంలో 2020లో జరిగిన వైఎస్సార్‌సీపీ నేత మోకా భాస్కరరావు హత్య కేసులో రవీంద్ర నిందితుడు. రవీంద్ర వ్యూహంలో భాగంగానే భాస్కరరావు హత్య జరిగినట్లు తేలడంతో ఆయన్ను అరెస్టు చేసి జైలుకు పంపించారు. ఆయనకే చంద్రబాబు మళ్లీ సీటు ఇచ్చారు. -సాక్షి, అమరావతి

సకుటుంబ సమేత 'రక్తచరిత్ర'!



గత ప్రభుత్వ హయాంలో రెచ్చిపోయిన పచ్చమూకలు

- హత్యారాజకీయాలకు పెట్టింది పేరు ఆ కుటుంబం
- మండలానికో ఇన్‌చార్జ్‌ను నియమించి ప్రజాధనం లూటీ
- ప్రతి మండలంలోనూ కోట్లాది రూపాయల దోపిడీ

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ఒకప్పుడు ఆ నియోజకవర్గం కక్షలు కార్పణ్యాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉండేది. నిత్యం తుపాకీల మోతలు, బాంబుల పేలుళ్లు, కత్తుల దాడులతో అట్టుడికేది. పునర్వ్యవస్థీకరణ సంఘం (ఆర్వోసీ) పేరిట స్వైర'రవి'హారం చేసిన ఓ ఫ్యాక్షన్ నేత ఓ వర్గం వారిని ఊచకోత కోశారు. ఈ నరమేధంలో వందలాది మంది బలయ్యారు. ఆ నేత మరణం తర్వాత ఆయన కుటుంబం రాజకీయాలు చేస్తూ వస్తోంది. 2014లో ఏర్పాటైన ప్రభుత్వంలో ఆయన సతీమణి అమాత్య పదవి దక్కించుకుని కొడుకుతో కలిసి అరాచకాలు, దోపిడీలకు తెగబడ్డారు. ఆ ప్రభుత్వంలో గ్రామ స్థాయి జన్మభూమి కమిటీ సభ్యులు మొదలుకుని నియోజకవర్గ స్థాయి వరకూ పచ్చపార్టీ నేతలు ఎవరి పరిధిలో వారు ప్రభుత్వ ధనాన్ని దోచేశారు. మరో వైపు తమకు ఎదురు తిరిగిన వారిని మట్టుబెట్టేందుకు హింసాకాండ సాగించారు. నియోజకవర్గ ప్రజలకు కంటిపై కునుకు లేకుండా చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆ నియోజకవర్గం ప్రశాంతంగా ఉంది. శాంతి భద్రతలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో ఫ్యాక్షన్ ఇప్పుడు మచ్చుకైనా కనిపించడం లేదు. సరికొత్త 'ప్రకాశ'ంతో అలరారుతోంది. ఇప్పుడు మళ్లీ ఆ నియోజకవర్గంలో అలజడి రేగుతోంది. గతంలో దౌర్జన్య కాండ సాగించిన ఆ ఫ్యాక్షన్ తల్లి మళ్లీ పోటీ చేస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఆ చీకటి రోజులు మాకొద్దంటూ నినదిస్తున్నారు.

కిరాతకాలు

- 2015 ఏప్రిల్ 29న పట్టపగలు పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న రాప్తాడు తహసీల్దార్ కార్యాలయంలో మాజీ ఎంపీపీ ప్రసాద్‌రెడ్డిని టీడీపీ నేతలు అతి దారుణంగా హత్య చేశారు.
- 2018 మార్చి 30న అనంతపురం రూరల్ మండలం కందుకూరులో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు శివారెడ్డిని దారుణంగా హత్య చేశారు.
- 2018 అక్టోబరు 10న ఆత్మకూరులో వైఎస్సార్ సీపీ నాయకుడు గూలి కేశవరెడ్డిని హత్య చేశారు.
- ఎంతో మందిపై దౌర్జన్యాలకు పాల్పడ్డారు. దాడులకు తెగబడ్డారు. మహిళలనూ గాయపరిచి పాపం మూటగట్టుకున్నారు.

అక్రమాలెన్నో..

- అప్పటి మహిళా మంత్రి అండదండలతో రాప్తాడులో రూ.4 కోట్ల విలువైన పండమేటి వెంకట రమణ స్వామి ఆలయ మాన్యంలో అక్రమంగా టీడీపీ కార్యాలయ భవనాన్ని నిర్మించారు.
- పలు గ్రామాల్లో నీరు–చెట్టు పథకం ద్వారా చేపట్టిన పనుల్లో రూ. 200 కోట్లపైనే దోచేశారు.
- ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్‌లో రోడ్డు విస్తరణ పేరిట మంత్రి ఆదేశాలతో దాదాపు 120 ఇళ్లతో పాటు దుకాణాలను కూల్చివేశారు. బాధితులకు ప్రత్యామ్నాయం చూపలేదు. ఇక్కడ రైల్వే స్టేషన్ సమీపంలోని సర్వే నంబర్ 343/2ఏలోని 70 సెంట్ల స్థలాన్ని అప్పటి మహిళా మంత్రి తనయుడి అనుచరుడి పేరిట ఆక్రమించారు. అప్పట్లోనే ఇక్కడ సెంటు స్థలం విలువ రూ.4 లక్షలకుపైగా ఉండేది.
- సిద్దారాంపురం గ్రామ సర్వే నంబర్ 524లోని 92 ఎకరాల ప్రభుత్వ భూమి (గ్రామ కంఠం)కి మండల ఇన్‌చార్జ్, మంత్రి సోదరుడు తన అనుచరుల పేరిట పట్టా చేయించాడు. దీనిపై గ్రామస్తులు అప్పట్లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
- చెర్లోపల్లి, పాపిరెడ్డి గ్రామాల సమీపంలో 300 ఎకరాల భూములను టీడీపీ నాయకులు కాజేసి, వాటిని ప్రైవేటు కంపెనీలకు విక్రయించుకుని సొమ్ము చేసుకున్నారు.
- కోనాపురం గ్రామం దగ్గర హంద్రీ–నీవా కాలువ నుంచి ఎం.బండమీదపల్లి చెరువులోకి నీటిని తరలించేందుకు రూ.8 కోట్లతో కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. ఆ పనులు అప్పటి ఎంపీపీకి రావడంతో నాటి మహిళా మంత్రి చక్రం తిప్పి ఆ పని తన తమ్ముడికి ఇప్పించారు.. నాణ్యత లేకుండా పనులు చేసి భారీగా సొమ్ము వెనకేసుకున్నారు.
- 44వ జాతీయ రహదారి సమీపంలో దాదులూరు గ్రామంలోని నాదారు చెరువును టీడీపీ నాయకులు ఆక్రమించారు. పలువురు టీడీపీ నేతలు ప్రభుత్వ భూములకు అక్రమంగా పట్టాలు చేయించుకుని.. గాలి మరలు, సోలార్ విద్యుత్ ప్లాంట్ల కోసం వాటిని ఇచ్చి సొమ్ము చేసుకున్నారు.
- రహదారుల నిర్మాణంలోనూ భారీ అవినీతికి పాల్పడ్డారు.
- కురుగుంట సమీపంలోని సర్వే నంబర్ 133/4లో మూడు ఎకరాల ప్రభుత్వ స్థలంలో పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని రెవెన్యూ అధికారులపై మహిళా మంత్రి ఒత్తిడి తెచ్చారు. వాస్తవానికి ఇక్కడ 105 మందికి పట్టాలను మంజూరు చేయాల్సి ఉండగా 60 మందికి మాత్రమే అందజేసి... మిగిలిన 45 ఇంటి పట్టాలను తమ అనుచరుల చేత ఒక్కొక్క పట్టా రూ.2 లక్షల వరకు విక్రయింపజేశారు.

మాస్టారూ.. ఎవరీమె?

మొదటి పేజీ తరువాయి

వారు తన సంతానంగా స్పష్టంగా పేర్కొనకపోవడం విశేషం.

- **2019 ఎన్నికల్లో ఇలా..** 2019 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సమర్పించిన అఫిడవిట్‌లో కేవలం తన భార్య రమాదేవిని మాత్రమే చూపించారు. అయితే అంతకు ముందే కుమారుడు నిషాంత్ రోడ్డు ప్రమాదంలో మరణించడంతో కుమార్తె శారిణిని అఫిడవిట్‌లో సంతానంగా, డిపెండెంట్‌లుగా పేర్కొనకపోవడం గమనార్హం.
- **2024లో (ప్రస్తుతం)ఇలా..** 2024 సార్వత్రిక ఎన్నికల్లో సమర్పించిన అఫిడవిట్‌లో తన భార్య రమాదేవిని మాత్రమే చూపించారు. కానీ ఎక్కడా కుమార్తెలు ఉన్నట్లుగా చూపించకపోగా, శారిణి, సింధూర వద్ద అప్పులు తీసుకున్నట్లు అఫిడవిట్‌లో చూపించడం గమనార్హం.

ఇందిర నారాయణ రెండో భార్యే?

పొంగూరు ఇందిర రెండో భార్యే అనడానికి అనేక ఆధారాలు ఉన్నాయి. 1996లో ఏర్పాటు చేసిన నారాయణ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంస్థలో ఇందిర భర్త పొంగూరు నారాయణగా ఆమె చైర్మన్ హోదాతో ఉన్నట్లు ట్రస్ట్ బోర్డులో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు నిర్ధారణ చేస్తున్నాయి. ఇందిర నిర్వహణ కమిటీలో కూడా కోశాధికారిగా ఉన్నట్లు తెలుస్తోంది. 2014లో మాత్రం ఎన్నికల కోసం ఆమెతో రాజీనామా చేయించారు.

2011 నుంచి 2020 వరకు నారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీకి చెందిన ఐసీఐసీఐ బ్యాంక్ అకౌంట్‌లో లావాదేవీల విషయంలో కూడా ఇందిర సంతకం ఉంది. అయితే ఆమెతో కోర్టు ద్వారా విడాకులు తీసుకున్నట్లు ఎప్పుడు, ఎలా, ఎక్కడ అనే ఆధారాల్లేవు. ఆమె పాస్‌పోర్టు పరిశీలించినా నారాయణ భార్యగా తేటతెల్లం అవుతుంది. ఆమె పేరుతో ఉన్న ఆస్తుల రిజిస్టర్ డాక్యుమెంట్లను పరిశీలించినా ఇదే విషయం ప్రస్ఫుటం అవుతుంది. ఇందిర కుమార్తె శారిణి పాస్‌పోర్ట్‌లో తన తండ్రి నారాయణగా ఉన్నట్లు సమాచారం. అయితే నారాయణ మంత్రి అయ్యాక వికీపీడియాలో మాత్రం భార్య రమాదేవి, కుమార్తెలు సింధూర, శారిణి, కుమారుడు నిషాంత్ (లేట్) అనే విషయాలు నమోదు చేసి ఉండడం విశేషం.

కన్యాదానం చేసి..

నారాయణ గతంలో మంత్రి పదవి చేపట్టిన తర్వాత కొంత కాలానికి కుమారుడు హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. తర్వాత కొన్నాళ్లకు తన కుమార్తె శారిణి (రెండో భార్య కుమార్తె)కి టీడీపీ నేత గంటా శ్రీనివాసరావు కుమారుడు రవితేజతో వివాహం జరిగింది. ఆ వివాహ సందర్భంలో నారాయణ, ఇందిర దంపతులుగా వ్యవహరించి కన్యాదానం చేశారు. అలాగే నారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీ మేనేజ్‌మెంట్ కమిటీ మెంబర్‌గా శారిణి, రవితేజ వ్యవహరిస్తున్నారు. అన్ని సందర్భాల్లో ఇందిరను భార్యగా చూపిస్తున్న నారాయణ ఎన్నికల అఫిడవిట్‌లో మాత్రం చూపించకపోవడం విశేషం.

టీడీపీకి ఆర్థిక దన్ను

టీడీపీకి నారాయణ ఆర్థిక వెన్నుదన్నుగా నిలుస్తూ చంద్రబాబు అండతో రాజధాని ప్రాంతంలో వేలాది ఎకరాల భూ కుంభకోణానికి పాల్పడ్డారు. అనేక అవినీతి బాగోతాల్లో నారాయణ పాత్రధారుడుగా ఉన్నారు. ఇక విద్యా సంస్థల్లో అయితే పేపర్ల లీకేజీల నుంచి అనేక అడ్డదారులు తొక్కారు. వీటి నుంచి బయటపడాలని 2019లో నెల్లూరు సిటీ నియోజకవర్గం నుంచి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నారాయణ అవినీతి బాగోతాలన్నీ బయటపడ్డాయి. ఈ కేసులన్నీ మెడకు చుట్టుకోవడంతో కేసుల నుంచి బయటపడేందుకు ఈ ఎన్నికల్లో గెలవాలని రూ.వందల కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇప్పటికే టీడీపీకి సైతం దాదాపు రూ.900 కోట్ల ఎన్నికల ఫండ్‌ను అందజేసినట్లు ప్రచారం జరుగుతోంది. నెల్లూరు సిటీలో కూడా వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నిలబెట్టిన ఒక సామాన్యుడిపై ఓడిపోతాననే భయంతో రూ.100 కోట్ల వరకు ఖర్చు చేసేందుకు కూడా వెనుకాడడం లేదని ఆ పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది.

ఆస్తుల్లోనూ తప్పుడు సమాచారమే?

దేశ వ్యాప్తంగా నారాయణ విద్యాసంస్థలను నెలకొల్పి వేలకోట్ల ఆస్తులను సొంతం చేసుకున్న నారాయణ ఎన్నికల అఫిడవిట్‌లో ఆస్తులపై తప్పుడు సమాచారం ఇచ్చారనే ప్రచారం జరుగుతోంది. ఆయన కుటుంబ ఆస్తుల విలువ రూ.824.05 కోట్లుగా చూపారు. ఆయన తోపాటు మొదటి భార్య రమాదేవి పేరిట ఆస్తులున్నట్లు పేర్కొన్నారు. వారిద్దరి పేర్లతో అప్పులు కూడా రూ.189.59 కోట్లుగా చూపారు. కానీ దేశ వ్యాప్తంగా వేల కోట్ల ఆస్తులు పోగేసుకున్న నారాయణ అఫిడవిట్‌లో కొన్నింటినే చూపారని చెప్పుకోవాలి.

కేసుల్లో దిట్ట

నారాయణపై అఫిడవిట్‌లో చూపిన ప్రకారం ఎనిమిది కేసులు నమోదయ్యాయి. నారాయణ తమ్ముడు భార్య నెల్లూరు నగరంలోని బాలాజీనగర్ స్టేషన్‌లో వరకట్నం, వేధింపుల కేసు నమోదు చేయించింది. అలాగే చిత్తూరులో ప్రశ్నాపత్రాల లీక్ చేసిన అభియోగంతో కేసు నమోదయింది. అలాగే నారాయణ విద్యాసంస్థల్లో చదువుకునే విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న కేసులో కడప జిల్లా బి కోడూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.. మిగిలిన ఐదు కేసులు అమరావతి భూముల విషయంలో సీఐడీ కేసులు నమోదు చేసింది.. అమరావతి భూముల మాస్టర్ డిజైనింగ్ అక్రమాలు, దళితుల భూములు కొనుగోలు, మంత్రిగా తన విధులను దుర్వినియోగం చేశారన్న అభియోగాలపై సీఐడీ కేసులు నమోదు చేసినట్లు చూపారు.

నామినేషన్ స్క్రూట్నీలో అభ్యంతరాలు

నెల్లూరులోని శుక్రవారం జరిగిన నామినేషన్ల స్క్రూట్నీ సమయంలో నెల్లూరు నగర టీడీపీ అభ్యర్థి నారాయణ నామినేషన్ సందర్భంగా పొందుపరిచిన అఫిడవిట్‌పై స్థానిక వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్ పలు అభ్యంతరాలను తెలిపారు. నారాయణకు రెండు పెళ్లిళ్లు అధికారికంగా అయినట్లు పలు ఆధారాలతో సహా రిటర్నింగ్ అధికారికి చూపించారు. అఫిడవిట్‌లో రెండో భార్యను ఎక్కడా చూపించలేదని. రెండో భార్య కుమార్తె శారిణి ఉన్నట్లు చూపించారు. నారాయణ ఎడ్యుకేషన్ సొసైటీ ఏర్పాటు నుంచి ఆయన భార్యగా ఇందిరను చూపించారని, కుమార్తె శారిణి కూడా సొసైటీ మేనేజ్‌మెంట్ మెంబర్‌గా ఉందని, వారి పాస్‌పోర్టులు పరిశీలించినా వాస్తవాలు తెలుస్తాయని అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఆయా అభ్యంతరాల ఆధారంగా నారాయణ నామినేషన్‌ను తిరస్కరించాలని ఫిర్యాదు చేసినా రిటర్నింగ్ అధికారి ఆ అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకోకపోవడం గమనార్హం.

ఆ ద్రోహం మీ బాబుదే రామోజీ

- యానిమేటర్లను మోసం చేసిందంటూ ఈనాడులో అబద్ధపు రాతలు
- 75 రోజులు సమ్మె చేసినా బెదిరించి అణిచేశారు



సాక్షి, అమరావతి: అన్ని వర్గాల పక్షపాతిగా వివిధ కార్యక్రమాలు అమలు చేస్తున్న జగన్ సర్కారుకు వంకలు పెడుతూ అబద్ధాలు అచ్చేస్తున్న రామోజీరావు మరో అవాస్తవాన్ని మిత్ర ద్రోహం శీర్షికతో వండి వార్చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ వస్తే మొదటి వేటు యానిమేటర్లపైనే పడుతుందని అలవోకగా అబద్ధం ఆడేశారు. యానిమేటర్లను మోసం చేసింది చంద్రబాబేనన్న నిజాన్ని దాచిపెట్టి అప్పటి దారుణాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నెట్టేశారు. పొదుపు సంఘాల ద్వారా యానిమేటర్లకు ఉమ్మడి ఏపీలో 2014కు ముందు రూ. రెండువేల గౌరవ వేతనం ఉండేది. ఆ తరువాత విభజిత ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే ఆ గౌరవ వేతనాన్ని నిలిపివేశారు. యానిమేటర్లను ఉద్యోగులుగా పరిగణించలేమని, జీతాలు ఇచ్చేది లేదని తెగేశారు. డ్వాక్రా సంఘాల నుంచే కొంత మొత్తం వసూలు చేసుకోవాలని కూడా సూచించారు. దీనిపై 2015లో వారు 75 రోజులు పాటు సమ్మె చేసినా ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. వీరి ఆగ్రహం ఎదురు తిరుగుతుందన్న భయంతో అదే గౌరవ వేతనం అందజేస్తామంటూ 2019 ఎన్నికలకు ఆరు నెలల ముందు ప్రకటించారు. అప్పట్లో ప్రజా సంకల్పయాత్రలో ఉన్న జగన్ మోహన్ రెడ్డిని యానిమేటర్లు కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. పార్టీ అధికారంలోకి వస్తే రూ.10 వేల చొప్పున వేతనం చెల్లిస్తామని జగన్ ప్రకటించారు. హామీ ఇచ్చినట్టుగానే గత ఐదు సంవత్సరాలుగా నిరాటంకంగా చెల్లిస్తున్నారు. అప్పట్లో బీమా మిత్ర, కళ్యాణ్‌మిత్రలు మండల కేంద్రాల్లో మాత్రమే అందుబాటులో ఉండేవారు. కానీ, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైఎస్సార్ బీమా, వైఎస్సార్ కళ్యాణమస్తు పథకాలను వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దనే అందిస్తున్నారు. దీన్ని కూడా తప్పుగా పేర్కొంటూ రామోజీ విషం చిమ్మారు.

మీకు తెలుసా?



బెజవాడ బరిలో బెంగాలీ బాబు

ప్రముఖ రంగస్థల నటుడు, గాయకుడు హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ 1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికలలో విజయవాడ నుంచి విజయకేతనం ఎగురవేశారు. ఆ ఎన్నికల్లో కమ్యూనిస్టుల మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా కాంగ్రెస్ అభ్యర్థిపై 74,924 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. పందొమ్మిదో శతాబ్ది భారతీయ మేధావుల్లో అగ్రగణ్యుడైన అఘోరనాథ ఛటోపాధ్యాయ ఆయన తండ్రి. బెంగాల్ నుంచి వచ్చి హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. భారత కోకిల సరోజినీ దేవి ఆయన సోదరి.

కింగ్‌మేకరే... కానీ!

గెలిచేవారు కొందరైతే గెలిపించేవారు మరికొందరు. రెండో కోవలోకి వస్తారు తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఉండవల్లి సత్యనారాయణమూర్తి అలియాస్ 'రాయవరం మున్సబు'. ఆయన మాజీ మంత్రులు పిల్లి సుభాష్‌చంద్రబోస్, గొల్లపల్లి సూర్యారావు, సంగీత వెంకటరెడ్డి వంటి నేతలెందరికో రాజకీయ ఓనమాలు నేర్పారు. పరోక్ష రాజకీయాల్లో చక్రం తిప్పారు. ప్రత్యక్ష రాజకీయాల్లో మాత్రం రాణించలేకపోయారు. ఒకసారి అసెంబ్లీకి పోటీ చేసి ఓడిపోయారు.

ఆ దేశాల్లో ఓటేయకపోతే నేరం

ప్రపంచ వ్యాప్తంగా 33 దేశాల్లో ఓటు వేయడం తప్పనిసరి. ఈ హక్కును వినియోగించుకోకుంటే కొన్ని దేశాలు జరిమానా విధిస్తుండగా, మరికొన్ని ప్రభుత్వ సాయం, సదుపాయాలు నిలిపేస్తున్నాయి. కొన్ని దేశాల్లో ఉద్యోగుల జీతాలను నిలిపివేస్తున్నారు. మరికొన్ని దేశాల్లో ఏకంగా ఓటు హక్కును తొలగిస్తున్నారు. సరైన కారణం చూపితేగాని దాన్ని పునరుద్ధరించే అవకాశం ఉండదు. తప్పనిసరిగా ఓటు వేయాల్సిన దేశాల్లో ప్రముఖంగా బెల్జియం, ఆస్ట్రేలియా, ఆస్ట్రియా, అర్జెంటీనా, బొలీవియా, ఉక్రెయిన్, బ్రెజిల్, ఈజిప్ట్, గ్రీస్, ఇటలీ, మెక్సికో, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్, టర్కీ, స్విట్జర్లాండ్, నార్త్ కొరియా తదితర దేశాలున్నాయి.

బ్యాలెట్టా.. బుక్‌లెట్టా

సాధారణంగా ఒక్క సీటుకు ఎంత మంది అభ్యర్థులు పోటీ పడతారు..? 10.. 20.. మహా అయితే 30! కానీ ఒకే సీటుకు 1033 మంది పోటీ చేశారు. ఇది నిజం.. 1966లో తమిళనాడులోని మొదారుచి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అంతమంది బరిలో నిలిచారు. దీంతో అభ్యర్థుల గుర్తుల జాబితా చాంతాడులా పెరిగి.. బ్యాలెట్ పేపర్ కాస్తా బుక్‌లెట్‌గా మారింది.



సంతకం ముంచేసింది

కేవలం ఒకే ఒక్క సంతకం ఆయన రాజకీయ భవిష్యత్‌నే మార్చేసింది. 2009 సాధారణ ఎన్నికలలో ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, టీడీపీ తరఫున కదిరి బాబూరావు బరిలోకి దిగారు. కదిరి బాబూరావు నామినేషన్ పత్రాల్లో పొరపాటున సంతకం చేయడం మరచి పోయారు. దాంతో ఆయన నామినేషన్‌ను ఎన్నికల అధికారి తిరస్కరించారు. ఆ పరిస్థితుల్లో ఆయన సమీప బంధువు మధుసూదన్‌కు టీడీపీ మద్దతు ఇచ్చింది.

వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అప్పటికి అధికారంలోకి వచ్చి 10 నెలలు కూడా కాలేదు..

చంద్రబాబు హయాంలో జరిగిన ఆర్థిక విధ్వంసాన్ని చక్కదిద్ది.. రాష్ట్రంలో సంక్షేమాన్ని పట్టాలెక్కిస్తున్న వేళ..

వందేళ్లకు ఒకసారి వచ్చే ఉపద్రవం.. ఒక్కసారిగా చుట్టుముట్టి రాష్ట్రాన్ని వణికించింది..

అయితే సీఎం జగన్ చేతులెత్తేయలేదు.. కరోనా వైరస్‌పై పోరాటంలో తన వలంటీర్ల సైన్యాన్ని మోహరించారు.

వందలాది ఆస్పత్రుల్ని కోవిడ్ చికిత్సా కేంద్రాలుగా మార్చి లక్షలాది మంది ప్రాణాలు కాపాడారు.

కరోనా కట్టడికి క్వారంటైన్ కేంద్రాలు తెరిచి వారికి భరోసా కల్పించారు.

సొంతవారే ఆదరించని ఆ కష్టకాలంలో వలంటీర్లు, ఏఎన్ఎంలు అనునిత్యం ప్రజా సేవలో నిమగ్నమయ్యారు.

అందుబాటులో ఉన్న ఆస్పత్రులన్నీ కరోనా చికిత్సా కేంద్రాలుగా మార్చి ఉచితంగా వైద్య సేవలందించారు.

కరోనా బాధితులకు పౌష్టికాహారంతో పాటు ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందించారు.

కరోనాపై యుద్ధంలో.. జగన్‌కు జేజేలు

పక్కా ప్రణాళికతో కోవిడ్‌పై యుద్ధం.. జగన్ సర్కారు సూపర్ సక్సెస్

- రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్న వేళ విరుచుకుపడ్డ **కరోనా మహమ్మారి**
- ప్రాణాలకు ఎదురొడ్డి కరోనాపై పోరాడిన **వలంటీర్లు, ఏఎన్ఎంల సైన్యం**
- రికార్డు స్థాయిలో కోవిడ్ పరీక్షలు, వ్యాక్సిన్ల పంపిణీ
- కోవిడ్ నిర్ధారణకు నెలల వ్యవధిలోనే 150 ల్యాబ్‌ల ఏర్పాటు
- వందల ఆస్పత్రులు, క్వారంటైన్ కేంద్రాల్లో బాధితులకు ఉచిత చికిత్స
- బాధితులు త్వరగా కోలుకునేలా పౌష్టికాహారం పంపిణీ
- ఆక్సిజన్ కొరత లేకుండా రూ.200 కోట్లతో ప్లాంట్ల ఏర్పాటు.. 24 వేల పడకలకు నిరంతరం ఆక్సిజన్ సౌకర్యం
- చివరి దశలో ఉన్న 2,06,721 మంది ప్రాణాలు కాపాడిన జగన్ ప్రభుత్వం
- ఆరోగ్యశ్రీలోకి కరోనా.. పేద, ధనిక తేడా లేకుండా రూ.743.77 కోట్ల ఖర్చు
- కరోనా కట్టడికి రూ.4 వేల కోట్లకుపైగా వ్యయం
- వైరస్ కట్టడికి ప్రభుత్వ చర్యల్ని ప్రశంసించి నీతి ఆయోగ్, ప్రముఖులు



కోవిడ్‌పై పోరులో వలంటీర్ల సైన్యం


కరోనా మహమ్మారి విజృంభించిన వేళ.. అందరిలోనూ భయం.. ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందిన దేశాల్లోనూ ఎవరి జాగ్రత్త వారిదేనంటూ చేతులెత్తేశారు. అయితే జగన్ మాత్రం ధైర్యంగా కోవిడ్ విపత్తుకు ఎదురొడ్డారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కరోనా ఛిన్నాభిన్నం చేసినా.. దాన్ని లెక్కచేయకుండా ప్రజల ప్రాణాలు కాపాడడంపైనే దృష్టంతా పెట్టారు. కరోనా వల్ల రాష్ట్రానికి దాదాపు రూ. 30 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లింది. అయినా జగన్ డబ్బుల లెక్క చూడకుండా వలంటీర్లు, ప్రభుత్వ ఉద్యోగుల సహకారంతో ప్రజలకు అవసరమైన సాయం అందించారు. నిరంతరం కోవిడ్ పరీక్షలు చేయిస్తూ.. కరోనా సోకిన వారికి క్వారంటైన్ కేంద్రాలు, ఆస్పత్రుల్లో అన్ని వసతులు కల్పిస్తూ చికిత్స అందించారు. కరోనా కట్టడి, బాధితులకు అందుతున్న సాయం చూసి తెలంగాణలో ఉండే ఆంధ్ర ప్రజలు ఆశ్చర్యపోయారు. తమ ఊళ్లలో కుటుంబసభ్యులు, బంధువులకు అందుతున్న సేవలు.. తమ రాష్ట్రంలో సేవలతో పోల్చుకుని ప్రశంసలతో ముంచెత్తారు. కరోనా కట్టడిలో ఏపీ ఎంత బాగా పనిచేసిందో తెలిపేందుకు ఈ చిన్న ఉదాహరణ చాలు. వలంటీర్ల వ్యవస్థపై విషం చిమ్ముతున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు కరోనా సమయంలో ఈ రాష్ట్రంలో ఉండి ఉంటే వారి విలువ అప్పుడే తెలిసుండేది.

టెస్ట్, ట్రేస్, ట్రీట్ వ్యూహం

ముందుగా వలంటీర్లు, ఇతర ప్రభుత్వ సిబ్బంది విదేశాల నుంచి వచ్చిన ప్రయాణికులను గుర్తించి, వారిని హోంఐసోలేషన్‌లో ఉంచేవారు. వైద్య పరీక్షల నిర్వహణ, హోం ఐసోలేషన్ కిట్లు అందించడంలో వలంటీర్లు కీలకంగా వ్యవహరించారు. టెస్ట్, ట్రేస్, ట్రీట్ (టీటీటీ) వ్యూహం అమలులో వారి సేవలు అద్వితీయం.







నెలల వ్యవధిలోనే 150 కోవిడ్ నిర్ధారణ ల్యాబ్‌లు



2019 మే నెలాఖరులో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొలువైన నాటికి రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య రంగం అస్తవ్యస్తంగా ఉంది. ఆస్పత్రుల్లో వైద్యులు, పరికరాలు, ఇతర వసతుల కొరత తీవ్రంగా ఉండేది. 2020లో తొలి కేసు నమోదైనప్పుడు రాష్ట్రంలో ఒక్క వైరస్ పరీక్షా కేంద్రం లేదు. పుణెకు పంపి ఫలితాల కోసం రోజులు తరబడి వేచి చూడాల్సిందే. ఈ పరిస్థితుల నుంచి 150 ఆర్టీపీసీఆర్, ట్రూనాట్, ఇతర ల్యాబ్‌లను అభివృద్ధి చేశారు. వైరస్ వ్యాప్తి ఉధృతంగా ఉన్న సమయంలో రోజుకు 80 వేల నమూనాలు పరీక్షించారు. 122 మొబైల్ టెస్టింగ్ బస్సుల ద్వారా పట్టణాలు, నగరాలు, గ్రామాల్లో పరీక్షలు నిర్వహించారు. రెండో దశ కరోనా వ్యాప్తి అనంతరం కొత్త వేరియంట్‌లను పసిగట్టడానికి వీలుగా జీనోమ్ సీక్వెన్సింగ్ ల్యాబ్‌ను విజయవాడలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రభుత్వాస్పత్రులు, ఐసోలేషన్ సెంటర్లలో కరోనా బాధితులకు వైద్య సేవలు అందించడానికి పెద్ద ఎత్తున నియామకాలను చేపట్టారు. శాశ్వత ప్రాతిపదికన 9,712, తాత్కాలిక ప్రాతిపదికన మరో 21,662 పోస్టులను భర్తీ చేశారు. కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేసిన ఉద్యోగులకు తర్వాత చేపట్టిన నియామకాల్లో ప్రత్యేక వెయిటేజ్ కల్పించారు.

కాల్ సెంటర్‌తో నిరంతర పర్యవేక్షణ



రెండో దశ కరోనా సమయంలో ప్రజల కోసం ప్రత్యేకంగా 104 కాల్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఈ సెంటర్ ద్వారా కరోనాకు సంబంధించిన సమాచారం, సేవలు, టెలీ మెడిసిన్ అందుబాటులోకి తెచ్చారు. కాల్ సెంటర్‌కు ఫోన్ చేస్తే కరోనా నిర్ధారణ పరీక్షలకు టోకెన్ తీసుకోవడం, పాజిటివ్ అయితే ఆసుపత్రికి తరలించేలా అంబులెన్స్‌ను పంపడం, ఆసుపత్రిలో బెడ్‌ను సమకూర్చడం వంటివి ప్రజలకు సులభతరం చేశారు. రాష్ట్ర స్థాయి కాల్ సెంటర్‌తో పాటు, జిల్లా, మండలం, గ్రామం, మున్సిపాలిటీ ఇలా అన్ని స్థాయిల్లో కాల్ సెంటర్లు నిర్వహించారు. ఆసుపత్రులు, క్వారంటైన్ కేంద్రాల వద్ద హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేసి, వీటి ద్వారా పడకల లభ్యత, రోగుల ఆరోగ్య పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ చేపట్టారు. హెల్ప్‌డెస్కుల ద్వారా రోగుల ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులు తెలుసుకోవడానికి వీలు కల్పించారు. సీసీ కెమెరాల ద్వారా క్వారంటైన్ సెంటర్‌లు, ఆసుపత్రులపై నిరంతర నిఘా ఉంచారు. ఆరోగ్య శ్రీలో కరోనా బాధితులకు ఉచితంగా వైద్య సేవలు మొదలు పెట్టిన తొలి రాష్ట్రం ఏపీనే..

638 కోవిడ్ ఆస్పత్రులు, 119 కోవిడ్ కేర్ సెంటర్లు

వైరస్ వ్యాప్తి తొలి నాళ్లలో రెండు ఆసుపత్రుల్లో 210 పడకలతో కరోనా చికిత్స ప్రారంభించారు. మొదటి దశలో ఆసుపత్రుల సంఖ్య 243కు పెంచగా.. 37,044 పడకలు ఏర్పాటు చేశారు. మూడో వేవ్ నాటికి 638 ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో 56,741 పడకలకు సేవలు విస్తరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 119 కోవిడ్ కేర్ సెంటర్లు ఏర్పాటు చేసి వాటిల్లో 55430 పడకలు అందుబాటులోకి తెచ్చారు. స్వల్ప లక్షణాలున్న బాధితులకు వీటిల్లో సేవలు అందించారు.



ఆక్సిజన్ కొరత లేకుండా చర్యలు

2021లో రెండో దశ వైరస్ విజృంభణ సమయంలో తీవ్రమైన శ్వాసకోశ సమస్యలు తలెత్తాయి. దీంతో చాలావరకూ రోగులకు కృత్రిమంగా ఆక్సిజన్ అందించాల్సి వచ్చేది. రోజుకు 686 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ అవసరమయ్యేది. ఒడిశా, తమిళనాడు, ఇతర రాష్ట్రాల నుంచి ఆక్సిజన్ రాష్ట్రానికి సరఫరా అయ్యేది. స్టేట్ కమాండ్ కంట్రోల్ రూం నుంచి ఎప్పటికప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ఆసుపత్రుల్లో ఆక్సిజన్ నిల్వలు, మరుసటి రోజు ఎంత అవసరమో ముందు రోజు అంచనా వేస్తూ ప్రాణవాయువుకు కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకున్నారు. ఏపీలో ఆక్సిజన్ కొరత వల్ల మరణించే పరిస్థితి లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు.



152 ఆస్పత్రుల్లో ఆక్సిజన్ ప్లాంట్లు

రెండో దశలో జగన్ ప్రభుత్వం 50 పడకలు పైబడిన ప్రతి ఆసుపత్రిలో ప్రభుత్వం ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేసింది. 152 ఆసుపత్రుల్లో నిమిషానికి 1.20 లక్షల లీటర్ల ఆక్సిజన్ ఉత్పత్తి సామర్థ్యంతో 176 పీఎస్ఏ ప్లాంట్లను అందుబాటులోకి తెచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో 24,419 బెడ్లకు నిరంతరం ఆక్సిజన్ సరఫరా చేసేవారు. దేశంలో అత్యధిక ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్‌లు ఉన్న ప్రభుత్వాసుపత్రులు రాష్ట్రంలోనే ఉండేవి.



కరోనా కట్టడికి రూ.4 వేల కోట్లకుపైగా ఖర్చు

కరోనా కట్టడికి సీఎం జగన్ ప్రభుత్వం చిత్తశుద్ధితో అడుగులు వేసింది. ఇతర రాష్ట్రాలకు, దేశానికి ఆదర్శంగా నిలిచింది. ఏకంగా రూ.4 వేల కోట్లు ఖర్చు చేసింది. ఔషధాలు, చికిత్స ఉపకరణాలు, ఆక్సిజన్ పైప్‌లైన్లు, ఇతర వనరుల కల్పనకు రూ.2 వేల కోట్లు, జిల్లాల్లో కోవిడ్ నియంత్రణ కోసం రూ.1500 కోట్లు, ప్రయోగశాలల ఏర్పాటు, రీఏజెంట్‌లు, టెస్టింగ్ కిట్ల కోసం రూ.200 కోట్లకు పైగా, ఆక్సిజన్ కోసం రూ.100 కోట్లు, ఆసుపత్రుల్లో సీసీ కెమెరాలు, ఇతర వ్యయాల కోసం రూ.51 కోట్లకు పైగా ఖర్చు చేశారు. ఆయుష్ విభాగంలో వైరస్ నియంత్రణకు రూ.2 కోట్లకు పైగా వెచ్చించారు.

ఏపీ భేష్

కరోనాను ఏపీ విజయవంతంగా ఎదుర్కొంటోంది. వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి 4.5 లక్షల మంది వలంటీర్‌లు, 11 వేల మంది గ్రామ కార్యదర్శులతో కరోనా లక్షణాలున్న వారిని క్వారంటైన్ చేస్తున్నారు.'

- 2020లో రాష్ట్రంలో పర్యటించినప్పుడు బ్రిటన్ డిప్యూటీ హై కమిషనర్ ఆండ్రూ ఫ్లెమింగ్ వ్యాఖ్యలు

వలంటీర్లు, ఏఎన్ఎంల పాత్ర అద్భుతం

కరోనా కట్టడిలో గ్రామ, వార్డు వలంటీర్లు, ఏఎన్ఎంలది కీలక పాత్ర. ప్రభుత్వం ఇంటింటి సర్వే చేపట్టి అనుమానిత లక్షణాలున్న వారిని గుర్తించి ఐసోలేషన్‌లో ఉంచి.. మందులు పంపిణీ చేయడం బాగుంది. రాష్ట్రంలో హోమ్ ఐసోలేషన్ సమర్థంగా నిర్వహించారు.

- 2021లో నీతి ఆయోగ్ అధ్యయనంలో రాష్ట్ర ప్రభుత్వానికి కితాబు

ఆరోగ్యశ్రీలో చికిత్స కోసం రూ.743.77 కోట్లు

నిరుపేద నుంచి కోటీశ్వరుడి వరకూ వైరస్ బారిన పడిన ప్రతి ఒక్కరికీ జగన్ ప్రభుత్వం ఉచిత వైద్యం అందించింది. దేశంలో మొట్టమొదటిగా కరోనాకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో చికిత్స అందించి రికార్డు సృష్టించారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు పూర్తి ఉచితంగా అందించేలా 2021 మేలో ఆరోగ్యశ్రీ పరిధిలోకి కరోనా సేవలను తీసుకొచ్చారు. అప్పటి నుంచి కరోనా రెండో దశ, అనంతరం ఒమిక్రాన్, ఇతర వేవ్‌లలో కరోనా బారిన పడిన ప్రజలకు ఉచితంగా వైద్య సేవలందించారు. ఏకంగా 2,06,721 మంది కరోనా చికిత్స అందుకున్నారు. దీని కోసం ప్రభుత్వం రూ.743.77 కోట్లు వెచ్చించింది.


ఫలించిన ఫీవర్ సర్వే

వైరస్ కట్టడికి అనుమానిత లక్షణాలున్న వ్యక్తులను గుర్తించడం, వారికి కరోనా నిర్ధారణ పరీక్షలు చేసి చికిత్స అందించేలా ప్రభుత్వం పెద్దపీట వేసింది. వివిధ దశల్లో రాష్ట్రంలోని 1.66 కోట్ల ఇళ్లకు తిరిగి వైద్య, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్‌లు ఫీవర్ సర్వే చేపట్టారు. అనుమానిత లక్షణాలున్న వారిని గుర్తించి మరింత మందికి వ్యాపించకుండా నియంత్రించడంతో పాటు, మరణాల రేటును నియంత్రించారు. 50 విడతలు రాష్ట్రంలో వైద్య శాఖ ఫీవర్ సర్వే నిర్వహించింది.

రికార్డు స్థాయిలో 3.43 కోట్ల కోవిడ్ పరీక్షలు

కరోనా నియంత్రణలో భాగంగా వీలైనన్ని ఎక్కువ పరీక్షలు చేయడం ద్వారా ఎక్కువ పాజిటివ్ కేసులను గుర్తించి వైరస్ వ్యాప్తిని నియంత్రించడంలో ఏపీ ప్రభుత్వం విజయవంతమైంది. ఫీవర్ సర్వే ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఇంటిని జల్లెడ పట్టి అనుమానిత లక్షణాలున్న వారిని గుర్తించి పెద్ద ఎత్తున పరీక్షలు చేపట్టారు. దీంతో ప్రారంభ దశలోనే వైరస్ బారిన పడిన వారిని పసిగట్టి తీవ్ర అనారోగ్య పరిస్థితుల నుంచి గట్టెక్కించారు. ప్రారంభ దశలోనే వైరస్‌ను గుర్తించడం ద్వారా త్వరితగతిన వైద్యం చేసి వేల మంది ప్రాణాలు కాపాడారు. మొత్తం 3.43 కోట్ల పరీక్షలు ప్రభుత్వం నిర్వహించింది.







మందులు పుష్కలం

ప్రతిక్షణం సీఎం జగన్ కోవిడ్‌పై అధికారుల్ని, క్షేత్ర స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేస్తూ దిశానిర్దేశం చేశారు. రోగులకు చికిత్సలు అందించడానికి వైద్యులు, పీపీఈ కిట్‌లు, మాస్క్‌లు, శానిటైజర్‌లతో పాటు, మందులు ఇంజెక్షన్‌లను పుష్కలంగా అందించారు. వేల సంఖ్యలో ఐసీయూ, ఆక్సిజన్, నాన్ ఆక్సిజన్, వెంటిలేటర్ బెడ్లను సమకూర్చారు. బెడ్ల కొరత లేకుండా ప్రభుత్వాస్పత్రుల ప్రాంగణాల్లో, బహిరంగ మైదానాల్లో జర్మన్ హ్యాంగర్ షెడ్లు వేసి వైద్య సేవలు అందించారు. కల్యాణ మండపాలు, కమ్యూనిటీ సెంటర్లలో పెద్ద ఎత్తున క్వారంటైన్ కేంద్రాలు నిర్వహించారు. మాస్కులను తయారు చేయించి ప్రభుత్వమే ఉచితంగా అందించింది.

వ్యాక్సిన్ పంపిణీలో నంబర్‌వన్

వ్యాక్సిన్ పంపిణీలో తొలి నుంచి జగన్ ప్రభుత్వం ఎంతో చొరవగా వ్యవహరించింది. రికార్డు స్థాయిలో వ్యాక్సిన్ పంపిణీ చేసి జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో నిలిచింది. 18 ఏళ్లు పైబడిన 4.35 కోట్ల మందికి రెండు డోసులు, 1.86 కోట్ల మందికి ప్రికాషన్ డోసు టీకాను పంపిణీ చేసింది. 12–14 ఏళ్ల పిల్లల్లో 14.95 లక్షల మందికి, 15–18 ఏళ్ల వయసు వారిలో 25.27 లక్షల మందికి రెండు డోసుల టీకా వేశారు.

వైద్యుడిని కాపాడేందుకు 1.17 కోట్ల రూపాయల సాయం



డాక్టర్లు నర్సు భాస్కర్, భాగ్యలక్ష్మి

నా భర్త నర్సు భాస్కరరావు కారంచేడు పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్‌గా ఉండేవారు. నేను గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్నాను. 2021 ఏప్రిల్‌లో ఇద్దరం కోవిడ్ బారిన పడ్డాం. నేను కోలుకున్నా నా భర్త ఆరోగ్యం క్షీణించింది. విజయవాడ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా ఫలితం లేకపోవడంతో హైదరాబాద్ తీసుకెళ్లాం. ఊపిరితిత్తులు పూర్తిగా చెడిపోయాయని, అవి మార్చిస్తేగాని బతకరని వైద్యులు చెప్పారు. ఎక్మో దొరకడం ఆలస్యం కావడంతో కళ్ల ముందే మావారి పరిస్థితి పూర్తిగా క్షీణించింది. బ్రెయిన్ డెడ్ అని, నిర్ధారించి ఇంటికి తీసుకెళ్లిపోమన్నారు. అందుకు నా మనసు అంగీకరించలేదు. మెదడు పనిచేస్తుండడంతో మరో ఆస్పత్రిలో చేర్చి 40 రోజులు ఎక్మో సాయంతో ప్రాణాలు కాపాడేందుకు శ్రమించారు. జూన్ 4న ఆస్పత్రిలో చేరిన ఆయనకు జులై 14న ఊపిరితిత్తుల మార్పిడి ఆపరేషన్ చేశారు. ఆపరేషన్‌కు రూ. 40 లక్షలు ఖర్చయ్యింది. మొత్తం రూ. 1.17 కోట్లు ఖర్చు కాగా ఆ మొత్తాన్ని సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ప్రభుత్వమే మంజూరు చేసింది. ఆపరేషన్ అనంతరం వంద రోజులకుపైగా ఆయన మంచానికే పరిమితమయ్యారు. అప్పుడు నేనే చిన్నపిల్లాడిలా సాకాను. ఊపిరితిత్తులకు ఇన్‌ఫెక్షన్ సోకకుండా కాపాడుకున్నాను. ఊపిరితిత్తుల మార్పిడికి అంత మొత్తం మా దగ్గర లేకపోవడంతో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఈ విషయమై ముఖ్యమంత్రితో చర్చించారు. రెండు రోజుల్లోనే ఆయన వైద్యానికి అయ్యే ఖర్చు మొత్తం రాష్ట్ర ప్రభుత్వం తరపున చెల్లిస్తామని చెప్పారు. హైదరాబాద్‌లో మరో ఆసుపత్రికి మార్చడానికి గ్రీన్ చానల్ ఏర్పాటు చేయించారు. ఇప్పుడు ఆయన కోలుకుని డ్యూటీకి వెళ్తున్నారు. సీఎం మేలు మరవలేం.



- వడ్డే బాలశేఖర్, సాక్షి, అమరావతి

సాక్షి
ఫ్యామిలీ
V
విజయవాడ
శనివారం ॥ 27-4-2024


ప్రతీకాత్మక చిత్రం

పరంపర

సెలవులొచ్చేశాయ్ ఫోన్ పక్కన పడేద్దామా

సెలవులొచ్చేది ఆటల కోసం, స్నేహాల కోసం బంధువుల కోసం, విహారాల కోసం, వినోదాల కోసం పిల్లలు ఇంతకాలం ఫోన్లలో కూరుకుపోయారు. వారిని ఫోన్ల నుంచి బయటకు తెండి. మీ బాల్యంలో సెలవుల్లో ఎలా గడిపారో అలా గడిపేలా చేయండి. పెద్దయ్యాక తలుచుకోవడానికి బాల్యం లేకపోవడానికి మించిన విషాదం లేదు.

ఆటస్థలాలు లేని స్కూళ్లలో చదివించడం, ఆడుకునే వీలు లేని ఇళ్లలో నివసించడం, పార్కులు లేకపోవడం, ఆడుకోవడానికి తోటి పిల్లలు లేని వాతావరణంలో జీవించడం, ఇవన్నీ ఉన్నా పిల్లలతో గడిపే సమయం తల్లిదండ్రులకు లేకపోవడం... వీటన్నింటి వల్ల పిల్లలకు స్కూల్, ఇల్లు కాకుండా తెలిసింది ఒకే ఒక్కటి. సెల్‌ఫోన్. పిల్లలకు సెల్‌ఫోన్లు ఇచ్చి వారు వాటిలో కూరుకుపోతే 'అమ్మయ్య. మా జోలికి రావడం లేదు' అనుకునే తల్లిదండ్రులు ఉన్న ఈ కాలంలో పిల్లలకు ఆరోగ్యకరమైన ఆటలు, విహారం, అనుబంధాల విలువ, కొత్త విషయాల ఎరుక ఎలా కలుగుతుంది?

అందుకే వేసవి సెలవలు ఒక పెద్ద అవకాశం. ఇరవై ముప్పై ఏళ్ల క్రితం వరకు తెలుగు ప్రాంతాలలో వేసవి సెలవులు వస్తే పిల్లలు ఎలా గడిపేవారో ఇప్పుడూ అలా గడిపే అవకాశం కల్పించవచ్చు. కాకుంటే తల్లిదండ్రులు ప్రయత్నించాలి. పిల్లలను మోటివేట్ చేయాలి.

బంధువులు- బంధాలు

బంధువులు ఎవరో తెలియకపోతే బంధాలు నిలవవు. ఎంత స్వతంత్రంగా జీవిద్దామనుకున్నా, సాటి మనుషుల విసిగింపును తప్పించుకుని తెగదెంపులు చేసుకుని బతుకుదామనుకున్నా మనిషి సంఘజీవి. అతడు బంధాలలో ఉండాల్సిందే. బంధాల వల్ల బతకాల్సిందే. పిల్లలకు బంధాలు బలపడేది, బంధాలు తెలిసేది వేసవి సెలవుల్లోనే. ఇంతకు ముందు పిల్లలు వేసవి వస్తే తల్లిదండ్రులను వదిలిపెట్టి పిన్ని, బాబాయ్, పెదనాన్న, తాతయ్య... వీళ్ల ఇళ్లకు వెళ్లి రోజుల తరబడి ఉండేవారు. వారి పిల్లలతో బంధాలు ఏర్పరుచుకునేవారు. దీని వల్ల కొత్త ఊరు తెలిసేది. ఆటలు తెలిసేవి. కలిసి వెళ్లిన సినిమా అలా ఓ జ్ఞాపకంగా మిగిలేది. ఇవాళ పెద్దల పట్టింపులు పిల్లలకు శాపాలవుతున్నాయి. రాకపోకలు లేని బంధుత్వాలతో పిల్లలు ఎక్కడకూ వెళ్లలేని స్థితి దాపురించింది. దీనిని సరి చేయాల్సిన బాధ్యత పెద్దలదే. లేకుంటే పిల్లలు ఫోన్లనే బంధువులుగా భావించి అందులోని చెత్తను నెత్తికెక్కించుకుంటారు. జీవితంలో సవాళ్లు ఎదురైన సమయంలో ఒంటరితనం ఫీలయ్యి అతలాకుతలం అవుతారు.

తెలుగు ఆటలు

సెలవుల్లో పిల్లలకు తెలుగు ఆటలు తెలియడం ఒక పరంపర. బొంగరాలు, గోలీలు,



వామనగుంటలు, పరమపదసోపాన పటం, ఒంగుళ్లు-దూకుళ్లు, నేల-బండ, ఏడుపెంకులాట, పులి-మేక, నాలుగు స్తంభాలాట, వీరి వీరి గుమ్మడిపండు, లండన్ ఆట, రైలు ఆట, పొడుపుకథలు విప్పే ఆట, అంత్యాక్షరి, కళ్లకు గంతలు... ఈ ఆటల్లో మజా తెలిస్తే పిల్లలు ఫోన్ ముట్టుకుంటారా?

కథ చెప్పుకుందామా

కథలంటే పిల్లలకు ఇష్టం. పెద్దలు చెప్పాలి గాని. ఈ సెలవుల్లో రాత్రి పూట భోజనాలయ్యాక, మామిడి పండ్లు తిన్నాక, పక్కలు వేసుకుని అందరిని కూచోబెట్టి పెద్దలు కథలు చెప్తే ఎన్నెన్ని తెలుస్తాయి! ఎన్ని ఊహల కవాటాలు తెరుచుకుంటాయి. మర్యాద రామన్న, తెనాలి రాముడు, బేతాళుడు, సింద్‌బాద్, ఆలీబాబా, పంచతంత్రం, రామాయణం, మహాభారతం... భీముడిలోని బలం, అర్జునుడిలోని నైపుణ్యం... ఇవి కదా చెప్పాలి.

బలం కోసం తిండి:

పిల్లలను సరిగ్గా గమనించి వారికి కావలసిన బలమైన తిండి తినిపించడానికి వీలయ్యేది ఈ సెలవుల్లోనే. బలహీనంగా ఉండే పిల్లలు, ఎదిగే వయసు వచ్చిన ఆడపిల్లలకు ఏమేమి వొండి తినిపించాలో పెద్దల ద్వారా తెలుసుకున్న తల్లిదండ్రులు ఈ కాలంలో తినిపిస్తారు. శిరోజాల సంరక్షణ, చర్మ సంరక్షణ, పంటి వరుస సరి చేయించడం, జీర్ణశక్తిని ఉద్దీపన చేయడం, బంధువుల రాక వల్ల లేదా బంధువుల ఇంటికి వెళ్లడం వల్ల పిల్లలందరికీ కలిపి వారికి వృద్ధి కలిగించే ఆహారం చేసి పెట్టవచ్చు. తోటి పిల్లలు పక్కన ఉంటే ఇష్టం లేకపోయినా పిల్లలు తింటారు.

సెలవులొచ్చేది పిల్లల మానసిక, శారీరక వికాసానికి. కదలకుండా మెదలకుండా ఫోన్ పట్టుకుని కూచుని వారు ఈ సెలవులు గడిపేస్తే నింద తల్లిదండ్రుల మీదే వేయాలి... పిల్లల మీద కాదు.

గెలుపు దారి

పాకశాస్త్ర ప్రవీణ

చండీగఢ్‌కు చెందిన 23 సంవత్సరాల దేవిక మన్‌చందానీ ఇప్పుడు న్యూయార్క్‌లోని ప్రముఖ చెఫ్‌లలో ఒకరు. వంటలకు సంబంధించిన ఎన్నో పోటీల్లో బహుమతులు గెలుచుకుంది. పేస్ట్రీ చెఫ్‌గా రకరకాల ప్రయోగాలు చేస్తూ తనదైన ప్రత్యేకత చాటుకుంటోంది.

చిన్నప్పటి నుంచి దేవికకు వంటలన్నా, కొత్త వంటకాల గురించి తెలుసుకోవడం అన్నా చాలా ఇష్టం. ఆ ఇష్టమే తనని చండీగఢ్ వీధుల నుంచి న్యూయార్క్‌లోని ప్రసిద్ధ రెస్టారెంట్‌ల వరకు తీసుకెళ్లింది. ఆమె కుటుంబంలో, బంధువులలో పాకశాస్త్ర ప్రవీణులు ఎంతో మంది ఉన్నారు. వారి దగ్గరి నుంచి ఎన్నో కుటుంబ వంటకాలను నేర్చుకుంది.


వంటలపై దేవిక ఇష్టం ఎక్కడిదాకా వెళ్లిందంటే న్యూయార్క్‌లోని కలినరీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అమెరికా(సిఐఎ)లో చదివే వరకు. పాకశాస్త్ర పరిధిని విస్తరించుకోవడానికి, ప్రావీణ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి ఈ చదువు దేవికకు ఉపయోగపడింది.

'సిఐఎ'లో అకడమిక్ ఎక్స్‌లెన్స్ అవార్డ్ నుంచి నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఇచ్చే అవార్డ్ వరకు ఎన్నో అవార్డ్‌లు అందుకుంది దేవిక.

'స్కిల్స్ యూఎస్‌ఏ బేకింగ్ అండ్ పేస్ట్రీ ఆర్ట్స్' పోటీల్లో పాల్గొనడం దేవిక కేరీర్‌లో మైలురాయిగా నిలిచింది. ఆ పోటీలో పాల్గొన్న ఏకైక భారతీయురాలిగా గుర్తింపు పొందింది. అంతేకాదు, ఆ పోటీలో బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఈ విజయం తనని రెండు అడుగులు ముందుకు వేసేలా చేసింది. ప్రసిద్ధ 'గాబ్రియెల్' రెస్టారెంట్‌కు సంబంధించి ముఖ్యమైన ఈవెంట్స్‌కు నాయకత్వం వహించేలా చేసింది.

ఆ రెస్టారెంట్‌లో ఎప్పటికప్పుడూ కొత్త కొత్త సవాళ్లు ఎదురయ్యేవి. క్రైసిస్ మేనేజ్‌మెంట్ గురించి బాగా తెలిసిన దేవిక ఆ సవాళ్లను అధిగమించింది.

ఒక విజేతగా సిఐఏ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగం చేసే


దేవిక మన్‌చందానీ

అవకాశం దేవికకు వచ్చింది. 'పాత్ వేస్ టు ఎక్స్‌లెన్స్' అంశంపై స్ఫూర్తిదాయకమైన ప్రసంగం చేసింది. 'ఎగ్జయిట్‌మెంట్‌కు ఎనర్జీ తోడైతే ఎంత విజయాన్ని అయినా సాధించవచ్చు' అంటుంది దేవిక.

'స్కిల్స్ యూఎస్‌ఏ' రాష్ట్ర స్థాయి పోటీలకు న్యాయనిర్దేత పాత్ర పోషించిన దేవిక 'బేకింగ్ అండ్ పేస్ట్రీ ఆర్ట్స్'కు సంబంధించిన పోటీకి పోటీ పడుతున్న తరువాతి తరం విద్యార్థులకు మార్గనిర్దేశం చేసింది.

సూపర్ స్పీకర్

దేవిక మన్‌చందానీ చెఫ్ మాత్రమే కాదు స్ఫూర్తిదాయక వక్త కూడా. ఆమె వంటలతో పాటు ఉపన్యాసాలకు కూడా ఎంతోమంది అభిమానులు ఉన్నారు. పనిచేస్తున్న క్రమంలోనే క్రైసిస్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన సూత్రాలు పట్టుబడతాయని చెబుతుంది దేవిక. చదువుల కోసం వేరే దేశం వెళ్లే విద్యార్థులకు రకరకాల సవాళ్లు ఎదురవుతుంటాయి. తాను అమెరికాకు వచ్చినప్పుడు ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి. వాటిని అధిగమించిన తీరును విద్యార్థులకు చెబుతుంటుంది దేవిక.



'ఎంతో కొంత నేర్చుకున్నాను అనే తృప్తి కంటే 'ఇంకా ఎంతైనా నేర్చుకుంటాను' అనే దాహం విజయానికి దారి చూపుతుంది అంటుంది దేవిక.

'లక్ష్యం మీద అయోమయం కాదు స్పష్టత ఉండాలి' అంటున్న దేవిక ఎప్పటికప్పుడు కొత్త ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇస్తుంది.

పేస్ట్రీ చెఫ్ కావాలనే కలతో చండీగఢ్ నుంచి అమెరికాకు వెళ్లిన దేవిక తన కలను నెరవేర్చుకోవడమే కాదు చిన్న వయసులోనే ప్రముఖ 'పేస్ట్రీ చెఫ్'గా పెద్ద పేరు తెచ్చుకుంది.

స్త్రీ శక్తి

సముద్రంపై సాహస సంతకం



'భయంతో కాదు ప్రేమతో మాత్రమే సముద్రంలో ప్రయాణం చేయగలం' అనే మాట ఉంది. వందమందిలో ఒకరిగా సముద్రప్రయాణం వేరు. ఒకరిద్దరుగా వేరు. దిల్నా కె, రూప ఎ ఇరవై రెండు రోజుల పాటు సముద్ర ప్రయాణం చేశారు. కొన్నిసార్లు సముద్రం తన మౌన గాంభీర్యాన్ని వీడి కోపంతో గర్జించేది. ప్రశాంతం అనుకున్న సాగరంలో కల్లోలం మొదలయ్యేది. అయితే ఎలాంటి ప్రతికూల పరిస్థితులకూ ఈ ఇద్దరూ భయపడలేదు.

భారతీయ నావికాదళానికి చెందిన లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా కె, లెఫ్టినెంట్ కమాండర్ రూప ఎ 'ఐఎన్ఎస్వీ' తరిణితో సముద్ర సాహస యాత్రని విజయవంతంగా పూర్తి చేశారు. ఈ ఘనత సాధించిన తొలి భారతీయులుగా ప్రత్యేకత చాటుకున్నారు. 'తరిణి' నౌకలో గోవా నుంచి బయలుదేరి 22 రోజుల తరువాత మారిషస్‌లోని పోర్ట్ లూయిస్‌కు చేరుకున్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకొని విజయవంతంగా సముద్రయాత్ర చేసిన దిల్నా, రూపలు శభాష్ అనిపించుకున్నారు.

ఫిబ్రవరి 28న గోవాలోని ఐఎన్ఎస్వీ మండోవి నుంచి మారిషస్‌లోని పోర్ట్ లూయిస్‌కు బయలుదేరింది తరిణి. గమ్య స్థానానికి చేరుకున్న తరువాత రెండు దేశాల (భారత్, మారిషస్)ల మధ్య పరస్పర సహకారాన్ని పెంపొందించడానికి సంబంధించిన శిక్షణ కార్యక్రమాలు, విన్యాసాల్లో మారిషస్ కోస్టు గార్డ్‌లతో కలిసి పాల్గొన్నారు లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా, లెఫ్టినెంట్ కమాండర్ రూప.

'ఈ ఘనత సాధించిన తొలి భారతీయులుగా నిలిచారు. వీరి విజయం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుంది' అని దిల్నా, రూపలను ప్రశంసించింది నావికాదళం. సముద్ర ప్రయాణ కాలంలో భారీ గాలులు, ప్రతికూల సముద్ర పరిస్థితుల రూపంలో దిల్నా, రూపలకు ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. అయితే ఎప్పుడూ ధైర్యం కోల్పోలేదు.

'ఒక్కసారి అధైర్యపడితే ఓటమికి ఆహ్వానం పంపినట్లే.

రెండోసారి అధైర్య పడితే ఓటమి మీ గుమ్మం వరకు వచ్చినట్లే.

మరోసారి కూడా భయపడితే ఓటమి ఇంట్లోకి వచ్చినట్లే' అని శిక్షణ సమయంలో విన్న మాటను వారు బాగా గుర్తుపెట్టుకున్నారు.

సముద్రమంత సాహసం


దిల్నా రూప

నాలుగు ప్రయత్నాల తరువాత అయిదోసారి నేవీకి ఎంపికైంది కేరళలోని కోజికోడ్‌కు చెందిన దిల్నా కె. నావికాదళంలోకి ప్రవేశించడానికి ముందు ఆర్చరీ, క్రికెట్‌లో ప్రతిభ చాటుకుంది. నేవీ షూటింగ్ టీమ్‌లో ఒకరైన దిల్నాకు రొటీన్ యాత్రల కంటే సాహస యాత్రలు అంటే ఇష్టం. పుదుచ్చేరికి చెందిన రూప అలగిరిసామికి స్ఫూర్తి... కల్పనాచావ్లా. చెన్నైలో ఏరోనాటికల్ ఇంజినీరింగ్ చేసింది. సాహసాలకు మారుపేరుగా నిలిచిన మహిళల జీవితచరిత్రలు చదవడం అంటే ఇష్టం. ఈ ఇద్దరికి ప్రముఖ నావికుడు, గోల్డెన్ గ్లోబ్ రేస్ హీరో అభిలాష్ టోమి (రిటైర్డ్) శిక్షణ ఇచ్చారు. ఐఎన్ఎస్వీ నౌకలో ప్రపంచాన్ని చుట్టివచ్చిన భారతీయుడిగా టోమి రికార్డ్ సృష్టించాడు. గత సంవత్సరం దిల్నా కె, రూపలు ఆరుగురు సభ్యుల బృందంతో కలిసి గోవా నుంచి కేప్‌టౌన్ మీదుగా రియో డి జనీరోకు 188 రోజుల పాటు నౌకాయానం చేశారు.

ఈ నెల 21న గోవాలోని మండోవికి తిరిగి వచ్చిన ఐఎన్ఎస్వీ తరిణికి నావికా సిబ్బంది ఘనస్వాగతం పలికారు. ఈ సముద్ర యాత్రకు దిల్నా, రూపలను తేలిగ్గా ఎంపిక చేయలేదు. కఠినమైన ఎంపిక ప్రక్రియతో అనేక వడపోతల ద్వారా వీరిని ఎంపిక చేశారు.

వీరి సాహసం ఇక్కడితో ఆగిపోదు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రారంభం కానున్న 'సాగర్ పరిక్రమ' అనే భూగోళ ప్రదక్షిణ కోసం ఈ ఇద్దరూ సన్నద్ధమవుతున్నారు.

'సాహసం' లోని విశేషం ఏమిటంటే... దానిపక్కన ఫుల్‌స్టాప్ ఎప్పుడూ ఉండదు. ఒక సాహసం మరో సాహసాన్ని ప్రేరేపిస్తుంది. విజయం సాధించేలా చేస్తుంది. 'సాగర్ పరిక్రమ'లో కూడా దిల్నా, రూపలు విజయం సాధించాలని ఆశిద్దాం.

ఇంటి పనులతోనే రోజంతా గడిచిపోతుంటుంది అభిరుచిని మెరుగుపరుచుకోవాలన్నా సమయమే సరిపోదనిపిస్తుంది. కానీ, కొందరు మాత్రమే ఉన్న కాస్త సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ తమతోపాటు మరికొందరికి ఉపాధి అవకాశాలను అందిస్తుంటారు. ఈ కోవకే చెందుతారు సవిత ఆలంపల్లి. తెలంగాణలోని జహీరాబాద్ వాసి అయిన సవిత కాటన్ ఫ్యాబ్రిక్‌పైన సహజసిద్ధమైన పువ్వులు, ఆకులతో సహజమైన ప్రింట్లను తీసుకువస్తుంది. అదే ఫ్యాబ్రిక్‌ని ఉపయోగిస్తూ మోడ్రన్ డ్రెస్సులను డిజైన్ చేస్తోంది. వర్క్‌షాప్స్ నిర్వహిస్తూ, బెంగళూరులో స్టూడియో ఏర్పాటు చేసి, సెల్ఫ్ మేడ్ బిజినెస్ ఉమన్‌గా తనని తాను నిరూపించుకుంటుంది. ఆసక్తిని ఉపాధిగా మలుచుకునేందుకు చేసిన ప్రయాణంలో తాను వేసిన అడుగుల గురించి ఆనందంగా వివరించింది.

ఆకులో ఆకునై..

ఎకో ఫ్రెండ్లీ డ్రెస్ డిజైనింగ్


సవిత


వర్క్‌షాప్

"డిగ్రీ వరకు చదువుకున్న నేను పెళ్లయ్యాక మావారు రామకృష్ణతో కలిసి అమెరికాకు వెళ్లాను. గృహిణిగానే కొన్నాళ్లు ఉండిపోయాను. న్యూయార్క్ ఎఫ్ఐటిలో ఫ్యాషన్ డిజైనింగ్‌కి సంబంధించిన కోర్స్ చేశాను. పదేళ్ల క్రితం ఇండియా వచ్చి బెంగళూరులో స్థిరపడ్డాం. రోజంతా ఇంటిపనులు, పిల్లల పనులు ఉన్నా నా కోసం కొంత సమయాన్ని కేటాయించుకునే దాన్ని. ఫాస్ట్ ఫ్యాషన్‌లో ఉపయోగించే ఫ్యాబ్రిక్ తీవ్రమైన కాలుష్యానికి గురి చేస్తుందని తెలుసుకున్నాను. అప్పటినుంచి నా వంతుగా ఏదైనా చేయాలనుకుని ప్రయత్నాలు చేస్తుండేదాన్ని. ఫ్లోర్ క్లీనర్స్, సుగంధ ద్రవ్యాలు వంటివి ఇంట్లో తయారు చేస్తుండేదాన్ని. వాటివల్ల ఇంట్లో వాళ్లు కూడా చాలా మెచ్చుకునేవారు. ఎకో ప్రింటింగ్, సస్టెయిన్‌బుల్ ఫ్యాబ్రిక్స్ పైన వర్క్ చేయడం మొదలుపెట్టాను. ప్రకృతి ద్వారా లభించే వస్తువులతో రోజూ ఏదో ఒక ప్రయోగం చేస్తుండే దాన్ని.

స్టూడియోదాకా మారేందుకు చేసిన రకరకాల ప్రయోగాల వల్ల ఇప్పుడు నాతో పాటు మరో ఐదుగురు మహిళలకు ఉపాధి అవకాశాలు లభించాయి. మేమంతా కలిసి ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌కు వచ్చిన ఆర్డర్స్ ప్రకారం పని చేస్తుంటాం.



ఆకులు – పువ్వులు

పూజలు, ఇతర సంప్రదాయ వేడుకలలో పువ్వులు, ఆకులను కూడా ఉపయోగిస్తుంటాం. సాధారణంగా వాటిని ఉడకబెట్టి, టై అండ్ డై చేస్తుంటారు. నేను వాటిని ఎండబెట్టి, కొన్నింటిని తాజాగా ఉన్నప్పుడే ఫ్యాబ్రిక్ మీద చల్లి, దగ్గరగా చుట్టి, కొన్ని రోజులు అలాగే ఉంచి ప్రయోగాలు చేసే దాన్ని. ప్రయత్నాలు చేయగా చేయగా ఫ్యాబ్రిక్‌పైన రకరకాల డిజైన్స్ అమితంగా నన్ను ఆకట్టుకున్నాయి. మోదుగ, శంఖపుష్ప, పారిజాత.. వంటివే కాదు అరుదుగా పూసే పువ్వులనూ సేకరిస్తాను. వాటిని ఎండబెట్టి నిల్వ ఉంచుతాను. మామిడి, జామ, మందార ఆకులనూ డిజైన్‌కు వాడుతుంటాను. ఏ మాత్రం రసాయనాలు లేని ప్రయోగం ఇది.





ఇంటి నుంచి స్టూడియో వరకు

రసాయనాలతో పండించే పత్తి కాకుండా వర్షాధార పంటద్వారా వచ్చే కాటన్ ఫ్యాబ్రిక్‌ను కలెక్ట్ చేసి, నా ప్రయత్నాలను ఇంకా విరివిగా చేయడం మొదలుపెట్టాను. సస్టెయిన్‌బుల్ డ్రెస్సులు అంటే చాలావరకు వదులుగా ఉండే దుస్తులు అనుకుంటారు. కానీ, మంచి ఫిటింగ్, డిజైన్, ప్రింట్లతో ఈ తరం మెచ్చేలా డ్రెస్ డిజైనింగ్ చేయాలనుకున్నాను. కార్పొరేట్ ఉమెన్‌కు నప్పే విధంగా, అలాగే టీనేజ్ కలెక్షన్స్ కూడా ప్రిపేర్ చేస్తుంటాను. ఎకో ఫ్రెండ్లీ ఫ్యాబ్రిక్, ప్రింటింగ్.. డ్రెస్సులు ధరిస్తే ఒంటికి పాజిటివ్ ఎనర్జీ లభిస్తుంది. ప్రకృతికి దగ్గరగా ఉన్నామన్న అనుభూతి సొంతం అవుతుంది. ఏడెనిమిదేళ్లుగా సస్టెయినబిలిటీ మీద రకరకాల ప్రయోగాలు చేసి, ఐదేళ్ల క్రితం 'టింక్టోరియా' పేరుతో బెంగళూరులో స్టూడియో ఏర్పాటు చేశాను. ఆకులలో ఉండే జీవాన్ని టింక్టోరియా అంటారు. దానిని ఫ్యాబ్రిక్ మీదకు తీసుకురావాలని చేసిన ప్రయత్నం కాబట్టి అదే పేరును నా డిజైన్స్‌కు పెట్టాను. ఇంటినుంచి

అవగాహనకు వర్క్‌షాప్స్

ఎకోప్రింటింగ్ పట్ల ప్రజలలో అవగాహన కల్పించడానికి హైదరాబాద్, బెంగళూరు ఇతర క్రాఫ్ట్ ఎగ్జిబిషన్స్‌లలో ఉచితంగా వర్క్‌షాప్స్ నిర్వహిస్తున్నాను. స్టాల్స్ ఏర్పాటు చేస్తుంటాను. అక్కడి వచ్చి, ఆసక్తితో నేర్చుకుంటాను అనేవారు మళ్లీ మళ్లీ ఫోన్ చేసి ప్రింటింగ్ ప్రాసెస్ అడుగుతుంటారు. చాలా మందికి ఆకులతోనూ, పువ్వులతోనూ డిజైన్ చేస్తారని తెలియదు. ఈ డిజైన్ ఉతికితే పోతుందేమో అనుకుంటారు. కానీ, సరైన విధంగా చేస్తే రంగు ఏ మాత్రం పోదు. ముందు కుంకుడుకాయ రసంతో ఫ్యాబ్రిక్‌ను శుభ్రం చేస్తాం. ఆ తర్వాత ఆకులను, పువ్వులను అనుకున్న డిజైన్స్‌లో అమర్చి, దగ్గరగా చుట్టి, ఆవిరిమీద ఉంచుతాం. ఆ తర్వాత బయటకు తీసి, ఒక రోజంతా అలాగే ఉంచుతాం. ఆ తర్వాత పూర్తిగా విప్పి, క్లాత్‌ని శుభ్రం చేస్తాం. సరైన డిజైన్ రావడానికి 3 నుంచి 4 రోజుల సమయం పడుతుంది. షిబోరి, టై అండ్ డై, కలంకారీ డిజైన్స్‌తోపాటు నేతకారులతో ముందే మాట్లాడి ఫ్యాబ్రిక్ డిజైన్‌లో మోటిఫ్ ప్రింట్స్ వచ్చేలా గైడెన్స్ ఇస్తుంటాను. కొన్ని రకాల ఆకులు, పువ్వుల ప్రింటింగ్‌లో థ్రెడ్ వర్క్ కూడా ఉంటుంది. ప్రకృతిపైన ప్రేమ, ఇష్టంతో నన్ను నేను కొత్తగా మార్చుకునే క్రమంలో ఎంచుకున్న మార్గం ఇది. ఇంట్లో వాడాల్సిన కెమికల్స్ స్థానంలో ఏ మాత్రం రసాయనాలు లేని వస్తువులను తయారు చేయడానికి నిరంతరం ప్రయత్నిస్తుంటాను. ఈ విధానం వల్ల ఐదారేళ్లలో నాదైన ఓ కొత్త ప్రపంచాన్ని నిర్మించుకున్నాను అనిపిస్తుంది' అని ఆనందంగా వివరిస్తారు సవిత.


మోడల్

– నిర్మలారెడ్డి



ఏం తినాలి? ఎలా తినాలి?

కూరలను బాగా నూనె పోసి వేయించి ఉప్పూకారం మసాలా దట్టించినందువల్ల నోటికి రుచిగా ఉండచ్చేమోగాని ఆ కూరలలోని పోషక విలువలన్నీ చచ్చిపోయి నిస్సారమవుతాయి. త్వరగా జీర్ణం కావు. నూనె ఎక్కువైనందువల్ల రక్తంలో కొలెస్ట్రాల్ పెరగటం, శరీరంలో కొవ్వు పేరుకుపోయి స్థూలకాయం రావటం తదితర ఇబ్బందులు తలెత్తుతాయి. విపరీతంగా ఉడకబెట్టినా అంతే... సారం లేని పదార్థాన్ని తిన్నట్టే. అది తినడం వల్ల ఆ ఆహారం మన ఒంటికి పట్టదు. అసలు మనం ఎలాంటి కూరలను ఎలా తీసుకోవాలో తెలుసుకుందాం.



మనం తిన్న ఆహారం వంటబట్టాలంటే నూనెలో వేయించిన కూరలను తినే అలవాటును మానుకోవాలి. ఉడికించిన కూరలలో కొద్దిగా తాలింపు వేసుకుని తినే విధంగా మన ఆహారపు అలవాట్లను మార్చుకోవాలి.

గింజధాన్యాలు, పప్పుధాన్యాలు, ఆకుకూరలు, దుంపలు, పండ్లు అన్నింటిలోను అన్ని రకాల పోషకాలు ఉన్నాయి. వాటి మోతాదుల్లో మాత్రమే తేడా ఉంటుంది. అందువల్ల మనకు అన్నీ అవసరమే. అయితే అన్నీ అందరికీ ఒకే రీతిలో అవసరం కావు. ఉదాహరణకు పాలు తాగే పసిపిల్లలకు ఒకరకమైన పోషకాలు కావాలి. చిన్న పిల్లలయితే మరొక రకమైన పోషకాలు కావాలి. యుక్తవయస్కులకు ఇంకొక రకం పోషకాలు కావాలి. అదేవిధంగా గర్భిణులకు ఒక రకమైన పోషకాలు, పెద్దవారికి, వృద్ధులకూ మరొక రకమైన పోషకాలూ కావాలి. అంటే అవసరాలనుబట్టి పోషకాలు మారతాయి. కాబట్టి తీసుకోవలసిన ఆహారం కూడా మారుతుంది. అదే విధంగా ఆహార చికిత్సా ప్రక్రియలో కూడా వ్యాధిని బట్టి, రోగిని బట్టి తీసుకోవలసిన ఆహారం మారుతుంది. ఆహారాన్ని ఎంపిక చేసుకోవటం అంటే ఇదే.

నిజానికి ఆహారాన్ని ఎంపిక చేసుకోవటం అనుకున్నంత తేలికకాదు. పోషకాలను బట్టి పరిశీలిస్తే గింజధాన్యాలలో అన్ని రకాల పోషక విలువలు సమృద్ధిగా ఉన్నాయని, ఆకు కూరలు, పండ్లు, దుంపలతో సహా బాదం, ఖర్జూర మొదలైన ఎండు ఫలాలలో ఏదో ఒక పోషక విలువ లోపించి ఉండటాన్ని మనం గమనించవచ్చు. కేవలం ఈ కారణం వల్ల గింజధాన్యాలను మాత్రమే తీసుకుంటే లేనిపోని సమస్యలు వస్తాయి. అవి త్వరగా జీర్ణంకావు. అందువల్ల, గింజధాన్యాలతోబాటు తప్పనిసరిగా త్వరగా జీర్ణం అయ్యే ఆకు కూరలు, పండ్లు కూడా అవసరం. ఇవి అన్నీ తెలిసినప్పుడే సమీకృత ఆహారాన్ని ఎంపిక చేసుకోవటం సులభం అవుతుంది. ఈ విషయంలో మనలో చాలామందికి ఉన్న సాధారణ ఆహార విజ్ఞానం సరిపోదు. పోషకాహార నిపుణులతో లేదా ప్రకృతి వైద్యులతో సంప్రదించి, వారి సలహా తీసుకోవటం అవసరం.

సమీకృత ఆహారం... కొన్ని సూచనలు

ఎటువంటి ఆహార పదార్థాలను ఎంపిక చేసుకోవాలన్న విషయాన్ని అలా ఉంచితే సాధారణ ఆరోగ్యం దృష్ట్యా ఈ కింది సూచనలను పాటించటం మంచిదని ప్రకృతి వైద్యులు చెబుతుంటారు.

రోజూ ఉదయం పచ్చికూర ముక్కలు (వెజిటబుల్ సలాడ్) తీసుకోవటం మంచి అలవాటు. దంతాల పటుత్వం లేని వారు కూర ముక్కలను మిక్సీలో వేసుకుని చిన్న చిన్న ముక్కల రూపంలో గాని, లేక జ్యూస్ రూపంలోగాని తీసుకోవచ్చు.

అన్నిరకాల, అన్ని రంగుల పండ్లను లేదా పళ్ల రసాలను తీసుకోవాలి. ఆ క్రమంలో కాలానుగుణంగా వచ్చే సీజనల్ ఫలాలను తప్పనిసరిగా తీసుకోవాలి. మనం తినే ఆహారంలో కనీసం 30 లేక 40 శాతం పండ్లు ఉంటే మంచిది.

దంపుడు బియ్యం లేక మర పట్టని ముతక బియ్యం శ్రేష్ఠం. చిరుధాన్యాలు వాడటం మంచిది.

మొలకెత్తిన గింజలు, కొబ్బరి, ఖర్జూర ప్రతి రోజూ తీసుకోవటం మంచిది.

ఇలా తీసుకోవాలి

- కనీసం వారానికి నాలుగు రోజులు ఆకు కూరలను ఇగురు లేదా పప్పు రూపంలో తీసుకోవాలి.
- కాఫీ, టీ తాగే అలవాటును నెమ్మదిగా మానుకోవటం మంచిది, అలా మానుకోవడం సాధ్యం కాకపోతే, కనీసం మోతాదును తగ్గించాలి. రోజుకి ఒకటి లేక రెండుసార్లకు మించి తీసుకోరాదు.
- పొగాకు, జర్దా, ధూమపానం, మత్తుపానీయాలను పూర్తిగా మానుకోవాలి.
- కృత్రిమ రసాయనాలతో తయారు చేసిన, నిల్వ ఉన్న బేకరీ వస్తువులు, శీతల పానీయాలు (కూల్ డ్రింక్స్), చాక్లెట్లు, ఫాస్ట్‌ఫుడ్స్, ఐస్ క్రీమ్ లాంటివి మన శరీరానికి హాని చేస్తాయి. అందువల్ల వీటిని సాధ్యమైనంత వరకు తగ్గించటం మంచిది.
- ఉప్పు వాడకాన్ని బాగా తగ్గించాలి. ఎందుకంటే, మన శరీరానికి అవసరమైనంత ఉప్పు మనం తీసుకునే పండ్లు, కూరగాయలలోనే ఉంటుంది.
- ఆహారం ఎంపికలో మరొక ప్రధాన సమస్య అమ్లయుతమైన ఆహారం, క్షార యుతమైన ఆహారం, ఆమ్లాలు, క్షారాలు రెండూ మనకు అవసరమే అయినా, వాటి నిష్పత్తిలో తేడా ఉంది. ఆమ్లాల కన్నా క్షారాలు మనకు అధికంగా కావాలి. మనం తీసుకునే ఆహారం కూడా అదేవిధంగా ఉండాలి. అంటే ఆమ్లయుతమైన పదార్థాలు తక్కువగా, క్షారయుతమైన పదార్థాలు. ఎక్కువగా ఉండే విధంగా ఆహారాన్ని ఎంపిక చేసుకోవాలి.
- అదేవిధంగా రోగగ్రస్థుల విషయంలో వ్యాధినిబట్టి ఆహార ఎంపిక ఉంటుంది. ఇది. అయితే ప్రధానంగా వైద్యుల పర్యవేక్షణలో జరగాలి.

అలసట, అధిక దాహాన్ని దూరం చేసే పుదీనా



ప్రకృతి ప్రసాదించిన, తాజాదనాన్ని ఇచ్చే ఎన్నో ఆరోగ్య సుగుణాలు ఉన్న ఆకు పుదీనా. దీనిని నిత్యం ఆహారంలో తీసుకోవడం వల్ల అనేక రకాలైన ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ముఖ్యంగా వేసవిలో పుదీనా వాడకం మరింత ప్రయోజనకరం.

పుదీనా ఆకులలో విటమిన్ ఏ, విటమిన్ సి, విటమిన్ బి-6 లతోపాటు, క్యాల్షియం, మెగ్నీషియం, ఐరన్, పొటాషియం వంటి మినరల్స్, ప్రోటీన్లు, ఫైబర్, కార్బోహైడ్రేట్స్ వంటి పోషకాలు పుష్కలంగా ఉండడంతో ఇది మన జీవక్రియను మెరుగుపరుస్తుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులు రోజూ పుదీనా వాటర్ తీసుకుంటే చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. బరువు తగ్గడానికి, ముసలితనం త్వరగా రాకుండా ఉండడానికి పుదీనా ఎంతో ఉపయోగపడుతుంది.

పుదీనా నీటిని తాగితే శరీరానికి శక్తి లభించడమే కాకుండా చర్మ సమస్యలు తగ్గుతాయి. కళ్ళ కింద నలుపు తగ్గటానికి పుదీనాతో తయారు చేసిన లేపనం ఎంతో ఉపయోగపడుతుంది. శరీరంలోని మలినాలను తొలగించి జీర్ణక్రియను సాఫీగా చేయడానికి, జీర్ణ వ్యవస్థను సక్రమంగా పనిచేసేలా చేయడానికి ఉపయోగపడుతుంది. పుదీనాను మజ్జిగతో కలిపి తీసుకుంటే మన శరీరంలో వేడి తగ్గుతుంది.

అందానికి కూడా!

పుదీనా ఆకులను మెత్తగా నూరి ముఖానికి రాసుకుంటే ముఖం కాంతివంతంగా ప్రకాశవంతంగా మారుతుంది. మన అందాన్ని పెంచటంలో కూడా పుదీనాది ప్రత్యేక స్థానం. చర్మ సమస్యలను నివారిస్తుంది. మొటిమలను, మచ్చలను తగ్గించడంలోపుదీనా ఎంతగానో ఉపయోగపడుతుంది. దంత సమస్యలను, చిగుళ్ల సమస్యలను తగ్గిస్తుంది.

నోటి దుర్వాసనకు చెప్పి చెక్ పెట్టి, దంతాలను తెల్లగా మెరిసేలా చేస్తుంది. ఉదయాన్నే నిమ్మరసం, తేనె, పుదీనా కలిపి తీసుకుంటే ఆరోగ్యాన్ని అది బాగు చేస్తుంది.

పుదీనాతో ఉత్సాహం...

వేసవిలో అధిక దాహం, అలసట సర్వ సాధారణం. అధిక దాహం సమస్యకు చెక్ పెట్టడానికి పుదీనా వాటర్ ఎంతగానో ఉపయోగపడుతుంది. అంతేకాదు, అలసటగా ఉన్నప్పుడు పుదీనా వాటర్‌లో కాస్తంత నిమ్మరసం, పటికబెల్లం లేదా చిటికడు బ్లాక్ సాల్ట్ కలుపుకుని తాగితే అలసట ఇట్టే తీరుతుంది.

వేసవి కాలం

కళ్ళ మంటలా? ఇలా చేయండి



ఎండలు మండుతున్నాయి. ఈ సమయంలో చాలామందికి కళ్లు పొడిబారిపోవడం, కళ్లు ఎర్రబడి మంటలు రావడం సర్వ సాధారణం. అలాంటప్పుడు కొన్ని చిట్కాలు పాటిస్తే ఉపశమనం కలుగుతుంది. ఆ చిట్కాలేమిటో చూద్దాం...

పాలలో కాని కలబంద రసంలో కానీ దూదిని ముంచి పదిహేను నిమిషాల పాటు కళ్ళపై పెట్టుకుంటే కళ్ళ అలసట తగ్గుతుంది.

- గంధం చెక్కని అరగదీసి కళ్ళ మీద రాసుకుంటే కళ్ళలోని ఎరుపు తగ్గుతుంది
- నిద్రపోయే ముందు నాలుగైదు తేనె చుక్కలు, నువ్వుల నూనె నాలుగైదు చుక్కలు కలిపి కళ్ళలో వేసుకుంటే ఉదయానికి కళ్ళు నిర్మలంగా,స్వచ్ఛంగా ఉంటాయి.
- కళ్ళు మంటగా వుంటే చల్లటి నీటితో కళ్ళు శుభ్రంగా కడుక్కోవాలి. ఆ నీరు కళ్ళ లోని దుమ్ముకణాలు, మలినాలను తీసివేయడంలో సహాయపడుతుంది
- దూదిని రోజ్ వాటర్ లో ముంచి కను రెప్పలపై 10-15 నిమిషాల పాటు ఉంచాలి. ఇలా చేస్తే కంటి గాయాలకి, కళ్ళ మంటలకి ఉపశమనం లభిస్తుంది
- దూదిని పాలలో ముంచి కంటిచుట్టు తుడవాలి. తర్వాత చల్లనీటితో శుభ్రంగా కడుక్కోవాలి
- దోసకాయ ముక్కల్ని కట్ చేసి కను రెప్పుల పై 15 నిమిషాల పాటు ఉంచినట్లయితే కళ్ళ మంట నుంచి ఉపశమనం పొందవచ్చు
- శుభ్రమైన తెల్లటి వస్త్రాన్ని చల్లటి నీటితో తడిపి నీరంతా పిండేయాలి. ఆ వస్త్రంలో కొన్ని మల్లెపూలు లేదా నంది వర్ధనం పూలు ఉంచి కళ్లమీద ఆ వస్త్రాన్ని ఉంచుకుంటే చల్లగా ఉండడంతోపాటు తలనొప్పి తగ్గుతుంది.
- పచ్చి బంగాళదుంపను చక్రాల్లా తరిగి ఆ ముక్కలను కళ్ళపై పెట్టుకుంటే కళ్ళమంటల నుంచి ఉపశమనం లభిస్తుంది.

సినిమా

చెడుపై గెలుపు



● తమన్నా

హీరోయిన్ తమన్నా లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'ఓదెల 2'. 'ఓదెల రైల్వేస్టేషన్' ఫేమ్ అశోక్ తేజ ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నారు. మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్‌పై డి. మధు నిర్మిస్తున్న ఈ సినిమా రెండో షెడ్యూల్ ప్రారంభమైంది. ''సూపర్ నేచురల్ థ్రిల్లర్‌గా 'ఓదెల 2' రూపొందుతోంది. తన ప్రజలను రక్షించడానికి దేవుడు ప్రతి యుగంలో చెడుని ఎలా గెలుస్తాడో చూపించే కథాంశంతో ఈ మూవీ ఉంటుంది. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరుపుతున్న రెండో షెడ్యూల్ 25 రోజుల పాటు సాగుతుంది. సినిమాలోని ప్రధాన తారాగణంతో పాటు ఇతర నటీనటులతో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాం. ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ కానుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్ సింహ, మురళీ శర్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, కెమెరా: సౌందర్ రాజన్ .ఎస్, క్రియేటెడ్ బై: సంపత్ నంది.



● అమితాబ్ బచ్చన్

లాయర్‌గా...

బాలీవుడ్ హిట్ ఫిల్మ్ 'పింక్'లో అమితాబ్ బచ్చన్ లాయర్‌గా తన నటనతో ఆడియన్స్‌ను కట్టిపడేశారు. మరోసారి కోర్టులో అమితాబ్ బచ్చన్ మాట్లాడే పవర్‌ఫుల్ డైలాగ్స్ వినే అవకాశం ఉందని కోలీవుడ్ టాక్. రజనీకాంత్ హీరోగా రూపొందుతున్న 'వేట్టయాన్' చిత్రంలో లాయర్ పాత్రలో అమితాబ్ కనిపించనున్నారట. 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో అమితాబ్ కీలక పాత్ర చేస్తున్న విషయం తెలిసిందే. అది లాయర్ పాత్ర అనే ప్రచారం జరుగుతోంది. రజనీ ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ పాత్రలో కనిపిస్తారని, అమితాబ్ లాయర్‌గా కనిపిస్తారనీ భోగట్టా. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం చెన్నైలోని ఓ స్టూడియోలో జరుగుతోందట. రజనీ ఇంట్రో సాంగ్ చిత్రీకరణ జరుగుతోందని సమాచారం.

అనుపమ పరదా



● అనుపమ

అనుపమా పరమేశ్వరన్ ప్రధాన పాత్రధారిగా, సంగీత, దర్శనా రాజేంద్రన్ కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రానికి 'పరదా' అనే టైటిల్ ఖరారైంది. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వంలో విజయ్ డొంకాడ, శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువ నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమా ఫస్ట్ లుక్, కాన్సెప్ట్ వీడియోను నటి సమంత, దర్శక-నిర్మాతలు రాజ్ అండ్ డీకే షేర్ చేశారు. 'పరదా' కాన్సెప్ట్ వీడియోలో 'యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతా..' అనే శ్లోకం వినిపిస్తుండటం సినిమాపై ఆసక్తిని కలిగించేలా ఉంది. ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్ లొకేషన్స్‌తో పాటు ఆ పరిసర గ్రామాల్లో ఇప్పటివరకు ఈ సినిమాను చిత్రీకరించారు. ''మేలో హైదరాబాద్‌లో జరగనున్న కొత్త షెడ్యూల్‌తో ఈ సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తవుతుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ''ఓ మంచి సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం'' అన్నారు ప్రవీణ్. ''ప్రేక్షకులను మరో ప్రపంచంలోకి తీసుకువెళ్లే ప్రయాణమే మా చిత్రం'' అన్నారు విజయ్ డొంకాడ. ఈ చిత్రానికి సంగీతం: గోపీ సుందర్.

నేరాలను నిర్మూలించే పోలీస్


'మొగలి రేకులు' సీరియల్ ఫేమ్ ఆర్‌కే సాగర్ హీరోగా నటిస్తున్న చిత్రం 'ది 100'. రాఘవ్ ఓంకార్ శశిధర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మిషా నారంగ్, ధన్యా బాలకృష్ణ, గిరిధర్, విష్ణుప్రియ ఇతర పాత్రలు చేస్తున్నారు. రమేశ్ కరుటూరి, వెంకీ పూశడపు, జె, తారక్ రామ్ నిర్మాతలు. ఈ సినిమా టీజర్‌ను హీరో చిరంజీవి తల్లి కొణిదెల అంజనా దేవి ఆవిష్కరించారు. ''ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్‌గా 'ది 100' రూపొందుతోంది. నేరాలను నిర్మూలించడానికి ఎంతకైనా తెగించే నిజాయితీ గల ఐపీఎస్ ఆఫీసర్ విక్రాంత్ పాత్రలో ఆర్‌కే సాగర్ నటిస్తున్నారు'' అని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, కెమెరా: శ్యామ్ కె. నాయుడు.



● అంజనా దేవి, ఆర్.కె. సాగర్

అధునాతన టెక్నాలజీ తీసుకొచ్చాం

- సారథి స్టూడియోస్ చైర్మన్ ప్రసాద్



● కీరవాణి, ఎంఎస్ఆర్‌వీ ప్రసాద్, కేవీ రావు

''మా సారథి స్టూడియోలో పోస్ట్ ప్రొడక్షన్ పనులకు కావాల్సిన అధునాతన టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చాం. మేం ప్రారంభించిన డాల్బీ మిక్సింగ్, సౌండ్ డిజైన్‌లు చాలా అధునాతనమైనవి. ఈ టెక్నాలజీని ఉపయోగించుకుంటూ మా స్టూడియోలో మొదలైన మొదటి సినిమా ప్రభాస్ 'కల్కి 2898 ఏడీ' అని చెప్పడానికి సంతోషిస్తున్నాం'' అని సారథి స్టూడియోస్ చైర్మన్ ఎంఎస్ఆర్‌వీ ప్రసాద్ అన్నారు. హైదరాబాద్ అమీర్‌పేటలోని సారథి స్టూడియోలో నెలకొల్పిన అధునాతన డాల్బీ మిక్సింగ్ స్టూడియోను సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి, సౌండ్ డిజైన్ స్టూడియోను సంగీత దర్శకుడు శేఖర్ చంద్ర ప్రారంభించారు. ''ఓ చిత్రానికి సౌండింగ్‌కు ఉన్న ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. అందుకే అధునాతన టెక్నాలజీని ప్రవేశపెట్టాం'' అన్నారు సారథి స్టూడియోస్ డైరెక్టర్ కేవీ రావు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు కేఎస్ రామారావు, కేఎల్ నారాయణ, రచయిత విజయేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



● జెన్నిఫర్ అనిస్టన్

ముప్ఫైనాలుగేళ్లకు సీక్వెల్

హాలీవుడ్ సూపర్ హిట్ కామెడీ ఫిల్మ్ '9 టు 5' (1980). కోలిన్ హిగ్గిన్స్ దర్శకత్వంలో డాబ్నీ కోల్‌మన్, జేన్ ఫోండా, లిల్లీ టామ్లిన్, డాలీ పార్టన్ లీడ్ రోల్స్‌లో నటించిన ఈ సినిమాకు ఆ తర్వాత సీక్వెల్ తీయాలనుకున్నారు. సీక్వెల్ పనులు జరుగుతున్నాయని జేన్ ఫోండా 2018లో ఓ సందర్భంగా పేర్కొన్నారు. కానీ సెట్స్‌పైకి వెళ్లలేదు. '9 టు 5' విడుదలైన ముప్ఫైనాలుగేళ్లకు ఇప్పుడు ఈ చిత్రం సీక్వెల్‌ని నటి జెన్నిఫర్ అనిస్టన్ నిర్మించడానికి సన్నాహాలు మొదలుపెట్టారు. ఆస్కార్ అవార్డు విన్నింగ్ రైటర్ డయాబ్లో కథ రాస్తున్నారట. ఇక '9 టు 5' కథ విషయానికొస్తే.. ఓ కంపెనీలో ముగ్గురు ఉద్యోగినిలు పై అధికారి వల్ల వేధింపులకు గురవుతారు. దాంతో అతణ్ని కిడ్నాప్ చేసి, ఓ గదిలో బంధిస్తారు? ఆ కంపెనీ యజమాని ఇదంతా తెలుసుకుని, ఆ ఉద్యోగినిలకు ఎలా అండగా నిలిచాడు? అనేది ఈ చిత్రకథ. సీక్వెల్ స్టోరీ ఎలా ఉంటుందో చూడాలి.

అయితే ఏంటంట?

కథానాయిక చాందినీ చౌదరి పోలీసాఫీసర్‌గా నటిస్తున్న చిత్రం 'యేవమ్'. వశిష్ఠ సింహా, జై భారత్, ఆషు రెడ్డి ఇతర లీడ్ రోల్స్ చేస్తున్నారు. ప్రకాశ్ దంతులూరి దర్శకత్వంలో నవదీప్, పవన్ గోపరాజు నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి చాందినీ చౌదరి పాత్ర లుక్‌ను విడుదల చేశారు. 'ఆడపిల్లనే... అయితే ఏంటంట?' అనే డైలాగ్ ఆ పోస్టర్ పై ఉంది. ''మహిళా సాధికారత, వారి ధైర్యాన్ని ప్రతిబింబించేలా ఈ సినిమా కథనం ఉంటుంది. ఇందులో చాందినీ చౌదరి నటన హైలైట్‌గా ఉంటుంది'' అని చిత్రబృందం పేర్కొంది.



● చాందినీ చౌదరి

మేలో కృష్ణమ్మ



● సత్యదేవ్

ప్రముఖ దర్శకుడు కొరటాల శివ సమర్పణలో సత్యదేవ్, అతీరా రాజ్ జంటగా నటించిన చిత్రం 'కృష్ణమ్మ'. వీవీ గోపాలకృష్ణ దర్శకత్వంలో అరుణాచల క్రియేషన్స్‌పై కృష్ణ కొమ్మాలపాటి నిర్మించిన ఈ చిత్రం మే 10న విడుదల కానుంది. కాగా పలు విజయవంతమైన చిత్రాలను ప్రేక్షకులకు అందించిన ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు మైత్రీ మూవీ మేకర్స్, ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ 'కృష్ణమ్మ'ని విడుదల చేస్తున్నాయి. ''రా అండ్ రస్టిక్ బ్యాక్‌డ్రాప్ యాక్షన్ మూవీగా తెరకెక్కిన చిత్రం 'కృష్ణమ్మ'. ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. సత్యదేవ్‌ని సరికొత్త కోణంలో ఆవిష్కరించేలా ఈ మూవీ నిలుస్తుంది'' అన్నారు మేకర్స్.

గ్రామీణ నేపథ్యంలో...

'ఐఐటీ కృష్ణమూర్తి' ఫేమ్ పృథ్వీ రూపాలి, అంబిక హీరో హీరోయిన్లుగా పాలిక్ శ్రీను దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోంది. ఆమని, ఝాన్సీ లీడ్ రోల్స్‌లో ఈ సినిమాను దుర్గం రాజేష్, రావుల రమేష్, టీఎస్ రాజు నిర్మిస్తున్నారు. ''లవ్, ఎమోషన్, ఫన్ అంశాలు మిళితమై, గ్రామీణ నేపథ్యంలో సాగే కథ ఇది. పాలిక్ చెప్పిన కథ నాకు నచ్చింది'' అన్నారు ఆమని. ''ఈ సినిమాను దీపావళికి రిలీజ్ చేస్తాం'' అన్నారు దర్శక-నిర్మాతలు.



● ఆమని

దీక్ష ఆరంభం



● రామకృష్ణ గౌడ్, భవ్యశ్రీ, కిరణ్

ప్రముఖ దర్శక-నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్ స్వీయ దర్శకత్వంలో 'దీక్ష' సినిమా ఆరంభమైంది. ఇందులో కిరణ్ కుమార్, భవ్యశ్రీ జంటగా నటిస్తున్నారు. ఆర్.కె. ఫిలింస్, స్నిగ్ధ క్రియేషన్స్‌పై ఈ చిత్రం రూపొందుతోంది. తొలి సన్నివేశానికి సిద్ధిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి కెమెరా స్విచ్ఛాన్ చేయగా, రామకృష్ణ గౌడ్ క్లాప్ ఇచ్చారు. యోగానంద కృష్ణమాచార్య దర్శకత్వం వహించగా, తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఉపాధ్యక్షులు ఎ. గురురాజ్, జేవీఆర్ స్క్రిప్ట్‌ను యూనిట్‌కి అందించారు. ''మంచి కథాబలం ఉన్న సినిమా 'దీక్ష'. ఈ సినిమా తర్వాత క్రీడల నేపథ్యంలో మరో సినిమా చేయబోతున్నాను'' అన్నారు రామకృష్ణ గౌడ్.

ముక్కోణపు ప్రేమకథ

మూడు పాత్రల మధ్య ముక్కోణపు ప్రేమకథ నేపథ్యంలో ఓ సినిమాకి శ్రీకారం జరిగింది. మురళీ అలకపల్లి దర్శకత్వంలో ఈ చిత్రాన్ని రాహుల్ శ్రీవాత్సవ్ అయ్యర్ .ఎస్ నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి సీనియర్ ఫిలిం జర్నలిస్ట్ రాంబాబు కెమెరా స్విచ్ఛాన్ చేయగా, మరో సీనియర్ ఫిలిం జర్నలిస్ట్ ప్రభ క్లాప్ ఇచ్చారు. రాహుల్ శ్రీవాత్సవ్ అయ్యర్ .ఎస్ మాట్లాడుతూ– ''మానవీయ విలువలు, భావోద్వేగాలతో కూడిన ప్రేమకథగా రెండు భాగాలుగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం'' అన్నారు. ''గ్రామీణ నేపథ్యంలో సాగే ప్రేమకథ ఇది'' అన్నారు మురళీ అలకపల్లి.